మంగళవారం
27•8•2019
కరీంనగర్
• వెల. రూ.6.50
• సంపుటి 9 • సంచిక 63
• పేజీలు: 14 + 16

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE






## చిదంబరానికి చుక్కెదురు

సీబీఐ కేసులో ముందస్తు బెయిల్‌కు సుప్రీం నో
ఈడీ కేసులో బెయిల్ నేటి వరకు పొడిగింపు
మరో నాలుగు రోజులు సీబీఐ కస్టడీకి పంపిన ప్రత్యేక కోర్టు

III



## తులం బంగారం రూ.39,670

ఒకేరోజు రూ.675 ఎగబాకిన పుత్తడి ధర
అంతర్జాతీయ మార్కెట్లో ఆరేండ్ల గరిష్ఠానికి
కిలో వెండి రూ.1,450 అధికం

9



## స్టాక్ మార్కెట్‌కు ఉద్దీపనోత్సాహం

సెన్సెక్స్ 793, నిఫ్టీ 228 పాయింట్లు వృద్ధి
సర్చార్జీ ఉపసంహరణతో పోటెత్తిన పెట్టుబడులు
ఆకట్టుకున్న ఆర్థిక, బ్యాంకింగ్, నిర్మాణరంగాల షేర్లు

9

PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

# 1.76 లక్షల కోట్లు

## కేంద్రానికి ఆర్బీఐ మిగులు నగదు నిల్వలు

### జలాన్ కమిటీ సిఫారసుకు ఆర్బీఐ సెంట్రల్ బోర్డు ఆమోదం

- మిగులు నిధులపై ఆర్బీఐ, కేంద్రం మధ్య కొంతకాలంగా కోల్డ్‌వార్
- ఎట్టకేలకు పంతం నెగ్గించుకున్న మోదీ సర్కారు
- ఆర్థికవ్యవస్థ మందగమనం ఛాయల్లో కేంద్రానికి ఊరట
- ద్రవ్యలోటు పెరుగకుండా ఉద్దీపనలకు అవకాశం



**ముంబై, ఆగస్టు 26:**

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) నుంచి కేంద్ర ప్రభుత్వ ఖజానాకు మునుపెన్నడూ లేని విధంగా రికార్డుస్థాయిలో రూ.1.76 లక్షల కోట్ల మిగులు నగదు నిల్వలు వస్తున్నాయి. సోమవారం ఆర్బీఐ గవర్నర్ శక్తికాంతదాస్ నేతృత్వంలో జరిగిన 578వ సెంట్రల్ బోర్డు సమావేశంలో బిమల్‌జలాన్ కమిటీ సిఫారసులు ఆమోదం పొందాయి. ఆర్బీఐ మాజీ గవర్నర్ జలాన్ నేతృత్వంలో సెంట్రల్ బ్యాంక్ నగదు నిల్వలపై ఏర్పాటైన కమిటీ సూచనల మేరకు రూ.1,76,051 కోట్లను కేంద్ర ప్రభుత్వానికి ఇవ్వాలని బోర్డు నిర్ణయించింది. గత ఆర్థిక సంవత్సరానికి (2018-19) రూ.1,23,414 కోట్లను ఇవ్వనున్న ఆర్బీఐ.. మరో రూ.52,637 కోట్లనూ ముట్టజెప్పనున్నది. సవరించిన ఆర్థిక మూలధన నియమావళి (ఈసీఎఫ్) ప్రకారం గుర్తించిన ఈ రూ.52,637 కోట్ల మిగులు నిల్వలను 2018-19కిగాను ఖజానాకు తరలిస్తున్నట్లు ఓ ప్రకటనలో ఆర్బీఐ తెలిపింది. కాగా, ఇప్పటికే 2018-19కిగాను రూ.28,000 కోట్ల మధ్యంతర డివిడెండ్‌ను కేంద్రానికి ఆర్బీఐ సమర్పించింది. ఈ క్రమంలో మిగతా మొత్తాన్నీ త్వరలోనే అప్పగించనున్నది. కేంద్రంతో సంప్రదింపుల తర్వాత ఈసీఎఫ్ సమీక్షకు గతేడాది డిసెంబర్ 26న జలాన్ నేతృత్వంలో ఆరుగురు సభ్యుల కమిటీని ఆర్బీఐ ఏర్పాటు చేసింది. ప్రభుత్వం తరపున ఆర్థిక కార్యదర్శి రాజీవ్‌కుమార్‌కు చోటు లభించగా, ఈ నెల 14న కమిటీ తమ నివేదికకు తుది రూపునిచ్చింది. దీనిపైనే సోమవారం ఆర్బీఐ సెంట్రల్ బోర్డు సమావేశమైంది. సమావేశానికి రాజీవ్‌కుమార్‌తోపాటు ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి అటానుచక్రబర్తి, రిజర్వ్ బ్యాంక్ డిప్యూటీ గవర్నర్లుసహా ఎన్ చంద్రశేఖరన్, మనీశ్ సభర్వాల్, ఎస్ గురుమూర్తి తదితర బోర్డు సభ్యులు హాజరయ్యారు. ప్రస్తుత ఆర్థిక పరిస్థితులు, జాతీయ, అంతర్జాతీయ సవాళ్లు, ఆర్బీఐ విధులపైనా

మిగతా 3వ పేజీలో

### కేంద్రానికి కొత్త జోష్

**దేశ** ఆర్థికవ్యవస్థలో మందగమనం ఛాయలు విస్తరిస్తున్న వేళ.. ఆర్బీఐ నుంచి అందుతున్న నిధులు కేంద్ర ప్రభుత్వానికి కొత్త ఊపిరులూదనున్నాయి. నిధుల కొరతను ఎదుర్కొంటున్న మోదీ సర్కారుకు ఈ నిధులు కొండంత ధైర్యాన్ని ఇవ్వగలవన్న అభిప్రాయాలు నిపుణుల నుంచి వ్యక్తమవుతున్నాయి. ద్రవ్యలోటు పెరుగకుండా ఈ నిధులతో ఉద్దీపనలకు అవకాశం ఏర్పడిందని చెప్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి కూడా రూ.95,414 కోట్ల డివిడెండ్‌ను ఆర్బీఐ నుంచి కేంద్రం ఆశిస్తున్నది.



- అవసరాలకు అనుగుణంగా రూపొందించాలి
- అధికారులను ఆదేశించిన సీఎం కేసీఆర్
- నేడు బడ్జెట్ ప్రతిపాదనలపై చర్చ

# వాస్తవిక బడ్జెట్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

ఆర్థిక మాంద్యం ప్రభావం దేశవ్యాప్తంగా అన్ని రంగాలపై తీవ్ర ప్రభావం చూపుతున్న నేపథ్యంలో వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా రాష్ట్ర బడ్జెట్‌ను రూపొందించాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అధికారులను ఆదేశించారు. గత మార్చిలో ఓట్ ఆన్ అకౌంట్ ప్రవేశపెట్టిన నేపథ్యంలో 2019-20 ఆర్థిక సంవత్సరానికి పూర్తిస్థాయి బడ్జెట్‌ను త్వరలోనే అసెంబ్లీలో ప్రవేశ పెట్టనున్నట్లు సీఎం తెలిపారు. బడ్జెట్ రూపకల్పనపై సీఎం కేసీఆర్ సోమవారం ప్రగతిభవన్‌లో అధికారులతో కసరత్తుచేశారు. రాష్ట్ర ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడు బీ వినోద్‌కుమార్, ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్ శర్మ, ముఖ్యకార్యదర్శి నర్సింగ్‌రావు, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావుతోపాటు ఇతర ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శులు పాల్గొన్నారు. 'దేశవ్యాప్తంగా తీవ్రమైన ఆర్థిక మాంద్యం నెలకొని ఉన్నది. అన్ని రంగాలపై దీని ప్రభావం పడింది. ఆదాయాలు బాగా తగ్గిపోయాయి. అన్ని రాష్ట్రాల్లోనూ ఆదాయం తగ్గింది. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రంలోని ఆదాయం- అవసరాలను బేరీజు వేసుకొని బడ్జెట్ రూపకల్పన జరుగాలి. వాస్తవ దృక్పథంతో బడ్జెట్‌ను తయారుచేయాలి. ప్రజాసంక్షేమం, వ్యవసాయాభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యమిస్తూనే, ఇతర రంగాలకు అవసరమైనమేర కేటాయింపులు ఉండేలా చూడాలి' అని సీఎం కేసీఆర్ అధికారులకు స్పష్టంచేశారు. బడ్జెట్ రూపకల్పనపై మంగళవారం కూడా కసరత్తు జరుగుతుందని సీఎం అన్నారు. బడ్జెట్‌కు తుదిరూపం వచ్చిన తరువాత మంత్రివర్గ ఆమోదం తీసుకోవడం, అసెంబ్లీని సమావేశపరిచి, బడ్జెట్ ప్రతిపాదించడం జరుగుతుందని సీఎం తెలిపారు.



సోమవారం ఫ్రాన్స్‌లోని బియారిట్జ్‌లో జీ7 సదస్సు సందర్భంగా జరిగిన ద్వైపాక్షిక సమావేశంలో నవ్వులు చిందిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్

# మధ్యవర్తిత్వాల్లేవ్

కశ్మీర్ అంశంపై తేల్చిచెప్పిన ప్రధాని మోదీ

- అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో ద్వైపాక్షిక సమావేశం
- యూఎస్ నుంచి దిగుమతులను పెంచనున్నట్లు వెల్లడి
- పర్యావరణం, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్‌పై జీ-7 సదస్సులో ప్రసంగం

5

# హైదరాబాద్‌లో వన్‌ప్లస్

## మూడేండ్లలో వెయ్యి కోట్ల పెట్టుబడి

- ఇక్కడి మెరుగైన మానవ వనరులతో కంపెనీలు ఉత్తమసేవలు అందించవచ్చు
- ఆర్‌అండ్‌డీ సెంటర్ ప్రారంభోత్సవంలో టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- హైదరాబాద్‌లో ఫోన్ల ఉత్పత్తిని ప్రారంభించాలని ఆకాంక్ష
- హైదరాబాద్ మాకు ముఖ్యమైన ప్రాంతం
- ఇక్కడ దక్కిన ఆదరణ సంతోషాన్నిస్తున్నది
- వన్‌ప్లస్ వ్యవస్థాపకుడు పీట్‌లా



సోమవారం నానక్‌రాంగూడలో వన్‌ప్లస్ ఆర్‌అండ్‌డీ సెంటర్ ప్రారంభోత్సవం సందర్భంగా ఆ సంస్థ వ్యవస్థాపకుడు పీట్ లాతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేస్తున్న టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో ఐటీశాఖ కార్యదర్శి జయేశ్‌రంజన్ తదితరులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

అత్యున్నత మౌలిక వసతులు, మెరుగైన మానవ వనరులు, పురోగమన విధానాలతో హైదరాబాద్‌లోని కంపెనీలు ఉత్తమ సేవలు అందించవచ్చని టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు పేర్కొన్నారు. సోమవారం ఆయన హైదరాబాద్‌లోని నానక్‌రాంగూడలో ప్రీమియం స్మార్ట్‌ఫోన్ల దిగ్గజసంస్థ 'వన్‌ప్లస్' వ్యవస్థాపకుడు పీట్ లాతో కలిసి ఆ సంస్థ ఆర్‌అండ్‌డీ (పరిశోధన, అభివృద్ధి) కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. 'వన్‌ప్లస్' సంస్థ తమ కీలక కేంద్రాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటుచేయడం సంతోషకరమన్నారు. హైదరాబాద్ కేంద్రంగా 'వన్‌ప్లస్' స్మార్ట్‌ఫోన్లను తయారుచేయాలని ఆకాంక్షిస్తూ.. ప్రభుత్వపరంగా కావాల్సిన సహాయాన్ని అందజేస్తామని భరోసా ఇచ్చారు. హైదరాబాద్‌లో దోశలు రుచికరంగా ఉంటాయని, ఇక్కడ బిర్యానీ కూడా అద్భుతంగా ఉంటుందని కేటీఆర్ అన్నారు. 'వన్‌ప్లస్' వ్యవస్థాపకుడు పీట్ లా మాట్లాడుతూ.. హైదరాబాద్ తమకు ఎంతో ముఖ్యమైన ప్రాంతమని, భారతదేశంలో తమకు స్వాగతం పలికిన తీరు, ఇక్కడ దక్కిన ఆదరణ ఎంతో

మిగతా 2వ పేజీలో

• కల సాకారం..

## నేటి నుంచి బీబీనగర్ ఎయిమ్స్ తరగతులు

సీఎం కేసీఆర్ పట్టుదలకుతోడు ఎంపీల కష్టానికి ప్రతిఫలం

7

**చికెన్ ధరలు (వెన్‌కాబ్) (రూ.)**

| | | | |
|---|---|---|---|
| ఫారం ధర | 63.00 | రిటైల్ లైవ్ | 85.00 |
| డ్రెస్డ్ | 123.00 | స్కిన్‌లెస్ | 140.00 |

**గుడ్ల ధరలు (వందకు) (రూ.)**

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 316.00 | రంగారెడ్డి | 316.00 |
| మెదక్ | 316.00 | కరీంనగర్ | 317.00 |
| వరంగల్ | 317.00 | చిల్లర ధర | 3.80 |



ఇటీవల గజ్వేల్ నియోజకవర్గంలోని సింగాయిపల్లి అటవీ ప్రాంతంలో పునరుద్ధరణ పనులను జిల్లాల కలెక్టర్లకు వివరిస్తున్న ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు (ఫైల్).

- రాష్ట్రవ్యాప్తంగా క్షీణించిన అడవులు దాదాపు 12 లక్షల హెక్టార్లు
- ఇప్పటికే అడవుల పునర్జీవ కార్యక్రమం జోరుగా సాగుతున్నది.. 2.65 లక్షల హెక్టార్లలో

# ప్రతి నియోజకవర్గానికి ఒక కోమటిబండ

## గజ్వేల్ మోడల్‌గా అటవీ ప్రాంతాలకు పునర్జీవం

10 లక్షల హెక్టార్లలో సహజంగా పునరుద్ధరణ ■ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాలతో చకచకా ఏర్పాట్లు

**ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ:**

రాష్ట్రంలో అటవీభూముల శాతాన్ని పెంచాలన్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఆదేశాల మేరకు.. క్షీణించిన అడవులకు పునర్జీవం కల్పించేందుకు అటవీ అధికారులు యుద్ధ ప్రాతిపదికన సన్నాహాలు చేస్తున్నారు. ఇందుకు గజ్వేల్ నియోజకవర్గాన్ని మోడల్‌గా తీసుకుంటున్నారు. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో కోమటిబండ తరహాలో అడవులు పెంచేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్‌లో హరితహారం కార్యక్రమం కింద అటవీశాఖ చేపట్టిన 'రెజువెనేషన్ ఆఫ్ డీగ్రేడెడ్ ఫారెస్ట్' కార్యక్రమం మంచి ఫలితాలనిచ్చింది. దాదాపు 2,500 హెక్టార్ల పరిధిలో క్షీణించిన అటవీప్రాంతాన్ని దట్టమైన అడవిగా మలచడం ద్వారా.. అంతర్ధాన దశలో ఉన్న అడవులకు 'హరిత' జీవం పోశారు. ఇక్కడి కోమటిబండ చుట్టూ 750 హెక్టార్ల మేరకు పచ్చదనం పరుచుకొని అడవుల పునరుద్ధరణలో దేశానికే దిక్సూచిగా నిలిచింది. ఈ ప్రాంతం ఇప్పుడు ఇతర రాష్ట్రాల అధికారులకు కేస్‌స్టడీగా మారింది. 2015కు ముందు

మిగతా 3వ పేజీలో

# తండ్రి భూమి కోసం పోరాటం

- పాతికెకరాలు ఆక్రమించిన పాలోళ్లు
- ఆడబిడ్డలను వెళ్లగొట్టిన అక్రమార్కులు
- కబ్జాకోరులకు రెవెన్యూ వత్తాసు
- 'ధర్మగంట'ను ఆశ్రయించిన నల్లగొండ జిల్లా బాధితులు

6

ధర్మగంట



బాధితురాలు సరోజ

**ఓ తండ్రి..** ఆయనకు అయిదుగురు కుమార్తెలు.. కష్టపడి సంపాదించిన 25 ఎకరాల భూమి.. తను జీవించి ఉన్నంతకాలం సాగుచేసుకొని.. తన తదనంతరం కుమార్తెలకు తలా ఐదెకరాలు ఇవ్వాలని అనుకున్నాడు. కానీ పాలోళ్లు పడనియ్యలేదు. అతని పీకమీద కూర్చొని బెదిరించారు. భయపెట్టారు. ఊరి నుంచి వెళ్లగొట్టారు. ఆ బెంగతోనే తండ్రి చనిపోయాడు. తల్లి తన పిల్లల పెండ్లిండ్ల కోసమైనా భూమి పనికొస్తుందనుకొంటే.. ఆమెను భూమి వద్దకు కూడా రానియ్యడంలేదు. చివరకు ఐదుగురు కుమార్తెలు తండ్రి నుంచి తమకు వారసత్వంగా సంక్రమించాల్సిన భూమికోసం పోరాటం చేస్తున్నారు. రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. వీరి గోడు వినిపించుకొనేవారే లేకుండాపోయారు. నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలానికి చెందిన ఈ మహిళలు.. వేరే మార్గంలేక న్యాయం కోసం 'ధర్మగంట'ను ఆశ్రయించారు.



నూతన న్యాయమూర్తులు జస్టిస్ అభిషేక్‌రెడ్డి, జస్టిస్ వినోద్‌కుమార్, జస్టిస్ లక్ష్మణ్ గౌడ్‌తో ప్రమాణం చేయిస్తున్న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్‌చౌహాన్

# కొలువుదీరిన నూతన న్యాయమూర్తులు

- వినోద్‌కుమార్, అభిషేక్‌రెడ్డి, లక్ష్మణ్‌తో ప్రమాణం చేయించిన సీజే

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** హైకోర్టు నూతన న్యాయమూర్తులుగా జస్టిస్ తడకమళ్ల వినోద్‌కుమార్, జస్టిస్ అన్నిరెడ్డి అభిషేక్‌రెడ్డి, జస్టిస్ కూనూరు లక్ష్మణ్ సోమవారం ప్రమాణం చేశారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్‌చౌహాన్ వీరితో ప్రమాణం చేయించారు. తెలంగాణ హైకోర్టులో న్యాయవాదులుగా సుదీర్ఘ అనుభవం ఉన్న వినోద్‌కుమార్, అభిషేక్‌రెడ్డి, లక్ష్మణ్‌ను హైకోర్టు న్యాయమూర్తులుగా నియమిస్తూ శనివారం కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. సోమవారం వీరు న్యాయమూర్తులుగా బాధ్యతలు స్వీకరించారు. ఉదయం 9.30 గంటలకు ఒకటో నంబర్ కోర్టు హాలులో జరిగిన ఈ కార్యక్రమానికి పెద్దసంఖ్యలో న్యాయవాదులు, నూతన న్యాయమూర్తుల కుటుంబసభ్యులు, శ్రేయోభిలాషులు హాజరయ్యారు. అనంతరం జరిగిన పరిచయ కార్యక్రమంలో సీజే జస్టిస్ రాఘవేంద్రసింగ్‌చౌహాన్, ఇతర న్యాయమూర్తులు, బార్ కౌన్సిల్ చైర్మన్ నర్సింహారెడ్డి, వైస్‌చైర్మన్ సునీల్‌గౌడ్, సభ్యులు గండ్ర మోహన్‌రావు, విష్ణువర్ధన్‌రెడ్డి, ముఖీద్, హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సూర్యకరణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### మూడు డివిజన్ బెంచ్‌లలో న్యాయమూర్తులు

కొత్త న్యాయమూర్తుల నియామకం నేపథ్యంలో హైకోర్ట్ బెంచ్‌ల సిట్టింగ్ అరేంజ్‌మెంట్స్‌ను చీఫ్ జస్టిస్ విడుదల చేశారు. ఇప్పటిదాకా రెండు డివిజన్‌బెంచ్‌లు ఉండగా.. మరో డివిజన్‌బెంచ్ ఏర్పాటుచేశారు. చీఫ్ జస్టిస్ బెంచ్‌లో జస్టిస్ అభిషేక్‌రెడ్డి, జస్టిస్ సంజయ్‌కుమార్ బెంచ్‌లో జస్టిస్ లక్ష్మణ్, జస్టిస్ ఎంఎస్ రాంచంద్రరావు బెంచ్‌లో జస్టిస్ వినోద్‌కుమార్ జూనియర్ న్యాయమూర్తులుగా ఆసీనులయ్యారు.





'వన్‌ప్లస్' సంస్థ ఆర్‌అండ్‌డీ సెంటర్‌ను ప్రారంభించి మాట్లాడుతున్న టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో ఆ సంస్థ వ్యవస్థాపకుడు పీట్‌లా, ఐటీశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్ తదితరులు కూడా ఉన్నారు.

# హైదరాబాద్‌లో వన్‌ప్లస్


మొదటిపేజీ తరువాయి...


సంతోషాన్ని కలిగిస్తున్నదని చెప్పారు. భారత ఐటీ హబ్‌గా హైదరాబాద్ ఎదుగుతున్నదని, ఇక్కడ తమ ఆర్‌అండ్‌డీ కేంద్రాన్ని భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. దేశ, విదేశీ అవసరాలను తీర్చడంతోపాటు మేకిన్ ఇండియాకు తోడ్పాటునివ్వడం, భారత్‌లోని సాంకేతిక నిపుణులపై భారీగా పెట్టుబడులు పెట్టడమే లక్ష్యాలుగా ఈ ఆర్‌అండ్‌డీ కేంద్రం ముందుకు సాగుతుందని వివరించారు. ఐదో తరం (5జీ) టెలికం టెక్నాలజీ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ), ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగాల్లో ఈ కేంద్రం ప్రత్యేక కృషిచేస్తుందన్నారు. త్వరలో తాము కొత్త ఉద్యోగులను నియమించుకోనున్నట్టు తెలిపారు. 'వన్‌ప్లస్' ఇండియా జీఎం వికాస్‌అగర్వాల్ మాట్లాడుతూ.. తమకు ముఖ్య భాగస్వాములైన అమెజాన్, గూగుల్, క్వాల్‌కామ్ సంస్థలు మూడూ హైదరాబాద్‌లో ఉండటం ఎంతో కలిసొచ్చే విషయమన్నారు. హైదరాబాద్‌లో తమ ఆర్‌అండ్‌డీ కేంద్రాన్ని ఏర్పాటుచేయాలని ఇక్కడి ప్రభుత్వాధికారులతో జరిపిన తొలి సమావేశంలోనే నిర్ణయించామని చెప్పారు. ప్రస్తుతం ఈ కేంద్రంలో 200 మంది ఉద్యోగులున్నారని, త్వరలోనే ఈ సంఖ్యను 1,500 మందికి పెంచుతామని, ఐఐటీలు, ఎన్‌ఐటీల్లో చదివినవారికి తమ నియామకాల్లో పెద్దపీట వేస్తామని తెలిపారు. ఇది ప్రారంభం మాత్రమేనని, రానున్న మూడేండ్లలో రూ.1000 కోట్ల పెట్టుబడులతో ఈ సెంటర్ కొద్ది సంవత్సరాల్లోనే తమకు ప్రపంచంలోనే అతిపెద్ద కేంద్రంగా ఎదుగుతుందని అన్నారు. భారతీయ వినియోగదారుల ఆకాంక్షలకు అనుగుణంగా తమ స్మార్ట్ ఫోన్లలో జెన్‌మోడ్, ఎస్‌ఎంఎస్ ఇన్‌బాక్స్ లాంటి ఫీచర్లను అందుబాటులోకి తీసుకొస్తామని వికాస్‌అగర్వాల్ చెప్పారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్ మాట్లాడుతూ.. స్టార్టప్ ఆవిష్కర్తలకు స్ఫూర్తిదాయకమైన వ్యక్తిగా పీట్‌ను పేర్కొనవచ్చన్నారు. హైదరాబాద్‌లోని హిమాయత్‌నగర్‌లో 'వన్‌ప్లస్' ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను ఏర్పాటుచేయనున్నట్టు తెలిపారు. ప్రపంచంలోని టాప్-4 ప్రీమియం స్మార్ట్‌ఫోన్ కంపెనీల్లో ఒకటైన 'వన్‌ప్లస్'కు భారత మార్కెట్లో 35 శాతం వాటా ఉన్నది.

# మద్దతుధరకే పత్తి కొనుగోళ్లు

**క్వింటా పత్తి రూ.5,500, రెండోరకానికి రూ.5,255 ■ రాష్ట్రవ్యాప్తంగా 302 మిల్లుల గుర్తింపు**

- కొనుగోలు బాధ్యత సీసీఐ, మార్కెటింగ్‌దే
- కొన్న వెంటనే రైతు ఖాతాల్లో డబ్బు
- వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి




హైదరాబాద్‌లోని గోల్కొండ హోటల్‌లో సోమవారం జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి. చిత్రంలో వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి పార్థసారథి, ఆ శాఖ కమిషనర్ రాహుల్ బొజ్జా ఉన్నారు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వానకాలం సీజన్‌లో పత్తి పంటను మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు సర్కారు సిద్ధమైంది. ఇందుకు తగిన ఏర్పాట్లుచేయాలని అధికారులకు ఆదేశాలు జారీచేసింది. మొదటిరకం పత్తి క్వింటా రూ.5,500, రెండోరకాన్ని రూ.5,255 చొప్పున కొనుగోలు చేసేలా ఏర్పాట్లుచేయాలని వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి.. అధికారులను ఆదేశించారు. పత్తి మద్దతు ధరలో ఎలాంటి తేడాల్లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పత్తి మొదటిరకం క్వింటా రూ.5,500, రెండో రకం క్వింటా రూ.5,255 చొప్పున కొనుగోలు చేయాలని చెప్పారు. గతేడాది 230 మిల్లుల్లో పత్తి కొనుగోళ్లు చేపట్టగా, ఇందుకోసం ఈ ఏడాది 302 మిల్లులను గుర్తించామని ఆయన వెల్లడించారు. హైదరాబాద్‌లోని గోల్కొండ హోటల్‌లో వానకాలం పత్తి కొనుగోలు ఏర్పాట్లపై సోమవారం జరిగిన సమావేశానికి నిరంజన్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ.. పత్తి కొనుగోలు కేంద్రాల వద్ద అన్ని సదుపాయాలు కల్పించాలని చెప్పారు. తూకాల్లో ఎలాంటి తేడాలు రావొద్దని, వేబ్రిడ్జ్‌లు సరిగా ఉండేలా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు.

### వారంలో ఆరురోజులు కొనుగోలు

పత్తి కొనుగోలుకు సంబంధించి రైతులను చైతన్యపరిచేందుకు ప్రకటనలు, ప్రచార సామగ్రి సమకూర్చుకొని అవగాహన కల్పించాలని అధికారులను నిరంజన్‌రెడ్డి ఆదేశించారు. అనుమతించిన చార్జీలకు మించి రైతుల వద్ద నుంచి ఒక్క పైసా కూడా ఎక్కువగా వసూలు చేయొద్దని స్పష్టంచేశారు. గుర్తింపు లేని రైతులకు స్థానిక అధికారులు క్యూఆర్‌కోడ్ ఇవ్వాలని సూచించారు. పత్తి కొన్న వెంటనే ఆన్‌లైన్ ద్వారా రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బు జమచేయాలని ఆదేశాలు జారీచేశారు. వారానికి ఆరు రోజులు కొనుగోళ్లు జరుపాలని చెప్పారు. గత ఏడాది కన్నా ఈసారి ప్రపంచవ్యాప్తంగా 3.5 శాతం నుంచి 5 శాతం ఎక్కువ దిగుబడి వస్తుందని అంచనా వేసినట్టు ఆయన తెలిపారు. ఈ ఏడాది ప్రపంచవ్యాప్తంగా 34.59 మిలియన్ హెక్టార్లలో పత్తి సాగయినట్టు చెప్పారు. పత్తి నిల్వల కోసం గోదాములను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. పత్తి కొనుగోలు కోసం జిల్లా, రాష్ట్రస్థాయిలో కమిటీలు ఏర్పాటు చేయాలని, పత్తి కొనుగోలుకు సంబంధించిన పూర్తి బాధ్యత సీసీఐ, మార్కెటింగ్ అధికారులదేనని మంత్రి నిరంజన్‌రెడ్డి స్పష్టంచేశారు. ఈ సమావేశంలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఎండీ అలీరాణి, వ్యవసాయ శాఖ ముఖ్యకార్యదర్శి పార్థసారథి, వ్యవసాయ శాఖ కమిషనర్ రాహుల్ బొజ్జా, మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి పాల్గొన్నారు.

### ఆయిల్‌పామ్ సాగుకు ప్రోత్సాహం

**రాష్ట్రంలో** ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించనున్నట్టు మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి తెలిపారు. సోమవారం గోల్కొండ హోటల్‌లో జరిగిన ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 40 వేల ఎకరాలుగా ఉన్న ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణాన్ని 2 లక్షల ఎకరాలకు పెంచాలని చెప్పారు. రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగుకు 206 ప్రాంతాలు అనుకూలమని కేంద్రం గుర్తించిందని, ఆయా చోట్ల సాగును ప్రోత్సహిస్తామని పేర్కొన్నారు. ఆయిల్‌పామ్ సాగుకు సహకరించాలని కేంద్రానికి లేఖ రాసినట్టు నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో సహకార కమిషనర్ వీరబ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఇసుక బుకింగ్‌లో అవకతవకలు

- పోలీసులకు టీఎస్‌ఎండీసీ ఫిర్యాదు
- దర్యాప్తు మొదలుపెట్టిన సైబర్‌క్రైమ్ పోలీసులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఇసుక ఆన్‌లైన్ బుకింగ్‌లో అవకతవకలు జరుగుతున్నాయని, దీనిపై సమగ్ర దర్యాప్తు జరుపాలని తెలంగాణ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీఎస్‌ఎండీసీ) అధికారులు హైదరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాష్ట్రంలో ఇసుక బుకింగ్ కోసం టీఎస్‌ఎండీసీ ఆన్‌లైన్ పద్ధతిని కొనసాగిస్తున్నది. ఇందుకు సంబంధించిన డిజైన్, అమలు, మెయింటెనెన్స్ కోసం ఏపీటీ ఆన్‌లైన్ సంస్థతో ఒప్పందాన్ని కుదుర్చుకోవడంతో ఆ సంస్థే ఆన్‌లైన్‌లో ఇసుక విక్రయ వ్యవహారాలను పర్యవేక్షిస్తున్నది. అయితే అందరికీ కాకుండా కొందరికి మాత్రమే ఆన్‌లైన్ బుకింగ్ లభిస్తున్నది. కొందరు డైనమిక్ ఐపీలు, మ్యాక్ ఐడీలు ఉపయోగించి అవకతవకలకు పాల్పడుతున్నట్టు టీఎస్‌ఎండీసీ అధికారులు గుర్తించడంతో సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ అవకతవకలపై ఇన్‌స్పెక్టర్ మోహన్‌రావు నేతృత్వంలోని బృందం కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టింది. టీఎండీసీకి సేవలందిస్తున్న ఏపీటీ ఆన్‌లైన్ సంస్థపై కూడా అనుమానాలున్నందున దానిపై ఆరా తీస్తున్నామని మోహన్‌రావు తెలిపారు.



### ఇసుక బుకింగ్‌లో ఓటీపీ విధానం

ఇసుక బుకింగ్‌లో దళారులకు పూర్తిస్థాయిలో కళ్లెం వేసేందుకు రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా ఈ నెల 23 నుంచి వన్‌టైమ్ పాస్‌వర్డ్ (ఓటీపీ) విధానాన్ని తీసుకొచ్చింది. ఇసుక బుకింగ్ సమయంలో వినియోగదారుడికి, వాహనదారుడికి ఓటీపీ నంబర్లను పంపేందుకు ఫోన్ నంబర్లను, వాహనాల సమాచారాన్ని అప్‌డేట్ చేస్తున్నారు. దళారులకు ఏ మాత్రం అవకాశం ఇవ్వకుండా చూడటంతోపాటు వాహనాదారుల్లో జవాబుదారీతనాన్ని పెంచేందుకు కృషి చేస్తున్నారు. ఇతరుల పేరుతో దళారులు ఇసుకను బుక్‌చేసి మార్కెట్లో అధికధరకు విక్రయిస్తున్నట్టు ఫిర్యాదులు రావడంతో నిజమైన వినియోగదారులకు ప్రభుత్వం నిర్దేశించిన ధరకే ఇసుక అందేలా చూసేందుకు ఓటీపీ విధానాన్ని తీసుకొచ్చారు. ఈ విధానం పట్ల వినియోగదారులతోపాటు వాహనాదారులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీఎస్‌ఎండీసీ) వద్ద రిజిస్ట్రేషన్ చేసుకున్న వాహనాలు 28 వేలవరకు ఉన్నాయి. వీటి యజమానుల వివరాలన్నీ టీఎస్‌ఎండీసీ వద్ద ఉన్నాయి. అయితే ఇతరుల నుంచి లారీలను కొనుగోలుచేసినప్పుడు ఆర్సీల్లో పేర్లు, ఫోన్ నంబర్లు మార్చకపోవడం, పాత రిజిస్ట్రేషన్ నంబర్ల స్థానంలో కొత్త నంబర్లను తీసుకోవడం లాంటి సందర్భాల్లో కొన్ని సమస్యలు తలెత్తుతున్నాయి. ఇటువంటి లారీలు కొద్ది సంఖ్యలో ఉన్నట్టు గుర్తించడంతో వాటి ఆర్సీలను అప్‌డేట్ చేసుకునేందుకు అవకాశమిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఇసుక విధానం దేశానికే ఆదర్శంగా నిలిచింది. దీని ద్వారా వినియోగదారులకు సరైన సమయంలో ఇసుక లభ్యమవడమే కాకుండా ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరుతున్నది. రోజుకు దాదాపు రూ.3 కోట్ల ఆదాయాన్ని ఆర్జించే దిశగా టీఎస్‌ఎండీసీ పయనిస్తున్నది. తెలంగాణ రాష్ట్ర ఇసుక విధానంపై ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, పంజాబ్, మహారాష్ట్ర తదితర పలు రాష్ట్రాల అధికారులు అధ్యయనం జరిపి వారి రాష్ట్రాల్లోనూ అమలు చేస్తున్నారు. ఇటీవలే ఏపీ ప్రభుత్వం కూడా తెలంగాణ ఇసుక విధానాన్ని అమలుచేయాలని నిర్ణయించింది.

# కేటీఆర్‌ను మళ్లీ ప్రభుత్వంలో చూడాలి

- ఆయన కృషితోనే హైదరాబాద్‌కు ప్రఖ్యాత ఎమ్మెన్సీల రాక
- మజ్లిస్ పార్టీ అధినేత అసదుద్దీన్ ట్వీట్
- ధన్యవాదాలు తెలిపిన కేటీఆర్



ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ట్వీట్‌కు ధన్యవాదాలు తెలుపుతూ కేటీఆర్ రీట్వీట్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర ఐటీశాఖ మాజీ మంత్రి కే తారకరామారావును మళ్లీ ప్రభుత్వంలో చూడాలని ఉన్నదని మజ్లిస్ పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ పేర్కొన్నారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు ప్రపంచ ప్రఖ్యాత బహుళజాతి సంస్థలు (ఎమ్మెన్సీలు) తరలిరావడం వెనుక కేటీఆర్ ప్రత్యేక కృషి ఉన్నదని అసద్ సోమవారం ట్వీట్ చేశారు. గతేడాది ఒప్పో కంపెనీ, ఇటీవల అమెజాన్ కంపెనీ, తాజాగా వన్‌ప్లస్ కంపెనీ హైదరాబాద్‌కు తరలిరావడంపై స్పందిస్తూ ఆయన ఈ వ్యాఖ్య చేశారు. అసద్ ట్వీట్‌కు మాజీ మంత్రి కేటీఆర్ ధన్యవాదాలు తెలుపుతూ రీట్వీట్ చేశారు.

### ముహూర్తం

**సూర్యోదయం:** 6.05 గంటలకు

**సూర్యాస్తమయం:** 6.30 గంటలకు

వికారినామ సంవత్సరం, దక్షిణాయణం, వర్షరుతువు, శ్రావణమాసం, కృష్ణపక్షం, ద్వాదశి, నక్షత్రం: పునర్వసు, అమృతఘడియలు: రాత్రి 11.00 నుంచి 12.36 వరకు, రాహుకాలం: మధ్యాహ్నం 3.24 నుంచి సాయంత్రం 4.57 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 8.34 నుంచి 9.24 వరకు, తిరిగి మధ్యాహ్నం 2.22 నుంచి 3.11 వరకు, వర్జ్యం: మధ్యాహ్నం 2.05 నుంచి 3.41 వరకు.

# తెలంగాణ రాష్ట్ర డెంటల్ కౌన్సిల్ ఏర్పాటు

**కేటీఆర్‌ను కలిసిన కౌన్సిల్ సభ్యులు ■ రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర డెంటల్ కౌన్సిల్‌ను ఏర్పాటు చేసింది. కొత్తగా ఏర్పడిన కౌన్సిల్ ప్రతినిధులు సోమవారం టీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావును మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర డెంటల్ కౌన్సిల్‌ను ఏర్పాటు చేయడం పట్ల తెలంగాణ ప్రభుత్వానికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కేటీఆర్‌ను కలిసిన వారిలో ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డితోపాటు డెంటల్ కౌన్సిల్ అధ్యక్షుడు కే రాజేశ్‌రెడ్డి, సభ్యులు జీ విక్రమ్‌రెడ్డి, జీ ప్రమోద్‌కుమార్, రాకేశ్‌రావు తదితరులు ఉన్నారు.

# మిషన్ భగీరథకు నిధులివ్వండి

- ప్రాజెక్టు ఖర్చులో 50 శాతం.. నిర్వహణ మొత్తం భరించాలి
- కేంద్ర జల్‌శక్తి మంత్రి గజేంద్రసింగ్‌ను కోరిన మంత్రి ఎర్రబెల్లి



ఢిల్లీలో సోమవారం మీడియాతో మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు. చిత్రంలో టీఆర్‌ఎస్ లోక్‌సభాపక్ష నేత నామా నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యుడు బండా ప్రకాశ్ ఉన్నారు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** దేశానికి ఆదర్శంగా నిలిచిన మిషన్ భగీరథ పథకానికి అయిన ఖర్చులో 50 శాతం, నిర్వహణకు అయ్యే ఖర్చు మొత్తాన్ని చెల్లించాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ తాగునీటి సరఫరాశాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కేంద్రాన్ని కోరారు. కేంద్రప్రభుత్వ తాగునీటి, పారిశుద్ధ్యశాఖ ఢిల్లీలో జల్ జీవన్ మిషన్ పథకంపై కేంద్రమంత్రి గజేంద్రసింగ్ షెకావత్ అధ్యక్షతన అన్నిరాష్ట్రాల పంచాయతీ రాజ్‌శాఖ మంత్రులతో సమావేశం నిర్వహించింది. ఈ సమావేశానికి ఎర్రబెల్లి దయాకర్‌రావు హాజరై రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న మిషన్ భగీరథ పథకంపై సమగ్ర నివేదిక సమర్పించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇంటింటికీ తాగునీరు అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన మిషన్‌భగీరథ పథకం దేశానికే ఆదర్శంగా నిలిచిందని.. ప్రధాని మోదీ ప్రకటించిన జల్‌జీవన్ పథకానికి మిషన్ భగీరథ పథకమే స్ఫూర్తి అని అన్నారు. రెండు పథకాలకు సామీప్యత ఉన్నందున తెలంగాణలో ఇప్పటికే అమలవుతున్న మిషన్ భగీరథకు కేంద్రం తోడ్పాటు అందించాలని కోరారు. ఈ మేరకు కేంద్ర జల్‌శక్తి మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చినట్లు తెలిపారు. మిషన్ భగీరథకు నిధులివ్వాలని ఈ ఏడాది జూన్‌లోనూ మంత్రికి లేఖ ఇచ్చినట్టు గుర్తుచేశారు. మిషన్‌భగీరథ అంచనా వ్యయం రూ.40,028 కోట్లు అని.. ఇందులో 80 శాతం నిధులను నాబార్డు నుంచి రుణం రూపంలో.. మిగిలిన 20 శాతాన్ని ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయించిందని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని ప్రధాని మోదీ 'మన్‌కీ బాత్'లో ప్రశంసించారని చెప్పారు. మిషన్‌భగీరథకు సహకారం అందించేందుకు 50శాతం నిధులను భరించాలని కేంద్రాన్ని మరోసారి కోరినట్టు తెలిపారు. మిషన్‌భగీరథ నిర్వహణ కోసం ఏటా రూ 2,110 కోట్ల మొత్తం అవసరమవుతుందని దీనిని కూడా కేంద్రమే చెల్లించాలని కోరినట్టు మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు వెల్లడించారు.

### ఉపాధి బకాయిలు ఇప్పించండి

మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం కింద తెలంగాణకు రావాల్సిన మెటీరియల్ కాంపొనెంట్ నిధులు రూ.664 కోట్లను వెంటనే విడుదల చేయాలని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కోరారు. సోమవారం కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులతో ఎర్రబెల్లి, టీఆర్‌ఎస్ లోక్‌సభాపక్ష నాయకుడు నామా నాగేశ్వరరావు, రాజ్యసభాపక్ష ఉపనేత బండా ప్రకాశ్ ముదిరాజ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణలో ఉపాధిహామీ, ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన, పెన్షన్ల పంపిణీ తదితర పథకాలకు భారీగా నిధులు కేటాయించాలని విజ్ఞప్తిచేశారు. 2018-19 కి ఉపాధి పథకం మెటీరియల్ కాంపోనెంట్ నిధులు రూ.314 కోట్లు, 2019-20 ఏడాదిలో రూ.673 కోట్లకుగాను.. రావాల్సిన రూ.350 కోట్లు కలిపి రూ.664 కోట్లను విడుదల చేయాలని కోరారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 36.30 లక్షల మంది కూలీలకు 8.63 కోట్ల పనిదినాలను కల్పించి, ఉపాధిహామీ అమలులో దేశంలో తెలంగాణ ముందంజలో ఉందన్నారు. ఈ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని కోరారు.

# వినూత్న పగతో కటకటాల్లోకి

- స్నేహం కాదందని యువతి, ఫెయిల్ చేశారని ప్రొఫెసర్లపై కోపం
- రసాయనాల నీటితో బాటిళ్ల పార్సిల్!
- నిందితుడిని అరెస్టుచేసిన నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు



పోలీసులకు పట్టుబడ్డ వెంకటేశ్వరరావు

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** వినూత్న రీతిలో పగ తీర్చుకోవాలనుకున్న ఓ వ్యక్తి ఊచలు లెక్కిస్తున్నాడు. పదేండ్ల కిందట స్నేహం కాదన్నదని యువతిపై, ఎంబీఏలో ఫెయిల్ అయ్యేందుకు కారణమనే అనుమానంతో ప్రొఫెసర్లపై కోపం పెంచుకున్నాడు. రసాయనాలు కలిపిన నీటి బాటిళ్లను వారి పేర్లతో వీఐపీల చిరునామాకు పార్సిల్ చేయాలనుకుని నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులకు పట్టుబడ్డాడు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ రాధకిషన్‌రావు వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ కుమ్మరిగూడలో నివాసముండే వడ్డపల్లి వెంకటేశ్వరరావు 2008 నుంచి 2010 వరకు బొల్లారంలోని నవభారతి పీజీ కాలేజీలో ఎంబీఏ చదివి ఫెయిల్ అయ్యాడు. ఆ సమయంలో తోటి విద్యార్థినితో స్నేహం చేయాలని ప్రయత్నించగా, ఆమె నిరాకరించింది. ఎంబీఏలో ఫెయిల్ కావడానికి ఓయూ ప్రొఫెసర్లు, ఆ యువతి కారణమని కోపం పెంచుకున్నాడు. అడ్మినిస్ట్రేషన్, ప్రొఫెసర్లపై హైకోర్టులో కేసు కూడా వేశాడు.

### 62 బాటిళ్లు పార్సిల్ చేసే ప్రయత్నం!

వెంకటేశ్వర్‌రావు ప్రస్తుతం సికింద్రాబాద్ మార్కెట్‌లో అల్లం, వెల్లులి వ్యాపారం చేస్తున్నాడు. తన స్నేహం కాదన్న యువతితో పాటు ప్రొఫెసర్లపై పగ తీర్చుకోవాలని పథకం వేశాడు. 62 బాటిళ్లను సేకరించి, వాటిలో ఘాటైన వాసనలు వచ్చేలా కెమికల్స్‌తో కూడిన నీటిని నింపాడు. ప్యాక్‌చేసి ఆటోలో తీసుకొని ఈ నెల 16న సాయంత్రం సికింద్రాబాద్ ప్యాట్నీ సెంటర్‌లోని పోస్టాఫీసుకు వచ్చాడు. కార్యాలయం మూసి ఉండటంతో బాటిళ్లను అక్కడే పెట్టి, మరుసటి రోజు మళ్లీ అక్కడకు చేరుకున్నాడు. పార్సిల్‌కు పోస్టల్ ఖర్చుల కింద రూ.7,216 చెల్లించి అక్కడినుంచి వెళ్లిపోయాడు. పార్సిళ్లపై వీవీఐపీలు, వీఐపీలు, ప్రభుత్వ అధికారులు, సెలబ్రెటీల పేర్లను రాశాడు. తన స్నేహం కాదన్న యువతి పేరుతోపాటు ఓయూ ప్రొఫెసర్లు వాటిని పంపిస్తున్నట్టు వారి పేర్లు రాసి, దానికి మొత్తం బాధ్యత తమదేనంటూ లెటర్ కూడా రాశాడు. పార్సిళ్లు అనుమానాస్పదంగా ఉండటంతో పోస్టాఫీస్ సిబ్బంది తనిఖీ చేసి.. బాటిళ్ల నుంచి ఘాటైన వాసన రావడంతో పోలీసులకు ఫిర్యాదుచేశారు. పోస్టాఫీస్ వద్ద సీసీ కెమెరాలను పరిశీలించగా, అందులో ఆటోలో వెంకటేశ్వరరావు వచ్చినట్టు గుర్తించి అరెస్ట్ చేశారు. అతని నుంచి ల్యాప్‌టాప్, ప్రింటర్ కమ్ స్కానర్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసు తదుపరి విచారణను మహంకాళి పోలీసులకు అప్పగించారు.

### లోకం పోకడ




ఆయనిచ్చే నీళ్లు సిలిండర్ ద్వారా వస్తాయని అనుకోలేదు!

# రేపు కలెక్టర్ల కాళేశ్వరం పర్యటన

- నేడు మధ్యాహ్నం వరంగల్‌కు చేరుకోనున్న 33 జిల్లాల కలెక్టర్లు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ/ జయశంకర్ జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** జిల్లా కలెక్టర్లు ఈ నెల 28న (బుధవారం) కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించనున్నారు. మంగళవారం సాయంత్రం 33 జిల్లాల కలెక్టర్లు వరంగల్‌కు చేరుకొని రాత్రి అక్కడే బసచేస్తారు. బుధవారం ఉదయం 6.30 గంటలకు భూపాలపల్లి జిల్లాకు బయలుదేరుతారు. మొదట మహాదేవపూర్ మండలంలోని లక్ష్మీ (మేడిగడ్డ) బరాజ్‌ను సందర్శిస్తారు. అనంతరం కాళేశ్వరం సమీపంలోని లక్ష్మి (కన్నెపల్లి) పంప్‌హౌస్‌కు చేరుకుంటారు. ఈ పంప్‌హౌస్‌లో మోటర్లు, గోదావరి నుంచి పంపుహౌస్‌లోకి చేరుకొనే అప్రోచ్ కెనాల్, పంప్‌హౌస్‌లోని మోటర్లు కన్నెపల్లి- అన్నారం గ్రావిటీ కెనాల్‌లో గోదావరి జలాలను పోసే డెలివరీ సిస్టర్న్‌ను పరిశీలిస్తారు. కాళేశ్వరంలోని ముక్తీశ్వరస్వామిని దర్శించుకొంటారు. అనంతరం పెద్దపల్లి జిల్లాలోని బరాజ్‌లు, పంప్‌హౌస్‌లు, సర్జిపూల్స్‌ను సందర్శించి సాయంత్రం తిరిగి వెళ్లనున్నారు. సీఎం సూచనమేరకు కలెక్టర్లు కాళేశ్వరం ప్రాజెక్టును పరిశీలిస్తున్నారు.

## జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా లోకేశ్‌కుమార్

- రాష్ట్రంలో పలువురు ఐఏఎస్‌ల బదిలీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రప్రభుత్వం పలువురు ఐఏఎస్ అధికారులను బదిలీచేసింది. ఈ మేరకు సోమవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి ఎస్కే జోషి ఉత్తర్వులు జారీచేశారు. జలమండలి ఎండీగా, జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న దానకిశోర్ నుంచి జీహెచ్‌ఎంసీ బాధ్యతలను తప్పించింది. ఆయన జలమండలి ఎండీగానే కొనసాగనున్నారు. రంగారెడ్డి కలెక్టర్ లోకేశ్‌కుమార్‌ను జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా నియమించింది. రంగారెడ్డి జిల్లా జాయింట్ కలెక్టర్ హరీశ్‌కు కలెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. పరిశ్రమశాఖ ముఖ్యకార్యదర్శిగా కొనసాగుతున్న జయేశ్‌రంజన్‌ను గనులశాఖ ఇన్‌చార్జి డైరెక్టర్‌గా నియమించారు.

# సర్కారు దవాఖానల్లో ఉచితంగా రోటావైరస్ టీకా

- శిశుమరణాలు తగ్గించేందుకు ప్రభుత్వం చర్యలు


డాక్టర్ రమేశ్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** శిశుమరణాలను తగ్గించేందుకు రాష్ట్రప్రభుత్వం కీలకనిర్ణయం తీసుకున్నది. ఆరునెలల్లోపు శిశువులకు ఈ వచ్చేనెల (సెప్టెంబర్) నుంచి సర్కారు దవాఖానల్లో ఉచితంగా రోటావైరస్ టీకా వేయనున్నది. రోటా వైరస్ వ్యాక్సినేషన్ కోసం అన్ని ప్రభుత్వ దవాఖానల సిబ్బందికి ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్టు నిలోఫర్ దవాఖాన ఆర్‌ఎంవో, ఓపీ బ్లాక్ ఇంచార్జి డాక్టర్ రమేశ్ దాంపురి తెలిపారు. నవజాత శిశువుల దగ్గర నుంచి ఐదేండ్లలోపు పిల్లలకు 'రోటావైరస్' సోకే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని చెప్పారు. ఈ వైరస్‌తో చిన్నారులు డయేరియాకు గురై మృత్యువాతపడే ప్రమాదం ఉన్నదని చెప్పారు. ఇప్పటివరకు ఈ టీకాలు కేవలం ప్రైవేట్ దవాఖానల్లో మాత్రమే ఇచ్చేవారన్నారు. రూ.1200లకు పైగా ఖరీదు ఉండే రోటా వైరస్ టీకాలను ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని సర్కార్ దవాఖానల్లో ఇచ్చేందుకు సన్నద్ధమైనట్టు డాక్టర్ రమేశ్ దాంపురి తెలిపారు. ఈ వ్యాక్సినేషన్ శిశువు జన్మించిన ఆరు నెలల్లోపు మాత్రమే ఇవ్వాల్సి ఉంటుందని చెప్పారు. శిశువు పుట్టిన నెలన్నరకు, రెండున్నర నెలలకు, మూడున్నర నెలలకు మూడు దఫాలుగా ఈ టీకాలను ఇస్తామని చెప్పారు.




బోయినపల్లి మండలం శ్రీరాజరాజేశ్వర జలాశయం


పూర్తిస్థాయిలో నిండిన నాగార్జునసాగర్ ప్రాజెక్టు

జలాభిషేకం

# జయహో నంది.. భళా గాయత్రి

- పంప్‌హౌస్‌లలో నిరంతరంగా నడుస్తున్న మోటర్లు
- రోజుకో టీఎంసీ ఎత్తిపోత.. వరదకాల్వ గుండా గోదావరి జలాలు
- నేడు 12 టీఎంసీలకు చేరనున్న శ్రీరాజరాజేశ్వర జలాశయం
- 18.5 కిలోమీటర్ల మేర విస్తరించిన బ్యాక్‌వాటర్

**హైదరాబాద్, కరీంనగర్ ప్రధానప్రతినిధి, నమస్తే తెలంగాణ:** కాళేశ్వరం ప్రాజెక్టు లింక్-2లో గోదావరి జలాల జైత్రయాత్ర కొనసాగుతున్నది. ఇటు నంది, అటు గాయత్రి పంప్‌హౌస్‌లో అద్భుత జలదృశ్యం ఆవిష్కృతమవుతున్నది. ఎనిమిదో ప్యాకేజీలో మూడు, ఆరో ప్యాకేజీలో మూడు మోటర్ల ద్వారా నిరంతరం ఎత్తిపోతలతో గంగమ్మ పరవళ్లు తొక్కుతున్నది. శ్రీరాజరాజేశ్వర రిజర్వాయర్‌కు రోజుకో టీఎంసీ చొప్పున గోదావరి జలాలు చేరుతున్నాయి. సోమవారం ఆరుగంటల వరకు ప్రాజెక్టులో నీటినిల్వ 11.2863 టీఎంసీలుగా ఉన్నది. ఇది మంగళవారం 12 టీఎంసీలకు చేరనున్నది. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంతో శ్రీరాజరాజేశ్వర జలాశయానికి (మిడ్ మానేరు)కు మహర్దశ వచ్చింది. గతేడాది ఇదే సమయంలో నీటిమట్టం 996.88 అడుగులతో నీటి నిల్వ కేవలం 4.30 టీఎంసీలకే పరిమితమయింది. కానీ ఈసారి మాత్రం గోదావరి జలాలతో కళకళలాడుతున్నది. కాళేశ్వరం ఎత్తిపోతల పథకం ద్వారా ఎల్లంపల్లి జలాశయం నుంచి నిరంతరాయంగా ఎత్తిపోతల కొనసాగుతుండటంతో రిజర్వాయర్‌లో జలాలు పరుచుకుంటున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టులోని ఆరో ప్యాకేజీ కింద నిర్మించిన నంది పంపుహౌస్‌లో కొన్నిరోజులుగా 124.4 మెగావాట్ల సామర్థ్యం ఉన్న మూడుమోటర్ల ద్వారా నీటిని ఎత్తిపోస్తున్నారు. తద్వారా నంది రిజర్వాయర్ ఆపై.. సుదీర్ఘంగా నిర్మించిన జంట సొరంగాల ద్వారా జలాలు లక్ష్మీపూర్ వద్ద నిర్మించిన గాయత్రి పంపుహౌస్‌కు చేరుకుంటున్నాయి. అక్కడ మూడు బాహుబలి మోటర్ల ద్వారా ఎత్తిపోస్తున్న జలాలు వరద కాల్వద్వారా శ్రీరాజరాజేశ్వర జలాశయానికి పరుగులు తీస్తున్నాయి. బ్యాక్‌వాటర్ 18.5 కిలోమీటర్ల మేర అంటే సిరిసిల్ల శివారులోని కరకట్ట వరకు విస్తరించింది. మరో కిలోమీటరున్నర దూరం వెళ్తే.. సిరిసిల్లకు సమీపంలోని తంగళ్లపల్లి వంతెన వరకు చేరుకోనున్నది. ఇదిలాఉండగా, జలాల ఎత్తిపోతల పరిమాణాన్ని పెంచేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ నెలాఖరుకు మరో రెండు మోటర్ల చొప్పున జలాల ఎత్తిపోతలను ప్రారంభించేందుకు కసరత్తు చేస్తున్నట్టు తెలిసింది. ఐదు మోటర్ల ద్వారా ఎత్తిపోసేందుకు ఏర్పాట్లుచేస్తున్నారు.

### కృష్ణాకు మళ్లీ ఇన్‌ఫ్లోలు

కృష్ణా బేసిన్‌లో ఇన్‌ఫ్లోలు మళ్లీ మొదలయ్యాయి. ఎగువన ఆల్మట్టికి పదివేల క్యూసెక్కుల వరద వస్తుండగా అధికారులు కరంటు ఉత్పత్తి ద్వారా అంతే మోతాదులో దిగువకు వదులుతున్నారు. నారాయణపురకు పదివేల క్యూసెక్కుల వరద వస్తుండగా ఏడువేల క్యూసెక్కులకు పైగా కాల్వలకు వదులుతున్నారు. జూరాలకు 11వేలకు పైగా క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతున్నది. తుంగభద్ర డ్యాంకు 12 వేల క్యూసెక్కులు వస్తుండగా.. అంతే మోతాదులో కాల్వల ద్వారా సాగుకు వినియోగిస్తున్నారు. శ్రీశైలం జలాశయానికి ఎనిమిదిన్నర వేల క్యూసెక్కుల వరకు వరద వస్తున్నది. జలాశయం నుంచి 25 వేల క్యూసెక్కుల అవుట్‌ఫ్లో నమోదవుతుంది. నాగార్జునసాగర్ ఇన్‌ఫ్లోలు రావడంలేదు. మరో వైపు గోదావరి బేసిన్‌లో కడెం ప్రాజెక్టుకు స్వల్పంగా వెయ్యి క్యూసెక్కుల వరద వస్తుండగా.. శ్రీరాంసాగర్, ఎల్లంపల్లికి ఇన్‌ఫ్లోలు నమోదుకావడంలేదు. తాలిపేరు ప్రాజెక్టులోకి సోమవారం ఉదయం భారీగా వరద చేరడంతో అధికారులు మూడుగేట్లు ఎత్తి 7,530 క్యూసెక్కుల నీటిని దిగువన ఉన్న గోదావరిలోకి విడుదల చేశారు.

**ప్రాజెక్టులలో సోమవారం నీటిమట్టాల వివరాలు...**

| రిజర్వాయర్ | ఎఫ్ఆర్ఎల్ అడుగుల్లో | ప్రస్తుత మట్టం అడుగుల్లో | పూర్తిస్థాయి నిల్వ టీఎంసీల్లో | ప్రస్తుత నిల్వ టీఎంసీల్లో | ఇన్‌ఫ్లో క్యూసెక్కుల్లో | అవుట్‌ఫ్లో క్యూసెక్కుల్లో |
|---|---|---|---|---|---|---|
| ఆల్మట్టి | 1705.00 | 1704.72 | 129.72 | 128.19 | 10000 | 10000 |
| నారాయణపుర | 1615.00 | 1614.60 | 37.64 | 37.33 | 10000 | 7104 |
| ఉజ్జయిని | 1630.00 | 1630.00 | 117.24 | 117.24 | 1729 | 4350 |
| జూరాల | 1045.00 | 1044.88 | 9.66 | 9.58 | 11500 | 21676 |
| తుంగభద్ర | 1633.00 | 1633.00 | 100.86 | 100.86 | 11949 | 11968 |
| శ్రీశైలం | 885.00 | 882.20 | 215.81 | 200.20 | 8567 | 24426 |
| నాగార్జునసాగర్ | 590.00 | 588.720 | 312.05 | 308.17 | 0 | 19969 |
| పులిచింతల | 175.00 | 173.88 | 45.77 | 44.04 | 0 | 1000 |
| సింగూరు | 1717.93 | 1670.51 | 29.91 | 0.46 | 0 | 20 |
| నిజాంసాగర్ | 1405.00 | 1368.54 | 17.18 | 0.15 | 0 | 10 |
| శ్రీరాంసాగర్ | 1091.00 | 1063.40 | 90.31 | 17.88 | 0 | 400 |
| లోయర్‌మానేరు | 920.00 | 881.85 | 24.07 | 3.52 | 0 | 204 |
| శ్రీ రాజరాజేశ్వర | 1043.31 | 1016.93 | 25.873 | 11.29 | 10300 | 83 |
| కడెం | 700.00 | 697.58 | 7.60 | 6.98 | 1018 | 775 |
| ఎల్లంపల్లి | 485.56 | 476.64 | 20.18 | 13.27 | 0 | 0 |

# అరచేతిలో ఉద్యోగ ఖాళీల వివరాలు

- డీట్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చిన తెలంగాణ ప్రభుత్వం
- ఆవిష్కరించిన మంత్రి మల్లారెడ్డి, ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్


'డీట్' యాప్‌ను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి, ఐటీశాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్, ఉపాధి కల్పన, శిక్షణ సంచాలకుడు యాకూబ్‌నాయక్, డీట్ సీఈవో మణికాంత్ చల్లా

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణేనని రాష్ట్ర కార్మిక, మహిళాశిశుసంక్షేమ, ఉపాధి కల్పనశాఖల మంత్రి చామకూర మల్లారెడ్డి తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ సహకారంతో వివిధ రంగాల్లో ఉద్యోగాల వివరాలను నిరుద్యోగులకు అందించేందుకు రూపొందించిన డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజి ఆఫ్ తెలంగాణ (డీఈఈటీ-డీట్) యాప్‌ను సోమవారం సచివాలయంలో ఐటీ, పరిశ్రమలశాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్‌తో కలిసి మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ రంగాల్లోని ఉద్యోగ ఖాళీల వివరాలను తెలుసుకోవడానికి డీట్ యాప్ ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని చెప్పారు. ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని దీని ద్వారా ఉచితంగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ యాప్ ద్వారానే ఇంటర్వ్యూలు కూడా చేపట్టవచ్చునని, తెలంగాణవ్యాప్తంగా వివిధ సంస్థలకు చెందిన 45 వేలకుపైగా ఉద్యోగ ఖాళీలను ఈ యాప్‌లో పొందుపరిచామని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం ఎంతో చిత్తశుద్ధితో కల్పిస్తున్న ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత వినియోగించుకోవాలని సూచించారు. ఐటీ, పరిశ్రమలశాఖల ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్ మాట్లాడుతూ.. తెలంగాణకు పెద్ద కంపెనీలు తరలివస్తున్నాయని, వన్‌ప్లస్ సంస్థ తమ ఆర్ అండ్‌డీ సెంటర్‌ను సోమవారం ప్రారంభించిందని తెలిపారు. రానున్న మూడేండ్లలో వన్‌ప్లస్ సంస్థ 1500 పైగా ఉద్యోగావకాశాలు కల్పించనున్నదని చెప్పారు. నగరంలో ప్రారంభమవుతున్న కంపెనీలు తమకు అవసరమైన ఉద్యోగులను భర్తీచేసుకొనేందుకు ఈ యాప్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. స్టోరీ టెక్ ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో తెలంగాణ ప్రభుత్వం ఈ యాప్‌ను అభివృద్ధి చేసినట్టు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కల్పన, శిక్షణ సంచాలకుడు యాకూబ్‌నాయక్, డీట్ సీఈవో మణికాంత్ చల్లా తదితరులు పాల్గొన్నారు.

## రేపు తుదివిడుత ఎంబీబీఎస్ మేనేజ్‌మెంట్ సీట్ల భర్తీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తుదివిడుత మేనేజ్‌మెంట్ కోటా ఎంబీబీఎస్ సీట్ల భర్తీకి ఈనెల 28 బుధవారం నాడు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్టు కాళోజీ ఆరోగ్య, వైద్యవిజ్ఞాన విశ్వవిద్యాలయం సోమవారం జారీచేసిన ఒక ప్రకటనలో తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేట్ వైద్య కళాశాలల్లో మేనేజ్‌మెంట్ కోటా (బీ, సీ, ఎన్నారై) కింద సీట్ల భర్తీకి ఇప్పటికే రెండు విడుతల్లో కౌన్సెలింగ్ పూర్తయింది. మొదటి ర్యాంకు నుంచి చివరి ర్యాంకు వరకు అర్హులైన అభ్యర్థులందరికి ప్రవేశం కోసం తుది విడుత కౌన్సెలింగ్‌ను ఈనెల 28న ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ జీ రాంరెడ్డి దూరవిద్యా కేంద్రంలో నిర్వహించనున్నట్టు తెలిపారు. పూర్తి వివరాల కోసం www.knruhs.in, knruhs.telangana.gov.in వెబ్‌సైట్‌లో సంప్రదించాల్సిందిగా సూచించారు.


శాసనమండలి సభ్యునిగా ప్రమాణం చేస్తున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి

## ఎమ్మెల్సీగా గుత్తా ప్రమాణస్వీకారం

- పలువురి అభినందనలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్ర శాసనమండలి సభ్యునిగా గుత్తా సుఖేందర్‌రెడ్డి సోమవారం ప్రమాణం చేశారు. శాసనమండలి డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్ చాంబర్‌లో ఈ కార్యక్రమం జరిగింది. అనంతరం విద్యాసాగర్‌తోపాటు రాష్ట్ర శాసనసభా వ్యవహారాలశాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, విద్యాశాఖ మంత్రి జీ జగదీశ్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి తదితరులు గుత్తాను అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు. గుత్తాను అభినందించిన వారిలో ప్రభుత్వ విప్‌లు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, బీ వెంకటేశ్వర్లు, ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, శాసనసభ్యులు గొంగిడి సునీతా మహేందర్‌రెడ్డి, గ్యాదరి కిశోర్, బాల్క సుమన్, ఎన్ భాస్కర్‌రావు, కంచర్ల భూపాల్‌రెడ్డి, బొల్లం మల్లయ్య యాదవ్, ఎమ్మెల్సీలు నారదాసు లక్ష్మణ్‌రావు, ఎం శ్రీనివాస్‌రెడ్డి, తేరా చిన్నపురెడ్డి తదితరులు కూడా ఉన్నారు. 2021 జూన్ వరకు గుత్తా ఎమ్మెల్సీ పదవిలో కొనసాగనున్నారు.


విద్యాశాఖ కార్యదర్శి జనార్దన్‌రెడ్డికి విరాళ చెక్కును అందజేస్తున్న రాష్ట్ర సహకార ఎపెక్స్ బ్యాంకు చైర్మన్ రవీందర్‌రావు

## డోనర్ కార్నర్‌కు విరాళం

- సీఎస్సార్ కింద రూ.5 లక్షలు అందజేసిన అపెక్స్ బ్యాంక్ అధ్యక్షుడు రవీందర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి కార్యక్రమాలు, విద్యార్థులకు ప్రోత్సాహం, వసతి సదుపాయాల కల్పన వంటి వాటికోసం విద్యాశాఖ చేపట్టిన 'డోనర్ కార్నర్'కు విశేష స్పందన లభిస్తున్నది. ఇందు కోసం విద్యాశాఖ సీఎస్ఆర్ కింద కంపెనీల నుంచి విరాళాలు సేకరిస్తున్నది. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వందకు పైగా సైకిళ్లను పంపిణీచేసేందుకు రాష్ట్ర సహకార ఎపెక్స్ బ్యాంకు (టీఎస్‌క్యాబ్) అధ్యక్షుడు కోడూరు రవీందర్‌రావు రూ.5 లక్షల విరాళం ఇచ్చారు. ఈ మేరకు సోమవారం విద్యాశాఖ కార్యదర్శి బీ జనార్దన్‌రెడ్డికి ఆయన చెక్కు అందచేశారు. విద్యాశాఖ 'హాజరుమాసోత్సవం'లో భాగంగా విద్యాశాఖ ఎంపిక చేసిన పాఠశాలల్లో ఆగస్టు నెలలో వందశాతం హాజరు నమోదు చేసిన విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లు బహుకరించనున్నారు. ఈ కార్యక్రమంలో ఎపెక్స్‌బ్యాంక్ ఎండీ నేతి మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి నియోజకవర్గానికి ఒక కోమటిబండ

మొదటిపేజీ తరువాయి...

కోమటిబండ ప్రాంతాన్ని చూసినవారు.. ప్రస్తుత పరిస్థితిని చూసి ఆశ్చర్యపడే పరిస్థితి నెలకొన్నది. ఒకప్పుడు మైదానాన్ని తలపించిన కోమటిబండ పరిసరాలు.. ముఖ్యమంత్రి నిరంతర పర్యవేక్షణ, అటవీశాఖ అధికారులు ప్రత్యేక కృషి ఫలితంగా నేడు పచ్చదనంతో దట్టమైన అడవిగా పరిఢవిల్లుతున్నది. ఈ నెల 21న కలెక్టర్లతో కలిసి గజ్వేల్, కోమటిబండ ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించిన ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు.. అడవుల అభివృద్ధి పట్ల సంతృప్తి వ్యక్తంచేశారు. అదే తరహాలో ప్రతీ నియోజకవర్గంలో ఒక బ్లాక్ ఏర్పాటుచేయాలని ఆదేశించారు. దీంతో ప్రతీ నియోజకవర్గంలో క్షీణించిన అటవీ ప్రాంతాలను గుర్తించి, ఒక ఫారెస్ట్ బ్లాక్‌ను దట్టమైన అడవిగా మలచడానికి అటవీ అధికారులు ప్రణాళికలు వేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా క్షీణించిన అడవులు దాదాపు 12 లక్షల హెక్టార్ల వరకు ఉండగా అందులో రీజువెనేషన్ కింద ఇప్పటికే 2.65 లక్షల హెక్టార్లలో అడవుల పునర్జీవ కార్యక్రమం జోరుగా సాగుతున్నది. ఇందులో గజ్వేల్‌దే అగ్రస్థానం. రాష్ట్రంలో మొత్తం అటవీ భూముల సరిహద్దు 26 వేల కిలోమీటర్ల వరకు ఉన్నది. అందులో 14 వేల కిలోమీటర్ల ప్రాంతం ట్రెంచ్‌లను (పశువులు, మనుషుల చొరబాటును తగ్గించడానికి గోతులు) తవ్వడానికి అనుకూలంగా ఉన్నది. ఈ క్రమంలో ట్రెంచ్‌లను తవ్వే పనిని అటవీ శాఖ ముమ్మరం చేసింది. ఇప్పటివరకు 8,300 కిలోమీటర్ల పొడవున ట్రెంచ్‌ల ఏర్పాటు పూర్తయింది. బ్లాక్‌లుగా విభజించి ప్లాంటేషన్‌ను చేపట్టి, క్షీణించి, విధ్వంసమైన అడవికి ఎయిడెడ్ న్యాచురల్ రీజనరేషన్ (ఏఎన్ఆర్) పద్ధతిలో తిరిగి జీవం పోయనున్నారు. క్షీణించిన అడవుల పునరుద్ధరణ కార్యక్రమం విజయవంతానికి గజ్వేల్ నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీసుకుని పనులు ప్రారంభిస్తున్నట్టు అడిషనల్ పీసీసీఎఫ్, హరితహారం ఇంచార్జి ఆర్ఎం డోబ్రియాల్ తెలిపారు.

# టీ-హాజరుకు విశేష స్పందన

- సర్కారుబడుల్లో హాజరు పెంచేందుకు యాప్‌ను రూపొందించిన విద్యాశాఖ
- ఈ నెల 23 నుంచి అమల్లోకి.. డౌన్‌లోడ్ చేసుకున్న 13 వేల స్కూళ్లు
- రోజువారీ హాజరు నివేదికలు అప్‌లోడ్ చేస్తున్న హెచ్‌ఎంలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని ప్రభుత్వపాఠశాలల్లో విద్యార్థుల హాజరుశాతాన్ని మెరుగుపరిచేందుకు టీ-హాజరు పేరుతో విద్యాశాఖ రూపొందించిన ప్రత్యేకయాప్‌కు విశేషస్పందన వస్తున్నది. ఈ నెల 23న ఈ యాప్‌ను ప్రారంభించారు. యాప్‌ను ప్రభుత్వబడులు డౌన్‌లోడ్ చేసుకుని, విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరును రోజువారీగా తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలని 26 వేల స్కూళ్ల ప్రధానోపాధ్యాయులకు విద్యాశాఖ ఆదేశాలు జారీచేసింది. ఈ నేపథ్యంలో ఈయాప్‌ను ప్రారంభించిన మూడు పనిదినాల్లో 13 వేలకు పైగా స్కూళ్లు డౌన్‌లోడ్ చేసుకుని రోజువారీ హాజరు అప్‌లోడ్ చేస్తున్నట్టు పాఠశాల విద్యా శాఖ అడిషనల్ డైరెక్టర్ శ్రీహరి తెలిపారు. త్వరలోనే అన్ని స్కూళ్లు టీహాజరు యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుంటాయని పేర్కొన్నారు. సోమవారం వరకు 13,789 స్కూళ్లు యాప్‌లో నమోదు చేసుకోగా.. 11,202 స్కూళ్లు యాప్ ద్వారా రోజువారీ హాజరు పంపినట్లు అధికారులు తెలిపారు. దాని ప్రకారం 83.82 శాతం ఉపాధ్యాయులు, 74.5 శాతం విద్యార్థుల హాజరు నమోదైందని అదనపు డైరెక్టర్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో యాప్ ద్వారా హాజరుశాతాన్ని పంపించడం, మెరుగు పరుచడంపై జిల్లా విద్యాధికారులను, మండల విద్యాధికారులను, ప్రధానోపాధ్యాయులను బాధ్యులుగా చేసినట్టు తెలిపారు. ఈ క్రమంలో క్లస్టర్, మండలాలు, జిల్లాల వారీగా హాజరు పట్టికను పాఠశాల విద్యాశాఖ ఉన్నతాధికారులు అధికారిక వెబ్‌సైట్ డ్యాష్‌బోర్డు ద్వారా పర్యవేక్షిస్తామని చెప్పారు.

## యూకే చీవినింగ్ స్కాలర్‌షిప్, ఫెలోషిప్‌ల దరఖాస్తులకు ఆహ్వానం

- 150 విశ్వవిద్యాలయాల్లోని 1200 కోర్సుల్లో చేరేవారికి సువర్ణావకాశం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** 2020-2021 సంవత్సరానికి యూకే చీవినింగ్ స్కాలర్‌షిప్, ఫెలోషిప్‌లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు హైదరాబాద్‌లోని బ్రిటిష్ డిప్యూటీ కమిషన్ ఓ ప్రకటనలో తెలిపింది. ఏడాది మాస్టర్స్ కోర్సుకు స్కాలర్‌షిప్, స్వల్పకాలిక కోర్సులకు ఫెలోషిప్‌ను అందజేస్తున్నట్టు పేర్కొన్నది. యూకేలోని దాదాపు 150 విశ్వవిద్యాలయాల్లోని 12,000 కోర్సుల్లో ఏడాది మాస్టర్స్ డిగ్రీ విద్యను అభ్యసించేవారికి ఆర్థికసాయాన్ని అందిస్తామని వెల్లడించింది. సైన్స్ అండ్ ఇన్నోవేషన్, సైబర్ సెక్యూరిటీ, జర్నలిజం, ఆర్థికసేవలు తదితర విభాగాల్లో ఎనిమిది నుంచి పన్నెండు వారాల కోర్సులకు అందజేస్తామని యూకే డిప్యూటీ హైకమిషనర్ డాక్టర్ ఆండ్రూఫ్లెమింగ్ తెలిపారు. భారతదేశం నుంచి చురుకైన విద్యార్థులకు చక్కటి అవకాశాన్ని కల్పించేందుకు చీవినింగ్ స్కాలర్‌షిప్పులను అందజేస్తున్నామని చెప్పారు. చీవినింగ్ స్కాలర్‌షిప్‌లను అందుకోవాలంటే కనీసం రెండేండ్ల పాటు పనిచేసిన అనుభవం ఉండాలని చెప్పారు. దరఖాస్తులు చేసుకొనేందుకు నవంబర్ 5 వరకు అవకాశం కల్పిస్తున్నామన్నారు. దాదాపు ఏడు నుంచి పదేండ్లపాటు పని చేసిన అనుభవమున్నవారే చీవినింగ్ ఫెలోషిప్‌లకు అర్హులని చెప్పారు. దక్షిణాసియా జర్నలిజం ఫెలోషిప్, సైన్స్ అండ్ ఇన్నోవేషన్ లీడర్‌షిప్ ఫెలోషిప్, సైబర్ సెక్యూరిటీ, ఫైనాన్షియల్ సర్వీసెస్, గురుకుల్ లీడర్‌షిప్ వంటి అంశాల్లో ఫెలోషిప్ కోసం దరఖాస్తుచేసుకొనేందుకు అక్టోబర్ 9 వరకు గడవు విధించారు. గురుకుల్ ఫెలోషిప్ 2019 దరఖాస్తులు డిసెంబర్‌లో ప్రారంభం అవుతాయి. పూర్తి వివరాలకు 8978901076 నంబర్‌లో సంప్రదించాలని బ్రిటీష్ డిప్యూటీ హై కమిషన్ కోరింది.

## 1.76 లక్షల కోట్లు

మొదటిపేజీ తరువాయి...

సమావేశంలో చర్చించారు.

**పంతం నెగ్గించుకున్న మోదీ సర్కారు**

నిరుడు మిగులు నగదు నిల్వల బదిలీపై అప్పటి ఆర్బీఐ గవర్నర్ ఊర్జిత్‌పటేల్‌కు, మోదీ సర్కారుకు మధ్య మాటల యుద్ధం జరిగిన సంగతి విదితమే. ఆర్బీఐ స్వేచ్ఛను హరిస్తున్నారంటూ కేంద్రంపై అప్పటి ఆర్బీఐ డిప్యూటీ గవర్నర్ విరాల్ ఆచార్య బాహాటంగానే విమర్శలు గుప్పించారు. ఈ క్రమంలో కేంద్రానికి ఆర్బీఐకి మధ్య విభేదాలు తారస్థాయికి చేరగా, పటేల్ తన గవర్నర్ పదవికి అనూహ్యంగా రాజీనామా కూడా చేసేశారు. ఆ తర్వాత శక్తికాంతదాస్ రాగా, మిగులు నిల్వలపై కమిటీని వేశారు. ఈ నేపథ్యంలో ఆర్బీఐ వద్ద పరిమితికి మించి నగదు నిల్వలున్నాయన్న ఏకభిప్రాయానికి వచ్చిన కమిటీ.. వాటిని కేంద్రానికి తరలించాలని తీర్మానించింది. ఫలితంగా కేంద్రం పంతం నెగ్గినట్లైంది. గతేడాది జూన్ 30 నాటికి ఆర్బీఐ వద్దనున్న మిగులు నగదు నిల్వలు రూ.9.43 లక్షల కోట్లుగా ఉన్నాయి. ఈ స్థాయిలో అవసరం లేదన్న కేంద్రం కొంత తమకు బదిలీచేయాలని కోరింది. దీంతో వివాదం మొదలైంది. ఈ నిల్వలను విడుతలవారీగా తరలించాలని నిపుణులు అంటున్నారు. గత లోక్‌సభ ఎన్నికల ప్రచారం సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ సైతం ఆర్బీఐ వద్ద మూలుగుతున్న అపార నగదు నిల్వలు ద్రవ్య వ్యవస్థలోకి రావాల్సిన అవసరం ఉన్నదని, వాటితో ఆర్థిక వ్యవస్థ వృద్ధిదాయక చర్యలు చేపట్టవచ్చని అభిప్రాయపడ్డ విషయం తెలిసిందే.

## తెలంగాణ విజయాలు దేశానికే ఆదర్శం

- ఖమ్మం కలెక్టరేట్‌లో 'తెలంగాణ విజయగాథ' పుస్తకావిష్కరణ

**ఖమ్మం ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** తెలంగాణ రాష్ట్రం సాధించిన విజయాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని ఖమ్మం కలెక్టర్ ఆర్వీ కర్ణన్, ఎమ్మెల్యే పువ్వాడ అజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఖమ్మం కలెక్టరేట్‌లోని ప్రజ్ఞాభవన్‌లో సోమవారం బీసీకమిషన్ సభ్యుడు జూలూరు గౌరీశంకర్ సంపాదకత్వంలో వెలువరించిన 'తెలంగాణ విజయగాథ' పుస్తకాన్ని వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కర్ణన్, ఎమ్మెల్యే పువ్వాడ అజయ్ మాట్లాడుతూ.. కొత్తగా ఏర్పడ్డ చిన్న రాష్ట్రాలపై ఉన్న అనేక అనుమానాలను తెలంగాణ నివృత్తి చేసిందని చెప్పారు. విద్యుత్, సాగునీటి, తాగునీటి సమస్యలను పరిష్కారాలు చూపుతూ రాష్ట్రం దూసుకుపోతున్నదని చెప్పారు. అభివృద్ధిలో తెలంగాణ గణనీయమైన వృద్ధిరేటు సాధిస్తున్నదన్నారు. కోటి ఎకరాల మాగాణికి నీళ్లు అందించటమే ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. గోదావరి జలాలను ఖమ్మం జిల్లాకు మళ్లించి, సస్యశ్యామలం చేసేందుకు కేసీఆర్ నిరంతర కృషిచేస్తున్నారని చెప్పారు. బీసీ కమిషన్ సభ్యుడు జూలూరు గౌరీశంకర్ మాట్లాడుతూ.. దేశంలో ఏ రాష్ట్రంలో జరుగని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు తెలంగాణలో జరిగాయని చెప్పారు. ప్రపంచంలోనే అతిపెద్ద నీటిపారుదల ప్రాజెక్టుగా కాళేశ్వరం రూపుదిద్దుకున్నదని చెప్పారు. ఈ అంశాలన్నింటిని పుస్తకంలో పొందుపరిచినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్‌తో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.


హత్యకు గురైన బొమ్మకంటి రంగమ్మ

## వృద్ధురాలి దారుణ హత్య

**మధిర, నమస్తే తెలంగాణ:** ఖమ్మం జిల్లా మధిర మండలం రాయపట్నంలో సోమవారం ఓ వృద్ధురాలిని గుర్తుతెలియని వ్యక్తులు గడ్డపలుగుతో మోదీ దారుణంగా హత్య చేశారు. గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బొమ్మకంటి హరిబాబు తల్లి రంగమ్మ(83) రోజు మాదిరిగానే తన ఇంటి వసారాలో నిద్రిస్తున్నది. సోమవారం తెల్లవారుజామున సుమారు 2 గంటల సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు రంగమ్మపై గడ్డపలుగుతో దాడికి పాల్పడటంతో ఆమె కేకలు వేసింది. ఇంట్లో ఉన్న కుటుంబ సభ్యులు కిటికీ తలుపు తీసి చూడగా ఆమె తీవ్రగాయాలతో రక్తస్రావంతో కనిపించింది. వెంటనే తలుపు తీసుకొని వచ్చి చూసే సరికి మృతిచెందింది. మధిర ఎస్సై చంద్రమోహన్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మధిర ప్రభుత్వ దవాఖానకు తరలించిన పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా హత్యకు గల కారణాలు తెలియరాలేదు.






సమాజ్‌వాదీ పార్టీ పాలనలో మంత్రివర్గమంతా అవినీతిలో కూరుకుపోయింది. కానీ బీజేపీ కార్యకర్తలు, మంత్రులు ప్రజల సంక్షేమం కోసం ఎల్లవేళలా కృషిచేస్తున్నారు. మా దృష్టిలో రాజకీయాలు ఓ బాధ్యత. వ్యాపారం కాదు.

**అమిత్ షా, కేంద్ర హోంమంత్రి**

రాజ్యాంగవ్యవస్థలను ఎలా అదుపులో పెట్టుకోవాలో బీజేపీ నుంచి అందరూ నేర్చుకునే స్థితి ఏర్పడింది. సీబీఐ,ఈడీలను దుర్వినియోగం చేస్తున్నారు. సీబీఐ, ఈడీలతో భయోత్పాతాన్ని సృష్టిస్తూ ప్రజాస్వామ్యానికి కొత్త అర్థాన్ని చెబుతున్నారు.

**అఖిలేశ్ యాదవ్, సమాజ్‌వాదీ పార్టీ అధినేత**



**చరిత్రలో నేడు**



1813

డ్రెస్డెన్ యుద్ధంలో ఆస్ట్రియన్లను ఓడించిన నెపోలియన్.

1955

'గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్' పుస్తకం ప్రచురణ.





1979

ఐర్లండ్ సిలిగోలో పడవ పేలుడులో మౌంట్ బాటెన్ మృతి.

తీవ్రవాదశక్తుల మూలంగా హాంకాంగ్ ధ్వంసమైపోతున్నది. చైనాకు అప్పగించిన హాంకాంగ్‌ను తిరిగి చేజిక్కించుకోవాలని పశ్చిమ దేశాలు భావిస్తున్నాయి. పశ్చిమదేశాల వారు హాంకాంగ్‌లోని తీవ్రవాదశక్తులకు సైద్ధాంతిక శక్తిని అందిస్తూ ఉంటే, ఇక్కడి ప్రజలు మొదటినుంచి అయోమయంలో ఉన్నారు. పశ్చిమ దేశాలు ఇరాక్, సిరియా, ఉక్రెయిన్ దేశాలలో జరిగిన విషాదానికి ఏమైనా కన్నీరు కార్చాయా? కానీ ఇప్పుడు చైనాపై పోరాటానికి హాంకాంగ్‌ను ఉపయోగించు కుంటున్నాయి. కానీ ఈ నగరం అనుభవిస్తున్న విషాదం పట్ల వారికి సానుభూతి ఏమీ లేదు.

**గ్లోబల్ టైమ్స్**

రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు ఉత్పాదకత గురించి మాట్లాడుతున్నారూ అంటే తక్కువ వేతనానికి ఎక్కువ పనిచేయాలని అర్థం. కానీ ఆర్థిక మంత్రి జోష్ ఫ్రైడెన్‌బర్గ్ ప్రసంగం మాత్రం ఇటువంటి నీతిసూత్రాలు లేకుండా సాగింది. ఇప్పటికే మనం నిజాయితీగా ఎక్కువగానే పనిచేస్తున్నాం. ఇప్పుడు కావలిసింది పని చేస్తున్న పనిగంటలలోనే మరింత ఎక్కువ ఫలితాలు సాధించడం ఎట్లా అనేది. ఎన్ని గంటలు పనిచేస్తున్నామని కాకుండా ఎంత పనిచేస్తున్నామనే ఆలోచనా ధోరణి ఈ మధ్య పెరిగిపోయింది.

**ది సిడ్నీ మార్నింగ్ హెరాల్డ్**



# స్వర్ణ సింధు!

ప్రపంచ బ్యాడ్మింటన్‌లో సింధు జగజ్జేతగా నిలువడం దేశానికే గర్వకారణం. స్విట్జర్లాండ్‌లో ఆదివారం జరిగిన ప్రపంచ చాంపియన్‌షిప్ మహిళల సింగిల్స్ ఫైనల్లో జపాన్ క్రీడాకారిణి నొజోమి ఒకుహరపై విజయం సాధించి స్వర్ణాన్ని సాధించడం దేశ చరిత్రలోనే అపూర్వ ఘట్టం. 2017లో ఇదే టోర్నీలో ఒకుహర చేతిలో పరాజయం పొందిన సింధు ఈ సారి సత్తా చాటి ప్రపంచ బ్యాడ్మింటన్ శిఖరాగ్రాన నిలిచింది. ఈ చాంపియన్‌షిప్ పోటీలకు ముందు ఈ ఏడాది సింధు ఒక్క టైటిల్ కూడా గెలువలేదు. దీంతో ఈ టోర్నీలో ఎలా ఆడుతుందో అనే సందేహాలు నెలకొన్నాయి. కానీ టోర్నీ మొదలైన తర్వాత అందరి అనుమానాలను పటాపంచలు చేసింది. గతంలో తనను ఓడించిన ప్రత్యర్థులను ఒక్కొక్కరిని వరుసపెట్టి మట్టికరిపించుకుంటూ వచ్చి జగజ్జేతగా నిలిచింది. గత రెండేండ్లుగా ఈ టోర్నీలో పసిడి పతకానికి అడుగు దూరంలో నిలిచి రజతాలతో సరిపెట్టుకున్న సింధు ఈ సారి తనపై పడ్డ 'సిల్వర్ స్టార్' ముద్రను చెరిపేసింది. అద్వితీయ ఆటతీరుతో భారత బ్యాడ్మింటన్ చరిత్రలో కొత్త అధ్యాయానికి నాంది పలికింది. సింధు ఎనిమిదేండ్ల వయసులో రాకెట్ పట్టినప్పటి నుంచి సాగించిన అలుపెరుగని కృషికి ఇప్పటికి ఫలితం దక్కింది. తెలంగాణ గడ్డ మీద ఎదిగి ప్రపంచస్థాయి క్రీడల్లో సత్తా చాటిన క్రీడాకారుల సరసన సింధు నిలువడం సంతోషకరం.

రెండేండ్ల కిందట ఈ టోర్నీ ఫైనల్లో సింధు, ఒకుహర తలపడ్డారు. బ్యాడ్మింటన్ చరిత్రలోనే అత్యంత ఉత్కంఠభరితంగా సాగిన ఆ పోరు ఇప్పటికీ క్రీడాభిమానుల గుండెల్లో పదిలంగానే ఉన్నది. సుమారు రెండు గంటలపాటు హోరాహోరీగా సాగిన ఆ మ్యాచ్‌లో ఆధిపత్యం చేతులు మారుతూ వచ్చి చివరకు సింధు పరాజయం పాలైంది. మ్యాచ్ ఓడినా తన ఆటతీరుతో అభిమానుల మనసు గెలుచుకున్న సింధు ఈసారి అదే ప్రత్యర్థికి అసలు అవకాశమే ఇవ్వలేదు. ఒకుహర ఒక పాయింట్ సాధించే లోపే ఎనిమిది పాయింట్లు ఖాతాలో వేసుకుంది. ప్రత్యర్థి మరో పాయింట్ సాంధిచేసరికి సింధు మరో 8 పాయింట్లు సాధించింది. ఈ రెండు ఉదాహరణలు చాలు ఆదివారం మ్యాచ్‌లో సింధు ఆధిపత్యం ఎలా సాగిందో చెప్పడానికి. ఈ టోర్నీలో తనదైన ఆటతీరుతో ముందుకుసాగిన సింధు ప్రత్యర్థిని ఓడించడంపై కాకుండా ముందు ఆమెపై మానసిక ఒత్తిడి పెంచడంపై దృష్టిపెట్టింది. సుదీర్ఘ ర్యాలీలకు చెక్‌పెట్టి ప్రత్యర్థిని కోర్టు నలువైపులా పరిగెత్తిస్తూ అలిసిపోయేలా చేసి ఆ తర్వాత అలవోకగా పాయింట్లు ఖాతాలో వేసుకుంటూ వెళ్లింది. దాదాపుగా ప్రతీ మ్యాచ్‌లోనూ ఇదే ఎత్తుగడ కొనసాగించింది. టోర్నీ ఆరంభంలో సులువైన విజయాలతో దూసుకెళ్లిన సింధుకు క్వార్టర్‌ఫైనల్లో అసలు సిసలు పోటీ ఎదురైంది. ఇటీవలికాలంలో కొరుకుడుపడని కొయ్యగా మారిన చైనీస్ తైపీ ప్లేయర్ తై జు యింగ్‌ను మట్టి కరిపించడంతోనే సింధుపై అంచనాలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. తొలి గేమ్‌ను 12-21తో కోల్పోయిన సింధు ఆ తర్వాత పుంజుకున్న తీరు అద్భుతం. వరుస గేమ్‌ల్లో సెట్ పాయింట్లను కాచుకొని చక్కటి విజయంతో సెమీఫైనల్ చేరిన సింధు సెమీస్‌లో చైనా క్రీడాకారిణి చెన్ యూఫీని వరుస గేమ్‌ల్లో చిత్తుచేసింది.


**2012 చైనా మాస్టర్స్ సూపర్ సిరీస్ టోర్నీ క్వార్టర్స్‌లో లండన్ ఒలింపిక్స్-2012 విజేత లీ జుయేరితో సింధు తలపడినప్పుడు, అంతర్జాతీయస్థాయిలో అప్పుడే మొదటి అడుగువేసిన సింధు పోటీ ఇవ్వగలదా అనే సందేహాలు వ్యక్తంఅయ్యాయి. ఈ అనుమానాలను పటాపంచలు చేస్తూ అద్భుత ప్రదర్శనతో ప్రపంచ ర్యాంకింగ్స్‌లో తనకంటే ఎంతో బలమైన లీని ఓడించింది. ఈ విధంగా ప్రపంచ బ్యాడ్మింటన్‌లోకి తన ఆగమనాన్ని ఘనంగా చాటిచెప్పింది. ఇప్పటికే ప్రపంచ ఛాంపియన్‌షిప్స్‌లో నాలుగు పతకాలు గెలుచుకున్నది.**


2012 చైనా మాస్టర్స్ సూపర్ సిరీస్ టోర్నీ క్వార్టర్స్‌లో లండన్ ఒలింపిక్స్-2012 విజేత లీ జుయేరితో సింధు తలపడినప్పుడు, అంతర్జాతీయస్థాయిలో అప్పుడే మొదటి అడుగువేసిన సింధు పోటీ ఇవ్వగలదా అనే సందేహాలు వ్యక్తంఅయ్యాయి. ఈ అనుమానాలను పటాపంచలు చేస్తూ అద్భుత ప్రదర్శనతో ప్రపంచ ర్యాంకింగ్స్‌లో తనకంటే ఎంతో బలమైన లీని ఓడించింది. ఈ విధంగా ప్రపంచ బ్యాడ్మింటన్‌లోకి తన ఆగమనాన్ని ఘనంగా చాటిచెప్పింది. ఇప్పటికే ప్రపంచ ఛాంపియన్‌షిప్స్‌లో నాలుగు పతకాలు గెలుచుకున్నది. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో సింధు విజయకేతనం ఎగురవేసిందీ అంటే, ఈ విజయం ఒక్కరోజులో వచ్చింది కాదు. పన్నెండేండ్ల నిరంతర శ్రమ సింధును నేడు ప్రపంచ ఛాంపియన్‌గా నిలబట్టింది. ఆటలో గెలుపు ఓటములే కాదు గాయాలు ఆమెను బాధించాయి. చిన్న దెబ్బలే అయినా దాదాపు ఏడాదిపాటు మైదానానికి దూరంగా ఉండాల్సి వచ్చింది. 2016 రియో ఒలింపిక్స్‌కు కొన్నేండ్ల ముందు కాలుకు ఫ్యాక్చర్ కావడంతో దాదాపు ఎనిమిది నెలలు వీల్ చైర్‌కే పరిమితమైంది. అయినా సింధు ఆత్మవిశ్వాసం కోల్పోలేదు. కుర్చీలో కూచోని ప్రాక్టీస్ కొనసాగించింది. ఆ కష్ట ఫలితం రియో ఒలింపిక్స్‌లో ఆమెకు రజత పతకాన్ని అందించింది. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో తన విజయాన్ని ప్రస్తావిస్తూ ఈ రోజు కోసం ఆర్నెల్లుగా ఎదురుచూస్తున్నానని, ఎలాగైనా స్వర్ణం సాధించాలనే కసితోనే బరిలోకి దిగానని సింధు చెప్పిన మాటలు అక్షరాల నిజం. బ్యాడ్మింటన్‌లో ప్రపంచ ఛాంపియన్‌షిప్ అత్యుత్తమ టోర్నీ. ఒలింపిక్స్‌కు ఏ మాత్రం తీసిపోదు. 2020 టోక్యోలో ఒలింపిక్స్ జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో సింధు సాధించిన ఈ విజయం ఆమెకు మరింత ఆత్మవిశ్వాసాన్ని చేకూరుస్తుంది. ఇదే జోరు ఒలింపిక్స్‌లోనూ కొనసాగించి స్వర్ణం సాధించాలన్నది అందరి ఆకాంక్ష.

**జనగళం**

## జగజ్జేత స్వర్ణ 'సింధు' రాకెట్టు

**దశాబ్దాల** నిరీక్షణకు తెరదించే
అనితర సాధ్య అద్భుత ఆట
అనన్య సామాన్య పోరాట బాట
చెక్కుచెదరని ఏకాగ్రత ఊట
పట్టుసడలని ఆత్మవిశ్వాస తోట
విశ్వ క్రీడా ప్రాంగణంలో ఎగిసి
చిరుతలా చెలరేగింది రాకెట్టు
ఉక్కిరిబిక్కిరైంది ప్రత్యర్థి జట్టు
అందని ద్రాక్షే ఆలింగనమైంది
భారతావని మది ఉప్పొంగింది
ప్రపంచ యవనికపై చరిత్ర లిఖించి
సొంతం చేసుకుంది విశ్వకిరీటం
జాతినేకం చేసింది సింధూరర నాదం
తరతరాలు తరించే తన్మయత్వం
తెలుగుతేజం సింధూ స్వర్ణ ప్రపంచం
రికార్డులు అదిరి బెదిరిన వేళ



ఆసేతు శీతాచలం ఆనందహేల
రెపరెపలాడింది మువ్వన్నెల పతాకం
జాతినుదుట సింధూర తిలకం
సాహో జగజ్జేత స్వర్ణ సంబుర సింధూ
అచ్చతెలుగు పూసర్ల వెంకట సింధూ!

**– డాక్టర్ బుర్ర మధుసూదన్‌రెడ్డి**

**ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.** editpage@ntnews.com Fax-040-23291118

**విశ్లేషణ**



**హరీశ్ ఖరే**

# రాజ్యాంగవ్యవస్థలే మనకు రక్ష

ప్రజాస్వామ్యస్ఫూర్తి అథమస్థానంలోకి దిగజారిపోతున్నది. రాజ్యాంగపరమైన కాఠిన్యత పదునెక్కుతున్నది. నిజానికి సుదీర్ఘ ప్రజాస్వామ్య చరిత్ర కలిగిన పాలనా, న్యాయవ్యవస్థలు అపసవ్యాలకు అంత తొందరగా లోనుకావు. నెహ్రూ శకంలో పాదుకొల్పబడిన అనేక విలువలు, నియమాలు రూపుమాసిపోతున్నాయి. దశాబ్దాల చరిత్ర కలిగిన నిష్పాక్షిక వ్యవస్థలన్నీ పనితీరులో పూర్వపు విశ్వసనీయతను కోల్పోతున్నాయి.

ఆ మధ్యకాలంలో నలుగురు సుప్రీంకోర్టు సీనియర్ న్యాయమూర్తులు ఒక పత్రికా సమావేశం ఏర్పాటుచేసి తాము స్వేచ్ఛగా తమ విధులను నిర్వహించలేకపోతున్నామని వాపోయారు. రాజకీయ జోక్యం, రాజకీయాధిపత్యం తమ విధులకు పరిధిలు విధిస్తున్నదని చెప్పుకున్నారు. ఈ క్రమంలో తాము నిష్పాక్షిక న్యాయం అందించలేకపోతున్నామని తమ అశక్తతను వివరించారు. ఆ క్రమంలోనే న్యాయవ్యవస్థ పనితీరు ఎలా ఉండాలో.. గత చరిత్ర నుంచి ఉదాహరణలతో వివరించారు. న్యాయమూర్తి ఎట్టి పరిస్థితుల్లోనో రాజకీయాలకు లొంగి పనిచేసే పరిస్థితి ఉండకూడదు. స్వతంత్ర న్యాయవ్యవస్థపై రాజకీయవ్యవస్థలు, కార్పొరేట్ కంపెనీలు తదితరాల ప్రత్యక్ష, పరోక్ష ప్రభావాలు, ఆధిపత్యాలు ఉండరాదు. అప్పుడు మాత్రమే స్వతంత్రంగా న్యాయవ్యవస్థ పనిచేయగలుగుతుంది.

సరిగ్గా ఈ నేపథ్యంలోంచే పి.చిదంబరం కేసును పరిశీలించాలి. మధ్యయుగాల కాలంనాటి పాలనా విధానాలు కొత్త తొడుగులు వేసుకొని మన ముందుకు వస్తున్నది. ప్రతీకార రాజకీయాలను పద్ధతి ప్రకారంగా కొనసాగిస్తున్నది. మొత్తంగా పాలనావ్యవస్థలన్నీ ఒక ఆధిపత్యశక్తికి దాసోహమై పోయాయి. మాజీ ఆర్థిక మంత్రి చిదంబరం ఇంటిపై సీబీఐ అధికారుల దాడి, వ్యవహరించిన తీరు.. మెల్లమెల్లగా అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేసిన తీరుకు అద్దం పడుతున్నది.

ఈ నేపథ్యంలోనే సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ వ్యాఖ్యలు గమనించదగినవి. కొన్ని చీకటిశక్తులు న్యాయవ్యవస్థతో సహా అన్ని స్వతంత్ర వ్యవస్థలను ఆజమాయిషీ చేయజూస్తున్నాయని హెచ్చరించారు. దీంతో భారత ప్రజాస్వామ్యానికి అతిపెద్ద ప్రమాదం పొంచి ఉన్నదని తెలిపారు. రాజకీయాధికారాన్ని కేంద్రీకృతం చేసే ప్రక్రియ వేగంగా కొనసాగుతున్నదని ప్రమాదమంతా దీంతోనేనని అన్నారు. తెలిసో, తెలియకో చాలా సందర్భాల్లో రాజకీయవ్యవస్థలు న్యాయవ్యవస్థల పనితీరును ప్రభావితం చేయటమే కాదు, ఆటంకాలు కల్పిస్తున్నాయి. ఈ క్రమంనే అధికార వికేంద్రీకరణ అనేది కనుమరుగై కేంద్రీకరణ పెరిగిపోతున్నది. దీంతో పాలనావ్యవహారాల్లో ప్రజాస్వామ్యం, భిన్నాభిప్రాయలకు తావులేకుండా అవుతున్నది. మొత్తంగా న్యాయవ్యవస్థ పనితీరులో కూడా అవాంఛిత కాఠిన్యత చోటుచేసుంటున్నది.

మరోవైపు ప్రధాన ప్రతిపక్షాల్లో కూడా అంతర్గత ఆధిపత్యం కొనసాగుతున్నది. ఆ క్రమంలోంచే అధికారపక్షానికి అవసరమైన రీతిలో అసమ్మతిని కూడా తెలుపలేకపోతున్నది. అధికారపక్షం ఇదే అదనుగా తనదైన మెజారిటీ బలంతో ఏకఛత్రాధిపత్యంగా వ్యవహరిస్తున్నది. అనుకున్నదే న్యాయంగా నడుచుకుంటున్నది. అయితే ఈ రాజకీయ అసమత్వానికి న్యాయవ్యవస్థ పనితీరు మాత్రమే కారణం కాదు. నిజానికి రాజకీయాధిపత్య శక్తుల కనుసన్నల్లో న్యాయవ్యవస్థ ఏమీ లేదు. కానీ ఇప్పుడొక విచిత్ర పరిస్థితి నెలకొని ఉన్నది. సమర్థ నాయకత్వం చేతిలో సర్వాధికారాలు కేంద్రీకృతమై ఉన్నాయి. అవన్నీ దేశం కోసమే, మంచికోసమే అనేంతగా జనంలో విశ్వాసాలు పాదుకొని ఉన్నాయి. అధినాయకత్వ ఆలోచనలు, పనులన్నీ ప్రజాకాంక్షలకు ప్రతిరూపమనే దాకాపోయింది. ఈ నేపథ్యంలోంచే సమర్థ నేత చేసే పనులన్నీ దేశం కోసమే అయిపోయింది. అక్కడ తర్కబద్ధ న్యాయం, హేతుబద్ధత అనేదానికి తావులేదు.



ఇక్కడే ఇప్పటి ప్రమాదమంతా ఉన్నది. ప్రజాస్వామ్యస్ఫూర్తి అథమస్థానంలోకి దిగజారిపోతున్నది. రాజ్యాంగపరమైన కాఠిన్యత పదునెక్కుతున్నది. నిజానికి సుదీర్ఘ ప్రజాస్వామ్య చరిత్ర కలిగిన పాలనా, న్యాయవ్యవస్థలు అపసవ్యాలకు అంత తొందరగా లోనుకావు. నెహ్రూ శకంలో పాదుకొల్పబడిన అనేక విలువలు, నియమాలు రూపుమాసిపోతున్నాయి. దశాబ్దాల చరిత్ర కలిగిన నిష్పాక్షిక వ్యవస్థలన్నీ పనితీరులో పూర్వపు విశ్వసనీయతను కోల్పోతున్నాయి.ఆ క్రమంలోనే రాజ్యాంగ ముసుగుతోనే అతిక్రమణలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి.

సమర్థ, నిర్ణయాత్మక నాయకత్వం తీసుకున్న ఆర్థికనిర్ణయాల పర్యవసానాలు, ఫలితాలు మనం ఇప్పటికీ అనుభవిస్తూనే ఉన్నాము. ప్రజలందరినీ ఏమార్చి అద్భుతాలు చేస్తామనే పేరిట పెద్దనోట్లను రద్దు చేశారు. దీంతో ఆర్థికవ్యవస్థ గాడిలో పడుతుందనీ, బలోపేతమవుతుందని అన్నారు. కానీ ఆ నిర్ణయంతో దేశంలోని చిన్న వ్యాపారులంతా తీవ్రంగా నష్టపోయారు. అనేక ఇబ్బందులకు గురయ్యారు. లోక్‌సభ ఎన్నికలు ముంచుకొస్తున్నవేళ.. కార్పొరేట్ సంస్థలన్నీ గగుర్పాటుకు గురయ్యాయి. మరోవైపు అధికార పార్టీకి సమర్థనేత మూడొందల పైచిలుకు స్థానాలతో అఖండ విజయాన్ని అందించారు. దీంతో ఆయనకు ఎదురు లేకుండా పోయింది. మరోవైపు నిర్ణయాత్మక నేత నిర్ణయాలన్నీ సంప్రదాయాలన్నింటినీ కాలరాస్తున్నది. ఆర్థిక పరిస్థితి కష్టాల్లో పడింది. దీన్ని నీతి ఆయోగ్ కూడా ఒప్పుకునే పరిస్థితి ఏర్పడింది.

ప్రముఖ వేదాంత గ్రూప్ కార్పొరేట్ కంపెనీ అధినేత అనిల్ అగర్వాల్ ప్రస్తుత దేశ పరిస్థితి గురించి చెప్పిన మాటలు ఆసక్తికరమైనవి. ఆయన ఓ ప్రముఖ ఆంగ్లపత్రికలో చెప్పిన దాని ప్రకారం.. ప్రతిరోజు ప్రజలు ఎదురుచూస్తుంటారు. ప్రజలు వాన కోస ఆకాశం వైపు చూస్తూ ఎలా ఎదురుచూస్తారో అలా.. ఆకాశం వైపు చూస్తూ గడిపే క్రమంలో తలనొప్పి, మెడ నొప్పి వస్తుంది. కానీ ఎప్పుడో ఒకసారి ఆకాశం నుంచే వర్షం కురుస్తుందనే ఆశ ఉంటున్నది. సరిగ్గా ఇదే విధంగా.. ప్రజలంతా ప్రధాని ఏదో ఒక రూపంలో సాయం అందిస్తారని ఎదురుచూస్తారు. పారిశ్రామికవర్గాలు కూడా తమకు అనుకూల నిర్ణయాలు వస్తాయని ఎదురుచూస్తుంటారు. కానీ నిర్ణయాత్మక నేత నుంచి ఎలాంటి ప్రజానుకూల, ప్రజలకు సాయపడే నిర్ణయాలు రాక దిగాలు పడుతారు.


ప్రముఖ వేదాంత గ్రూప్ కార్పొరేట్ కంపెనీ అధినేత అనిల్ అగర్వాల్ ప్రస్తుత దేశ పరిస్థితి గురించి చెప్పిన మాటలు ఆసక్తి కరమైనవి. ఆయన ఓ ప్రముఖ ఆంగ్రపత్రికలో చెప్పిన దాని ప్రకారం.. ప్రతిరోజు ప్రజలు ఎదురుచూస్తుంటారు. ప్రజలు వాన కోస ఆకాశం వైపు చూస్తూ ఎలా ఎదురుచూస్తారో అలా.. ఆకాశం వైపు చూస్తూ గడిపే క్రమంలో తలనొప్పి, మెడ నొప్పి వస్తుంది. కానీ ఎప్పుడో ఒకసారి ఆకాశం నుంచే వర్షం కురుస్తుందనే ఆశ ఉంటున్నది. సరిగ్గా ఇదేవిధంగా.. ప్రజలంతా ప్రధాని ఏదో ఒక రూపంలో సాయం అందిస్తారని ఎదురుచూస్తారు. పారిశ్రామికవర్గాలు కూడా తమకు అనుకూల నిర్ణయాలు వస్తాయని ఎదురుచూస్తుంటారు.


ప్రభుత్వం మరో యుద్ధానికి తెరతీసింది. మాజీ కేంద్ర ఆర్థిక మంత్రి అవినీతిని ముందుకుతెచ్చి అవినీతి అంతానికి పూనుకుంటున్నట్లు చెప్పుకుంటున్నది. అయితే రాజ్యాంగ వ్యవస్థల పనితీరును ప్రభావితమవుతున్న దాఖలాలు స్పష్టంగా కనిపిస్తున్న తీరు ఆందోళనకరమైనది. మనం ఇప్పటికీ గట్టి విశ్వాసంతో ఉండాలి. రాజ్యాంగబద్ధమైన వ్యవస్థల పరిరక్షణలో మనమంతా సురక్షితంగా ఉన్నాం. కానీ సమర్థ వ్యక్తి చేతిలో మన భద్రత అంతా ఉన్నదనే భ్రమలను విడనాడాలి.

**('ది వైర్' సౌజన్యంతో..)**

# నిబద్ధ నైపుణ్య సేవల కోసం..

**తెలంగాణం**



**వనం జ్వాలా నర్సింహారావు**

ప్రభుత్వ ఉద్యోగులకు, ప్రజాప్రతినిధులకు క్రమం తప్పకుండా శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలి. దీనిపై ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకోవాలి. తదనుగుణంగా వినూత్నపద్ధతిలో స్టేట్ ట్రైనింగ్ ఇనిషియేటివ్‌కు శ్రీకారం చుడితే బాగుంటుందేమో! ఇలా చేయడం ద్వారా శిక్షణ పొందినవారి వ్యక్తిగత, సామూహిక, సంస్థాగత పనితీరులో మెరుగుదల ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. దీంతోపాటు వారి సామర్థ్యం కూడా వృద్ధి చెందుతుంది. దీనికోసం శిక్షణా కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్లు, శాఖాధిపతుల ముఖ్యమైన బాధ్యతల్లో ఒకటిగా చేసి, వారివారి స్థాయిల్లో వారిని ట్రైనింగ్ కమిషనర్లుగా నామినేట్ చేయాలి. ట్రైనింగ్ కమిషనర్లుగా వీరి బాధ్యతల నిర్వహణలో చేదోడువాదోడుగా ఉండటానికి ప్రతి జిల్లాలో, రాష్ట్రస్థాయి ప్రభు త్వశాఖలో శిక్షణా కార్యక్రమాల అమలుకు ట్రైనింగ్ కో ఆర్డినేటర్లను నియమించాలి.

ప్రభుత్వం చేపట్టబోయే ఈ క్రమబద్ధ శాస్త్రీయ శిక్షణా కార్యక్రమంలో భాగంగా ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి ఏడాదిలో కనీసం ఒక్కసారైనా ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపైనా, ప్రభుత్వ పథకాలపైనా పరిపూర్ణంగా అవగాహన కలిగించాలి. వారి పనితీరులో సామర్థ్య పెంపుదల దిశగా శిక్షణ డిజైన్ తయారుకావాలి. శిక్షణ పూర్వరంగంలో శిక్షణకు హాజరయ్యేవారి పనికి, ఉద్యోగానికి సంబంధించి ఉండాలి. ఒక గ్రూప్‌గా వారు నిర్వహించాల్సిన విధుల, వారు పనిచేస్తున్న శాఖల అవసరాల గురించి, అభ్యర్థుల శిక్షణ అవసరాలు గుర్తించాలి.

ఈ యావత్ ప్రక్రియలో భాగంగా సచివాలయ స్థాయిలో మొదటగా ఉండాలి. ప్రభుత్వశాఖల స్థాయిలో, జిల్లాస్థాయిలో కార్యదర్శులుగా, హెచ్‌ఓడీలుగా, జిల్లా కలెక్టర్లుగా పనిచేస్తున్న అఖిల భారత సర్వీసు (ఐఏఎస్, ఐఎఫ్ఎస్, ఐపీఎస్) అధికారులకు శిక్షణ ఇవ్వాలి. దీనిద్వారా వారి సామర్థ్యం పెంపుదలకు తీసుకుంటున్న చర్యలపై అవగాహన కలిగించడానికి మూడురోజుల ఓఎంఓటీ (ఓరియంటేషన్ టు మానేజ్‌మెంట్ ఆఫ్ ట్రైనింగ్) శిబిరం నిర్వహిస్తే మంచిది. ట్రైనింగ్‌లో ఉన్నతస్థాయి అధికారుల నిబద్ధత, అంకితభావం ఉండాలి. కాబట్టి దానికి సంబంధించిన అంశాలు చర్చించే వీలు కూడా ఈ గోష్టిలో కలుగుతుంది. వీరికి చేదోడుగా పనిచేయాల్సిన ట్రైనింగ్ కో ఆర్డినేటర్లకు మేనేజ్‌మెంట్ ఆఫ్ ట్రైనింగ్‌లో శిక్షణ ఇవ్వాలి.

శిక్షణా విధానం కేవలం అందులో పాల్గొంటున్న వారి విజ్ఞానం, నైపుణ్యం మెరుగుపరుచడమే కాదు. వారి కార్యధోరణిలో, వైఖరిలో గణనీయమైన మార్పు చోటుచేసుకోవాలె. తద్వారా పౌరులకు, ప్రజా బాహుళ్యానికి మరింత సమర్థవంతమైన, పటిష్ఠమైన సేవలు అందించడానికి దోహదపడాలి. ప్రభుత్వపరంగా చేపట్టిన యావత్ శిక్షణా కార్యాచరణకు దార్శనికత చూపాలి. స్థూలస్థాయిలో పర్యవేక్షించడానికి, సమీక్షించడానికి ఒకవిధమైన రాష్ట్రస్థాయి శిక్షణా మండలిని అవసరమనుకుంటే ముఖ్యమంత్రి అధ్యక్షతన ఏర్పాటుచేయాలి. ఆ మండలిలో క్షేత్రస్థాయి, ఉన్నతస్థాయి శిక్షణా యాజమాన్య నిపుణులను భాగస్వాములను చేయాలి. వ్యక్తిగతంగా, శాఖాపరంగా, హెచ్‌వోడీ అవసరాలకు అనుగుణంగా శిక్షణావసరాలను గుర్తించాలి. శిక్షణావసరాల ఆధారంగా చక్కటి శిక్షణా డిజైన్ తయారుచేసి నిర్ణీత కాలవ్యవధిలో తగు శిక్షణ ఇప్పించాలి.




బడ్జెట్ అంచనాలతో సహా వారివారి శాఖలకు కావాల్సిన వార్షిక శిక్షణా కార్యాచరణ పథకాల రూపకల్పన బాధ్యతను సంబంధిత హెచ్‌వోడీలకు అప్పగించాలి. ఈ యావత్ ప్రక్రియకు ప్రధాన సమన్వయ సంస్థగా మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థను నియమించి, రాష్ట్రంలోని ఇతర శిక్షణాసంస్థల, అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజీ లాంటి సంస్థల సేవలను ఉపయోగించుకోవాలి. ప్రభుత్వోద్యోగులు, ప్రజా ప్రతినిధులను శిక్షణ నిమిత్తమై, వారివారి బాధ్యతలకు అనుగుణంగా నాలుగు భాగాలుగా విభజించవచ్చు. అవి: మొదటిది విధానస్థాయి, రెండవది పరిపాలనా స్థాయి, మూడవది అమలుపరిచే స్థాయి, నాలువది పై మూడుస్థాయిల వారికి మద్దతుగా పనిచేసే కింది స్థాయి సిబ్బంది.

పాలసీ స్థాయి వారిలో మంత్రులు, ఎమ్మెల్యేలు, (కార్యదర్శి, అంత కంటే పైస్థాయి) అఖిల భారత సర్వీస్ సీనియర్ అధికారులు ఉంటారు. వీరికి సంస్థాగత ప్రవర్తనకు సంబంధించిన శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేయాలి. అడ్మినిస్ట్రేటివ్ స్థాయి అధికారులలో హెచ్‌వోడీలు, కార్యదర్శి స్థాయి కంటే కింది అఖిలభారత సర్వీసు అధికారులు ఉంటారు. ఎగ్జిక్యూటివ్ లేదా అమలుపరిచే స్థాయి వారిలో మండలస్థాయి వరకూ క్రియాశీలక పాత్ర పోషించే క్షేత్రస్థాయి అధికారులుంటారు. మిగిలిన వారంతా కిందిస్థాయి లేదా క్లరికల్, పర్యవేక్షక క్యాటగిరికి చెందిన ఉద్యోగులు. రాష్ట్రం మొత్తం మీద అన్ని విభాగాల్లో కలిపి సుమారు 5 వేల నుంచి 10 వేల మంది వ్యూహాత్మక బాధ్యతలు నిర్వర్తిం చే ప్రభుత్వ ఉద్యోగులను, ప్రజాప్రతినిధులను గుర్తించాలి. వారికి ప్రత్యేక శిక్షణాకార్యక్రమాలు నిర్వహించాలి. ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాల అమలుపట్ల నిబద్ధత, అంకితభావం, కార్యనిర్వహణ పెంపొందేలా, మెరుగుపడేలా చేయాలి.

ఈ మొత్తం శిక్షణా వ్యవహారం విజయవంతం కావడానికి, సత్ఫలితాలు ఇవ్వడానికి తెలంగాణ రాష్ట్ర ఎపెక్స్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ సేవలను ఉపయోగించుకోవాలి. ఎంసీఆర్ హెచార్డీ ఇనిస్టిట్యూట్‌లో విజ్ఞానపరమైన అర్హతలు గల, అనుభవుజ్ఞులైన, నిబద్ధత గల నిపుణుల ఫాకల్టీ బృందం ఉన్నది. వీరిలో కొంద రు విజిటింగ్ ఫ్యాకల్టీ కాగా కొందరు శాశ్వత ప్రాతిపదికన ఉద్యోగులు. ఏటా దీనిలో 15,000 మంది వివిధస్థాయి ఉద్యోగులు ఈ సంస్థలో శిక్షణ పొందుతున్నారు. ఈ నేపథ్యంలో 1996లో కేంద్ర ప్రభుత్వం జాతీయ శిక్షణా విధానాన్ని విడుదల చేసింది. దాన్నే తిరిగి 2012లో ఆధునీకరించారు. జాతీయ విధానాన్ని దృష్టిలో ఉంచుకొని ఆ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతి రాష్ట్ర ప్రభుత్వం తమ తమ రాష్ట్ర శిక్షణా విధానాలను తయారు చేసుకోవాలని కేంద్రం సూచించింది.


ఎంసీఆర్ హెచార్డీ ఇనిస్టిట్యూట్‌లో విజ్ఞానపరమైన అర్హతలు గల, అనుభవుజ్ఞులైన, నిబద్ధత గల నిపుణుల ఫాకల్టీ బృందం ఉన్నది. వీరిలో కొంద రు విజిటింగ్ ఫ్యాకల్టీ కాగా కొందరు శాశ్వత ప్రాతిపదికన ఉద్యోగులు. ఏటా దీనిలో 15,000 మంది వివిధస్థాయి ఉద్యోగులు ఈ సంస్థలో శిక్షణ పొందుతున్నారు. ఈ నేపథ్యంలో 1996లో కేంద్ర ప్రభుత్వం జాతీయ శిక్షణా విధానాన్ని విడుదల చేసింది. దాన్నే తిరిగి 2012లో ఆధునీకరించారు. జాతీయ విధానాన్ని దృష్టిలో ఉంచుకొని ఆ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతి రాష్ట్ర ప్రభుత్వం తమ తమ రాష్ట్ర శిక్షణా విధానాలను తయారు చేసుకోవాలని కేంద్రం సూచించింది.


ఈ నేపథ్యంలో డాక్టర్ మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ సేవలను ఉపయోగించుకొని ఒక క్రమపద్ధతిలో ప్రభుత్వ ఉద్యోగులందరికీ, ప్రజా ప్రతినిధులందరికీ వారివారి అవసరాలకు తగిన విధంగా శిక్షణా కార్యక్రమాలు అమలుచేయాలి.

**(వ్యాసకర్త: హెచ్‌ఆర్డీ ఇన్‌స్టిట్యూట్ మాజీ అదనపు సంచాలకుడు)**


Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.



epaper.ntnews.com

# ప్రతిపక్షాల చేతబడి వల్లే సుష్మ, జైట్లీ మృతి!



- బీజేపీ ఎంపీ సాధ్వి ప్రజ్ఞాసింగ్ ఆరోపణ

**భోపాల్:** బీజేపీ సీనియర్ నాయకులు సుష్మా స్వరాజ్, అరుణ్ జైట్లీ మరణాలపై ఆ పార్టీ ఎంపీ సాధ్వి ప్రజ్ఞాసింగ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. తమ పార్టీకి చెందిన సీనియర్ నేతల మరణాన్ని కాంగ్రెస్ ప్రతిపక్షం మారక శక్తి (చేతబడి) చేయిస్తున్నదని ఆరోపించారు. బీజేపీకి విపత్కర కాలం దాపురించిందని ప్రతిపక్షం చేతబడి చేయిస్తున్నదని గతంలో ఓ మహారాజ్(ఆధ్యాత్మికవేత్త) చెప్పినట్టు ఆమె పేర్కొన్నారు. ఇటీవల మరణించిన కేంద్ర మాజీ మంత్రి అరుణ్ జైట్లీ, మధ్యప్రదేశ్ మాజీ సీఎం బాబూలాల్ గౌర్‌కు భోపాల్‌లోని బీజేపీ పార్టీ కార్యాలయంలో సోమవారం సంతాప సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజ్ఞ మాట్లాడుతూ.. 'బీజేపీకి వ్యతిరేకంగా మారక శక్తిని ప్రతిపక్షాలు చేతబడి చేయిస్తున్నాయని ఓ మహారాజ్ నాకు లోక్‌సభ ఎన్నికల సమయంలో చెప్పారు. ఆయన చెప్పిన మాటలను నేను తర్వాత మర్చిపోయాను. అయితే, ఆయన చెప్పినట్టుగానే మాకు ఇప్పుడు చెడు కాలం నడుస్తున్నది. పార్టీకి చెందిన పలువురు అగ్రనేతలు ఒక్కొక్కరూ మమ్మల్ని విడిచి వెళ్తున్నారు. మహారాజ్ చెప్పింది నిజమేమోనని నాకు అనిపిస్తున్నది' అని పేర్కొన్నారు. కాగా బీజేపీ సీనియర్ నాయకులు సుష్మా స్వరాజ్ ఈ నెల 6న, బాబూలాల్ గౌర్ 20న, జైట్లీ 24న మరణించడం తెలిసిందే.

# కర్ణాటకకు ముగ్గురు డిప్యూటీ సీఎంలు

- మంత్రులకు శాఖలను కేటాయించిన సీఎం యెడియూరప్ప

**బెంగళూరు:** వారం క్రితం మంత్రివర్గ విస్తరణ చేపట్టిన కర్ణాటక ముఖ్యమంత్రి యెడియూరప్ప సోమవారం 17 మంది మంత్రులకు శాఖలను ఖరారు చేశారు. తొలిసారిగా ముగ్గురికి డిప్యూటీ ముఖ్యమంత్రి పదవిని కట్టబెట్టారు. సీనియర్ నేత గోవింద్ కర్జోల్‌కు డిప్యూటీ సీఎం పదవితో పాటు పీడబ్ల్యూడీ, సాంఘిక సంక్షేమ శాఖలు కేటాయించారు. అశ్వత్ నారాయణ్‌కు డిప్యూటీ సీఎంతో పాటు ఉన్నత విద్య, ఐటీ, శాస్త్ర, సాంకేతిక శాఖను, లక్ష్మణ్ సవాదికి ఉప ముఖ్యమంత్రి పదవితో పాటు రవాణాశాఖను కేటాయించారు. బసవరాజు బొమ్మైకి హోం మంత్రిత్వ శాఖను కట్టబెట్టారు. మాజీ ముఖ్యమంత్రి జగదీశ్ షెట్టర్‌కు భారీ, మధ్య తరహా పరిశ్రమలు, మాజీ డిప్యూటీ సీఎం కే ఎస్ ఈశ్వరప్పకు పంచాయత్ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖను, మరో మాజీ డిప్యూటీ సీఎం ఆర్ అశోక్‌కు రెవెన్యూ శాఖను కేటాయించారు.






చంద్రయాన్-2 పంపిన చంద్రుడి బిలాల ఫొటోలు

# భూమి ఊపిరితిత్తులకు చిచ్చు

## మానవాళిని వణికిస్తున్న అమెజాన్ కార్చిచ్చు

### వాతావరణంలోకి విడుదలవుతున్న కోట్ల టన్నుల కర్బన ఉద్గారాలు

### పెరుగుతున్న గ్లోబల్ వార్మింగ్ ముప్పు



### 78వేల కార్చిచ్చులు

**అమెజాన్** అడవులు వర్షాధారం. జూలై నుంచి అక్టోబర్ వరకు పొడికాలం కొనసాగుతుంది. ఈ సమయంలో మంటలు చెలరేగడం సహజమే. మిగతా కాలంలో వర్షాలు పడినప్పుడు అడవి ఆ నష్టాన్ని పూడ్చుకుంటుంది. అయితే రానురాను మానవ చర్యలు అమెజాన్‌కు శాపంగా పరిణమించాయి. అడవుల నరికివేత, పొలాల కోసం చెట్లను దహనం చేయడం, పశువుల మేత కోసం అడవులను శుభ్రం చేయడం వంటి చర్యలతో కార్చిచ్చులు చెలరేగుతున్నాయి. ముఖ్యంగా బ్రెజిల్‌లో కార్చిచ్చులు ఎక్కువగా నమోదవుతున్నాయి. ఈ ఏడాది ఇప్పటివరకు బ్రెజిల్‌లో 78,383 కార్చిచ్చులు నమోదయ్యాయి. గత ఆరేండ్లలో ఇదే అత్యధికం. గత ఏడాదితో పోల్చితే 88 శాతం ఎక్కువ. అంతేకాదు.. 2016 నుంచి ఇప్పటివరకు నమోదైన సగటు కార్చిచ్చులతో పోల్చితే 60 శాతం అధికం. 2018లో మొదటి ఎనిమిది నెలల్లో 39,759 సార్లు మంటలు చెలరేగాయి. గత మూడు వారాల్లోనే అడవిలో 10వేల చోట్ల మంటలు చెలరేగడాన్ని ఉపగ్రహాలు గుర్తించాయని అధికారులు తెలిపారు.. ఇక అమెజాన్ బేసిన్‌లోని మిగతా దేశాల్లోనూ వేల సంఖ్యలో కార్చిచ్చు ఘటనలు నమోదవుతున్నాయి. వెనిజులాలో 26వేలు, బొలీవియాలో 17వేలకు పైగా మంటలు చెలరేగి అడవిని హననం చేస్తున్నాయి.

**అ**మెజాన్ అడవిలో చెలరేగిన కార్చిచ్చుతో ప్రపంచం ఉలిక్కి పడుతున్నది. 'ప్రపంచ ఊపిరితిత్తులు'గా పిలుచుకొనే ఈ మహారణ్యం మూడు వారాలుగా తగలబడిపోతుండటం భూగోళానికే భారీ ముప్పుగా పరిణమించింది. శాస్త్రవేత్తలు, పర్యావరణవేత్తలు, ప్రకృతి ప్రేమికులు మొదలు సామాన్య పౌరుల వరకు ప్రతి ఒక్కరూ అడవి తల్లి దుస్థితిని చూసి కన్నీరుమున్నీరవుతున్నారు. ఎందుకు?.. ఈ ప్రశ్నలకు సమాధానాలు అనేకం. అమెజాన్‌తో భూగోళానికి కలుగుతున్న ప్రయోజనాలు, ఇప్పుడు చెలరేగిన కార్చిచ్చుతో పర్యావరణానికి జరుగనున్న నష్టం.. ఇప్పటికే ముంచుకొస్తున్న గ్లోబల్ వార్మింగ్ ముప్పు మరింత పెరుగడం వంటి ఎన్నో కారణాలు దీనిని ప్రపంచ సమస్యగా మార్చాయి. ఇప్పటికైనా మేలుకోకుంటే మానవాళి సరిదిద్దుకోలేని తప్పుగా ఇది మారుతుందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.

**ఊపిరితిత్తులు కాలిపోతున్నాయి**

అమెజాన్ అడవులు దాదాపు 135 కోట్ల ఎకరాల్లో, దాదాపు తొమ్మిది దేశాల పరిధిలో విస్తరించాయి. ఇందులో 60 శాతం బ్రెజిల్‌లోనే ఉన్నది. ఈ వర్షాధార అడవులను 'ప్రపంచ ఊపిరితిత్తులు'గా పిలుస్తుంటారు. ఎందుకంటే.. భూమిపై విడుదలవుతున్న ఆక్సిజన్‌లో 20 శాతం ఈ అడవి నుంచే వస్తున్నది. ఇప్పుడు ఆ ఊపిరితిత్తులు కాలిపోతున్నాయి. కార్చిచ్చు కారణంగా ఇక్కడి నుంచి వెలువడుతున్న పొగ అంతరిక్షం నుంచి కూడా కనిపిస్తుండటం గమనార్హం. ఈ పొగ ఇప్పటికే దాదాపు 3500 కి.మీ. మేర ప్రయాణించిందని శాస్త్రవేత్తలు చెప్తున్నారు. అడవికి 3,200 కి.మీ. దూరంలో ఉన్న బ్రెజిల్‌లోని సావోపోలో నగరంపై నల్లని పొగ కమ్ముకున్నది.



**గ్లోబల్ వార్మింగ్ గంటలు**

మానవుల వికృత చర్యలతో ఇప్పటికే ప్రపంచం గ్లోబల్ వార్మింగ్ ముప్పును ఎదుర్కొంటున్నది. ఆ ముప్పును అడ్డుకోవడంలో అమెజాన్‌ది కీలకపాత్ర. ఏటా కోట్ల టన్నుల మేర కార్బన్ డై ఆక్సైడ్ వంటి కర్బన ఉద్గారాలను ఈ అడవి పీల్చుకుంటున్నది. సాధారణంగా చెట్లను కాల్చినప్పుడు అవి గతంలో శోషించుకొని నిల్వ చేసుకున్న కర్బన ఉద్గారాలు బయటికి వస్తాయి. ఇప్పుడు అమెజాన్ తగలబడిపోతుండటంతో కోట్ల టన్నుల కర్బన ఉద్గారాలు వాతావరణంలోకి విడుదలవుతున్నాయి. ఈ ఏడాదిలో ఇప్పటివరకు అమెజాన్ మహారణ్యంలో చెలరేగిన కార్చిచ్చుల వల్ల 230 మెగా టన్నుల కర్బన ఉద్గారాలు వాతావరణంలోకి విడుదలయ్యాయని అంచనా. అంటే 2300 కోట్ల కిలోల ఉద్గారాలు వాతావరణంలోకి కలిసిపోయాయి. ఇది ఆస్ట్రేలియా, పోలాండ్, టర్కీ వంటి కొన్ని దేశాలు ఏడాది కాలంలో విడుదల చేసే ఉద్గారాలకు దాదాపు సమానం. ఇలాగే కొనసాగితే రానున్న 30-50 ఏండ్లలోనే భూమి సగటు ఉష్ణోగ్రతలు 1.5 డిగ్రీల మేర పెరిగే అవకాశం ఉన్నదని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.

**సమతౌల్యానికి ప్రమాదం**

అమెజాన్ బేసిన్‌లో 30 లక్షలకు పైగా జీవజాతులు నివసిస్తున్నాయి. అత్యంత అరుదైన వృక్ష, జంతు జాతులకు ఇది ఆలవాలం. అంతేకాదు.. అత్యంత అరుదైన తెగలకు చెందిన మూలవాసులు దాదాపు 10 లక్షల మంది ఈ అడవిలోనే బతుకుతున్నారు. మూడు కోట్ల మందికిపైగా అడవిపై ఆధారపడుతున్నారు. కార్చిచ్చుల వల్ల అరుదైన జీవజాతులు అంతరించిపోతున్నాయి. ఫలితంగా పర్యావరణ సమతౌల్యం దెబ్బతింటున్నది.

**దోషి.. బ్రెజిల్**

1970ల్లో అమెజాన్ విస్తీర్ణం దాదాపు 150 కోట్ల ఎకరాలు. ఐదు దశాబ్దాల్లోనే బ్రెజిల్ 12-15 శాతం అడవులను కొట్టివేసింది. ఈ నరికివేత 20-25 శాతానికి చేరితే ప్రపంచానికే పెను ముప్పు అని పర్యావరణవేత్తలు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితికి పూర్తి బాధ్యత బ్రెజిల్ ప్రభుత్వానిదే. ఒకప్పుడు పటిష్ఠంగా ఉన్న అటవీ పరిరక్షణ చట్టాలను ప్రభుత్వాలు బలహీనం చేస్తూ వచ్చాయి. ప్రస్తుత అధ్యక్షుడు జైర్ బొల్సోనారో దానిని పతాక స్థాయికి తీసుకెళ్లారు. దేశ ఆదాయాన్ని పెంచేందుకు ఈ చట్టాలను మరింత నిర్వీర్యం చేశారు. ఫలితంగా వేల హెక్టార్ల విస్తీర్ణంలో అడవులకు నిప్పు పెడుతూ ధ్వంసం చేస్తున్నారు. గనుల తవ్వకం, కలప అక్రమ రవాణా, వ్యవసాయం వంటివి పెరిగిపోయాయి. కొన్నిచోట్ల ఆగస్టు 10వ తేదీని 'ఫైర్ డే' గా పాటిస్తున్నారంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు.

- నేషనల్ డెస్క్



**డికాప్రియో 36 కోట్ల విరాళం**

**లాస్ ఏంజెల్స్:** అమెజాన్ అడవిలో చెలరేగిన కార్చిచ్చులపై ప్రముఖ హాలీవుడ్ నటుడు, పర్యావరణ ఉద్యమకారుడు డికాప్రియో ఆవేదన వ్యక్తం చేశారు. మంటలను అదుపులోకి తేవడం, అడవి పునరుద్ధరణ కోసం ఐదు మిలియన్ డాలర్లు (రూ.36 కోట్లు) విరాళం అందించనున్నట్టు ప్రకటించారు. వీటిని అమెజాన్ అభివృద్ధికి కృషిచేస్తున్న ఐదు సంస్థలకు అందించనున్నట్టు పేర్కొన్నారు.

**బ్రెజిల్‌కు అండగా ఉంటాం: జీ7**

**రియో డీ జెనిరో:** అమెజాన్ అడవుల్లో చెలరేగిన భారీ కార్చిచ్చును ఆర్పేందుకు బ్రెజిల్ ప్రభుత్వానికి సహాయం చేయాలని జీ7 దేశాల కూటమి నిర్ణయించింది. ఆ దేశ అగ్నిమాపక సిబ్బందికి సహకరించేందుకు వేలాది మంది సైనికులను తరలించేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించింది. జీ7 కూటమి దేశాధినేతల సమావేశం ఆదివారంతో ముగిసింది. చివరి రోజు అమెజాన్ అడవిలో కార్చిచ్చుపై ప్రత్యేకంగా చర్చించారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమానుయేల్ మాక్రాన్ మాట్లాడుతూ బ్రెజిల్‌కు సహాయంపై సుదీర్ఘంగా చర్చించామని, ఆ దేశానికి ఆర్థికంగా, సాంకేతికంగా.. ఇలా వీలైనన్ని రంగాల్లో అండగా నిలువాలని నిర్ణయించినట్టు చెప్పారు. మంటలు అదుపులోకి వచ్చిన తర్వాత అడవిని పునరుద్ధరించడంపై బ్రెజిల్ ప్రభుత్వంతో చర్చిస్తామని జర్మనీ చాన్స్‌లర్ ఎంజెలా మెర్కెల్ అన్నారు. 'బ్రెజిల్ సార్వభౌమ దేశం. కానీ అమెజాన్ ప్రపంచస్థాయి అంశం' అని చెప్పారు.

# చంద్రయాన్-2పై విద్యార్థులకు క్విజ్

## టాప్‌స్కోరర్లు ప్రధానితో కలిసి చంద్రయాన్-2 ల్యాండింగ్‌ను వీక్షించే అవకాశం

**న్యూఢిల్లీ, ఆగస్టు 26:** చంద్రయాన్-2 ప్రయోగంపై అవగాహన పెంచేందుకు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) పాఠశాల విద్యార్థులకు ఆన్‌లైన్ క్విజ్ నిర్వహించనున్నది. ఇందులో ఉత్తమ ర్యాంకులు సాధించిన వారికి చంద్రయాన్-2లోని ల్యాండర్ జాబిల్లిపై అడుగుమోపే దృశ్యాన్ని ప్రధాని నరేంద్ర మోదీతో కలిసి వీక్షించే అవకాశం కల్పించనున్నది. విద్యార్థులను ప్రోత్సహించాలని అన్ని రాష్ట్రాలకు కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ లేఖ రాసింది. 'అంతరిక్ష ప్రయోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించే ఉద్దేశంతో మైగవ్.కామ్ సమన్వయంతో ఇస్రో ఆన్‌లైన్ క్విజ్‌ను నిర్వహిస్తున్నది. ప్రతి రాష్ట్రం, కేంద్ర పాలిత ప్రాంతం నుంచి టాప్ స్కోర్ సాధించిన ఇద్దరు 8-10 తరగతుల విద్యార్థులకు చంద్రయాన్-2 చంద్రుడిపై కాలుమోపే దృశ్యాన్ని బెంగళూరులోని ఇస్రో ప్రధాన కార్యాలయంలో ప్రధాని మోదీతో కలిసి వీక్షించే అవకాశం కల్పించనుంది' అని ఒక అధికారి వివరించారు. ఆన్‌లైన్‌లో నిర్వహించే ఈ క్విజ్ పోటీలో 20 ప్రశ్నలకు 10 నిమిషాల్లో సమాధానమివ్వాల్సి ఉంటుంది.

**చంద్రుడి ఉపరితల ఫొటోలు పంపిన చంద్రయాన్-2**

ప్రస్తుతం చంద్రుడి చుట్టూ పరిభ్రమిస్తున్న చంద్రయాన్-2.. చంద్రుడి ఉపరితలానికి సంబంధించిన మరికొన్ని చిత్రాలను పంపినట్లు ఇస్రో సోమవారం వెల్లడించింది. సోమర్‌ఫెల్డ్, కిర్క్‌వుడ్, జాక్సన్, మాక్, కొరొలెవ్, మిత్ర, ప్లాస్కెట్, హెర్మెట్ తదితర బిలాలు ఆ చిత్రాల్లో ఉన్నట్లు వివరించింది. వీటిలో భారత శాస్త్రవేత్త, పద్మభూషణ్ పురస్కార గ్రహీత సిసిర్ కుమార్ మిత్ర గౌరవార్థం ఒక బిలానికి మిత్ర అని పేరుపెట్టారు.

# రాహుల్‌కు ఆహ్వానం ఉపసంహరణ

- కశ్మీర్ పర్యటనను రాజకీయం చేశారు
- జమ్ముకశ్మీర్ గవర్నర్ సత్యపాల్ మాలిక్ ధ్వజం



**శ్రీనగర్, ఆగస్టు 26:** కశ్మీర్‌లో పర్యటించాలన్న తన ఆహ్వానాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాహుల్ గాంధీ రాజకీయం చేశారని జమ్ముకశ్మీర్ గవర్నర్ సత్యపాల్ మాలిక్ ఆరోపించారు. కశ్మీర్‌లో వాస్తవ పరిస్థితిని తెలుసుకునేందుకే రాష్ట్రంలో పర్యటించాలని తాను ఆహ్వానించానని, కానీ రాహుల్ గాంధీ కొందరు విపక్ష నేతలను వెంటేసుకుని వచ్చి.. కశ్మీర్‌లో నిర్బంధంలో ఉన్న నాయకులను కలుద్దామనుకున్నారని చెప్పారు. రాహుల్ రాజకీయం చేయడంతో తన ఆహ్వానాన్ని ఉపసంహరించుకుంటున్నట్లు సత్యపాల్ మాలిక్ పేర్కొన్నారు. కశ్మీర్‌లోకి రాహుల్‌ను అనుమతించాలా? వద్దా? అనేదానిని ఇక అధికార యంత్రాంగం నిర్ణయిస్తుందన్నారు. శాంతియుత పరిస్థితులు నెలకొనే వరకు కశ్మీర్ లోయలోకి ఏ రాజకీయ నాయకుడ్ని అనుమతించబోమన్నారు. రాహుల్‌గాంధీ శాంతిప్రక్రియకు అడ్డంకులు సృష్టించాలని ప్రయత్నించారని ఆరోపించారు. ఆయన వ్యాఖ్యలు భారత్‌కు వ్యతిరేకంగా పాక్ చేస్తున్న వ్యాఖ్యలను పోలి ఉన్నాయన్నారు. రాహుల్ ప్రకటనలు జాతి ప్రయోజనాలను దెబ్బ తీస్తున్నాయని చెప్పారు. జాతి ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వాలని, సున్నితమైన అంశాలపై చిల్లర రాజకీయం చేయొద్దని రాహుల్‌ను సత్యపాల్ కోరారు.

## ఏజేఎల్‌కు భూకేటాయింపు కేసులో..

# ఓరా, హుడాపై ఈడీ చార్జిషీట్



మోతీలాల్ ఓరా | భూపిందర్ హుడా

**న్యూఢిల్లీ, ఆగస్టు 26:** హర్యానాలోని పంచకులలో అసోసియేటెడ్ జర్నల్ లిమిటెడ్ (ఏజేఎల్) కంపెనీకి భూ కేటాయింపు కేసుకు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సోమవారం తొలి చార్జిషీట్‌ను దాఖలు చేసింది. అందులో కాంగ్రెస్ సీనియర్ నేత మోతీలాల్ ఓరా, హర్యానా మాజీ ముఖ్యమంత్రి భూపిందర్ సింగ్ హుడా పేర్లు ఉన్నాయి. భూ కేటాయింపులో చోటుచేసుకున్న అక్రమాల్లో వీరి ప్రత్యక్ష ప్రమేయం ఉన్నదని ఈడీ ఆరోపించింది. రాజ్యసభ సభ్యుడైన ఓరా, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. కాంగ్రెస్ మాజీ సీఎం అయిన హుడా.. కొత్త పార్టీ పెట్టే యోచనలో ఉన్నారు. ఆర్టికల్ 370 రద్దు విషయంలో పార్టీ వైఖరిని ఆయన ఇటీవల తీవ్రంగా తప్పుపట్టారు. ఈ విషయంలో కాంగ్రెస్ దారి తప్పిందని మండిపడ్డారు. 1992లో నాటి హుడా ప్రభుత్వం పంచకులలో ఏజేఎల్‌కు ప్లాట్‌ను కేటాయించింది. అయితే ఇందులో అక్రమాలు చోటుచేసుకున్నాయని ఆరోపిస్తూ బీజేపీ సర్కార్ సీబీఐ విచారణకు ఆదేశించింది. మరోవైపు ఈడీ కూడా మనీ ల్యాండరింగ్ కేసు నమోదు చేసింది. ఇప్పటికే ఏజేఎల్‌కు కేటాయించిన ప్లాట్‌ను స్వాధీనం చేసుకుంది. తన పదవిని దుర్వినియోగం చేసి హుడా ఏజేఎల్‌కు ఆ ప్లాట్‌ను కేటాయించారని ఆరోపించింది. ఏజేఎల్‌లో గాంధీ-నెహ్రూ కుటుంబంతోపాటు పలువురు కాంగ్రెస్ నేతలకు వాటాలున్నాయి. కాంగ్రెస్ వాణిని వినిపించే నేషనల్ హెరాల్డ్ పత్రికను ఏజేఎల్ నడుపుతున్నది. కాగా, ఈ కేసులో సీబీఐ ఇప్పటికే చార్జిషీట్‌ను దాఖలుచేసింది.

# మధ్యవర్తిత్వానికి ఆస్కారం లేదు

## కశ్మీర్ అంశంపై తేల్చిచెప్పిన ప్రధాని మోదీ

- అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో సమావేశం
- యూఎస్ నుంచి దిగుమతులను పెంచనున్నట్లు వెల్లడి
- పర్యావరణం, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్‌పై జీ-7 సదస్సులో ప్రసంగం
- ముగిసిన జీ-7 సదస్సు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ట్రంప్, మోదీ

**బియారిట్జ్/లండన్, ఆగస్టు 26:** జమ్ముకశ్మీర్ అంశంలో భారత్, పాక్ మధ్య మూడో పక్షం మధ్యవర్తిత్వానికి ఎలాంటి ఆస్కారం లేదని ప్రధాని నరేంద్రమోదీ తేల్చిచెప్పారు. ఇరుదేశాలు చర్చలు, సంప్రదింపుల ద్వారా సమస్యలను పరిష్కరించుకోగలవని స్పష్టం చేశారు. ఫ్రాన్స్‌లోని బియారిట్జ్‌లో జీ7 సదస్సు సందర్భంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో భేటీకి ముందు ప్రధాని మీడియాతో మాట్లాడారు. ఆ సమయంలో ట్రంప్ కూడా మోదీతోపాటు ఉన్నారు. కశ్మీర్ అంశంపై మధ్యవర్తిత్వం వహించేందుకు సిద్ధమని ట్రంప్ ఇటీవల వ్యాఖ్యానించడం దుమారం రేపిన సంగతి తెలిసిందే. మీడియాతో ట్రంప్ మాట్లాడుతూ.. మోదీ, ఇమ్రాన్‌ఖాన్ తనకు మంచి మిత్రులని, కశ్మీర్ వివాదాన్ని వారు పరిష్కరించుకోగలరని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇరువురు నేతల భేటీ ముగిసిన అనంతరం విదేశాంగ కార్యదర్శి విజయ్ గోఖలే మీడియాతో మాట్లాడుతూ.. అమెరికా నుంచి దిగుమతులను పెంచనున్నట్లు ట్రంప్‌తో ప్రధాని పేర్కొన్నారన్నారు. అలాగే వాణిజ్య విభేదాలను పరిష్కరించుకునేందుకు త్వరలో ఇరు దేశాల వాణిజ్య మంత్రులు భేటీ కావాలని నిర్ణయించారని చెప్పారు.

**మోదీ ఇంగ్లిష్ బాగా మాట్లాడుతారు..**

ప్రధాని మోదీ ఇంగ్లిష్ బాగా మాట్లాడుతారని, అయితే ఆ భాషలో మాట్లాడేందుకు ఆయన ఇష్టపడరని ట్రంప్ సరదాగా వ్యాఖ్యానించారు. విలేకర్లు అడిగిన ప్రశ్నలకు మోదీ హిందీలో సమాధానమివ్వడంతో ట్రంప్ పై విధంగా స్పందించారు.

**పర్యావరణ పరిరక్షణకు విస్తృత చర్యలు**

జీ7 సదస్సు సందర్భంగా పర్యావరణ అంశంపై నిర్వహించిన సమావేశంలో ప్రధాని మోదీ మాట్లాడారు. ప్లాస్టిక్ నిర్మూలన, నీటి సంరక్షణ, సౌరశక్తి ఉత్పాదకత పెంపు, జీవజాలం, జంతుజాలం సంరక్షణకు భారత్ పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. జీ7 కూటమిలో భారత్ భాగస్వామి కాకపోయినప్పటికీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మానుయెల్ మెక్రాన్ ఆహ్వానం మేరకు ప్రధాని మోదీ ఈ సదస్సుకు హాజరయ్యారు. డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్‌పై నిర్వహించిన సదస్సులో మోదీ మాట్లాడుతూ.. సామాజిక అసమానతలను తొలిగించేందుకు భారత్ డిజిటల్ సాంకేతికతను వినియోగిస్తున్నదని చెప్పారు.

**అమెజాన్ కార్చిచ్చు, వాణిజ్య యుద్ధంపై జీ7 కుస్తీ**

అమెజాన్ కార్చిచ్చు, వాణిజ్య యుద్ధం, ఇరాన్ అంశంతోపాటు ప్రపంచ సమస్యలపై విస్తృత చర్చలు సాగించిన జీ7 సదస్సు సోమవారం ముగిసింది. అయితే వివిధ అంశాల్లో సభ్యదేశాల మధ్య ఐక్యతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**భారత్‌కు పయనమైన ప్రధాని మోదీ**

ఫ్రాన్స్‌లో జీ-7 సదస్సును ముగించుకుని ప్రధాని నరేంద్రమోదీ సోమవారం భారత్‌కు పయనమయ్యారు. జీ-7 సదస్సు సందర్భంగా ట్రంప్ సహా వివిధ దేశాధినేతలతో ఆయన సమావేశమయ్యారు.

## భారత్-బ్రిటన్ ద్వైపాక్షికం బలోపేతం



బోరిస్‌తో మోదీ కరచాలనం

జీ7 సదస్సు సందర్భంగా ప్రధాని మోదీ ఆదివారం బ్రిటన్ నూతన ప్రధాని బోరిస్ జాన్సన్‌తో సమావేశమయ్యారు. వాణిజ్యం, రక్షణ, ఇన్నోవేషన్ రంగాల్లో ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసుకోవాలని నిర్ణయించారు. యాషెస్ సిరీస్ మూడో టెస్ట్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియాపై ఇంగ్లండ్ ఘన విజయం సాధించడంపై జాన్సన్‌కు మోదీ శుభాకాంక్షలు తెలిపారు. జాన్సన్ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇరువురు నేతలు సమావేశం కావడం ఇదే తొలిసారి. గతవారం మోదీతో ఫోన్‌లో మాట్లాడిన జాన్సన్.. కశ్మీర్ వివాదం ద్వైపాక్షిక అంశమేనని పేర్కొన్న విషయం తెలిసిందే.

**ఐరాస ప్రధాన కార్యదర్శితో భేటీ**

ఐక్యరాజ్యసమితి(ఐరాస) ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్‌తోనూ ప్రధాని మోదీ సమావేశమయ్యారు. 'గుటెరస్‌తో సమావేశం అద్భుతంగా జరిగింది. కీలక అంశాలపై సమగ్రంగా చర్చించాం. ముఖ్యంగా పర్యావరణ మార్పులను తగ్గించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చలు జరిపాం' అని ప్రధాని మోదీ ట్వీట్ చేశారు.

# ఆవు మాంసం తిన్నవారే అంటరాని వాళ్లయ్యారు!

- పురాతన కాలంలో 'దళిత' అనే పదమే లేదు
- ఆరెస్సెస్ సంయుక్త ప్రధాన కార్యదర్శి వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ:** పురాతన కాలంలో ఆవు మాంసాన్ని తిన్నవారిని అంటరాని వాళ్లుగా పరిగణించేవారని ఆరెస్సెస్ సంయుక్త ప్రధాన కార్యదర్శి కృష్ణ గోపాల్ వ్యాఖ్యానించారు. ఢిల్లీలో సోమవారం జరిగిన ఓ పుస్తకావిష్కరణ సభలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'ఆవు మాంసాన్ని తిన్న వారి ని అంటరాని వాళ్లుగా పరిగణించే వారు. అంబేద్కర్ కూడా ఈ విషయాన్ని ఓ పుస్తకంలో రాశారు' అని గోపాల్ అన్నారు. పురాతన భారత సాహిత్యంలో 'అంటరానితనం', 'దళితులు' అనే పదాలు లేవని పేర్కొన్నారు. భారతీయ సమాజంలో 'దళితులు' అనే పదం వ్యాపించడానికి బ్రిటీషర్లు చేసిన కుట్రే కారణమన్నా రు.ఇది క్రమంగా సమాజంలో వ్యాప్తిచెంది ప్రజల మనస్సులో బలంగా నాటుకుపోయిందని, ఇలా ఓ వర్గంపై అంటరానివారుగా ముద్రపడేలా చేసిందని చెప్పారు. రాజ్యాంగ సభ లో దళితులు అనే పదాన్ని వాడటం కంటే, 'షెడ్యూల్డ్ కులం' అని ఉపయోగించడానికే ప్రాధాన్యం ఇచ్చారని గుర్తుచేశారు. 8వ శతాబ్దంలో మహమ్మద్ బిన్ కాసిమ్ అనే ముస్లిం రాజు చేతిలో రాజా దహిర్ అనే రాజు ఓడిపోగా.. శత్రువులు తమను తాకితే, అంటరానివాళ్లుగా మారిపోతామని భావించిన రాణులు ఆత్మాహుతి చేసుకున్నారని గోపాల్ ఉదహరించారు.

# పూంఛ్-రావల్‌కోట్ బస్సు పునరుద్ధరణ

**జమ్ము, ఆగస్టు 26:** జమ్ముకశ్మీర్‌లోని పూంచ్, పాకిస్థాన్‌లోని రావల్‌కోట్ పట్టణాల మధ్య నడిచే బస్సును పునరుద్ధరించారు. ఈ నెల 19వ తేదీన పాకిస్థాన్ ప్రభుత్వం ఈ బస్సును నిలిపివేసింది. ఇందుకు తగిన కారణాలను తెలుపలేదు. బస్సు సరిహద్దు దాటేందుకు భారత అధికారులు అనుమతి కోరగా పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే) అధికారులు స్పందించలేదు. దీంతో సర్వీస్ రద్దయింది. చర్చల అనంతరం సర్వీస్‌ను పునరుద్ధరించారు. ఈ మేరకు సోమవారం పూంచ్ నుంచి బస్సు 46 మంది ప్రయాణికులతో బయలుదేరి సరిహద్దు దాటింది. వీరిలో 40 మంది పీవోకేవాసులు. వీరంతా తమ ఇండ్లకు తిరిగి వెళ్తున్నారు. మరో ఆరుగురు భారతీయులు. వీరు పీవోకేలోని తమ బంధువులను కలుసుకొనేందుకు వెళ్తున్నారని అధికారులు తెలిపారు. వారం రోజులకు ఒకసారి నడిచే ఈ బస్సును 'పైగామ్-ఎ-అమన్' (శాంతి సందేశం) అని పిలుస్తుంటారు. 2006 నుంచి ప్రతి సోమవారం నడిపిస్తున్నారు.

# మన్మోహన్‌కు ఎస్పీజీ భద్రత ఉపసంహరణ

- జడ్‌ప్లస్ భద్రత ఇవ్వనున్నట్టు హోంశాఖ వెల్లడి



**న్యూఢిల్లీ:** మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ (ఎస్పీజీ) భద్రతను ఉపసంహరిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. సమీక్ష తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నట్లు హోంశాఖ అధికారులు సోమవారం తెలిపారు. అయితే జడ్‌ప్లస్ భద్రత కొనసాగుతుందన్నారు. జడ్‌ప్లస్ భద్రత కింద కేంద్ర సాయుధ పోలీసు బలగాలు (సీఏపీఎఫ్).. అంటే సీఆర్పీఎఫ్ జవాన్లతో కూడిన భద్రత ఉంటుంది. 2004-14 మధ్య మన్మోహన్‌సింగ్ ప్రధానిగా పని చేశారు. ఎస్పీజీ భద్రత తొలిగించినట్లు ఆయనకు అధికార వర్గాలు తెలిపాయి. న్యూఢిల్లీలోని మన్మోహన్ ఇంటివద్ద సీఏపీఎఫ్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఎస్పీజీ కంటింజెంట్‌ను ఉపసంహరిస్తామని హోం శాఖ అధికారులు చెప్పారు. దీంతో ప్రధాని మోదీ, కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీ, ఆమె కొడుకు రాహుల్ గాంధీ, కూతురు ప్రియాంకాగాంధీలకు మాత్రమే ఎస్పీజీ భద్రత కొనసాగిస్తున్నారు. 2014లో ప్రధానిగా వైదొలిగిన తర్వాత ఏడాది మాత్రమే మన్మోహన్‌కు ఎస్పీజీ భద్రత ఉంటుంది. అయితే మన్మోహన్‌కు, ఆయన భార్య గుర్‌చరణ్‌కౌర్‌లకు వచ్చే బెదిరింపుల ఆధారంగా ఏడాదికోసారి ఎస్పీజీ భద్రతను కొనసాగిస్తూ వచ్చారు.

# అంతర్జాతీయ వేదికలపై కశ్మీర్ అంశాన్ని లేవనెత్తుతా

- ప్రత్యేక ప్రతిపత్తి రద్దు చారిత్రక తప్పిదం
- పాకిస్థాన్ ప్రధాని ఇమ్రాన్ పాతపాట



**ఇస్లామాబాద్, ఆగస్టు 26:** కశ్మీర్‌పై కయ్యానికి కాలు దువ్వే వైఖరితో ఫలితాలు సాధించడంలో విఫలమైన పాకిస్థాన్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్.. ఈ అంశాన్ని ఐరాస సాధారణ అసెంబ్లీతోపాటు ప్రతి అంతర్జాతీయ వేదికపై లేవనెత్తుతామని ప్రకటించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో జరిగిన భేటీలో కశ్మీర్ అంశంపై తృతీయ పక్షం జోక్యానికి అవకాశం లేదని భారత ప్రధాని నరేంద్రమోదీ తేల్చిచెప్పిన కొద్ది సేపటికే ఇమ్రాన్‌ఖాన్ సోమవారం జాతినుద్దేశించి మాట్లాడారు. కశ్మీర్ లోయలో భారత్ ఆంక్షలు ఎత్తివేసే వరకు తమ ప్రభుత్వం కశ్మీరీలకు మద్దతుగా నిలుస్తుందన్నారు. 'యావత్ దేశం కశ్మీరీలతో కలిసి పనిచేస్తుందని నేను నమ్ముతున్నా. కశ్మీర్‌కు ప్రచారకర్త (ambassador)గా వ్యవహరిస్తా' అని అన్నారు. వచ్చే నెలలో జరిగే ఐరాస సాధారణ అసెంబ్లీలో ఈ అంశాన్ని లేవనెత్తుతానని చెప్పారు. ముస్లిం దేశాలు కశ్మీర్ పక్షాన నిలువనందుకు పాకిస్థానీలు నిరాశకు గురి కావొద్దన్నారు. కశ్మీరీలకు మద్దతుగా వారం పాటు నిరసనలు తెలుపాలని ప్రజలను కోరారు. కశ్మీర్‌కు ప్రత్యేకప్రతిపత్తిని రద్దుచేయడం ద్వారా భారత ప్రధాని మోదీ చారిత్రక తప్పిదానికి పాల్పడ్డారన్నారు. దీనిపై ఐదు దశాబ్దాల తర్వాత తొలిసారి ఐరాస భద్రతా మండలి 'అంతర్గత చర్చలు' జరిపేలా చేయడం ద్వారా పాకిస్థాన్ తొలి విజయం సాధించిందని చెప్పుకున్నారు. భారత్‌తో అణ్వస్త్ర యుద్ధానికి సిద్ధమేనన్న సంకేతాలిచ్చిన ఇమ్రాన్.. అందులో విజేతలుండరని వ్యాఖ్యానించారు. ఆర్థిక ప్రయోజనాలే ప్రధానంగా భావిస్తున్న సంపన్న దేశాలు.. భారత్, పాకిస్థాన్ అణ్వస్త్ర దేశాలన్న సంగతిని గుర్తుంచుకోవాలన్నారు. పుల్వామా ఉగ్రదాడి జరిగినప్పటి నుంచి భారత్ తప్పుడు ప్రచార ఎజెండాతో ముందుకు వెళ్లిందన్నారు. తమ ప్రభుత్వం శాంతికోసం ప్రయత్నించిందన్నారు.

మీ వద్ద ఉన్న సమాచారాన్ని పంపించాల్సిన చిరునామాలు

ధర్మగంట
నమస్తే తెలంగాణ, 8-2-603/1/7,8,9
రోడ్డు నంబర్ 10, బంజారాహిల్స్,
హైదరాబాద్-500034.
పై అడ్రస్‌కు పోస్టుద్వారా పంపించండి.

Whatsapp No. 9346979997
dharmaganta@ntnews.com
అడ్రస్‌కు ఈ-మెయిల్ చేయండి.

స్థానిక నమస్తే తెలంగాణ
కార్యాలయంలో వివరాలు అందించండి.
/NTDAILYONLINE



వరంగల్ రూరల్ కలెక్టరేట్ ఎదుట అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న గట్లకానిపర్తి గ్రామ దళితులు

## భూములకు హద్దులు చూపండి

- వరంగల్ రూరల్ జిల్లా కలెక్టరేట్ ఎదుట గట్లకానిపర్తి దళితుల అర్ధనగ్న ప్రదర్శన
- 29 ఏండ్లుగా కాస్తుకు నోచుకోని 36 ఎకరాలు

**శాయంపేట:** వరంగల్ రూరల్ జిల్లా శాయంపేట మండలం గట్లకానిపర్తి, సూరంపేట గ్రామాలకు చెందిన దళితులతోపాటు ఇతర కులాలకు ఇచ్చిన పంచరాయ భూములకు హద్దులు చూపి అప్పగించాలని లబ్ధిదారులు సోమవారం కలెక్టరేట్ ఎదుట పట్టాలు పట్టుకొని అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. గ్రీవెన్‌సెల్‌లో జేసీ మహేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. శాయంపేట మండలం సూరంపేట శివారులో 36 ఎకరాల పంచరాయ భూమిని 1990 మార్చిలో గట్లకానిపర్తి, సూరంపేటకు చెందిన దళితులతోపాటు ఇతర కులాలకు చెందిన 148 మందికి 15 నుంచి 20 గుంటల వరకు పట్టాలు ఇచ్చినట్టు గట్లకానిపర్తి దళితులు తెలిపారు. 29 ఏండ్లు గడుస్తున్నా పంచరాయ భూమికి కొలతలువేయలేదని, హద్దులు పెట్టి లబ్ధిదారులకు ఇవ్వలేదని చెప్పారు. కొలతలు లేక, హద్దులు పెట్టకపోవడంతో తాము సాగుచేసుకోలేపోయామంటున్నారు. జూలై 26న జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. ఈ విషయమై తాసిల్దార్‌ను కలిస్తే ఆ భూమిని ప్రభుత్వానికి అప్పగిస్తామని చెప్పారని, అందుకే మరోసారి ప్రజావాణిలో ఫిర్యాదు చేశామని బాధితులు తెలిపారు. ఇప్పటికైనా తమ భూములను అప్పగించాలని కోరారు.

# తండ్రి భూమి కోసం పోరాటం

### పాతికెకరాలు ఆక్రమించిన పాలోళ్లు

- ఆడబిడ్డలను వెళ్లగొట్టిన అక్రమార్కులు
- కబ్జాకోరులకు రెవెన్యూ వత్తాసు
- 'ధర్మగంట'ను ఆశ్రయించిన నల్లగొండ జిల్లా బాధితులు

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలం చింతగూడెంకు చెందిన పాశం కృష్ణారెడ్డికి తన తండ్రి నుంచి వారసత్వంగా 25 ఎకరాల భూమి సంక్రమించింది. సర్వే నంబర్లు 27/బీ, 39, 44, 39/బీ, 59/సీ, 54/సీ, 55/డీ, 34/05, 45/ఏ, 50, 54, 61, 62, 64, 109/బీ, 115, 62, 64, 109/డీ, 57, 29 లలో ఈ భూమి ఉన్నది. కృష్ణారెడ్డి పేరిట ఈ భూమి పట్టా అయింది. 1994 వరకూ ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాలేదు. కొన్నేండ్ల తర్వాత కృష్ణారెడ్డి పాలోళ్లు అతనితో భూ తగాదాకు దిగారు. గొడవలు పెట్టుకొన్నారు. శారీరకంగా కూడా హింసించారు. అంతా ఆడపిల్లలు, పసివాళ్లు కావడంతో పాలోళ్ల బాధపడలేక ఆ దంపతులు ఊరొదిలిపెట్టి వెళ్లిపోయారు. కృష్ణారెడ్డి కుటుంబాన్ని ఊరి నుంచి వెళ్లగొట్టగానే ఆయన భూమిని పాలివాండ్లు ఆక్రమించుకొన్నారు. తర్వాత కృష్ణారెడ్డి చాలాసార్లు ఊరికి వెళ్లి భూమిని తమకు అప్పగించాలని పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ పెట్టించి మరీ అడిగారు. కానీ ఎలాంటి ఫలితం లేకుండాపోయింది. ఈ బాధతోనే కృష్ణారెడ్డి 2007లో మరణించారు. భారమంతా కృష్ణారెడ్డి భార్య పాశం ప్రమీలపైనే పడింది. ఆమె ఊరికి వెళ్లి తమ భూమి అప్పగించాలని పాలోళ్లను వేడుకొన్నారు. కానీ.. ఆ 25 ఎకరాలు తమ పేరిట పట్టా అయి ఉన్నదని బుకాయించారు. చివరకు కృష్ణారెడ్డి ఐదుగురు కుమార్తెలు లక్ష్మి, ప్రేమలత, అలివేలు, మాధవి, సరోజ భూమిని దక్కించుకోవడానికి పోరాటం మొదలుపెట్టారు. తమకు న్యాయం చేయాలంటూ రెవెన్యూ కార్యాలయాలు, కలెక్టరేట్ మెట్లు ఎక్కి అలిసిపోయారు. నాలుగేండ్ల నుంచి ఇదే తంతు. ఏ ఒక్క అధికారి కూడా వీరి గోడును పట్టించుకొన్న పాపానపోలేదు. సమస్యను పరిష్కరించలేదు. తమ తల్లిదండ్రులు ఎవరికీ భూమిని విక్రయించలేదని, తమను ఊరు వదిలివెళ్లేలా చేసి ఇతరులు చేజిక్కించుకొన్నారని వారు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. భూమి సర్వేచేయాలని దరఖాస్తు పెట్టుకొన్నా.. పాలోళ్లు అధికారులనే బెదిరిస్తున్నారని వాపోయారు. రెవెన్యూశాఖలోని ప్రతి ఒక్క అధికారికి భూమి పత్రాలతో సహా దరఖాస్తు చేసుకొన్నామని.. అధికారులకు ఇచ్చిన దరఖాస్తుల జిరాక్సులకే ఇప్పటికి రూ.లక్ష ఖర్చు చేశామని తెలిపారు. ఆఫీసుకు వెళ్లిన ప్రతిసారీ దరఖాస్తు ఇచ్చిపొమ్మంటున్నారే తప్ప సమస్యను పరిష్కరించడంలేదని వాపోయారు.



బాధితురాలు సరోజ

### రికార్డులు పరిశీలించి తేలుస్తాం

పాశం ప్రమీల దరఖాస్తును పరిశీలించాను. నేను విధుల్లో చేరి కొన్ని రోజులే అవుతున్నది. కృష్ణారెడ్డి భూమిలో ప్రస్తుతం కబ్జాలో ఉన్నవారికి నోటీసులు ఇస్తాం. ఆ భూమి వారికి ఎలా వచ్చిందో సంబంధిత డాక్యుమెంట్లను పరిశీలిస్తాం. ప్రస్తుతం కాస్తులో ఉంటున్న వారు కృష్ణారెడ్డి వద్ద కొన్నామని చెప్తున్నారు. డాక్యుమెంట్లు పరిశీలిస్తేనే విషయం తేలుతుంది. ఒకవేళ తప్పుడు రిజిస్ట్రేషన్లు జరిగి ఉంటే వాటిని రద్దుచేసి బాధితులకు న్యాయం చేస్తాం.

**- నాగార్జునరెడ్డి, గుర్రంపోడ్ తాసిల్దార్**

### రైతుల వద్దకే అధికారులు



'నమస్తే తెలంగాణ' చేపట్టిన 'ధర్మగంట' ద్వారా భూసమస్యల్లో చిక్కుకున్న రైతులకు పరిష్కారం లభిస్తున్నది. గతంలో ప్రభుత్వం చేపట్టిన భూరికార్డుల ప్రక్షాళనలో అధికారుల నిర్లక్ష్యంతో ఏర్పడిన సమస్యలను తొలగించాలని, ఏండ్ల తరబడి కాళ్లు అరిగేలా తిరుగుతున్న రైతుల కష్టాలు తీర్చాలనే ఆలోచనతో చేపట్టిన 'ధర్మగంట'తో రైతుల వద్దకే అధికారులు వచ్చి సమస్యలను పరిష్కరిస్తున్నారు.

**-తేజావత్ కిషన్, లాల్ తండా, మోతె మండలం, సూర్యాపేట జిల్లా**

# దొంగ పట్టాలు రద్దుచేయాలి

- భూపాలపల్లి జిల్లా మాధారం గిరిజన రైతుల పాదయాత్ర
- నాగళ్లు, వరినారు, డప్పులతో మహాముత్తారం తాసిల్‌కు తరలిన అన్నదాతలు
- యామన్‌పల్లిలో పలు దుకాణాల్లో భిక్షాటన

**మహాముత్తారం:** భూముల దొంగ పట్టాలను రద్దుచేయాలని డిమాండ్‌చేస్తూ జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలంలోని మాధారం, జీలపల్లి, కొర్లకుంట గ్రామాలకు చెందిన గిరిజన రైతులు సోమవారం పాదయాత్రగా వెళ్లి తాసిల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. మాధారం, జీలపల్లి, కొర్లకుంటల్లోని 200 మందికిపైగా గిరిజన రైతులు వరినారు, నాగళ్లు, డప్పు చప్పుళ్ల నడుమ మాధారం నుంచి లంబడిపల్లి, దొబ్బలపహాడ్, దౌతుపల్లి, యామన్‌పల్లి మీదుగా తాసిల్ కార్యాలయం వరకు పాదయాత్ర నిర్వహించారు. మాధారంలోని సర్వే నంబర్ 91లో 1092.28 ఎకరాల అసైన్‌మెంట్ భూమి ఉన్నదని, అందులో 100 ఎకరాలకు పైగా వీఆర్వో, వీఆర్‌ఏ, రెవెన్యూ సిబ్బంది కలిసి మాధారంతోపాటు కాటారం మండలంలోని చింతకాని, పోతులవాయి, కాటారం గ్రామాలవారికి దొంగ పట్టాలు చేయడంతో అసలైన రైతులకు పట్టాలు రాలేదని వాపోయారు. వజినేపల్లి శివారులోని సర్వే నంబర్ 17లో రెవెన్యూ అధికారులు రూ.లక్షల కొద్దీ లంచాలు తీసుకొని ఇష్టంవచ్చినవారికి పదుల సంఖ్యలో దొంగపట్టాలు చేశారంటూ నిరసన తెలిపారు. అసలు రైతులకు రెవెన్యూ అధికారులు పట్టాలుచేయకుండా ఇబ్బందుల పాలు చేస్తున్నారని వాపోయారు. దొంగ పట్టా లు పొందినవారు రైతుబంధుతోపాటు బ్యాంకు లో పంట రుణాల పేరుతో రూ.లక్షలకు లక్షలు కాజేస్తున్నారని తెలిపారు. ఇందుకు నిరసనగానే యామన్‌పల్లిలో గిరిజన రైతులు భిక్షాటనచేశా రు. యామన్‌పల్లిలో కుమ్రంభీం విగ్రహానికి, మహాముత్తారంలో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రాలు అందజేశారు. అనంతరం తాసిల్ కార్యాలయానికి చేరుకొని రెండు గంటలపాటు దొంగ పట్టాలను రద్దుచేయాలంటూ నినాదాలుచేశారు. ఎట్టకేలకు తాసిల్దార్ మల్లేశం రైతుల వద్దకు వచ్చి వారి సమస్యను తెలుసుకొన్నారు. దొంగ పట్టాలను తొలగించి, అసలైన రైతులకు న్యాయంచేస్తానని తాసిల్దార్ హామీ ఇవ్వడంతో శాంతించిన రైతులు వినతిపత్రం అందజేసి అక్కడినుంచి వెళ్లిపోయారు.



మాధారం నుంచి మహాముత్తారం తాసిల్‌కు పాదయాత్రగా వెళ్తున్న గిరిజన రైతులు

## రికార్డులో 1.10 ఎకరాలు మాయం

**బచ్చన్నపేట డీటీకి ఫిర్యాదుచేసిన బాధితుడు**

**బచ్చన్నపేట:** పహాణీ, 1-బీలో వచ్చిన భూమి వివరాలు ప్రస్తుతం ఆన్‌లైన్‌లో కనిపించడంలేదని జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం పోచన్నపేటకు చెందిన సామాజిక సేవా కార్యకర్త తుప్పతి శ్రీనివాస్ ఆవేదన వ్యక్తంచేశారు. సోమవారం ఆయన డిప్యూటీ తాసిల్దార్ విమలకు ఫిర్యాదుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన తండ్రి తుప్పతి బీరయ్య పేరిట 3.30 ఎకరాలు ఉండేదని, 2018 వరకు రికార్డులో ఉండి ఆన్‌లైన్‌లో కనిపించేందని తెలిపారు. ప్రస్తుతం ఆన్‌లైన్‌లో కేవలం 2.20 ఎకరాలు మాత్రమే కనిపిస్తున్నదని, మిగిలిన 1.10 ఎకరాలు మాయమైందని వాపోయారు. న్యాయంచేయాలని కోరారు.

## త్వరలోనే పాస్‌బుక్ అందజేస్తాం

- 'పట్టించుకోవడం లేదు, ప్రభుత్వ పథకాలకు దూరమయ్యాం' కథనాలకు స్పందన
- భూపాలపల్లి జిల్లా కలెక్టర్‌కు వివరణ ఇచ్చిన మహాముత్తారం తాసిల్దార్

**మహాముత్తారం:** 'పట్టించుకోవడం లేదు, 'ప్రభుత్వ పథకాలకు దూరమయ్యాం' శీర్షికలతో 'నమస్తే తెలంగాణ'లో సోమవారం ప్రచురితమైన కథనాలకు జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ వాసం వెంకటేశ్వర్లు స్పందించారు. మహాముత్తారం మండలం మాధారం రైతులు సింగినేని సారక్క, పంతకాని పోచయ్య పడుతున్న ఇబ్బందులపై కథనాలు ప్రచురితమయ్యాయి. స్పందించిన కలెక్టర్.. బాధిత రైతుల పట్టాల విషయం తెలుపాలని తాసిల్దార్‌కు సోమవారం లేఖ రాశారు. దీనిపై కలెక్టర్‌కు తాసిల్దార్ వివరణ కూడా ఇచ్చారు. సింగినేని సారక్కకు త్వరలోనే పాస్‌బుక్ అందజేస్తామని, పంతకాని అంకయ్యకు త్వరలోనే విరాసత్‌చేస్తామని తెలిపారు.

తెలంగాణ ప్రభుత్వం
రెవెన్యూ (భూసేకరణ) శాఖ
కార్యాలయ/సంయుక్త కలెక్టర్/ స్పెషల్ కలెక్టర్/భూసేకరణ / స్పెషల్ డిప్యూటీ కలెక్టర్/భూసేకరణ

ఫారం-VII

భూసేకరణలో న్యాయమైన పరిహారం, పారదర్శకత, పునరావాసము మరియు పునస్థాపన హక్కు చట్టము, 2013 వ సంవత్సరము కేంద్ర చట్టము 30/2013 లోని సెక్షన్ 19/1 మరియు రాష్ట్ర ప్రభుత్వ నియమావళి 2014లో నియమము 25/1 ననుసరించి

డిక్లరేషన్

ప్రొ.నెం. బి1/882/2018 తేదీ: 13.08.2019
ఫైల్ నెం. బి/3988/2017 తేదీ: 05.08.2019

[illegible]

షెడ్యూలు

| క్ర.సం | సర్వే నెం. | భూమి విధం | భూమి రకం | భూసేకరణలో వున్న విస్తీర్ణం ఎ.గుం. | భూమిపై ఆసక్తి (హక్కు) గల వ్యక్తి పేరు మరియు తండ్రి పేరు | చెట్లు, నిర్మాణాలు & మిగతా వివరములు |
| --- | --- | --- | --- | --- | --- | --- |
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 |
| LMC D1 5R MINOR REACH FROM KM 0.319 TO KM 0.500 | | | | | | |
| 1 | 142/2 | [illegible] | [illegible] | 0.00½ | [illegible] | లేవు |
| 2 | | | | 0.12 | [illegible] | లేవు |
| 3 | | | | 0.13½ | [illegible] | లేవు |
| 4 | | | | 0.13½ | [illegible] | లేవు |
| మొత్తము | | | | 0.39½ | | |

[illegible]

సం/- జిల్లా కలెక్టర్ నల్లగొండ
సం/- భూసేకరణ అధికారి, మరియు రెవెన్యూ డివిజనల్ అధికారి, నల్లగొండ
DIPR No. 661/LA/PP/2019-20

నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్
CIN No. U40109TG2000SGC034119.
టెండరు ప్రకటన
TSNPDCL తయారీదారుల నుండి ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం ద్వారా మెటీరియల్స్ కొనుగోలు చేయుటకు ఉద్దేశిస్తోంది.
స్పెసిఫికేషన్ నెం: CGM/P&MM/OT-31/2019-20 మరియు STN-06/2019-20
మెటీరియల్ పేరు: S-Ph 25 KVA DTRs మరియు LT డిస్ట్రిబ్యూషన్ బాక్సులు (SMC)
బిడ్ సెక్యూరిటీ @ 2% ఆన్ ఎక్స్-వర్క్స్. ఆన్-లైన్ ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు డౌన్‌లోడింగ్ ప్రారంభం: 27-08-2019న ఉ|| 11.00 గం. తదుపరి వివరాల కొరకు www.tender.telangana.gov.in మరియు www.tsnpdcl.in దర్శించండి. డిజిటల్ కీ పొందుట కొరకు www.tsts.gov.in దర్శించండి.
సం/- చీఫ్ జనరల్ మేనేజర్ (P&MM)
ఫోన్ నెం: 0870-2461507, మెయిల్ ఐడి: cgmpmm@tsnpdcl.in TSNPDCL, వరంగల్

తెలంగాణ ప్రభుత్వం
ప్రజారోగ్య మరియు పురపాలక ఇంజనీరింగ్ శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన
టెండరు ID: 140663 NIT No. 78/TUFIDC/యూనిట్-II/Laying of CC/BT రోడ్స్ & CC డ్రెయిన్స్/భీంగల్/2019-20 తేదీ: 23.08.2019
పని పేరు: భీంగల్ మునిసిపాలిటీ-TUFIDC రుణ సహాయం క్రింద భీంగల్ మునిసిపాలిటీలో వివిధ ప్రదేశాల వద్ద CC/BT రోడ్లు మరియు CC కాలువలు వేయుట. అంచనా కాంట్రాక్ట్ విలువ: రూ. 12,41,00,746/- బిడ్ దాఖలు చివరి తేదీ: 11.09.2019. సెల్ నం. 9701522366. తదుపరి వివరాలకు www.tender.telangana.gov.in వద్ద గల ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్‌ప్లేస్ వద్ద చూడవచ్చును.
సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్ (PH) TUFIDC, యూనిట్-II (FAC)
DIPR RO. No. 1001-DP/CL/Advt/1/2019-20, Dt: 26/08/2019

తెలంగాణ ప్రభుత్వం
వైద్య విద్యా శాఖ
Rc. No. CS-1/1933/2019, టెండరు ప్రకటన తేదీ: 20-08-2019
వైరల్ రిసెర్చ్ అండ్ డయాగ్నొస్టిక్ లేబొరేటరీస్ (VRDL) శాఖ, కాకతీయ మెడికల్ కాలేజ్, వరంగల్ కొరకు దిగువ తెలిపిన ఎక్విప్‌మెంట్స్ అనగా PCR కొరకు (7) ఐటమ్‌లు మరియు సెరాలజీ కొరకు (8) ఐటమ్‌లు (జాబితా జతచేయబడినది) కొనుగోలుచేయు నిమిత్తం ఆమోదిత డీలర్ల నుండి సీల్డ్ టెండర్లు కోరబడుతున్నవి. టెక్నికల్ స్పెసిఫికేషన్లు టెండరు ఫారాలతో తెలియజేయబడును. టెండరు దరఖాస్తు ధర: DD ద్వారా రూ. 2,000/-, టెండరు దరఖాస్తు అమ్మకం: 26-08-2019 నుండి 04-09-2019న ఉ|| 11.00 గం. నుండి సా|| 4.00 గం. వరకు. టెండరు స్వీకరణకు చివరి తేదీ: 12-09-2019న సా|| 4.00 గం. వరకు. టెండరు తెరచుట: ప్రిన్సిపాల్ ఛాంబర్, KMC, వరంగల్ 16-09-2019న ఉ|| 11.00 గం. బయానా మొత్తం: DD ద్వారా రూ. 10,000/-
DIPR RO.No. 999-DP/CL/ADVT/1/2019-20, Dt: 26-08-2019 సం/- ప్రిన్సిపాల్, కాకతీయ మెడికల్ కాలేజ్, వరంగల్

మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం :: ఖమ్మం
ఇ-ప్రొక్యూర్‌మెంట్ సంక్షిప్త టెండరు ప్రకటన
ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్, ఖమ్మం జిల్లా, తెలంగాణ వారు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ క్రింద సంక్షిప్త టెండరు ప్రకటన ప్రకారం కోరిన టెండర్లు దిగువ విధంగా ఉన్నవి.
NIT No. 07/DB/KMC/1624/2019-20, తేది : 21-08-2019
1) ఎ) మొత్తం పనుల సంఖ్య-94 నం.లు
బి) పనుల స్వభావం- i) సివిల్ మరియు ఇతర పనులు: 94 నం.లు.
2) పని మొత్తం విలువ : రూ. 878.30 లక్షలు
3) కార్యాలయంలో సంప్రదించుటకు అధికారి పేరు, చిరునామా : అసిస్టెంట్ ఇంజినీర్, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్, మొబైల్ : 9705371670 (అసిస్టెంట్ ఇంజినీరు). తదుపరి వివరాలకు http://tender.telangana.gov.in వద్ద ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్‌లో చూడవచ్చును.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్
DIPR RO.No. 329PP/CL/Advt/1/2019-20, Dt: 26-08-19

### అణుబాంబుతో తుఫాన్లను అడ్డుకోగలమా?

- ట్రంప్ అడిగినట్లుగా అమెరికాలో వార్తలు
- ఖండించిన అధ్యక్షుడు



**వాషింగ్టన్:** 'అమెరికాను తాకేలోపే హరికేన్ల(తుఫాన్లు)పై ఓ అణు బాంబు వేసి వాటిని అడ్డుకోవడానికి వీలుందా?' అంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఉన్నతాధికారుల్ని అడిగారన్న వార్తలు అమెరికాలో హల్‌చల్ చేస్తున్నాయి. అయితే, దీనిని ట్రంప్ ఖండించారు. తాను ఎవరితోనూ ఈ విషయంపై చర్చించలేదని చెప్పారు. అణుబాంబులతో హరికేన్లను అడ్డుకోవాలని తాను ఆలోచన చేసినట్టు వచ్చిన వార్తలను ఆయన ఖండించారు. ఆ వార్తలు హాస్యాస్పదమని కొట్టిపారేశారు. 'అమెరికన్లను తరుచూ ఇబ్బందులకు గురిచేస్తున్న హరికేన్లను అణుబాంబులతో అడ్డుకోవడానికి వీలుందా?' అని అధికారులతో జరిగిన అంతర్గత చర్చల్లో ట్రంప్ అడిగినట్టు ''ఆక్సియోస్'' అనే స్థానిక మీడియా సంస్థ ఆదివారం ఓ కథనాన్ని ప్రచురించింది. ఈ వార్తలను ట్రంప్ కొట్టివేశారు. 'తీరాన్ని తాకేకంటే ముందే హరికేన్లను అడ్డుకోవడానికి తాను అణుబాంబులను వాడాలనుకుంటున్నట్టు ఆక్సియోస్ పేర్కొనడం హాస్యాస్పదం. నేనెప్పుడూ అలా అనలేదు. ఇది అసత్య వార్త' అని ట్రంప్ ట్వీట్ చేశారు. అయితే శ్వేత సౌధం మాత్రం ఆక్సియోస్ వార్తలపై స్పందించేందుకు నిరాకరించింది. కాగా, 1950లో ఓ శాస్త్రవేత్త తొలిసారిగా అణు బాంబులను వేసి హరికేన్లను అడ్డుకోవడం అనే ప్రతిపాదనను తెరమీదకు తెచ్చినట్టు అధికారులు చెబుతున్నారు.

## సంస్కృతికి ప్రతీక బండలాగుడు పోటీలు

- ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

**గద్వాల రూరల్:** గ్రామీణ సంస్కృతికి ప్రతీకగా నేటికీ బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నారని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. శ్రీకృష్ణాష్టమి సందర్భంగా జోగుళాంబ గద్వాల జిల్లా రేపల్లిలో సోమవారం ఎమ్మెల్యే బండ లాగుడు పోటీలను ప్రారంభించారు. పోరాడి సాధించుకున్న తెలంగాణలో సీఎం కేసీఆర్ రైతుల పక్షపాతిగా రైతుల కోసం రైతుబంధు, రైతుబీమా వంటి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని ఎమ్మెల్యే అన్నారు.



జోగుళాంబ గద్వాల జిల్లా రేపల్లిలో బండలాగుడు పోటీలు ప్రారంభిస్తున్న గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి



### ● ఎంజీఎం దవాఖానకు రోగుల తాకిడి

వరంగల్ ఎంజీఎం దవాఖానకు రోగుల తాకిడి పెరిగింది. సోమవారం ఒక్కరోజే ఐదు వేలకుపైగా రోగులు వైద్యం కోసం వచ్చారు. దీంతో దవాఖానలో ఎటుచూసినా రద్దీ వాతావరణం కనిపించింది. తెలంగాణ ప్రభుత్వం ఎంజీఎం దవాఖానలో అధునాతన సౌకర్యాలు కల్పించి, రోగులకు మెరుగైన వైద్యం అందిస్తుండడంతో కొంతకాలంగా రోగుల రాక పెరిగింది. వరంగల్‌తోపాటు ఖమ్మం, నల్గొండ, ఆదిలాబాద్, కరీంనగర్, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రల నుంచి సైతం రోగులు వస్తున్నారని వైద్యాధికారులు పేర్కొంటున్నారు.

-ఎంజీఎం (వరంగల్)

# మోడుబారుతున్న బుందేల్‌ఖండ్

**కరువు రక్కసి కోరల్లో చిక్కి విలవిల్లాడే స్థితికి బుందేల్‌ఖండ్ క్రమంగా చేరుకుంటున్నది. మరో దశాబ్ద కాలంలో నీటి చుక్క కోసం అర్రులు చాచే నేలతో ఈ ప్రాంతం దర్శనమీయనున్నది. వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న ఇక్కడి మూడొంతుల ప్రజలు.. నీరులేక, ఎండుతున్న పంటను చూడలేక.. బతుకు బండిని నడుపటానికి అయిష్టంగానే పట్నం దిక్కు అడుగులేస్తున్నారు..**

- తీవ్ర నీటి ఎద్దడితో యూపీలోని ఏడు జిల్లాలు విలవిల..
- 2030 నాటికి మరింత తీవ్రం
- వ్యవసాయం చేయలేక పట్నానికి వలసపోతున్న రైతులు

**లక్నో:** ఉత్తర్‌ప్రదేశ్‌లోని బుందేల్‌ఖండ్ ప్రాంతం తీవ్ర కరువుతో నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నది. రానున్న కాలంలో ఈ పరిస్థితి మరింత తీవ్రతరం కానున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన ఓ అధ్యయనం వెల్లడించింది. ప్రస్తుత పరిస్థితులు భవిష్యత్తులో కూడా కొనసాగితే, 2030నాటికి చుక్క నీరు లేక వ్యవసాయంపై ఆధారపడే కుటుంబాలు జీవనోపాధి కోసం పట్టణాలు, జిల్లా కేంద్రాలకు తరలివెళ్లే పరిస్థితి వస్తుందని పేర్కొంది. '2030 వాటర్ రిసోర్స్ గ్రూప్', 'థింక్ త్రూ కన్సల్టింగ్' అనే ప్రైవేటు సంస్థ సంయుక్తంగా రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో 'విజన్ డాక్యుమెంట్ ఫర్ బుందేల్‌ఖండ్' పేరిట వెలువరించిన నివేదికలో ఈ నిజాలు బయటపడ్డాయి. కరువు తాండవించకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పథకాలు, పలు అంతర్జాతీయ సంస్థలు నిధులు మంజూరు చేస్తున్నప్పటికీ.. వాతావరణ మార్పులు, వర్షాభావం తదితర కారణాలు బుందేల్‌ఖండ్‌ను కరువు కోరల్లోకి నెడుతున్నాయి. 'వర్షపాతలేమి కారణంగా బుందేల్‌ఖండ్‌లో భూగర్భజలాలు గణనీయంగా అడుగంటుతున్నాయి. దీంతో వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న కుటుంబాలు క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొనే పరిస్థితి దాపురించింది. జీవనోపాధి కోసం వాళ్లు పట్టణాలకు వలసపోతున్నారు' అని నివేదిక పేర్కొంది.



**పరిస్థితులు దారుణం**

యమునా నది, వింధ్యా మైదానాల మధ్య ఉన్న ఉత్తర్‌ప్రదేశ్‌లోని బుందేల్‌ఖండ్ ప్రాం తంలో ఏడు జిల్లాలు ఉన్నాయి. 29,000 చ. కి. మీ విస్తీర్ణంతో దాదాపు 78 లక్షల మంది జనాభాతో ఈ ప్రాంతం విస్తరించింది. ఇక్కడ నివసించే దాదాపు 75 శాతం మందికి వ్యవసాయమే జీవనాధారం. దాదాపు 96 శాతం కుటుంబాలకు వ్యవసాయమే ఆదాయ మార్గంగా ఉన్నది. గత కొన్నేండ్లుగా ఇక్కడ తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో భూగర్భజలాలు అడుగంటాయి. గడిచిన 13 ఏండ్లలో సగటు వర్షపాతంతో పోలిస్తే, దాదాపు 40 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. గత ఐదేండ్లలో ఈ పరిస్థితి మరింత దారుణంగా పడిపోయినట్టు (సగటు వర్షపాతంతో పోలిస్తే, దాదాపు 60 శాతం తక్కువ వర్షపాతం నమోదు) నివేదిక పేర్కొన్నది.

**ఎన్నెన్నో కారణాలు..**

చెట్లను నరికివేయడం, పంటల్లో రసాయనిక మందుల్ని విరివిగా వాడటం, భూక్షయం తదితర కారణాలు బుందేల్‌ఖండ్ ప్రాంతంలో భూగర్భ జలాల పరిమాణాన్ని క్రమంగా తగ్గేలా చేస్తున్నాయి. వీటికి తోడు రాళ్లు, గ్రానైట్‌తో కూడిన నేలలు అధికంగా ఉండటం, బుందేల్‌ఖండ్ ప్రాంతం వాలుతో ఉండటంతో కొద్ది స్థాయిలో కురిసిన వర్షం నీరు కూడా భూమిలో ఇంకకుండా వృథాగా పోతున్నది. దీంతో క్రమంగా భూగర్భ జలాలు తగ్గిపోతున్నాయి. అంతర్జాతీయ గణాంకాల ప్రకారం.. సంవత్సర కాలంలో ఒక వ్యక్తికి సగటున 1,700 క్యూబిక్ మీటర్ల నీరు అవసరం. అయితే, 2030 నాటికి బుందేల్‌ఖండ్ ప్రాంతంలో నివసించే ఒక్కో వ్యక్తికి 1,000 క్యూబిక్ మీటర్ల నీరు కూడా లభించే పరిస్థితి లేదు. సమీకృత జల వనరుల నిర్వహణ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం బుందేల్‌ఖండ్ ప్రాంతంలో ఓ పైలెట్ ప్రాజెక్టుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. ఈ ప్రాజెక్టులో భాగంగా నీటి నిర్వహణ, పొదుపు తదితర అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించనున్నది.

**దేశంలో ఇలా..**

ప్రపంచం మొత్తం జనాభాలో భారతదేశం 16 శాతం వాటా కలిగి ఉన్నది. అయితే, ఇంత మంది జనాభాకు కేవలం 4 శాతం మాత్రమే స్వచ్ఛమైన నీటి వనరులు అందుబాటులో ఉన్నాయి. 2011 లెక్కల ప్రకారం.. దేశంలో ఒక్కో వ్యక్తికి 1,545 క్యూబిక్ మీటర్ల నీరు అందుబాటులో ఉండగా.. 2030నాటికి 1,306 క్యూబిక్ మీటర్లు, 2050 నాటికి 1,174 క్యూబిక్ మీటర్ల స్థాయికి నీటి నిల్వలు తగ్గనున్నాయి. రానున్న కాలంలో ఢిల్లీ, హర్యానా రాష్ట్రాలు తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొనున్నట్టు నివేదికలు హెచ్చరిస్తున్నాయి.

# చేప వ్యర్థాలతో మూలకణాల ఉత్పత్తి

## హైదరాబాద్ ఐఐటీ పరిశోధకుల ముందడుగు

**సంగారెడ్డి చౌరస్తా:** చేప వ్యర్థాలతో మూల కణాల ఉత్పత్తికి ఐఐటీ హైదరాబాద్ పరిశోధకులు శ్రీకారం చుట్టారు. కొలాజెన్ (చేప పొట్టు కింద లభించే గమ్ లాంటి పదార్థం) మూలకణాల ఉత్పత్తిలో ఉపయోగపడుతుందని గుర్తించారు. సముద్ర తీరంలో పెద్ద మొత్తంలో వృథాగా పోతున్న చేపల నిర్జీవ పదార్థాలను సద్వినియోగం చేసుకోవడంతోపాటు కొలాజెన్‌తో మూల కణాలను వృద్ధి చేయవచ్చని ఐఐటీయన్లు తమ పరిశోధనలతో తేల్చారు. జీవ వైవిధ్యంలో కొలాజెన్‌ను ఉపయోగించడం ద్వారా అటు దేశంలో నీలి ఆర్థిక అభివృద్ధిని కూడా సాధించవచ్చని పేర్కొంటున్నారు. సంగారెడ్డి జిల్లా కందిలోని ఐఐటీ హైద రాబాద్‌లో సోమవారం వారు వివరాలను వెల్లడించారు. ఇప్పటివరకు ఇతర జంతువుల నుంచి పొందుతున్న కొలాజెన్‌కు ప్రత్యామ్నాయంగా చేప వ్యర్థాల నుంచి స్వీకరించి ఉపయోగించుకోవచ్చని స్పష్టం చేశారు. మూల కణాల ఉత్పత్తి ల్యాబోరేటరీకి చెందిన యువ శాస్త్రవేత్త డాక్టర్ మనో గోవిందరాజ్ మాట్లాడుతూ.. తమ పరిశోధన బృందం కనిపెట్టిన ఈ విలువైన కొలాజెన్ సముద్ర సాంకేతికతలో ఒక గొప్ప ఆస్తిగా అభివర్ణించారు. సముద్ర తీరంలో చేపల అభివృద్ధికి సంబంధించి నీలి రంగు జీవ సాంకేతికాభివృద్ధికి చిహ్నంగా పేర్కొనవచ్చని తెలిపారు. బయోమెడికల్ ఇంజినీరింగ్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సుభ నారాయణ్ రాథ్, ఐఐటీ హైదరాబాద్ పీహెచ్‌డీ స్కాలర్ డాక్టర్ ఉదయ్‌కిరణ్ రూపావత్ ఈ బృందంలో ఉన్నారు.



చేప చర్మం కొలాజెన్‌కు సంబంధించిన త్రీడీ ప్రింటింగ్



చేప చర్మం నుంచి కొలాజెన్‌ను కనిపెట్టిన పరిశోధన బృందం

వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి సన్నిధి సోమవారం భక్తులతో కిక్కిరిసిపోయింది. స్వామివారిని దర్శించుకొన్న భక్తులు కుంకుమ పూజలు, గండ దీపం, పల్లకీసేవలు, పెద్దసేవలు, సత్యనారాయణ వ్రతాలు, కల్యాణాల మొక్కులు తీర్చుకున్నారు. 50 వేల మందికిపైగా భక్తులు తరలిరాగా.. సుమారు రూ.23 లక్షల ఆదాయం సమకూరిందని అధికారులు తెలిపారు.

- వేములవాడ కల్చరల్







సూర్యాపేటలో అన్నపూర్ణ భోజన కేంద్రాన్ని ప్రారంభించి, ఆహారం వడ్డిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి. చిత్రంలో హరేకృష్ణ ఫౌండేషన్ పీఆర్వో ప్రవిదాస్ తదితరులు

# సూర్యాపేటను మోడల్‌గా తీర్చిదిద్దుతా

## విద్యాశాఖమంత్రి జగదీశ్‌రెడ్డి

**సూర్యాపేట ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** టీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సూర్యాపేటను అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని, సీఎం కేసీఆర్ సహకారంతో రాష్ట్రానికే మోడల్‌గా తీర్చిదిద్దుతానని విద్యాశాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. సూర్యాపేటకు వచ్చే కూలీలు, నిరుపేదల ఆకలి తీర్చేందుకు హరేకృష్ణ మిషన్ సహకారంతో రూ.5కే భోజనం అందించే రెండు అన్నపూర్ణ భోజన కేంద్రాలను సోమవారం మంత్రి ప్రారంభించారు. అనంతరం రూ.30.12కోట్ల వ్యయంతో నిర్మించిన మిషన్ భగీరథ ట్యాంకు ప్రారంభం, మెయిన్ రోడ్డు విస్తరణలో భాగంగా రూ.9.51 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మట్లాడుతూ.. ఎవరు అడిగినా, అడగకపోయినా ఆపన్నులకు చేయూతను అందించడంలో ముఖ్యమంత్రి కేసీఆర్ దేశంలోనే ముందున్నారన్నారు. 2014లో తొలిసారి అధికారంలోకి వచ్చిన వెంటనే పింఛన్లను భారీగా పెంచగా, రెండోసారి అధికారంలోకి రాగానే వాటిని రెట్టింపు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. హరేకృష్ణ ఫౌండేషన్ సహకారంతో సూర్యాపేటలో రెండు అన్నపూర్ణ భోజన కేంద్రాలను ప్రారంభించుకోవడం సంతోషంగా ఉన్నదన్నారు. ఆయా కార్యక్రమాల్లో కలెక్టర్ అమయ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ రామానుజుల రెడ్డి, హరేకృష్ణ ఫౌండేషన్ పీఆర్వో ప్రవిదాస్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్లు జుట్టుకొండ సత్యనారాయణ, గండూరి ప్రవళికాప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి ఎయిమ్స్ తరగతులు

## సీఎం కేసీఆర్ కృషికి దక్కిన ఫలితం

- అందుబాటులోకి భవన సదుపాయం.. ప్రారంభానికి అధికారుల ఏర్పాట్లు

(గొట్టిపర్తి భాస్కర్‌గౌడ్)



యాదాద్రి భువనగిరి జిల్లాలోని బీబీనగర్ నిమ్స్ ప్రాంగణంలో ప్రారంభోత్సవానికి ముస్తాబైన ఎయిమ్స్ భవన సముదాయం

**యాదాద్రిభువనగిరి జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** ఎయిమ్స్ కల నేడు సాకారం కానున్నది. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలనే సీఎం కేసీఆర్ లక్ష్యం ఫలించింది. ఇందుకోసం యాదాద్రి జిల్లా బీబీనగర్‌లోని నిమ్స్ ప్రాంగణంలో ఎయిమ్స్ ఏర్పాటు కాగా మంగళవారం వైద్య కళాశాల ప్రారంభానికి ముహూర్తం ఖరారైంది. ఎన్నో ఏండ్ల కల నెరవేరుతుండటంతో రాష్ట్ర ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

బీబీనగర్‌లో మంగళవారం ఉదయం 10 గంటలకు భోపాల్ ఎయిమ్స్ డైరెక్టర్ శర్మణ్ సింగ్ ఎయిమ్స్ వైద్య కళాశాలను ప్రారంభించనున్నారు. భువనగిరి

### భోపాల్ ఎయిమ్స్ డైరెక్టర్‌చే ప్రారంభం

ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు.

### సీఎం కేసీఆర్ పట్టుదలతో..

యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండల పరిధిలో ఎయిమ్స్ ఏర్పాటు విషయంలో సీఎం కేసీఆర్ కృషి ఫలించింది. కేంద్ర ప్రభుత్వానికి లేఖ ఇచ్చింది మొదలు అప్పటి ఎంపీ బూర నర్సయ్యగౌడ్‌తోపాటు తోటి ఎంపీలు, టీఆర్‌ఎస్ అగ్ర నాయకత్వం ఒత్తిడి పెంచడంతో కేంద్రం గత ఏడాది బీబీనగర్‌లో ఎయిమ్స్ ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. ప్రస్తుతమున్న బీబీనగర్ నిమ్స్ భవనంలో 50 మంది విద్యార్థులతో వైద్య కళాశాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఇందుకు అవసరమయ్యే నిధులను విడుదల చేసి నిర్వహణ బాధ్యతలను భోపాల్ ఎయిమ్స్‌కు అప్పగించింది. సిబ్బంది నియామకాలతోపాటు విద్యార్థుల సీట్లను భోపాల్ కేంద్రంగా ఆన్‌లైన్‌లో నోటిఫికేషన్లు జారీ చేసి భర్తీ చేశారు. మరోపక్క నిమ్స్ భవన సముదాయంలో ఎయిమ్స్ వైద్య కళాశాలను ఏర్పాటు చేసేందుకు అన్ని ఏర్పాట్లను చకచకా పూర్తి చేశారు. మంగళవారం కళాశాలను ప్రారంభించేందుకు ఏర్పాట్లు జరుగుతుండగా సోమవారం నాడే కళాశాల సిబ్బంది, విద్యార్థులు తమ లగేజీతో హాస్టల్‌లోకి చేరుకున్నారు.

### మొదటి అడుగు..

రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు గత ఏడాది కేంద్ర ప్రభుత్వం బీబీనగర్‌లో ఎయిమ్స్ ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. ఆ మేరకు బడ్జెట్‌లో రూ.1,028 కోట్లు కేటాయించి 45 నెలల్లోగా పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఇందులో భాగంగా 2019-20 విద్యా సంవత్సరంలోనే బీబీనగర్ ఎయిమ్స్‌లో ఎంబీబీఎస్ కోర్సులు నిర్వహించేందుకు నోటిఫికేషన్ జారీ చేసి 100 సీట్లను భర్తీ చేయాల్సి ఉండగా మౌలిక వసతుల లేమితో 50 సీట్లను మాత్రమే భర్తీ చేసి కౌన్సెలింగ్ పూర్తి చేశారు. ఇక నిమ్స్ భవనాల్లోనే ప్రస్తుతానికి వైద్య కళాశాలను ప్రారంభిస్తున్నారు.

### చకచకా పనులు..

బీబీనగర్ నిమ్స్ ప్రాంగణంలోని బీ-బ్లాక్‌లో ఎయిమ్స్ వైద్య కళాశాలతోపాటు విద్యార్థులు, సిబ్బంది ఉండేందుకు హాస్టల్ వసతిని ఏర్పాటు చేశారు. వీటితోపాటు వీవీపీ లాంజ్, డైరెక్టర్స్ చాంబర్, కాన్ఫరెన్స్ హాలు, వైద్యులకు గదులు, రికార్డు రూమ్‌లు, అటానమీ విభాగం, అడ్మినిస్ట్రేటివ్ విభాగం, ఫిజియోతెరపి విభాగం, సామాజిక కుటుంబ వైద్య విభాగాలకు ప్రత్యేక చాంబర్లను ఏర్పాటు చేశారు.

### ఆనందంగా ఉంది..



ఎయిమ్స్ ఏర్పాటులో భాగంగా వైద్య కళాశాల తరగతులు ప్రారంభమవుతుండటం ఆనందంగా ఉన్నది. ఎంపీగా ఉన్న సమయంలో సీఎం కేసీఆర్ అప్పగించిన పనిని పూర్తి చేశానన్న సంతృప్తి కలిగింది. రూ.1,028 కోట్ల నిధులను సాధించుకోగలిగాం.

- డాక్టర్ బూర నర్సయ్యగౌడ్, మాజీ ఎంపీ భువనగిరి

### సీటు దొరికింది..



మాది నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలంలోని మింట్రాస్‌పల్లి గ్రామం. స్వరాష్ట్రంలోనే నూతనంగా ఏర్పాటు చేసిన ఎయిమ్స్‌లో మొదటి బ్యాచ్‌లో నాకు సీటు దొరకడం అదృష్టంగా భావిస్తున్నా. ఎయిమ్స్‌లో సీటు సంపాదించడం ఎంతో కష్టతరం. అలాంటిది స్వరాష్ట్రంలో సీటు రావడం నా జీవితంలో మరువలేనిది. - సాయి హర్షిణి, వైద్య విద్యార్థిని

### స్థానికంగానే సీటొచ్చింది..



మాది యాదాద్రి జిల్లా భువనగిరి పట్టణం. నేను పుట్టి పెరిగిన ప్రాంతంలోనే ఎయిమ్స్ ఏర్పాటు కావడం, అందులోనే సీటు రావడంతో ఎంతో ఆనందంగా ఉన్నది. తెలంగాణ ఏర్పాటు తర్వాత సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టి పెట్టి కేంద్రాన్ని ఒప్పించి ఎయిమ్స్ తీసుకురావడం నిజంగా అభినందనీయం.

- సాత్విక్, విద్యార్థి



మహబూబ్‌నగర్‌లో రైతుకు పట్టాదారు పాస్‌పుస్తకం అందజేస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్. చిత్రంలో జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, కలెక్టర్ రొనాల్డ్‌రోస్

# కొత్త రెవెన్యూ చట్టంతో అక్రమాలకు చెక్

## ఎక్సైజ్ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

**మహబూబ్‌నగర్ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** కొత్త రెవెన్యూ చట్టంతో అక్రమాలకు చెక్ పెడుతామని ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. బూజు పట్టిన రెవెన్యూ చట్టం వల్ల భూముల సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. భూములు కొన్న వెంటనే.. కొన్న వారి పేరు మీద మారడంతోపాటు రికార్డులన్నీ సక్రమంగా ఉండేలా సీఎం కేసీఆర్ కొత్త చట్టం తెస్తున్నారని తెలిపారు. సోమవారం మహబూబ్‌నగర్‌లో రైతులకు నూతన పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీ కార్యక్రమానికి జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, కలెక్టర్ రొనాల్డ్‌రోస్‌తో కలిసి మంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకప్పుడు పాలమూరు జిల్లాలో భూములకు విలువ ఉండేది కాదని.. రూ.వేలకే ఎకరా దొరికేదన్నారు. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిందన్నారు. సీఎం కేసీఆర్ వచ్చాక రైతుబంధు, రైతు బీమా పథకాలు తీసుకువచ్చి అన్నదాతకు అండగా నిలిచారన్నారు. ప్రస్తుతం పాలమూరు ఎత్తిపోతల పథకం పనులు వేగంగా సాగుతున్నాయని, ఈ ప్రాజెక్టు ద్వారా త్వరలోనే సాగునీరు అందుతుందన్నారు. పేద రైతులను మోసం చేసే అక్రమార్కులపై వెంటనే పోలీసు కేసు పెట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు.



కామారెడ్డి జిల్లా అంకోల్‌క్యాంపులో డబుల్ బెడ్ రూం ఇల్లును ప్రారంభిస్తున్న స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి



డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల లబ్ధిదారులతో ఎమ్మెల్యే రమేశ్‌బాబు, జెడ్పీ చైర్‌పర్సన్ వసంత, మార్క్‌ఫెడ్ చైర్మన్ లోక బాపురెడ్డి

# అట్టహాసంగా 'డబుల్' ఇండ్ల ప్రారంభం

## కామారెడ్డిలో ప్రారంభించిన స్పీకర్ పోచారం

**బీర్కూర్(నస్రుల్లాబాద్)/మేడిపల్లి:** కామారెడ్డి, జగిత్యాల జిల్లాల్లో డబుల్ బెడ్‌రూం ఇండ్ల ప్రారంభోత్సవం అట్టహాసంగా జరిగింది. కామారెడ్డి జిల్లా నస్రుల్లాబాద్ మండలంలోని అంకోల్‌క్యాంపులో 25 డబుల్ బెడ్ రూం ఇండ్లను సోమవారం స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. పేదవారి ఆత్మగౌరవం కోసం తెలంగాణ ప్రభుత్వం ఆరాటపడుతున్నదని, బాన్సువాడ నియోజకవర్గంలో ఇప్పటివరకు ఐదు వేల ఇండ్లు మంజూరు కాగా ప్రస్తుతానికి రెండు వేల ఇండ్లు పూర్తయ్యాయని స్పీకర్ పోచారం వివరించారు. సీఎం కేసీఆర్ సర్కార్ వల్లే తమకు సొంతింటి కల నెరవేరిందని లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలంలోని గోవిందారం గ్రామంలో పూర్తయిన 15 ఇండ్లను సోమవారం జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, మార్క్‌ఫెడ్ చైర్మన్ లోక బాపురెడ్డితో కలిసి వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు ప్రారంభించారు.

# మృత్యుంజయుడు

- రైల్వే కీమెన్‌కు తప్పిన ప్రాణాపాయం
- ట్రాక్ తనిఖీ చేస్తుండగా దూసుకొచ్చిన రైలు



దుర్గయ్యను దవాఖానకు తీసుకెళ్తున్న సిబ్బంది

**రామగుండంరూరల్:** రామగుండం రైల్వేస్టేషన్‌లో కీమెన్‌గా పని చేస్తున్న దుర్గయ్య సోమవారం ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. రైల్వే కాలనీకి చెందిన దుర్గయ్య రామగుండం రైల్వే స్టేషన్‌లో కీమెన్‌గా పని చేస్తున్నాడు. రోజువారీగా సోమవారం ఉదయం 11 గంటల సమయంలో రామగుండం రైల్వే స్టేషన్ కుందనపల్లి గేటు మధ్యలో ట్రాక్ తనిఖీ చేస్తున్నాడు. అదే సమయంలో బెంగుళూరు నుంచి హజ్రత్ నిజామొద్దీన్ రాజధాని ఎక్స్‌ప్రెస్ వస్తున్నది. రైలును గమనించని దుర్గయ్య అలాగే ట్రాక్‌పై ఉన్నాడు. లోకోపైలెట్ అప్రమత్తమై సడెన్ బ్రేక్ వేశాడు. ఈ క్రమంలో దుర్గయ్య ట్రాక్ మధ్యలో పడిపోగా, మూడు బోగీలు దుర్గయ్య పైనుంచి ముందు కెళ్లాయి. రైలు నిలిచిపోయిన తర్వాత వెంటనే రైల్వే సిబ్బంది దుర్గయ్యను బోగీల కింది నుంచి బయటకు తీశారు. దుర్గయ్య కాలు విరిగిపోగా, రామగుండం రైల్వే హాస్పిటల్‌లో ప్రథమ చికిత్స చేసి, కరీంనగర్ దవాఖానకు తరలించారు.

# విజయరమణారావుపై కేసు

**కలెక్టరేట్:** పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత కాంగ్రెస్ నాయకుడు విజయరమణారావుపై పోలీసులు కేసు నమోదు చేశారు. పెద్దపల్లి మండలం పెద్దబొంకూర్ ఎంపీటీసీగా గెలిచిన మిట్టపల్లి వసంతను ఎంపీపీ చేస్తానని డబ్బులు వసూలు చేసి నమ్మించి మోసం చేశారన్న ఆరోపణలతో కోర్టు ఆదేశాల మేరకు విజయరమణారావుపై కేసు నమోదు చేసినట్లు పెద్దపల్లి ఎస్‌ఐ ఉపేందర్‌రావు తెలిపారు. ఇటీవల స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నుంచి గెలిచిన తనను పెద్దపల్లి ఎంపీపీ చేస్తానని డబ్బులు వసూలు చేసి మోసం చేశారని ఆరోపిస్తూ గతంలోనే వసంత తన భర్త వెంకటేశంతో కలిసి పెద్దపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ పోలీసులు చర్యలు తీసుకోవడంలేదంటూ కోర్టును ఆశ్రయించారు. తాజాగా కోర్టు ఆదేశాలతో కోర్టు రెఫర్ కేసు నమోదు చేసినట్లు పెద్దపల్లి ఎస్‌ఐ ఉపేందర్‌రావు తెలిపారు.

# అక్రమ వసూళ్ల ముఠా అరెస్టు

**అశ్వారావుపేట, నమస్తే తెలంగాణ:** కేంద్ర ప్రభుత్వ పథకాలను మంజూరు చేయిస్తామని చెబుతూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న ఓ ముఠాను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. అశ్వారావుపేట సీఐ అబ్బయ్య మీడియాతో మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరుకు చెందిన గ్రంధి ఉదయ్‌కిరణ్ కుమార్, రేపన పద్మారావు, పగడాల అగస్టిన్, బాలచంద్‌లు బృందంగా ఏర్పడి సత్తుపల్లి మండలం బేతుపల్లికి చెందిన కాకాని నాగేశ్వరరావు (ఉపాధి హామీ పథకం మాజీ ఉద్యోగి), అశ్వారావుపేటకు చెందిన గండేటి సీతారామస్వామి గాండ్లగూడేనికి చెందిన మాలోతు నాగేశ్వరరావు, తిరుమలకుంటకు చెందిన కొత్తపల్లి సీతారాముడు ఏజెంట్లుగా నియమించుకున్నారు. వీరు గ్రామాల్లోకి వెళ్లి ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ పథకం కింద ఇంటికి రూ.3.50 లక్షల మంజూరు చేయిస్తామంటూ 15 రోజులుగా అక్రమ వసూళ్లకు పాల్పడ్డారు. అశ్వారావుపేట మండలంలోని దురదపాడు, రెడ్డిగూడెం, తిరుమలకుంట గ్రామాల్లో నిరుపేదలకు కలర్ జిరాక్స్ అప్లికేషన్లు ఇచ్చి రూ.1,500 నుంచి రూ.2,500 చొప్పున 164 మంది నుంచి రూ.2.90 లక్షల వరకు అక్రమంగా వసూలు చేశారు. రోజులు గడుస్తున్నా ఇండ్లు మంజూరు కాకపోవడంతో కొందరు బాధితులు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పోలీసులు చాకచక్యంగా నిందితులను అదుపులోకి తీసుకున్నారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నట్టు వారు తెలిపారు.

# ముగ్గురు నకిలీ మావోయిస్టుల రిమాండ్

**భద్రాద్రికొత్తగూడెం ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** మావోయిస్టులు, అజ్ఞాత దళాల పేరుతో చందాలు, అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న ముగ్గురు వ్యక్తులను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆళ్లపల్లి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. టేకులపల్లి సీఐ నాగరాజు సోమవారం మీడియాకు వివరాలు వెల్లడించిన వివరాల ప్రకారం.. వరంగల్‌కు చెందిన కొమళ్ల నర్సింహారెడ్డి, ఖమ్మం జిల్లా కొణిజర్లకు చెందిన రాయల వెంకటేశ్వర్లు గతంలో ప్రజా ప్రతిఘటన పార్టీలో పని చేశారు. ప్రజాప్రతిఘటన పార్టీ అంతరించిపోవడంతో విలాస జీవితాలకు అలవాటు పడి మావోయిస్టుల పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారన్నారు. వీరికి సహకరించిన సురేందర్‌ను సైతం రిమాండ్‌కు తరలించారు.

## ఏసీబీకి చిక్కిన కారేపల్లి ఈవోపీఆర్డీ



విక్రమ్‌కుమార్

**కారేపల్లి:** ఖమ్మం జిల్లా కారేపల్లి ఎంపీడీవో కార్యాలయ ఈవోపీఆర్డీ సోమవారం లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. వరంగల్ ఏసీబీ డీఎస్పీ ప్రతాప్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎంపీడీవో కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేసిన హరిదాస్‌కు రూ.12వేల చొప్పున ఐదు నెలల వేతనం చెల్లించాల్సి ఉన్నది. నాలుగు నెలల కిందట ఉద్యోగం మానేసిన హరిదాస్ తనకు రావాల్సిన మొత్తాన్ని ఇవ్వాలని ఈవోపీఆర్డీ విక్రమ్‌కుమార్‌ను కోరగా అందుకు ఆయన రూ.24 వేలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేశాడు. ఇటీవల రూ.10 వేలు తీసుకోగా, మిగతా రూ.14 వేలను సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ప్రస్తుతం కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న ప్రశాంత్ సెల్‌ఫోన్ నుంచి ఫోన్‌పే ద్వారా హరిదాస్ ఈవోపీఆర్డీ విక్రమ్ కుమార్ ఖాతాకు బదిలీ చేశాడు. అప్పటికే అక్కడే మాటువేసిన ఏసీబీ సీఐ రమణామూర్తి, ఎస్సై రవీందర్ తోపాటు ఏసీబీ సిబ్బంది సదరు అధికారిని పట్టుకున్నారు

# 48 గంటల్లో రాష్ట్రానికి వర్ష సూచన

- రేపు బంగాళాఖాతంలో అల్పపీడనం!
- రెండు జిల్లాల్లో కురిసిన వాన

**హైదరాబాద్/సిటీబ్యూరో, నమస్తేతెలంగాణ:** వచ్చే 48 గంటల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశమున్నది. ఉత్తర ఒడిశా దాన్ని ఆనుకొని ఉన్న పశ్చిమబెంగాల్, జార్ఖండ్ తీర ప్రాంతాల్లో సముద్రమట్టానికి 0.9 కిలోమీటర్ల నుంచి 7.6 కిలోమీటర్ల మధ్య ఉపరితల ఆవర్తనం స్థిరంగా కొనసాగుతున్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారి రాజారావు తెలిపారు. ఫలితంగా ఉత్తర బంగాళాఖాతం, దాని పరిసర ప్రాంతాల్లో ఈనెల 28న అల్పపీడనం ఏర్పడే అవకాశాలున్నట్టు వెల్లడించారు. రాగల 48 గంటల్లో రాష్ట్రంలోని పలుచోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వానలు కురిసే అవకాశమున్నట్టు పేర్కొన్నారు. వచ్చే 24 గంటల్లో గ్రేటర్ హైదరాబాద్‌లోని పలుచోట్ల ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలున్నట్టు తెలిపారు.

### భద్రాద్రి, ఆసిఫాబాద్ జిల్లాల్లో వర్షం

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ/సిర్పూర్(యు):** భద్రాద్రి కొత్తగూడెం, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాల్లో సోమవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో మధ్యాహ్నం దాదాపు గంటసేపు భారీ వర్షం పడింది. దీంతో కొత్తగూడెంలోని రోడ్లన్నీ జలమయమయ్యాయి. కాగా చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి మండలాల్లోనూ వర్షం పడింది. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(యు) మండలంలో సోమవారం సాయంత్రం వర్షం కురిసింది.

# చిన్నారిపై లైంగిక దాడి నిందితుడికి న్యాయనిరాకరణ

## తీర్మానం చేసిన సంగారెడ్డి జిల్లా కోర్టు న్యాయవాదులు

**సంగారెడ్డి, నమస్తేతెలంగాణ ప్రధానప్రతినిధి:** మూడున్నరేండ్ల చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడికి న్యాయ సేవలందించేందుకు సంగారెడ్డి జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ నిరాకరించింది. సోమవారం జిల్లా కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం తీర్మానించింది. ఈ నెల 23న సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన చిన్నారిపై అదే గ్రామానికి చెందిన పాపయ్య(40) లైంగిక దాడికి పాల్పడ్డాడు. అదే రోజు పాపయ్యను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. పాపయ్యకు ఎవరూ బెయిల్ పిటిషన్ వేయవద్దనీ, వరంగల్ ఘటన తరహా శిక్ష విధించాలని సంగారెడ్డి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రభుధాన్యం అభిప్రాయపడ్డారు.



మంథని ఆర్డీవోతో గోడు వెళ్లబోసుకుంటున్న అనసూయ, పక్కన ఆమె కూతురు

# కొడుకు బువ్వ పెడుతలేడు..

## ఆర్డీవోను ఆశ్రయించిన తల్లి

**మంథని, నమస్తే తెలంగాణ:** తన కొడుకు బువ్వ పెడుతలేడంటూ ఓ తల్లి మంథని ఆర్డీవో నగేశ్‌ను ఆశ్రయించింది. పెద్దపల్లి జిల్లా మంథని మండలం అడవిసోమన్‌పల్లికి చెందిన గట్టు అనసూయ-గట్టయ్య దంపతులకు నలుగురు కూతుళ్లు, ఒక కొడుకు ఉన్నారు. సింగరేణిలో పని చేసి ఉద్యోగ విరమణ పొందిన గట్టయ్య నలుగురికి పెండ్లిండ్లు చేశాడు. 2012లో మృతి చెందాడు. మానసిక వైకల్యంతో ఉన్న కూతురు వరలక్ష్మి కూడా తల్లి వద్దే ఉంటుంది. తన కొడుకు, కోడలు గట్టు జనార్దన్-స్వాతి తమనుపట్టించుకోవట్లేదని ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లింది. 2103లో స్వాతి గ్రామ సర్పంచ్‌గా ఉన్నప్పుడు తనపేర ఉన్న 9 ఎకరాలు, తన బిడ్డ పేరిట ఉన్న 2ఎకరాల భూమిని అక్రమంగా విరాసత్ చేసుకున్నదని ఆవేదన వ్యక్తం చేసింది. అప్పటి నుంచి కొడుకుకోడలు అన్నం పెట్టకుండా వేధిస్తున్నారని వాపోయింది. తమకు న్యాయం చేయాలని ఆర్డీవోను వేడుకొన్నది.



నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట ఎంపీడీవో కార్యాలయంలో సమయపాలన పాటించిన సిబ్బందికి ఎంపీపీ రవీంద్రనాథ్‌రెడ్డి, ఎంపీడీవో కరుణశ్రీలు పూలు అందజేసి స్వాగతం పలికారు. సోమవారం సమయానికి కార్యాలయానికి చేరుకున్న వారికి ఈ రకంగా అభినందించారు. - తిమ్మాజిపేట

నమస్తే తెలంగాణ
ఆట
8
[ కరీంనగర్ ]
మంగళవారం 27 ఆగస్టు 2019
WWW.NTNEWS.COM

# రాకెట్‌తోనే బదులిచ్చా

విమర్శకుల నోళ్లు మూయించడంపై సింధు వ్యాఖ్య



**బాసెల్ (స్విట్జర్లాండ్):** బ్యాడ్మింటన్ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకం సాధించిన తెలుగు షట్లర్ పీవీ సింధు చరిత్రాత్మక విజయాన్ని ఆస్వాదిస్తున్నది. గత రెండేండ్లలో తుదిపోరులో చేజారిని పసిడి... ఈసారి వశమవడంతో సంబురాలు చేసుకుంటున్నది. ఈ నేపథ్యంలో ప్రపంచ బ్యాడ్మింటన్ ఫెడరేషన్ వెబ్‌సైట్‌లో తన అభిప్రాయాలను వ్యక్తం చేసింది. గత రెండుసార్లు చాంపియన్‌షిప్ ఫైనల్లో ఓడినప్పుడు ఎదుర్కొన్న విమర్శల పట్ల చాలా కోపం, ఆవేదన చెందానని, అయితే వాటన్నింటికి ఇప్పుడు రాకెట్‌తోనే సమాధానం ఇచ్చానని ఆమె పేర్కొంది. 'నన్ను పదేపదే ప్రశ్నించిన వారికి నేను ఇచ్చిన సమాధానం ఇదే. నేను రాకెట్‌తోనే జవాబు ఇవ్వాలని అనుకున్నా. ఇచ్చేశా. చాంపియన్‌షిప్ ఫైనల్లో ఓడిన రెండుసార్లు చాలా బాధపడ్డా. భావోద్వేగానికి గురయ్యా. ఇదొక్క మ్యాచ్ ఎందుకు గెలవలేకపోతున్నానంటూ నన్ను నేనే ప్రశ్నించుకునేదాన్ని. కానీ ఈ రోజు.. నీ ఆట నువ్వు ఆడు.. కచ్చితంగా గెలుస్తావు అని నాకు నేను చెప్పుకున్నా'అని సింధు వెల్లడించింది. రియో ఒలింపిక్స్‌లో రజతం సాధించిన తర్వాత తనపై అంచనాలు అమాంతం పెరిగిపోయాయని ఆమె చెప్పింది. 'నేను జగజ్జేతగా నిలువాలని ప్రతిఒక్కరూ కోరుకున్నారు. రియో ఒలింపిక్స్ తర్వాత నాపై అంచనాలు బాగా పెరిగాయి. ఆ తర్వాత బరిలో దిగిన ప్రతిసారి స్వర్ణ పతకం సాధిస్తానని అంచనా వేస్తున్నారు. ఏడాది తర్వాత ఇతరుల గురించి ఆలోచించడం మానేశా. నా ఆట నేను ఆడుతూ.. 100 శాతం కష్టపడాలని నిర్ణయించుకున్నా. ఆటోమేటిక్‌గా గెలిచేశా. ఎందుకంటే వేరే వాళ్ల గురించి ఆలోచిస్తే నాపై అదనపు ఒత్తిడి పెరుగుతుంది' అని సింధు వివరించింది.

## టార్గెట్ టోక్యో

'టోక్యో ఒలింపిక్స్‌లో స్వర్ణం మాటేంటని ఇప్పుడే అందరూ అడుగుతున్నారు. మెగాటోర్నీకి మరెంతో సమయం లేదు. త్వరలోనే ఒలింపిక్స్ క్వాలిఫికేషన్స్ జరగనున్నాయి. నేను బాగానే ఆడతానని అనుకుంటున్నా. అయితే ప్రస్తుతం చాంపియన్‌షిప్ విజయాన్ని ఎంజాయ్ చేయాలనుకుంటున్నా. ఇంకేం ఆలోచించదల్చుకోలేదు. బ్యాడ్మింటన్ అంటే నాకు ప్రాణం. మరిన్ని టైటిళ్లు గెలవగలనని నాకు తెలుసు' అని ఆమె చెప్పుకొచ్చింది. ఆదివారం జరిగిన చాంపియన్‌షిప్ ఫైనల్లో సింధు 21-7, 21-7 తేడాతో ఒకుహర(జపాన్)ను ఓడించి, స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ ఘనత సాధించిన తొలి భారత ప్లేయర్‌గా నిలువడంతో పాటు చాంపియన్‌షిప్ చరిత్రలో ఎక్కువ పతకాలు సాధించిన మహిళల సింగిల్స్ క్రీడాకారిణిగా జాంగ్ నింగ్ (చైనా) సరసన నిలిచింది. గత రెండు చాంపియన్‌షిప్‌ల్లో రజతాలు సాధించిన సింధు.. 2013, 2014ల్లో కాంస్యాలు కైవసం చేసుకుంది.



ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం నెగ్గి చరిత్ర సృష్టించిన స్టార్ షట్లర్ పీవీ సింధుకు కరీంనగర్‌లోని వివేకానంద పాఠశాల విద్యార్థులు వినూత్న రీతిలో అభినందనలు తెలిపారు. సింధు పేరు ఆకారంలో కూర్చొని తమ అభిమానాన్ని చాటుకున్నారు.

## కాళిదాసుకు రెండో స్థానం



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ ఆట ప్రతినిధి:** మైండ్ గేమ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ వర్ధమాన చెస్ ఆటగాడు ఆనంద్ దత్త కాలిదాసు సత్తాచాటాడు. అండర్-16 విభాగంలో 3 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచాడు. 'స్లాన్' ఆధ్వర్యం లో జరిగిన ఈ టోర్నీలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడుకు చెందిన ప్లేయర్లు పాల్గొన్నారు. ఈ టోర్నీలో అండర్-9, 12, 16 విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఎల్బీ స్టేడియంలో పోటీలు ముగిసిన అనంతరం నిర్వాహకులు విజేతలకు ట్రోఫీలు అందజేశారు.

# టెస్టు చాంపియన్‌షిప్‌లో భారత్ బోణీ

వెస్టిండీస్‌పై 318 పరుగుల తేడాతో గెలుపు

రాణించిన రహానే..

విజృంభించిన బుమ్రా



**నార్త్ సౌండ్ (అంటిగ్వా):** వైస్ కెప్టెన్ అజింక్యా రహానే పోరాటానికి బౌలర్ల సమిష్టి కృషి తోడవడంతో వెస్టిండీస్‌తో జరిగిన తొలి టెస్టులో భారత్ జయభేరి మోగించింది. 419 పరుగుల లక్ష్యఛేదనలో రెండో ఇన్నింగ్స్ బరిలోకి దిగిన విండీస్ 100 పరుగులకే చాపచుట్టేసింది. ఫలితంగా భారత్ 318 పరుగుల తేడాతో గెలిచి రెండు టెస్టుల సిరీస్‌లో 1-0తో ముందంజ వేసింది. దీంతో పాటే ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ)లో టీమ్ ఇండియా ఖాతా తెరిచింది. ప్రస్తుతం ఈ జాబితాలో భారత్ (60 పాయింట్లు) అగ్రస్థానంలో ఉండగా.. న్యూజిలాండ్, శ్రీలంక చెరో 60 పాయింట్లతో ఆ తర్వాత స్థానాల్లో ఉన్నాయి. ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ చెరో 32 పాయింట్లు ఖాతాలో జమ చేసుకున్నాయి.

**బెంబేలెత్తించిన బుమ్రా..**

కొండంత లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో కరీబియన్లు పూర్తిగా విఫలమయ్యారు. పోరాడాల్సిన చోట పట్టుదల చూపకుండా.. ఒకరి వెంట ఒకరు పెవిలియన్‌కు వరుసకట్టారు. యార్కర్ కింగ్ జస్ప్రీత్ బుమ్రా (8-4-7-5) అద్వితీయ గణాంకాలు నమోదు చేసుకోగా.. ఇషాంత్ శర్మ (3/31), షమీ (2/13) అదరగొట్టారు. విండీస్ ఇన్నింగ్స్‌లో ఎనిమిది మంది బ్యాట్స్‌మెన్ సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారంటే మన పేసర్ల విజృంభణ ఎలా సాగిందో చెప్పొచ్చు. కీమర్ రోచ్ (38) టాప్ స్కోరర్. చివరి వికెట్‌కు మిగావ్ కమిన్స్ (19)తో కలిసి రోచ్ 50 పరుగులు జతచేయడంతో కరీబియన్లు ఆ మాత్రం స్కోరైనా చేయగలిగారు. తొలి ఇన్నింగ్స్‌లో 81 పరుగులతో పాటు రెండో ఇన్నింగ్స్‌లో సూపర్ సెంచరీ చేసిన రహానేకు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'అవార్డు దక్కింది. ఇరు జట్ల మధ్య శుక్రవారం నుంచి కింగ్‌స్టన్‌లో రెండో టెస్టు జరుగనుంది.

**100**

అంతర్జాతీయ క్రికెట్‌లో కెప్టెన్‌గా కోహ్లీకిది వందో విజయం. 152 మ్యాచ్‌ల్లోనే విరాట్ ఈ ఫీట్ అందుకున్నాడు.

**318**

పరుగుల పరంగా భారతదేశం వెలుపల టీమ్‌ఇండియాకు ఇదే అతిపెద్ద విజయం. అంతకుముందు గాలె (2017)లో లంకపై 304 పరుగులతో గెలిచింది.

## ఔట్‌స్వింగర్లతోనే ఐదేశా

ఔట్‌స్వింగర్లు వేయడంలో మెరుగవడం వల్లే మంచి ఫలితాలు వస్తున్నాయని టీమ్ ఇండియా పేస్ స్టర్ జస్ప్రీత్ బుమ్రా పేర్కొన్నాడు. గతంతో పోల్చుకుంటే ఆత్మవిశ్వాసం పెరిగిందని అతడు తెలిపాడు. వెస్టిండీస్‌తో తొలి టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో పదునైన యార్కర్లతో బెంబేలెత్తించిన బుమ్రా.. విరాట్ సేన విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఈ నేపథ్యంలో అతడు మాట్లాడుతూ.. 'గతంలో ఇన్‌స్వింగర్లు అధికంగా వేసేవాడిని. టెస్టు మ్యాచ్‌ల్లో అనుభవం వస్తున్న కొద్దీ ఔట్‌స్వింగర్లు సంధించే ఆత్మవిశ్వాసం పెరిగింది. ప్రత్యేకించి ఇంగ్లండ్ సిరీస్ తర్వాత. ఈ మ్యాచ్‌లో నేను, ఇషాంత్.. క్రీజ్ వెడల్పును వినియోగించుకుంటూ స్వింగ్ సృష్టించేందుకు ప్రయత్నించాం' అని అన్నాడు.

**1**

విరాట్ కోహ్లీ కెప్టెన్సీలో భారత్‌కు ఇది 27వ టెస్టు విజయం. దీంతో టీమ్‌ఇండియాకు అత్యధిక టెస్టు విజయాలు (27) అందించిన మాజీ కెప్టెన్ మహేంద్రసింగ్ ధోనీ సరసన నిలిచాడు.

భారత్ తరఫున అత్యంత వేగంగా 50 వికెట్లు పడగొట్టిన పేసర్‌గా బుమ్రా రికార్డుల్లోకెక్కాడు. అతడు 11 మ్యాచ్‌ల్లోనే ఈ ఫీట్ అందుకోవడం విశేషం.

విదేశాల్లో అత్యధిక టెస్టు విజయాలు (12) సాధించిన సారథిగా కోహ్లీ అగ్రస్థానంలో నిలిచాడు. తాజా గెలుపుతో గంగూలీ (11)ని వెనక్కినెట్టాడు.

రెండో ఇన్నింగ్స్‌లో బుమ్రా తీసిన ఐదు వికెట్లలో నాలుగు బౌల్డ్‌లే. ఒక టెస్టు ఇన్నింగ్స్‌లో నలుగురు బ్యాట్స్‌మెన్‌ను బౌల్డ్ చేసిన భారత తొలి బౌలర్ అతడే.

## అండగా ఉన్నోళ్లకు అంకితం



కష్టకాలంతో తన వెన్నంట నిలిచిన వారికి 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు ను అంకితమిస్తున్నట్లు టీమ్‌ఇండియా టెస్టు వైస్ కెప్టెన్ అజింక్యా రహానే పేర్కొన్నాడు. గత రెండేండ్లుగా పెద్దగా ఆకట్టుకోలేకపోతున్న రహానే వెస్టిండీస్‌తో తొలి టెస్టులో అదరగొట్టాడు. మొదటి ఇన్నింగ్స్‌లో 81 పరుగులు చేసిన జింక్స్.. రెండో ఇన్నింగ్స్ (102)లో శతక్కొట్టాడు. మ్యాచ్ అనంతరం రహానే మాట్లాడుతూ.. 'ఈ సెంచరీ ఎంతో ప్రత్యేకం. ఫామ్ లేక తంటాలు పడుతున్న గడ్డు రోజుల్లో నాకు అండగా నిలిచిన వారికి ఈ శతకాన్ని అంకితమిస్తున్నా. కౌంటీల్లో హ్యాంప్‌షైర్ తరఫున ఆడటం మేలు చేసింది. సుమారు 29, 30 ఇన్నింగ్స్‌ల తర్వాత మూడంకెల మార్క్ అందుకున్నా. చాలా ఆనందంగా ఉంది. తొలి ఇన్నింగ్స్ ఆరంభంలోనే 3 వికెట్లు కోల్పోయిన స్థితిలో సుదీర్ఘ ఇన్నింగ్స్ ఆడాలని నిర్ణయించుకున్నా. కనీసం 100 ఓవర్లైనా క్రీజులో నిలిస్తే జట్టు కోలుకుంటుందనుకున్నా అదే జరిగింది' అని పేర్కొన్నాడు.

## స్కోరు బోర్డు

**భారత్ తొలి ఇన్నింగ్స్:** 297, **వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్:** 222, **భారత్ రెండో ఇన్నింగ్స్:** 343/7 డిక్లేర్డ్ (రహానే 102, విహారి 93; ఛేజ్ 4/132), **వెస్టిండీస్ రెండో ఇన్నింగ్స్:** క్రైగ్ బ్రాత్‌వైట్ (సి) పంత్ (బి) బుమ్రా 1, క్యాంప్‌బెల్ (బి) బుమ్రా 7, బ్రూక్స్ (ఎల్బీ) ఇషాంత్ 2, బ్రావో (బి) బుమ్రా 2, హెట్‌మైర్ (సి) రహానే (బి) ఇషాంత్ 1, చేజ్ (బి) షమీ 12, హోప్ (బి) బుమ్రా 2, హోల్డర్ (బి) బుమ్రా 8, రోచ్ (సి) పంత్ (బి) ఇషాంత్ 38, గాబ్రియల్ (సి) పంత్ (బి) షమీ 0, మిగావ్ కమిన్స్ (నాటౌట్) 19, **ఎక్స్‌ట్రాలు:** 8, **మొత్తం:** 26.5 ఓవర్లలో 100 ఆలౌట్. **వికెట్ల పతనం:** 1-7, 2-10, 3-10, 4-13, 5-15, 6-27, 7-37, 8-50, 9-50, 10-100, **బౌలింగ్:** ఇషాంత్ 9.5-1-31-3, బుమ్రా 8-4-7-5, జడేజా 4-0-42-0, షమీ 5-3-13-2.

## ఎథిక్స్ ఆఫీసర్ ముందుకు రాహుల్ ద్రవిడ్



**న్యూఢిల్లీ:** పరస్పర విరుద్ధ ప్రయోజనాల విషయంలో టీమ్‌ఇండియా మాజీ కెప్టెన్, మిస్టర్ డిపెండబుల్ రాహుల్ ద్రవిడ్ ఆరోపణలు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ అంశంపై వివరణ ఇచ్చేందుకు వచ్చే నెల 26న తన ఎదుట హాజరు కావాలని బీసీసీఐ ఎథిక్స్ ఆఫీసర్ డీకే జైన్ ద్రవిడ్‌కు సూచించారు. మధ్యప్రదేశ్ క్రికెట్ బోర్డు సభ్యుడు సంజీవ్ గుప్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ అంశంపై గతంలోనే ఎథిక్స్ ఆఫీసర్ నోటీసులు పంపగా... ద్రవిడ్ రాతపూర్వక వివరణ ఇచ్చాడు. తాను ఇండియన్ సిమెంట్స్ పదవికి ప్రస్తుతం దూరంగా ఉన్నానని, తనకు చెన్నై సూపర్‌కింగ్స్ ఫ్రాంచైజీతో సంబంధమే లేదని తేల్చిచెప్పాడు. అయితే, ద్రవిడ్‌కు నోటీసులు పంపడంపై మాజీ సారథి సౌరభ్ గంగూలీ మండిపడిన విషయం తెలిసిందే. భారత క్రికెట్‌ను దేవుడే కాపాడాలంటూ ఆగ్రహం కూడా వ్యక్తం చేశాడు. ఇటీవలే పరస్పర విరుద్ధ ప్రయోజనాల మార్గదర్శకాలు అమలు చేయడంలో ఎదురవుతున్న ఇబ్బందులపై సీవోఏ సభ్యులు మాజీ క్రికెటర్లతో కూడా చర్చలు జరిపారు.



## పాక్ హెడ్‌కోచ్ రేసులో మిస్బా ఉల్ హక్

**కరాచీ:** పాకిస్థాన్ క్రికెట్ జట్టు హెడ్‌కోచ్ స్థానానికి దరఖాస్తు చేసుకున్నట్టు ఆ దేశ మాజీ కెప్టెన్ మిస్బా ఉల్ హక్ సోమవారం ప్రకటించాడు. దీనికోసం పీసీబీ క్రికెట్ కమిటీ నుంచి తప్పుకున్నాడు. మిస్బాను పాక్ హెడ్ కోచ్‌తో పాటు చీఫ్ సెలెక్టర్‌గా నియమిస్తారన్న ఊహాగానాలు కొద్దిరోజులుగా వినిపిస్తున్న విషయం తెలిసిందే. 'నేను హెడ్‌కోచ్ స్థానం కోసం దరఖాస్తు సమర్పించా. ఈ నిర్ణయం ఈ రోజే తీసుకున్నా. పోటీ తీవ్రంగా ఉంటుందని తెలుసు. ఎంతో చాలెంజ్‌తో కూడుకున్న ఈ పదవి కోసం చాలా మంది సీనియర్లు, మెరుగైన అర్హత కలిగిన వారు రేసులో ఉన్నారు'అని మిస్బా చెప్పాడు. అలాగే పాక్ ప్రధాన కోచ్ పదవి పోటీలో ఆస్ట్రేలియా మాజీ బ్యాట్స్‌మన్ డీన్ జోన్స్ ఉన్నాడు. పాక్ మాజీ పేసర్ వకార్ యూనిస్ బరిలో ఉన్నా.. బౌలింగ్ కోచ్‌గా ఉండేందుకు తాను ఇష్టపడతానని చెప్పాడు. ప్రపంచకప్‌లో పాక్ విఫలమవడంతో హెచ్ కోచ్‌గా ఉన్న మిక్కి ఆర్థర్‌తో పాటు సహాయక సిబ్బంది కాంట్రాక్టును పీసీబీ పొడిగించని విషయం తెలిసిందే. ఈ నెల 9 నుంచి పీసీబీ దరఖాస్తులను ఆహ్వానించగా గడువు సోమవారంతో ముగిసింది.

మరోవైపు పాకిస్థాన్ అండర్-19 క్రికెట్ జట్టు హెడ్ కోచ్‌గా ఆ దేశ మాజీ బ్యాట్స్‌మన్ ఇజాజ్ అహ్మద్ సోమవారం నియమితుడయ్యాడు. గతంలో అండర్-19 సహ పాకిస్థాన్-ఏ జట్టుకు హెడ్‌కోచ్‌గా పనిచేసిన అతడు 2010లో సీనియర్ జట్టుకు అసిస్టెంట్ కోచ్‌గా.. కొన్ని రోజులు హెడ్‌కోచ్‌గానూ విధులు నిర్వర్తించాడు.

## స్టార్ల ముందడుగు

యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్



ఆష్లే బార్టీ

**న్యూయార్క్:** యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ మహిళల సింగిల్స్‌లో ఆష్లే బార్టీ(ఆస్ట్రేలియా), కరోలినా ప్లిస్కోవా(చెక్ రిపబ్లిక్) ముందడుగేశారు. సోమవారం జరిగిన తొలి రౌండ్‌లో రెండో సీడ్ బార్టీ 1-6, 6-3, 6-2 తేడాతో అన్ సీడెడ్ ప్లేయర్ జరీనా దియాస్(కజకిస్థాన్)పై గెలిచి, రెండో రౌండ్ చేరింది. మరో మ్యాచ్‌లో మూడో సీడ్ ప్లిస్కోవా 7-6 (8/6), 7-6 (7/3)తో తన దేశానికే చెందిన అన్‌సీడెడ్ క్రీడాకారిణి టెరేజా మార్టిన్‌కోవాపై చెమటోడ్చి విజయం సాధించింది. మరోమ్యాచ్‌లో 16వ సీడ్ జొహన్నా కొంటా(బ్రిటన్) 6-1, 4-6, 6-2తో దరియ కసాట్కినా(రష్యా)పై కష్టపడి గెలిచింది. పురుషుల సింగిల్స్‌లో ఏడో సీడ్ నిషికొరి(జపాన్) 6-1, 4-1 తేడాతో మార్కో ట్రుంగెలెటిపై సునాయస విజయం సాధించాడు. మార్కో గాయం కారణంగా మ్యాచ్ మధ్యలోనే వైదొలిగాడు.

## ఎప్పటికీ మర్చిపోలేను

**లీడ్స్:** యాషెస్ సిరీస్ మూడో టెస్టులో ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ బెన్ స్టోక్స్(135 నాటౌట్) అద్భుత ఇన్నింగ్స్‌పై సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. ఓటమి ఖాయమనుకున్న స్థితి నుంచి చివరి వికెట్‌కు 76 పరుగులు జోడించి గెలిపించిన అతడి బ్యాటింగ్ నిజంగా అమోఘమే. ఈ ఇన్నింగ్స్‌పై స్టోక్స్ తన అభిప్రాయాలను సోమవారం వెల్లడించాడు. 'ఏ దశలోనూ పోరాటాన్ని ఆపకూడదు. ఆట ముగిసే వరకు పరాజయాన్ని అంగీకరించకూడదు. లీచ్ చివరి వికెట్‌గా వచ్చినప్పుడు ఇదే అనుకున్నా. నేను సాధించాలని నిశ్చయించుకున్నా. ఓవర్‌లో ఐదు బంతులు నేను ఆడి చివరి బంతికి లీచ్‌కు స్ట్రయిక్ ఇవ్వాలని అనుకున్నా. లీచ్ వికెట్‌ను కాపాడుకోగలడని నాకు తెలుసు' అని స్టోక్స్ అన్నాడు.



# న్యూజిలాండ్ విజయం

లంకతో టెస్టు సిరీస్ 'డ్రా'

**కొలంబో:** శ్రీలంకతో జరిగిన టెస్టు సిరీస్‌ను న్యూజిలాండ్ 1-1తో సమం చేసింది. రెండు టెస్టుల సిరీస్‌లో భాగంగా తొలి టెస్టులో అనూహ్య పరాజయం మూటగట్టుకున్న కివీస్ వర్షం అంతరాయం కలిగించిన రెండో టెస్టులో ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకుంది. టామ్ లాథమ్ (154), వాట్లింగ్ (105), గ్రాండ్‌హోమ్ (83) విజృంభించడంతో తొలి ఇన్నింగ్స్‌ను 431/6 వద్ద డిక్లేర్ చేసిన న్యూజిలాండ్.. ఆ తర్వాత రెండో ఇన్నింగ్స్‌లో ప్రత్యర్థిని 122 పరుగులకే పరిమితం చేసింది. మ్యాచ్‌ను డ్రా చేసుకొని సిరీస్ చేజిక్కించుకునే సువర్ణావకాశం లంక ముందు నిలిచినా.. బ్యాట్స్‌మెన్ సమిష్టిగా చేతులెత్తేయడంతో అది సాధ్యపడలేదు. చివరి రోజు పూర్తిగా బ్యాటింగ్ చేస్తే మ్యాచ్ డ్రా అయ్యే స్థితిలో అనవసర తప్పిదాలతో వికెట్లు కోల్పోయి చివరకు మ్యాచ్‌ను చేజార్చుకుంది. బౌల్ట్ (2/17), సౌథీ (2/15), ఎజాజ్ (2/31), సోమర్‌విల్లె (2/49) ధాటికి బెంబేలెత్తిన లంక చివరిదైన



ఐదోరోజు 70.2 ఓవర్లలో ఆలౌటైంది. వికెట్ కీపర్ బ్యాట్స్‌మన్ నిరోషన్ డిక్‌వెలా (51) ఒంటరి పోరాటం చేశాడు. శ్రీలంక తొలి ఇన్నింగ్స్‌లో 244 పరుగులు చేయగా.. అనంతరం న్యూజిలాండ్ మొదటి ఇన్నింగ్స్‌లో 431 పరుగులకు డిక్లేర్ చేసింది. లంక రెండో ఇన్నింగ్స్‌లో 122 పరుగులకు ఆలౌటైంది. ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్‌లో భాగంగా ఈ సిరీస్‌తో ఇరు జట్ల ఖాతాలో 60 పాయింట్లు చేరాయి. లాథమ్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, వాట్లింగ్‌కు మ్యాన్ ఆఫ్ ది సిరీస్ అవార్డులు దక్కాయి.

## 'పంత్ మెరుగవ్వాలి'

**న్యూఢిల్లీ:** మాజీ సారథి ధోనీకి ప్రత్యామ్నాయంగా పరిగణిస్తున్న యువ వికెట్ కీపర్ రిషభ్ పంత్ అనవసర షాట్లకు ప్రయత్నించి ఇటీవల వరుసగా విఫలమవుతున్నాడు. అతడి షాట్ల ఎంపికపై విమర్శలు ఎక్కువయ్యాయి. ఈ నేపథ్యంలో రిషభ్‌కు మాజీ డాషింగ్ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ సలహాలు ఇచ్చాడు. ఆటను మరింత మెరుగుపరుచుకునేందుకు కష్టపడాలని, మేనేజ్‌మెంట్ పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని సూచించాడు. 'పంత్ ఎంతో ప్రతిభ కలిగిన క్రికెటర్. అతడికి సామర్థ్యం ఉంది. అయితే తనను తాను మెరుగుపరుచుకోవడం అతడికి చాలా ముఖ్యం. అవకాశాలను సద్వినియోగం చేసుకొని, బాగా ఆడి ఓ చక్కటి క్రికెటర్‌గా ఎదిగేందుకు అతడికి ఇదే సరైన సమయం'అని సెహ్వాగ్ అన్నాడు.



# బెంగాల్‌కు హర్యానా బ్రేక్



**న్యూఢిల్లీ:** ప్రొ కబడ్డీ లీగ్ ఏడో సీజన్‌లో గత ఐదు మ్యాచ్‌ల్లో ఓటమెరుగని బెంగాల్ వారియర్స్ జట్టుకు హర్యానా స్టీలర్స్ బ్రేకులు వేసింది. సోమవారమిక్కడ జరిగిన పోరులో స్టీలర్స్ 36-33తో వారియర్స్‌ను ఓడించి, పాయింట్ల పట్టికలో ఐదో స్థానానికి చేరింది. హర్యానా జట్టులో వికాస్ కండోలా(11పాయింట్లు) సూపర్-10 సాధించగా.. వినయ్ (9 పాయింట్లు) ఆకట్టుకున్నాడు. బెంగాల్ తరఫున మణిందర్ సింగ్ 22 రైడ్లలో 15 పాయింట్లు తెచ్చి తుదికంట పోరాడాడు. రైడింగ్‌లో ఇరు జట్లు సమ ఉజ్జీలుగా నిలిచినా.. ట్యాక్లింగ్‌లో కాస్త ఆధిపత్యం కనబర్చిన హర్యానా విజయం సాధించింది. అంతకు ముందు జరిగిన మరో మ్యాచ్‌లో యూపీ యోధా 35-30తో పుణెరి పల్టన్స్‌పై విజయం సాధించింది. యూపీ జట్టులో శ్రీకాంత్ యాదవ్ 15 రైడ్ పాయింట్లు.. పుణేరీ ఆటగాడు మన్‌జీత్ 16పాయింట్లు సాధించి టాప్ స్కోరర్లుగా నిలిచారు.

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 37,494 | 11,058 |
| 793 | 228 |

ముడి చమురు (బ్రెంట్) 58.72 డాలర్లు

**బంగారం ధరలు**

న్యూఢిల్లీ (రూ.లలో)

| | |
|---|---|
| 24 క్యారెట్లు | 39,670 |
| 22 క్యారెట్లు | 39,500 |
| వెండి (కిలో) | 46,550 |

**విదేశీ మారకం**

| కరెన్సీ | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|
| అమెరికా డాలర్ | 69.00 | 74.50 |
| యూరో | 76.80 | 83.30 |
| బహ్రెయిన్ దినార్ | 181.50 | 195.50 |
| కువైట్ దినార్ | 228.00 | 240.00 |
| సౌదీ రియాల్ | 18.00 | 19.80 |
| యూఏఈ దిర్హామ్ | 18.50 | 20.20 |

### భెల్‌కు రూ.2,500 కోట్ల ఆర్డర్

**న్యూఢిల్లీ, ఆగస్టు 26:** విద్యుత్ పరికరాల తయారీలో అగ్రగామి సంస్థ భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్(భెల్)..ఎన్టీపీసీ నుంచి రూ.2,500 కోట్ల విలువైన రెండు ఆర్డర్లు వచ్చాయని తెలిపింది. తెలంగాణలోని రామగుండం వద్ద ఉన్న 2,100 మెగావాట్ల థర్మల్ విద్యుత్‌ప్లాంట్‌తోపాటు ఛత్తీస్‌గఢ్‌లో ఉన్న 2,600 మెగావాట్ల కోర్బా ఎన్టీపీఎస్ స్టేజ్-1,2 విద్యుత్ ప్లాంట్లలో ఉద్గారాన్ని నియంత్రించే పరికరాలను బిగించాల్సి ఉంటుందని కంపెనీ బీఎస్‌ఈకి సమాచారం అందించింది.

# ఉద్దీపనోత్సాహం

## భారీ లాభాల్లో దేశీయ స్టాక్ మార్కెట్లు

- సెన్సెక్స్ 793, నిఫ్టీ 228 పాయింట్లు వృద్ధి
- సర్చార్జీ ఉపసంహరణతో పోటెత్తిన పెట్టుబడులు
- ఆకట్టుకున్న ఆర్థిక, బ్యాంకింగ్, నిర్మాణ రంగాల షేర్లు




**ముంబై, ఆగస్టు 26:**

దేశీయ స్టాక్ మార్కెట్లలో ఉద్దీపనల ఉత్సాహం తొణికిసలాడింది. సర్చార్జీతో వరుస నష్టాల్లో కదలాడుతున్న సూచీలను ఆ సర్చార్జీ ఉపసంహరణే తిరిగి లాభాల బాట పట్టించింది. గత శుక్రవారం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ దేశ, విదేశీ ఈక్విటీ మదుపరులపై అదనపు సర్జార్జీ భారాన్ని వెనుకకు తీసుకుంటున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే సోమవారం ట్రేడింగ్‌లో బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ సెన్సెక్స్ 792.96 పాయింట్లు లేదా 2.16 శాతం పుంజుకుని 37,494.12 వద్ద నిలిచింది. ఒకానొక దశలో 37,544.48 పాయింట్ల గరిష్ఠాన్ని తాకగా, మరొక సమయంలో 36,492.65 పాయింట్ల కనిష్ఠాన్నీ తాకింది. ఉదయం ఆరంభంలోనే 663 పాయింట్ల లాభాలను అందుకుని ఆకట్టుకున్న సెన్సెక్స్.. ఒక దశలో 1,052 పాయింట్ల నష్టాలపాలై భయపెట్టింది. అయినప్పటికీ మదుపరుల కొనుగోళ్ల జోరుతో లాభాలను అందుకున్నది. అమెరికా-చైనా మధ్య వాణిజ్య చర్చలు ఎన్నోసార్లు విఫలమైనా.. త్వరలోనే మళ్లీ జరుగనున్నాయన్న వార్తలు ఇందుకు దోహదం చేశాయి. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ సైతం మళ్లీ 11 వేల మార్కును దాటింది. 171 పాయింట్ల లాభంతో మొదలైన నిఫ్టీ.. చివరకు 228.50 పాయింట్లు లేదా 2.11 శాతం ఎగబాకి 11,057.85 వద్ద స్థిరపడింది. ఇంట్రా-డేలో 11,070.30 పాయింట్ల గరిష్ఠాన్ని తాకగా, 10,756.55 పాయింట్ల కనిష్ఠాన్నీ చేరింది. మొత్తానికి గడిచిన మూడు నెలలకుపైగా కాలంలో ఒక్కరోజే ఈ స్థాయిలో సూచీలు పెరుగడం ఇదే తొలిసారి. దేశ ఆర్థిక వ్యవస్థలో ఏర్పడిన మందగమనాన్ని పారద్రోలేందుకు కేంద్రం ఉద్దీపనలను అందిస్తుండగా, సర్చార్జీ పెంపు ఉపసంహరణతోనే వాటికి శ్రీకారం చుట్టింది. దీంతోనే మదుపరులు అమ్మకాల ఒత్తిడి నుంచి తేరుకున్నారు. ఏంజెల్ ట్యాక్స్ నుంచి స్టార్టప్‌లకు మినహాయింపు, అమ్మకాలు లేక దిగాలు పడిన ఆటో రంగానికి ఓ ప్యాకేజీ, ప్రభుత్వ రంగ బ్యాంకులకు రూ.70,000 కోట్ల సాయం వంటి వాటినీ సీతారామన్ ప్రకటించడంతో మార్కెట్ సెంటిమెంట్ బలపడింది. రుణాలపై వడ్డీరేట్లను తగ్గించాలని బ్యాంకులు నిర్ణయించినట్లు చెప్పిన కేంద్ర ప్రభుత్వం.. దీనివల్ల గృహ, వాహన, ఇతరత్రా రుణాలు చౌక కాగలవన్న ఆశాభావాన్ని వ్యక్తం చేసింది. తద్వారా ఇటు ఆటో, అటు నిర్మాణ రంగాల్లో కొనుగోళ్లకు అవకాశాలుంటాయని, బ్యాంకింగ్ రంగంలోనూ రుణాల పంపిణీ ఊపందుకుంటుందన్న విశ్వాసాన్ని వెలిబుచ్చింది.

**ఆసియా, ఐరోపా మార్కెట్లలో..**

ఇటు వైపు దేశీయ స్టాక్ మార్కెట్లు లాభాల జోష్‌లో ఉంటే.. అటు వైపు అంతర్జాతీయ మార్కెట్లలో మిశ్రమ స్పందన కనిపించింది. ఆసియా దేశాల్లోని ప్రధాన స్టాక్ మార్కెట్లు చాలావరకు నష్టాల్లో ముగిశాయి. చైనా, హాంకాంగ్, దక్షిణ కొరియా, జపాన్ సూచీలు గణనీయంగా క్షీణించాయి. ఇదే సమయంలో ఐరోపాలోని కీలక సూచీలు లాభాల్లో కదలాడాయి. జర్మనీ, బ్రిటన్, ఫ్రాన్స్ సూచీలు ప్రారంభంలోనే ఆకర్షణీయ లాభాలను అందుకున్నాయి.

### పెరిగిన మదుపరుల సంపద రూ.2.41 లక్షల కోట్లు

**స్టాక్ మార్కెట్లలో** పారిన లాభాల వరద.. మదుపరుల సంపదను అమాంతం పెంచేసింది. సెన్సెక్స్ ఒక్కరోజే 793 పాయింట్లు పుంజుకున్న నేపథ్యంలో బీఎస్‌ఈలోని సంస్థల మార్కెట్ విలువ రూ.2.41 లక్షల కోట్లు ఎగబాకింది. రూ.2,41,975.59 కోట్లు ఎగిసి రూ.1,40,34,462.19 కోట్లకు చేరింది. 30 బ్లూచిప్ షేర్ల సూచీ సెన్సెక్స్‌లో 22 షేర్లు లాభాల్లోనే ముగిశాయి. యెస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ, బజాజ్ ఫైనాన్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు మదుపరులను విపరీతంగా ఆకట్టుకున్నాయి. మొత్తం బీఎస్‌ఈలోని షేర్లలో 1,705 షేర్లు లాభపడితే, 811 షేర్లు నష్టపోయాయి. 123 షేర్లు మాత్రం స్థిరంగా ఉన్నాయి. ఉద్దీపన పథకాలకుతోడు, వాణిజ్య యుద్ధంపై చైనా ఒప్పంద కాంక్షను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ స్వాగతించడం మార్కెట్ సెంటిమెంట్‌ను బలపరిచింది.

### బ్యాంకింగ్ షేర్లకు డిమాండ్

**మదుపరుల** నుంచి బ్యాంకింగ్, ఆర్థిక రంగ షేర్లకు పెద్ద ఎత్తున ఆదరణ కనిపించింది. రూ.70 వేల కోట్ల మూలధన సాయం ప్రకటనతో ప్రభుత్వ రంగ బ్యాంకుల షేర్లు 10 శాతానికిపైగా పుంజుకున్నాయి. సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా షేర్ విలువ 10.08 శాతం పెరుగగా, అలహాబాద్ బ్యాంక్ 8.33 శాతం, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర 5.98 శాతం, బ్యాంక్ ఆఫ్ ఇండియా 3.96 శాతం, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 3.62 శాతం, ఎస్బీఐ 3.38 శాతం, పీఎన్‌బీ 3.46 శాతం, కెనరా బ్యాంక్ 3.39 శాతం, బీవోబీ 1.71 శాతం చొప్పున లాభపడ్డాయి. అయితే ప్రైవేట్ రంగ బ్యాంకైన యెస్ బ్యాంక్ షేర్ విలువ.. సెన్సెక్స్‌లోనే అత్యధిక శాతం లాభపడింది. హెచ్‌డీఎఫ్‌సీ, బజాజ్ ఫైనాన్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, ఎల్అండ్‌టీ, యాక్సిస్ బ్యాంక్, కొటక్ మహీంద్రా బ్యాంక్‌ల షేర్లూ 5.24 శాతం మేర పెరిగాయి. నిర్మాణ, క్యాపిటల్ గూడ్స్, ఇండస్ట్రీస్, ఎఫ్ఎంసీజీ, విద్యుత్ రంగాల షేర్లకూ 3.86 శాతం మేర డిమాండ్ ఏర్పడింది. కాగా, మెటల్, ఔషధ, ఆటో తదితర రంగాల షేర్లలో అమ్మకాల ఒత్తిడి నమోదైంది. ఈ క్రమంలోనే టాటా స్టీల్, సన్ ఫార్మా, హీరో మోటోకార్ప్, వేదాంత, రిలయన్స్ ఇండస్ట్రీస్, టాటా మోటర్స్, మారుతి సుజుకీ, బజాజ్ ఆటో షేర్ల విలువ 2.01 శాతం దిగజారింది. మెటల్ సూచీ ఒక్కటే 1.12 శాతం పడిపోవడం గమనార్హం. కాగా, బీఎస్‌ఈ మిడ్-క్యాప్, స్మాల్-క్యాప్ సూచీలు 1.65 శాతం మేర పెరిగాయి.

### రూపాయి వెలవెల



**మార్కెట్లు** లాభాలతో గలగలమనిపిస్తే.. రూపాయి విలువ మాత్రం వెలవెలబోయింది. డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ సోమవారం ఫారెక్స్ ట్రేడింగ్‌లో 36 పైసలు పతనమై 72.02 స్థాయికి చేరింది. గడిచిన తొమ్మిది నెలల్లో ఈ స్థాయికి క్షీణించడం ఇదే తొలిసారి. 2018 నవంబర్ 14 తర్వాత రూపాయి విలువకు ఇదే అత్యంత కనిష్ఠం కావడం గమనార్హం. అంతర్జాతీయ కరెన్సీల్లో నమోదైన అమ్మకాల ఒత్తిడి ప్రభావం కూడా రూపాయిపై ఉందని విశ్లేషకులు తాజా ట్రేడింగ్ సరళిని అభివర్ణిస్తున్నారు. టర్కీ, చైనా, ఆస్ట్రేలియా కరెన్సీల పతనం మధ్య ఒకానొక దశలో 72.25 స్థాయికి రూపాయి విలువ దిగజారింది. ఫ్యూచర్ మార్కెట్‌లో బ్రెంట్ ముడి చమురు పీపా ధర 0.92 శాతం ఎగిసి 59.34 డాలర్లు పలికింది. ఈ క్రమంలో రూపాయి క్షీణత దేశీయ క్రూడ్ దిగుమతులను భారం చేసే వీలుందన్న భయాలూ వ్యక్తమవుతున్నాయి.



# పుత్తడి.. పరుగో పరుగు

- రూ.39,670కి చేరిన తులం ధర
- ఒకేరోజు రూ.675 ఎగబాకిన బంగారం
- కిలో వెండి రూ.1,450 అధికం

**న్యూఢిల్లీ, ఆగస్టు 26:** పరుగు పందెంలో పుత్తడి విజేతగా నిలుస్తున్నది. రోజుకొక చారిత్రక గరిష్ఠ స్థాయికి చేరుకుంటున్న బంగారం ధరలు సోమవారం మరో కొండెక్కికూర్చున్నాయి. రూపాయి బలహీనత, అంతర్జాతీయ మార్కెట్లో డిమాండ్ నెలకొనడంతో దేశీయ మార్కెట్లో అతి విలువైన లోహాల స్పీడ్‌కు ఎలాంటి బ్రేకులు పడలేదు. ఢిల్లీలో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన తులం ధర మరో రూ.675 అందుకొని రూ.39,670కి చేరుకున్నది. ప్రస్తుత సంవత్సరంలో ఏకంగా రూ.31 వేల నుంచి రూ.40 వేల వరకు చేరువైంది. దేశ ఆర్థిక పరిస్థితులు నిరుత్సాహకరంగా ఉండటంతో దేశీయ, అంతర్జాతీయ ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులను అతి విలువైన లోహాల వైపు మళ్లించడం, అమెరికా-చైనా దేశాల మధ్య నెలకొన్న వాణిజ్య యుద్ధం కొనసాగుతుండటం బంగారం ధరలు భగ్గుమనడానికి ప్రత్యేక కారణాలని విశ్లేషకులు అంచనావేస్తున్నారు. ఈ నెల 20 నుంచి రోజుకొక గరిష్ఠ స్థాయికి చేరుకుంటున్న ధరలు సోమవారం మరో శిఖరంపై ఎక్కి కూర్చున్నాయని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ వెల్లడించింది. వెండి అయితే ఏకంగా కిలో ధర రూ.1,450 అందుకొని రూ.46,550కి చేరుకున్నది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి వచ్చిన కొనుగోళ్ల మద్దతుతో వెండి అధికమైంది.

**ఆరేండ్ల గరిష్ఠానికి ఔన్స్ గోల్డ్**

అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ధర మిలమిల మెరుస్తున్నది. న్యూయార్క్ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర ఆరేండ్ల గరిష్ఠ స్థాయి 1,554.56 డాలర్లకు చేరుకున్నది. అమెరికా-చైనా దేశాల మధ్య కొనసాగుతున్న వాణిజ్య యుద్ధం ఇప్పట్లో ముగిసే అవకాశాలు లేకపోవడంతో గ్లోబల్ ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులను అతి విలువైన లోహాలవైపు మళ్లించడం ధరలు పెరుగడానికి ప్రధాన కారణమని జియోజిట్ ఫైనాన్షియల్ సర్వీసెస్ హెడ్ హరీష్ తెలిపారు. ధరలఇది భవిష్యత్తులో కొనసాగే అవకాశాలున్నాయని పేర్కొన్నారు. అంతర్జాతీయ దేశాల్లో నెలకొన్న రాజకీయ అస్థిరత, ట్రేడ్ వార్ కొనసాగుతుండటంతో వచ్చే కొన్ని నెలల్లో బంగారం రూ.41 వేల మార్క్ దాటే అవకాశాలున్నాయని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. సోమవారం ముంబైలో బంగారం ధర రూ.40 వేలకు చేరువైంది.

**పదేండ్లలో మూడింతలైన బంగారం**

బంగారం సామాన్యుడికి మరింత దూరం అవుతున్నది. పదేండ్ల క్రితం రూ.14,500గా ఉన్న తులం ధర ప్రస్తుతం మూడింతలు పెరిగి రూ.40 వేలకు చేరువైంది. 2009లో రూ.14 వేలు దాటిని గోల్డ్..ఆ తర్వాతి క్రమంలో భారీగా ఎగబాకింది. 2011లో రూ.26 వేలు దాటిన గోల్డ్..2014-15లో మాత్రం 26 వేలకు పడిపోంది.

| సంవత్సరం | ధర(రూపాయల్లో) |
|---|---|
| 2009 | 14,500 |
| 2010 | 15,500 |
| 2011 | 26,400 |
| 2012 | 32,000 |
| 2013 | 29,000 |
| 2014 | 26,800 |
| 2015 | 26,200 |
| 2016 | 30,500 |
| 2017 | 30,240 |
| 2018 | 31,710 |
| 2019 | 39,670* |



హైదరాబాద్‌లో జరిగిన ఏఐఎస్, సీసీఎస్ ఆఫీసర్ల సమావేశంలో బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న సీఈఏ కృష్ణమూర్తి తదితరులు

# మనపై ఎలాంటి ప్రభావం లేదు

**అమెరికా-చైనా ట్రేడ్‌వార్‌పై సీఈఏ కృష్ణమూర్తి**

**హైదరాబాద్, ఆగస్టు 26:**

అమెరికా-చైనా దేశాల మధ్య నెలకొన్న వాణిజ్య యుద్ధ పరిస్థితులు భారత్‌పై ఎలాంటి ప్రభావం చూపబోవని ప్రధాన ఆర్థిక సలహాదారు కృష్ణమూర్తి సుబ్రమణియన్ తెలిపారు. అంతర్జాతీయ వాణిజ్యంలో భారత్ ఎగుమతుల వాటా కేవలం రెండు శాతం మాత్రమేనని, ఈ రెండు అగ్రదేశాల మధ్య వాణిజ్య యుద్ధం ముదిరి పాకాన చేరిందని, ఈ ప్రభావం పొరుగు దేశమైన భారత్‌పై ఎలాంటి ప్రభావం చూపబోదని హైదరాబాద్‌లో జరిగిన ఏఐఎస్, సీసీఎస్ ఆఫీసర్ల 94వ ఫౌండేషన్ డే సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మందకొడిగా కొనసాగుతున్న ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి కేంద్ర ప్రభుత్వం సరైన దిశలో చర్యలు తీసుకుంటున్నదని, తప్పని పరిస్థితుల్లో గతంలో సంస్థాగత సంస్కరణలపై ప్రత్యేక దృష్టి సారించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు. ప్రపంచ దేశాల ఎగుమతుల్లో భారత్ వాటా చాలా స్వల్పంకావడంతో దీంట్లో అవకాశాలను అందిపుచ్చుకోవడానికి ప్రయత్నిస్తున్నట్లు, గ్లోబల్‌గా ఎగుమతులు నీరసించినప్పటికీ ఇదే సమయంలో భారత్ పుంజుకోవడం విశేషమన్నారు. పడిపోతున్న ఆర్థిక వ్యవస్థను తిరిగి పుంజుకునే చర్యల్లో భాగంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్..గత వారంలో విదేశీ, దేశీయ ఈక్విటీ పెట్టుబడిదారులపై విధించిన సంపన్న వర్గాల పన్నును ఎత్తివేయగా, స్టార్టప్‌లకు యాంజిల్ ట్యాక్స్‌కు మినహాయింపు, ఆటోమొబైల్ రంగానికి ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ కీలక నిర్ణయాలు దేశ ఆర్థిక వ్యవస్థ సరైన దిశలో ప్రయాణించడానికి దోహదం చేయనున్నాయన్నారు. వృద్ధికి పెట్టుబడులే కీలకమని వ్యాఖ్యానించిన కృష్ణమూర్తి..వినిమయం కూడా చేదోడువాదోడుగా ఉంటుందన్నారు. ప్రభుత్వరంగ బ్యాంకులను ఆర్థికంగా బలోపేతం చేయడానికి కేంద్ర ప్రభుత్వం కేటాయించిన రూ.70 వేల కోట్లపై ఆయన స్పందిస్తూ.. బ్యాంకులను పునర్వ్యవస్థీకరించాలనే ఉద్దేశంతో ఈ నిధులను కేటాయించినట్లు, దీంతో మార్కెట్లో నిధుల లభ్యత పెరిగి ఆర్థిక రంగానికి ఊతమివ్వనున్నదని పేర్కొన్నారు.

# నకిలీ కంపెనీల మాయాజాలం

- రూ.20 కోట్ల పన్ను ఎగవేత
- ఘజియాబాద్ వ్యాపారి మోసం
- అరెస్ట్ చేసిన రాష్ట్ర అధికారులు

**ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ:**

ఒకే వ్యక్తి వేర్వేరు పేర్లతో 21 బోగస్ కంపెనీలను సృష్టించి కోట్ల రూపాయల వస్తు, సేవల పన్ను (జీఎస్టీ)ను ఎగవేశాడు. ఒక్క పైసా పన్ను కట్టకుండా తెలివిగా జీఎస్టీ చట్టం ప్రకారం ఇన్‌పుట్ ట్యాక్స్ రాయితీని పొందాడు. ఉత్తర ప్రదేశ్‌కు చెందిన ఘజియాబాద్ వ్యాపారి చేసిన ఈ ఘరానా మోసాన్ని తెలంగాణ వాణిజ్య పన్నుల శాఖ అధికారులు వెలుగులోకి తెచ్చారు. ఆపై జీఎస్టీ చట్టం కింద అరెస్ట్ చేసి కటాకటాల్లోకి నెట్టారు. ఘజియాబాద్ వ్యాపారి కౌశిక్ శక్తి బాబూరామ్ పథకం ప్రకారం వివిధ పేర్లపైన దేశవ్యాప్తంగా 21 కంపెనీలను సృష్టించాడు. అందులో నాలుగు కంపెనీలు తెలంగాణలో నమోదైయ్యాయి. ఒక కంపెనీ నుంచి మరో కంపెనీ వస్తువులను కొనుగోలు చేసినట్లు లెక్కలు చూపుతూ జీఎస్టీ ఎగవేతలకు పాల్పడటమేగాక, ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌నూ జేబులో వేసుకుంటున్నాడు. ఉత్తర ప్రదేశ్‌లోని కంపెనీ ఢిల్లీలో, ఢిల్లీలోని కంపెనీ ముంబైలో కొనుగోళ్లు జరిపినట్లు.. అక్కడి వస్తువులను ఇంకో కంపెనీకి సరఫరా చేసినట్లు మాయ చేశాడు. ఒక్క దగ్గర కూడా జీఎస్టీ చెల్లించకపోగా, ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ను తీసుకుని లాభాలను గడించాడు. అయితే దీనిపై అనుమానం వచ్చి నిఘా వేసిన తెలంగాణ జీఎస్టీ అధికారులు.. తీగ లాగితే డొంకంతా కదిలింది. రాష్ట్ర వాణిజ్య పన్నులు, జీఎస్టీ స్పెషల్ కమిషనర్ ఎమ్ సత్యనారాయణ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ డాక్టర్ ఆర్ ఏడుకొండలు ఆధ్వర్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం ఈ బండారాన్ని బయటపెట్టింది. బాబూరామ్ శక్తి తన భార్య పేరిట హైదరాబాద్‌లో కంపెనీలను రిజిస్ట్రేషన్ చేయించినట్లు గుర్తించారు. హైదరాబాద్ నుంచి ఇతర రాష్ట్రాలలోని కంపెనీలకు ఇనుప తుక్కు పంపి ఇతర రాష్ట్రాల నుంచి హైదరాబాద్‌కు దాదాపు వంద రకాల వస్తువులను రవాణా చేసినట్లు అధికారులు తమ విచారణలో కనుగొన్నారు. వాటి విలువ మొత్తంగా రూ.71 కోట్లకుపైగా ఉంటుందని అంచనా. తెలివిగా ఇన్‌పుట్ ట్యాక్స్ సబ్సిడీని తీసుకున్న ఆయన ఇప్పటి వరకు దాదాపు రూ.20.08 కోట్ల పన్నును ఎగవేసినట్లు వెల్లడైంది. దీంతో తెలంగాణ జీఎస్టీ చట్టం 132 సెక్షన్ కింద అరెస్ట్ చేసి జైలుకు తరలించారు.




**మోసం చేస్తే జైలుకే..**

జీఎస్టీ ఎగవేసినా.. అడ్డదారిలో ఇన్‌పుట్ ట్యాక్స్ సబ్సిడీని పొందినా.. వ్యాపారులపై కఠిన చర్యలు తప్పవని రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ వి అనిల్ కుమార్ హెచ్చరించారు. జీఎస్టీ చట్టం ప్రకారం కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని స్పష్టం చేశారు. కాగా, తాజా మోసం నేపథ్యంలో జీఎస్టీ మోసాగాళ్లపై ప్రత్యేక నిఘా వేయాలని ఆయన అధికారులను ఆదేశించారు.

### జీఎస్టీ వార్షిక రిటర్నుల గడువు పెంపు

**న్యూఢిల్లీ, ఆగస్టు 26:** జీఎస్టీ వార్షిక రిటర్నుల గడువును మరో మూడు నెలల పాటు పెంచుతూ కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ నిర్ణయం తీసుకున్నది. పన్ను చెల్లింపులు జరిపేటప్పుడు ఎదురవుతున్న టెక్నికల్ సమస్యలను ఎదుర్కొంటున్న పన్ను చెల్లింపుదారులు ఇక నవంబర్ 30 వరకు ఎప్పుడైనా వార్షిక రిటర్నులు చేయవచ్చును. ప్రస్తుతం ఇది ఈ నెల 31లోగా రిటర్ను దాఖలు చేయాల్సి ఉంది. 2017-18 ఆర్థిక సంవత్సరానికిగాను వార్షిక రిటర్నులకోసం ఫామ్ జీఎస్టీఆర్-9/జీఎస్టీఆర్-9ఏను ఆగస్టు 31లోగా దాఖలు చేసుకోవాలి. రిజిస్టార్ అయిన సంస్థలు లేదా పన్ను చెల్లింపుదారులు రూ.2 కోట్ల కంటే అధిక వార్షిక ఆదాయం కలిగివున్నవారు జీఎస్టీఆర్-9 ద్వారా తమ రిటర్నులను దాఖలు చేయాల్సి ఉంటుంది.




# జీడీపీ 6 శాతమే

**ఫిక్కీ సర్వేలో అంచనా**

**న్యూఢిల్లీ, ఆగస్టు 26:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో భారత వృద్ధి 6 శాతానికి పరిమితంకానున్నదని ఫిక్కీ నిర్వహించిన సర్వేలో వెల్లడైంది. అంతక్రితం ఏడాది ఇదే కాలానికి 8.2 శాతంగా నమోదైంది. ఈ వృద్ధి గణాంకాలు వచ్చేవారం కేంద్ర గణాంకాల శాఖ విడుదల చేసే అవకాశాలున్నాయి. నిరుద్యోగంపై ఇటీవల ఎన్ఎస్ఎస్‌వో విడుదల చేసిన గణాంకాలు ఈ పరిస్థితికి అద్దం పడుతున్నాయని, ముఖ్యంగా భారత్‌లో నిరుద్యోగ చాయలు పెరుగుతున్నాయని ఫిక్కీ ఎకానమి అవుట్‌లుక్ సర్వేలో వెల్లడించింది. ఈ ఏడాది మొత్తానికి జీడీపీ 6.9 శాతంగా ఉంటుందని అంచనావేసిన సర్వే...కనీసంగా 6.7 శాతంగాను, గరిష్ఠంగా 7.2 శాతం మించే అవకాశాలు లేవని సర్వేలో పాల్గొన్న వారిలో అత్యధికమంది ఈ విషయాన్ని తెలిపారు. ఏడాది మూడుసార్లు వడ్డీరేట్లను తగ్గించిన రిజర్వు బ్యాంక్..మిగతా ఆర్థిక సంవత్సరానికిగాను రెపో రేట్లను మరింత తగ్గే అవకాశం ఉన్నదని ఈ సర్వేలో పాల్గొన్న ఆర్థికవేత్తలు అభిప్రాయపడ్డారు. గరిష్ఠ స్థాయిలో వడ్డీరేట్లు ఉండటంతో రుణాలు తీసుకోవడానికి ప్రజలు పెద్దగా ఆసక్తి చూపలేదని, ఈ ఏడాది ప్రారంభం నుంచి పలుమార్లు తగ్గించడంతో ఇటీవల పెరిగాయన్నారు. ఉద్యోగ కల్పన ఊపందుకోవడం, సులభతరమైన వాణిజ్య పరిస్థితులు ఏర్పడటం, సంస్కరణలు కొనసాగడం, ముఖ్యంగా కార్మికుల విభాగాలు, ప్రత్యేక రంగాలకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటిస్తే తప్పా వృద్ధి పెరిగే అవకాశాలు లేవని స్పష్టం చేసింది. వీటితోపాటు వ్యవసాయం, చిన్న-మధ్యతరహా పరిశ్రమల రంగాల బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. జూన్-జూలై మధ్యకాలంలో దేశవ్యాప్తంగా ఈ సర్వేను నిర్వహించింది. ఈ సర్వేలో పారిశ్రామిక వర్గాలు, బ్యాంకింగ్, ఆర్థిక సేవల విభాగాలకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు. 2019-20లో వ్యవసాయ రంగ వృద్ధి 2.2 శాతానికి పరిమితం కానున్నదని వెల్లడించిన ఆర్థికవేత్తలు...పారిశ్రామిక రంగం మాత్రం 6.9 శాతానికి, సేవల రంగం 8 శాతంగా నమోదవనున్నదని తెలిపారు. కాగా, ద్రవ్యోల్బణం మరింత తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయని తెలిపింది. ఈ ఏడాదిలో స్వల్పకాలం పాటు టోకు ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణం 2.9 శాతంగా అంచనావేసిన ఫిక్కీ నివేదిక..కనిష్ఠంగా 2.1 శాతం, గరిష్ఠంగా 5.7 శాతం మించే అవకాశాలు లేవని పేర్కొంది.

# టీవీ 9 సీఈవోగా బరూన్ దాస్



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రముఖ మీడియా సంస్థ టీవీ 9 చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్(సీఈవో)గా బరూన్ దాస్ నియమితులయ్యారు. ఇప్పటి వరకూ మధ్యంతర సీఈవోగా విధులు నిర్వర్తించిన మహేంద్ర మిశ్రా ఇక నుంచి టీవీ 9 బోర్డుకు ప్రధాన సలహాదారుగా వ్యవహరించనున్నారు. దక్షిణ, పశ్చిమ భారత్‌లలో అగ్రస్థానానికి చేరుకున్న టీవీ9.. ఇటీవల 'భారత్‌వర్ష్' అనే జాతీయ హిందీ న్యూస్ ఛానెల్‌ను ప్రారంభించింది. జీ మీడియా సీఈవోగా గత ఐదేండ్లుగా పని చేసిన బరూన్ దాస్.. మద్రాస్ ఐఐటీ, కోల్‌కతా ఐఐఎం, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ పూర్వ విద్యార్థి. ఏబీపీ న్యూస్, ఇండియా టుడే గ్రూప్, ఆస్ట్రో అల్ ఆసియా నెట్‌వర్క్ కౌలలాంపూర్, ఏబీపీ గ్రూప్ వంటి వాటిల్లో వివిధ హోదాల్లో పని చేశారు. ఈ సందర్భంగా బరూన్ దాస్ మాట్లాడుతూ.. టీవీ 9 గ్రూప్ బాధ్యతలను అందుకున్నందుకు ఆనందంగా ఉందన్నారు. ఈ ఛానెల్‌ను జాతీయ స్థాయిలో విస్తరించడానికి తనవంతుగా కృషి చేస్తానని అన్నారు. సంస్థ హోల్‌టైమ్ డైరెక్టర్ సింగారావు మాట్లాడుతూ.. జర్నలిజం విలువలను పెంపొందించే బాధ్యతకు తమ సంస్థ కట్టుబడి ఉందని, దేశంలోని ఇతర ప్రాంతాల్లో అగ్రస్థానం చేరుకునే దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలిపారు. ప్రధాన సలహాదారు మహేంద్ర మిశ్రా మాట్లాడుతూ.. టీవీ 9 గ్రూపును జాతీయ స్థాయిలోకి తీసుకెళ్లడంలో భాగమైనందుకు సంతోషంగా ఉందన్నారు. బరూన్ నాయకత్వంలో సంస్థ ఉన్నత శిఖరాలను అధిరోహిస్తుందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

## పచ్చని పైటేసిన భువనగిరి



పచ్చని పంటలతో భువనగిరికి సరికొత్త కళ వచ్చింది. గతంలో ఏనాడూ లేనంతగా పచ్చదనం పరుచుకున్నది. ఖిల్లాకు వచ్చే సందర్శకుల సంఖ్య పెరిగిన తీరుగానే పచ్చదనం కూడా ఇనుమడించింది. దాంతో పర్యాటకులను.. ఇటు యాదాద్రికి వచ్చే భక్తులను.. వరంగల్ - హైదరాబాద్ జాతీయ రహదారిపై వెళ్లే ప్రయాణికులను ఆకట్టుకొంటున్నది.

-ఫొటో: గుజ్జ నరేశ్, నమస్తే తెలంగాణ స్టాఫ్ ఫొటోగ్రాఫర్, యాదాద్రి భువనగిరి జిల్లా



జస్టిస్ లక్ష్మణ్‌ను అభినందిస్తున్న రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ రాజేశంగౌడ్, పాతూరి సుధాకర్‌రెడ్డి, బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు తదితరులు

## జస్టిస్ లక్ష్మణ్‌కు పలువురి అభినందనలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** హైకోర్టు న్యాయమూర్తిగా ప్రమాణం చేసిన జస్టిస్ లక్ష్మణ్‌ను రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ రాజేశం గౌడ్, మాజీ చీఫ్ విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా జడ్జి నవమోహన్‌రావు, చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణగౌడ్, నాగేశ్వర్‌రావుగౌడ్, న్యాయవాది అమర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు. బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు, సభ్యుడు కృష్ణమోహన్‌రావు జస్టిస్ లక్ష్మణ్‌ను కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా బీసీ కమిషన్ ఆధ్వర్యంలో తెలుగులోకి అనువదించిన వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రామాణిక నివేదికల ప్రతులను ఈ సందర్భంగా జస్టిస్ లక్ష్మణ్‌కు అందజేశారు.

## ఏసీబీ కోర్టుకు హాజరైన గాలి జనార్దన్‌రెడ్డి

బెయిల్ కుంభకోణంపై విచారణ సెప్టెంబర్ 12కు వాయిదా

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం సృష్టించిన బెయిల్ కుంభకోణంలో ప్రధాన నిందితుడిగా ఉన్న గాలి జనార్దన్‌రెడ్డి, ఇతర నిందితులు సోమవారం హైదరాబాద్‌లోని ఏసీబీ కోర్టు విచారణకు హాజరయ్యారు. అప్పటి జడ్జి నాగమారుతిశర్మ ఈ కేసులో నాలుగో సాక్షిగా విచారణకు హాజరయ్యారు. ఆయన వాంగ్మూలాన్ని నమోదుచేసిన ఏసీబీ కోర్టు.. తదుపరి విచారణను వచ్చేనెల 12కు వాయిదావేసింది. ఈ కేసు విచారణ 2012 నుంచి కొనసాగుతున్న విషయం తెలిసిందే.





యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్ విధానంలో భౌతికశాస్త్రం పాఠాలు నేర్చుకొంటున్న టెమ్రిస్ విద్యార్థులు

## ఆలోచనలో మార్పునకు 'యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్'

టెమ్రిస్ కార్యదర్శి బీ షఫీఉల్లా వెల్లడి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మైనార్టీ గురుకులాల్లో చదువుతున్న విద్యార్థుల ఆలోచనా ధోరణిని మార్చే లక్ష్యంగా టెమ్రీస్‌లో 'యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్' కార్యక్రమాన్ని అమలుచేసున్నట్టు టెమ్రిస్ కార్యదర్శి బీ షఫీఉల్లా సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఇందులో భాగంగా సిద్ధాంతపరమైన బోధనతోపాటు ప్రయోగాత్మక విద్యాబోధనను అవలంబిస్తున్నట్టు పేర్కొన్నారు. బోధనలో మార్పు తెచ్చేందుకే యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్ ప్రవేశపెట్టామని తెలిపారు. ఇప్పటివరకు మార్కులు, ర్యాంకుల కోసమే విద్యార్థులు పోటీపడుతున్నారని, ఈ పద్ధతి మారాల్సిన అవసరమున్నదని సూచించారు. విద్యార్థుల్లో విషయ పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు 'యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్' దోహదం చేస్తుందని పేర్కొన్నారు. దీని కోసం నాణ్యమైన బోధనా సామగ్రి, పుస్తకాలు అందుబాటులోకి తెచ్చినట్టు తెలిపారు. యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్‌లో భాగంగా ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, ఆస్ట్రానమీ, ఆర్ట్‌అండ్‌క్రాఫ్ట్, సైన్స్, జాగ్రఫీ వంటి సబ్జెక్టుల్లో ప్రయోగాత్మక బోధన చేపడుతున్నట్టు షఫీఉల్లా వెల్లడించారు.



బార్ కౌన్సిల్ సభ్యుడు గండ్ర మోహన్‌రావు నుంచి టీఆర్‌ఎస్ సభ్యత్వం తీసుకొంటున్న న్యాయవాదులు

## టీఆర్‌ఎస్ సభ్యత్వం తీసుకొన్న న్యాయవాదులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** హైకోర్టులో పలువురు న్యాయవాదులు టీఆర్‌ఎస్ పార్టీ సభ్యత్వాలను స్వీకరించారు. బార్ కౌన్సిల్ సభ్యుడు గండ్ర మోహన్‌రావు ఆధ్వర్యంలో సోమవారం సభ్యత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బార్ కౌన్సిల్ సభ్యుడు ముఖీద్‌తోపాటు పలువురు న్యాయవాదులు టీఆర్‌ఎస్ పార్టీ సభ్యత్వం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు కల్యాణ్‌రావు, పురంధర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రావు, సాయిచక్రవర్తి, మాధవరావు, రాము తదితరులు పాల్గొన్నారు.

## టీటఫ్ ప్రతినిధులతో కార్మికశాఖ భేటీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ ఎలక్ట్రిసిటీ ట్రేడ్ యూనియన్స్ ఫ్రంట్ (టీటఫ్) ప్రతినిధులతో కార్మికశాఖ అధికారులు సమావేశమయ్యారు. సోమవారం టీటఫ్ కార్యాలయంలో నిర్వహించిన ఈ సమావేశంలో ఉద్యోగులు, కార్మికులకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ఆర్టిజన్ పేరుతో విధులు నిర్వహిస్తున్న 23 వేల మందికిపైగా ఉద్యోగులకు సంబంధించిన విధివిధానాలను తక్షణం ఏర్పాటుచేయాలని ఫ్రంట్ ప్రతినిధులు కోరారు. ప్రస్తుతం విద్యుత్‌రంగంలోని ఉద్యోగులకు జెన్కో, ట్రాన్స్‌కో, డిస్కమ్స్‌లలో ఉన్న సర్వీసు నిబంధనలను ఆర్టిజన్ కార్మికులకు కూడా వర్తింపజేయాలని, క్యాడర్‌కు ఒకే విధమైన వేతనాలు అందజేయాలని విన్నవించారు. విద్యుత్‌రంగ ఆర్టిజన్ కార్మిక సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో టీటఫ్ చైర్మన్ జీ సాయిబాబు, కన్వీనర్ ఈ శ్రీధర్, కో చైర్మన్ ఎంఏ వజీర్, వీ కుమారాచారి, ఎస్ శ్రీధర్‌గౌడ్, వైస్ చైర్మన్లు ఎస్ ప్రభాకర్, ఎస్ సుధీర్, ఎంఏ మజీద్, సీహెచ్ శంకర్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.



హైదరాబాద్‌లోని ఎన్‌ఐఆర్డీపీఆర్‌లో నిర్వహించిన మొబైల్ ఫిల్మ్‌మేకింగ్ వర్క్‌షాపులో మాట్లాడుతున్న నిపుణురాలు రాధికా రస్తోగి. చిత్రంలో డబ్ల్యూఆర్ రెడ్డి కూడా ఉన్నారు.

## ఫిల్మ్ మేకింగ్ ఒక అద్భుతమైన కళ

ఎన్‌ఐఆర్‌డీపీఆర్ డీజీ డబ్ల్యూఆర్ రెడ్డి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఫిల్మ్‌మేకింగ్ ఒక అద్భుతమైన కళ అని, బయోగ్రఫీలు చూడటం వల్ల జీవితంలో స్ఫూర్తిని పొందవచ్చని ఎన్‌ఐఆర్డీపీఆర్ డైరెక్టర్ జనరల్ డబ్ల్యూఆర్ రెడ్డి పేర్కొన్నారు. విజ్ఞాన్ ప్రసార్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఎన్‌ఐఆర్డీపీఆర్‌లో మూడ్రోజులపాటు మొబైల్ ఫిల్మ్ మేకింగ్ మీద నిర్వహిస్తున్న వర్క్‌షాప్ సోమవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో డబ్ల్యూఆర్ రెడ్డి మాట్లాడుతూ.. దేశంలో 560 మిలియన్ల ప్రజలు ఇంటర్‌నెట్‌ను వినియోగిస్తున్నారని చెప్పారు. గ్రామాల్లోనూ ఇంటర్నెట్ అందుబాటులోకి వచ్చిందని చెప్పారు. ఫిల్మ్ మేకింగ్‌లో కెమెరాషాట్స్, స్టోరీ, స్క్రిప్ట్ రైటింగ్, వీడియోగ్రఫీ, కెమెరాయాప్స్, ఎడిటింగ్ యాప్స్, వీడియో ప్రొడక్షన్, లైటింగ్, ఫిల్మ్ ఎడిటింగ్ తదితర అంశాలపై నిష్ణాతులు అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు.

# గ్రీన్ చాలెంజ్‌కు అనూహ్య స్పందన

ఎంపీ సంతోష్‌కుమార్ సవాల్‌ను స్వీకరించిన మాజీ ఎంపీ కవిత, మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి



గ్రీన్ ఇండియా చాలెంజ్‌లో భాగంగా ఎంపీ సంతోష్‌కుమార్ ఇచ్చిన చాలెంజ్‌ను స్వీకరించి తన నివాసంలో మొక్క నాటుతున్న మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత



హైదరాబాద్‌లోని మంత్రుల క్వార్టర్స్‌లో కుటుంబసభ్యులతో కలిసి మొక్క నాటుతున్న మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**




రాజ్యసభ సభ్యుడు సంతోష్‌కుమార్ ఇచ్చిన గ్రీన్ చాలెంజ్ పిలుపునకు అన్నివర్గాల నుంచి అనూహ్య స్పందన లభిస్తున్నది. గ్రీన్ చాలెంజ్‌లో భాగంగా మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత హైదరాబాద్‌లోని తన నివాసంలో సోమవారం మొక్కలు నాటారు. ఎంపీ సంతోష్‌కుమార్ విసిరిన గ్రీన్ చాలెంజ్‌ను స్వీకరించిన ఆమె.. మూడు మొక్కలు నాటి హరితస్ఫూర్తి చాటారు. ఈ కార్యక్రమంలో ఇగ్నైటింగ్ మైండ్స్ సంస్థ ప్రతినిధి రాఘవ తదితరులు పాల్గొన్నారు. రోడ్లు, భవనాలశాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి సైతం సంతోష్‌కుమార్ గ్రీన్ చాలెంజ్‌ను స్వీకరించారు. మినిస్టర్ క్వార్టర్స్‌లో కుటుంబసభ్యులతో కలిసి ఆయన మొక్కలు నాటారు. అనంతరం నిజామాబాద్ జిల్లా ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, జీవన్‌రెడ్డి, షకీల్ అహ్మద్, గణేశ్‌గుప్తాను నామినేట్ చేశారు. ఎంపీ గ్రీన్ చాలెంజ్‌కు తెలంగాణ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ మందుల సామ్యూల్ స్పందించి తుంగతుర్తి నియోజకవర్గంలోని తన సొంతూరు ధర్మారంలో మొక్కలు నాటగా, ఆంధ్రప్రభ ఎండీ ముత్తా గౌతమ్ రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలంలో పెద్దఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో చొప్పదండి ఎమ్మెల్యే రవిశంకర్, జోగినపల్లి రవీందర్‌రావు, ముత్తాగౌతమ్ కుటుంబసభ్యులు తదితరులు పాల్గొన్నారు.



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలంలోని శ్రీరాజరాజేశ్వర జలాశయం సమీపంలో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, జోగినపల్లి రవీందర్‌రావు తదితరులు

# జీడీపీపై రోడ్డు ప్రమాదాల ప్రభావం

- లైసెన్సుల జారీలో జాగ్రత్తలు అవసరం
- రోడ్డు భద్రతపై సదస్సులో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి



సోమవారం విశ్వేశ్వరయ్య భవన్‌లో రోడ్డు భద్రతపై జరిగిన సదస్సును ప్రారంభిస్తున్న మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి. చిత్రంలో రవాణాశాఖ ముఖ్య కార్యదర్శి సునీల్‌శర్మ, విద్యాశాఖ కార్యదర్శి జనార్దన్‌రెడ్డి, తదితరులు కూడా ఉన్నారు.

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రోడ్డు ప్రమాదాలు ఇప్పుడు అత్యంత ప్రమాదకరంగా మారాయని, దేశ ఆర్థిక వ్యవస్థపై కూడా ప్రభావం చూపుతున్నాయని రవాణాశాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. రోడ్డు ప్రమాదాలతో ఆర్థికవ్యవస్థలో ప్రతి ఏటా 3 శాతం జీడీపీ తగ్గుతున్నదని ఆర్థిక నిపుణులు తేల్చారని పేర్కొన్నారు. సోమవారం ఖైరతాబాద్‌లోని ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్‌భవన్‌లో 'రోడ్ సేఫ్టీ ఆడిట్ ఫర్ ఇంప్రూవ్‌మెంట్ ట్రాఫిక్ సేఫ్టీ'పై ఒక రోజు సదస్సు జరిగింది. దీనికి ప్రశాంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. రహదారి భద్రతపై అవగాహన కోసం రాష్ట్రమంతా ఇలాంటి సదస్సులు ఏర్పాటుచేయాల్సిన అవసరమున్నదని చెప్పారు. ప్రమాదాల్లో కుటుంబ పెద్దను కోల్పోతుండటంతో ఆర్థిక పరిస్థితులు మారుతున్నాయన్నారు. వాహనదారుల అజాగ్రత్త, భద్రతను పట్టించుకోక ప్రమాదాలు జరుగుతున్నాయని, కొన్నిచోట్ల రోడ్లు సరిగా లేకపోవడం, సరైన డిజైన్‌తో వేయకపోవడం కూడా ప్రమాదాలకు కారణంగా మారుతున్నాయని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా రోడ్డు సేఫ్టీపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్తృతమైన అధ్యయనం చేస్తున్నాయని వివరించారు.

### అవగాహనతో ప్రమాదాల నియంత్రణ

ప్రమాదాలను నియంత్రించేందుకు కళాశాలల్లో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలని, పాఠశాల విద్యలో రోడ్ సేఫ్టీపై అవగాహనను సిలబస్‌గా పెట్టాలని, సోషల్ మీడియాలోనూ అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అధికారులకు మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి సూచించారు. ప్రమాదకరమైన ప్రాంతాలను గుర్తించి జాగ్రత్తలు తీసుకోవాలని, దీనిపై ఆర్‌అండ్‌బీ అధికారులు దృష్టిపెట్టాలని చెప్పారు. జాతీయ రహదారుల వెంట అంబులెన్స్‌లను ఎక్కువగా కేటాయించాలని, రహదారి దవాఖానలు కూడా ఏర్పాటుచేస్తే ప్రమాదాల తీవ్రతను తగ్గించవచ్చని పేర్కొన్నారు. లైసెన్సులను జారీ చేసే సమయంలోనే కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే రోడ్డు ప్రమాదాలకు చెక్ పెట్టవచ్చని చెప్పారు. అవినీతి, అలసత్వానికి తావులేకుండా మోటరు వెహికిల్ చట్టాన్ని పకడ్బందీగా అమలుచేయాలని, వాహనాల ఫిట్‌నెస్ టెస్టింగ్‌లో నిర్లక్ష్యంగా ఉండరాదని ఆదేశించారు. ఆర్‌అండ్‌బీ, రవాణా, పోలీస్, విద్య, వైద్యశాఖల అధికారులు కలిసి సమన్వయంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## డీటీసీపీ భవనంలోకి మున్సిపల్ శాఖ!

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పురపాలకశాఖ కార్యాలయాన్ని మూడు రోజుల్లోగా డీటీసీపీ భవనంలోకి మార్చనున్నట్టు తెలిసింది. పురపాలకశాఖకు చెందిన ఉన్నతాధికారులు, సిబ్బంది సోమవారం ఏసీ గార్డ్స్‌లోని డీటీసీపీ బిల్డింగ్‌ను సందర్శించారు. ఈ భవనం కొత్తది కావడం పైగా విశాలంగా ఉండటంతో.. పురపాలకశాఖ కార్యాలయానికి సరిపోతుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. డీటీసీపీ భవనం పక్కనే ఉన్న సీడీఎంఏ లేదా ప్రజారోగ్య కార్యాలయంలో ఒకట్రెండు విభాగాలను సర్దుబాటుచేసే వీలున్నది. ఈ విషయాన్ని పరిశీలించిన తర్వాతే పురపాలకశాఖను డీటీసీపీ భవనంలోకి మార్చేందుకు నిర్ణయం తీసుకొన్నట్టు తెలిసింది. ఇప్పటికే సచివాలయంలోని వివిధ కార్యాలయాలు బీఆర్కే భవన్‌లోకి మారుతున్న విషయం తెలిసిందే.

# నన్ను హైదరాబాద్‌కు తీసుకెళ్లండి

ఐసిస్‌లో చేరి సిరియాలో మృతిచెందిన వ్యక్తి భార్య వేడుకోలు

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** ఐసిస్‌లో చేరి సిరియాలో వైమానిక దాడిలో మృతిచెందిన వ్యక్తి భార్య.. పిల్లలతోపాటు తనను హైదరాబాద్‌కు తీసుకెళ్లాలని వేడుకుంటున్నారు. టోలిచౌకిలోని కుటుంబసభ్యులకు ఇటీవల ఫోన్ చేసి విజ్ఞప్తిచేశారు. హైదరాబాద్ టోలిచౌక్ ప్రాంతానికి చెందిన కుటుంబం 20 ఏండ్లుగా సౌదీలో నివాసమున్నది. ఇంజినీరింగ్ చదివిన వీరి కుమారుడు హైదరాబాద్‌కు చెందిన యువతిని పెండ్లి చేసుకోగా, వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ప్రపంచ పర్యటనకు వెళుతున్నట్టు చెప్పి.. పిల్లలను తీసుకొని దుబాయ్, టర్కీ మీదుగా సిరియా వెళ్లారు. కొన్నాళ్లకు తాను ఐసిస్‌లో చేరానని యువకుడు ఈమెయిల్ ద్వారా బంధువులకు సమాచారం ఇవ్వడంతో విషయం వెలుగులోకి వచ్చింది. రెండునెలల కిందట టోలిచౌక్‌లోని కుటుంబసభ్యులకు ఆ యువకుడి భార్య ఫోన్ చేశారు. 'గత ఏడాది నా భర్త వైమానిక దాడుల్లో మృతిచెందాడు. నలుగురు పిల్లలతో నేను పునరావాస శిబిరంలో తలదాచుకొంటున్నాను. మమ్మల్ని హైదరాబాద్‌కు తీసుకెళ్లండి' అని వేడుకున్నారు. తాజా ఘటనపై నిఘావర్గాలు సమాచారం సేకరిస్తున్నట్టు తెలిసింది.

# పట్టణాలను పరిశుభ్రంగా ఉంచండి

- ప్రజలు ఆనారోగ్యానికి గురికాకుండా జాగ్రత్తలు తీసుకోండి
- మున్సిపల్ కమిషనర్లకు సీడీఎంఏ టీకే శ్రీదేవి ఆదేశం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పట్టణాల్లో రహదారులకు ఇరువైపులా ఉండే ఖాళీస్థలాలు, కాలిబాటలను పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ కమిషనర్లకు రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టరేట్ (సీడీఎంఏ) కమిషనర్ డాక్టర్ టీకే శ్రీదేవి ఆదేశాలు జారీచేశారు. ఎప్పటికప్పుడు చెత్తకుప్పలను తొలగించి పరిశుభ్రత పాటించాలని సూచించారు. ప్రతి పట్టణాన్ని సుందరంగా ముస్తాబు చేయాలని, పట్టణాల్లో మౌలిక సదుపాయాల్ని మెరుగుపర్చాలని ఇటీవల జరిగిన కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఆదేశించారు. దీంతో రంగంలోకి దిగిన సీడీఎంఏ కమిషనర్ శ్రీదేవి.. రోడ్లకిరువైపులా శిథిలాలు, చెత్త, కలుపుమొక్కలు పేరుకుపోయి ప్రజలు అనారోగ్యం బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్లకు సూచించారు. శుభ్రం చేయడానికి ముందు, శుభ్రం చేసిన తర్వాత ఆయా పట్టణాల్లోని వీధుల ఫొటోలు పంపాలని, పురపాలక విభాగం రీజినల్ డైరెక్టర్ ఎప్పటికప్పుడు పరిశుభ్రత సమాచారాన్ని తెప్పించుకోవాలని ఆదేశించారు. హైదరాబాద్, వరంగల్ రీజినల్ డైరెక్టర్లు క్రమం తప్పకుండా వివిధ వార్డుల్లో సందర్శించాలని, పట్టణాల్ని పరిశుభ్రం చేస్తున్న విధానంపై కమిషనర్లు నివేదికలు తెప్పించుకొని.. ప్రతినిత్యం సాయంత్రం ఐదు గంటల్లోపు పురపాలనశాఖకు పంపాలని పేర్కొన్నారు.

## రాష్ట్రానికి ఎక్కువ నిధులు వచ్చేలా కృషిచేయాలి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** నేషనల్ లేబర్ కోఆపరేటివ్ బోర్డు నుంచి రాష్ట్రానికి ఎక్కువ నిధులు తీసుకొచ్చే విధంగా కృషిచేయాలని వ్యవసాయ శాఖమంత్రి నిరంజన్‌రెడ్డి.. బోర్డు డైరెక్టర్ దండుగల రాజ్యలక్ష్మికి సూచించారు. సోమవారం సచివాలయంలో మంత్రిని ఆమె మర్యాదపూర్వకంగా కలిశారు. సెప్టెంబర్ 3న ఢిల్లీలో నేషనల్ లేబర్ కోఆపరేటివ్ బోర్డు సమావేశం ఉన్నదని ఈ సందర్భంగా వివరించారు. నిధుల విడుదలకు సంబంధించి కేంద్రానికి నివేదిక పంపేలా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని మంత్రిని కోరారు.

## హైకోర్టులో మెగా హెల్త్‌క్యాంప్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** యశోద దవాఖాన ఆధ్వర్యంలో న్యాయవాదుల కోసం సోమవారం హైకోర్టు ఆవరణలో మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆర్‌ఎస్ చౌహాన్ క్యాంప్‌ను ప్రారంభించారు.

## నేటి నుంచి టీఆర్టీ వినికిడి లోపం అభ్యర్థులకు వైద్యపరీక్షలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** టీఆర్టీ నియామకాల్లో భాగంగా వినికిడి లోపం ఉన్న అభ్యర్థులకు వైద్యపరీక్షలు నిర్వహించనున్నారు. మంగళవారం నుంచి వచ్చేనెల 4 వరకు కోఠీ ఈఎన్టీ కళాశాలలో ఉదయం 9 గంటల నుంచి వైద్యపరీక్షలు నిర్వహించనున్నట్టు టీఎస్‌పీఎస్సీ తెలిపింది. అభ్యర్థులు సదరం సర్టిఫికెట్, మూడు పాస్‌పోర్ట్‌సైజ్‌ఫొటోలు, హాల్‌టికెట్, రూ.400 ఫీజు తెచ్చుకోవాలని కోరింది.

## పిడుగుపాటు మృతుని కుటుంబానికి రూ.6 లక్షల పరిహారం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కుమ్రంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలం గూడమామడలో ఏప్రిల్ 14న పిడుగుపాటుకు మృతి చెందిన తుమ్రం యాదవ్‌రావు కుటుంబానికి ప్రభుత్వం రూ.6 లక్షల పరిహారం మంజూరు చేసింది. ఈమేరకు సోమవారం రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి సోమేశ్‌కుమార్ ఉత్తర్వులు జారీచేశారు.

## ఎమ్మెస్‌ఎంఈ పరిశ్రమల సమాఖ్య ఏర్పాటు

అధ్యక్షుడిగా వినయ్‌కుమార్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల సమాఖ్య (ఎమ్మెస్‌ఎంఈ కాన్ఫెడరేషన్) హైదరాబాద్‌లో ఏర్పాటైంది. సోమవారం బేగంపేటలోని ది ప్లాజా హోటల్‌లో సమావేశమై తొలి కార్యవర్గాన్ని ఎన్నుకొన్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా అన్నెం వినయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా శ్రీధర్ బేతి, ఉపాధ్యక్షుడిగా స్వామిగౌడ్, కోశాధికారిగా అనిల్‌చోప్‌దార్, సంయుక్త కార్యదర్శిగా అనిల్‌బోరా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు వినయ్‌కుమార్ మాట్లాడుతూ.. సమాఖ్యను అన్ని జిల్లాలకు విస్తరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఫ్యాప్సీ మాజీ చైర్మన్ శివ్‌కుమార్ రుంగ్తా , బాలానగర్, కూకట్‌పల్లి ఐడీఏ చైర్మన్ రాజేందర్‌కట్టర్, క్యాబ్సన్స్ గ్యాస్ డైరెక్టర్ దినేశ్ బుటాడా, మెహల్‌మెహతా, ధీరజ్ సురానా, రుద్రా శ్రీధర్, కటారి రవి తోపాటు వంద మందికిపైగా పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ
జిందగీ
మంగళవారం 27 ఆగస్టు 2019 WWW. NTNEWS.COM /nt.zindagi

## మామ్స్ క్రెడిట్ యూనియన్



**పిల్లలు ఏం కావాలంటే అవి కొనిస్తారు తల్లిదండ్రులు. ఇలా అలవాటు చేయడం వల్ల పెరిగి పెద్దయ్యే కొద్దీ వారికి డబ్బు విలువ తెలియదు. తన పిల్లలకు డబ్బు విలువ తెలిపేందుకు ఓ తల్లి వినూత్న మార్గాన్ని ఎంచుకున్నది. ధనం విలువ గురించి వివరించడానికి సరికొత్త ప్రయోగం చేస్తున్నది.**

డబ్లిన్‌కు చెందిన షకేత మరియన్ మెక్‌గ్రెగర్ తన పిల్లలకు డబ్బు విలువను గురించి తెలియజేయడానికి వినూత్న కార్యక్రమం మొదలు పెట్టింది. 'డబ్బులు చెట్లకు పెరగవు, ఉద్యోగం సంపాదించండి' అంటూ 'మామ్స్ క్రెడిట్ యూనియన్' పేరుతో వారికి సరికొత్త పాఠాలు చెబుతున్నది. పని చేస్తేనే డబ్బు వస్తుందనే విషయాన్ని వారికి తెలియజెప్పే ప్రయత్నం చేస్తున్నది. షకేత మరియన్ పిల్లలు ఆమెను కొత్త ఫోన్ కొనిమ్మని తరచుగా అడిగేవారు. వారిని సరైన మార్గంలో పెట్టాలనుకున్నది. అందుకోసం కిచెన్ మేనేజర్, లాండ్రీ సూపర్‌వైజర్, హౌజ్ కీపర్ వంటి ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకొమ్మని చెప్పింది. ఎవరెవరు ఏయే పనులు చేయాలనుకుంటున్నారో ఆ పనికి సంబంధించిన ఉద్యోగానికి దరఖాస్తు పూర్తి చేసి మరియాకు అందించాలి. జాబ్ ఇంటర్వ్యూ సమయాన్ని పేర్కొంటూ ఇంట్లోని గోడకు పేపర్లు అంటించింది. ఆయా ఉద్యోగ బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించిన వారికి కొంత జీతం ఇస్తూ పిల్లలకు డబ్బు సంపాదనపై అవగాహన కల్పిస్తున్నది. పిల్లలలో మంచి క్రమశిక్షణను అలవాటు చేస్తున్నది. ఆమె చేస్తున్న ఈ ప్రక్రియకు సంబంధించిన తతంగమంతా సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. మరియా తన పిల్లలను చక్కదిద్దడానికి చేస్తున్న ప్రయత్నాన్ని తల్లిదండ్రులందరూ ప్రశంసిస్తున్నారు. ఆమె ఫేస్‌బుక్‌లో చేసిన పోస్ట్‌ను ఇప్పటి వరకూ 1,12,000 మంది షేర్ చేయగా, 30 వేల మంది ఆమె చేస్తున్న పనికి మద్దతు తెలుపుతున్నారు.

## మనసారా నవ్వండి



**నవ్వు నాలుగు విధాల చేటు అనేవారు గతంలో. నవ్వుతూ ఉంటే ఎక్కువకాలం ఆరోగ్యంగా ఉండొచ్చు అంటున్నారు ఇప్పుడు. శారీరక, మానసిక ఆరోగ్యంపై మంచి ప్రభావం చూపించే శక్తి నవ్వుకు మాత్రమే ఉంది. అందాన్ని పెంచడంలోనూ నవ్వు కీలకపాత్ర పోషిస్తున్నది.**

- హాయిగా నవ్వడం వల్ల శరీరంలో ఎండార్ఫిన్లు విడుదల అవుతాయి. మానసిక ఆనందం సొంతమై ఒత్తిడి అదుపులోకి వస్తుంది. శరీరానికి శక్తి అంది అలసట దూరమవుతుంది.
- సరదాగా మాట్లాడడం వల్ల సత్సంబంధాలు పెరుగుతాయి. అవతలివారు మీపై సానుకూలంగా ఆలోచిస్తారు. కుటుంబంలో బంధాలు బలపడుతాయి. ఆత్మీయులు పెరుగుతారు.
- రక్తపోటు అదుపులో ఉండాలన్నా, రోగనిరోధకశక్తి పెరుగాలన్నా హాయిగా నవ్వేయండి అని చెబుతున్నారు నిపుణులు. మెదడూ చురుగ్గా పనిచేసి ఆలోచనాశక్తి మెరుగవుతుంది. గుండె ఆరోగ్యమూ బాగుంటుంది.
- కోపం ఒక్కటే కాదు.. ఇతర ఉద్వేగాలూ అదుపులో ఉంటాయని అధ్యయనాలు చెబుతున్నాయి.
- మనసారా నవ్వినప్పుడు ముఖంలో 15 రకాల కండరాలకు వ్యాయామం అందుతుంది. రక్తప్రసరణ సజావుగా సాగి, ముఖం కాంతివంతంగా మారుతుంది. చర్మరంధ్రాలూ శుభ్రపడుతాయి.
- మనసారా నవ్వేందుకు.. మంచి పుస్తకాలు, సినిమాలు, పిల్లలతో ఎక్కువసేపు గడిపేలా చూసుకోవాలి. ఎదుటివారితో నవ్వించే వారితో తరచూ మాట్లాడుతూ ఉండండి.
- రోజులో 10 నుంచి 15 నిమిషాలు నవ్వితే చాలు.. దాదాపు నలభై కెలోరీలు కరుగుతాయి.

## అందమైన పెదవుల కోసం..



**మహిళలకు మరింత అందాన్ని తీసుకువచ్చేవి పెదవులు. మరి నల్లగా, పొడిబారినట్లుగా, పగిలినట్లుగా ఉండడం వల్ల ఇబ్బంది పడుతుంటారు. పెదవులు అందంగా ఉండడానికి ఈ కింది చిట్కాలు పాటించండి.**

- తేనెలో కొంచెం పంచదారను కలుపాలి. ఈ మిశ్రమాన్ని పెదవులకు అప్లై చేయాలి. 20 నిమిషాల తర్వాత శుభ్రం చేసుకుంటే పెదవులపై ఉన్న మురికి తొలిగిపోతుంది.
- ఆలూ ముక్కల్ని పెదవులపై రుద్దాలి. 10 నిమిషాలపాటు మర్దన చేయాలి. దీంతో పెదవులు మెత్తబడడంతోపాటు నల్లని పెదవులు గులాబీ రంగులోకి మారుతాయి.
- కలబంద నుంచి గుజ్జును వేరుచేయాలి. దీన్ని పెదవులకు అప్లై చేయాలి. ఇలా చేయడం వల్ల పెదవులు పొడిబారడాన్ని తగ్గిస్తుంది.
- టమాటా, పెరుగును బాగా కలుపాలి. ఈ మిశ్రమాన్ని పెదవులకు రాయాలి. దీనితో 5 నిమిషాల పాటు మర్దన చేయాలి. ప్రతిరోజూ ఇలా చేయడం వల్ల పెదవులు అందంగా, ప్రకాశవంతంగా కనిపిస్తాయి.
- కుంకుమపువ్వు, పెరుగును బాగా కలుపాలి. దీన్ని నేరుగా పెదాలకు రాసుకోవాలి. ఇలా తరచూ చేయడం వల్ల పెదవులు మృదువుగా, తేమగా ఉంటాయి.
- గులాబీ రేకులని పాలలో వేసి పేస్ట్‌లా చేయాలి. ఈ మిశ్రమాన్ని పెదవులకు మృదువుగా అప్లై చేయాలి. ఇలా చేయడం వల్ల పెదవులకు సహజమైన రంగు పొందవచ్చు.
- ప్రతిరోజూ పడుకునే ముందు ఆలివ్ ఆయిల్‌తో పెదాలపై మసాజ్ చేసుకోవాలి. ఉదయాన్నే వాష్ చేసుకోవాలి. ఇలా చేయడం వల్ల పెదవులు ఆకర్షణీయంగా ఉంటాయి.



**'ఆనంద్‌భవన్'. ఇది పేరుకు తగ్గట్లుగానే ఆనందాల భవనం. ఇక్కడ పనిచేసే వారిలో ఒక్కొక్కరిది ఒక్కో నేపథ్యం. ఒక్కో కథ. పదిమంది మహిళల విజయగాథ. వీరిని వెనుకుండి నడిపిస్తున్నది కూడా ఓ మహిళే. ఆమెనే హిమబిందు. విధి వంచితులు, ఒంటరి మహిళలు, నిరుపేద విద్యార్థినులను ఈ ఆనంద భవనానికి చేర్చింది. ధైర్యం చెప్పింది. డబ్బు సంపాదించే దారులు వివరించింది. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న వారికి తోడుగా నిలిచి.. వారందరి జీవితాల్లో ఆనందం నింపింది. ఆ ఆనందభవన్‌లోకి 'జిందగీ' అడుగుపెడితే.. మనసు కదిలించే జీవితగాథలు తెలిశాయి.**

# స్త్రీ సాధికారతకు చిహ్నం

శాంతి (పేరు మార్చాం) ఆమె భర్త రోజూ తాగొచ్చి హింసించే వాడు. ఇండ్లలో పనికిపోయి ఆమె దాచుకున్న డబ్బులూ మద్యానికి ఖర్చు చేసేవాడు. కేవలం తన ముగ్గురి పిల్లల కోసమే బతుకుతున్న శాంతిని హిమబిందు కలిసింది. ధైర్యం చెప్పి, ఆనంద్‌భవన్‌లో ఉపాధి కల్పించింది. తర్వాత పోలీసుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇప్పించడంతో భర్త పూర్తిగా మారిపోయాడు. అతను కూడా పని చూసుకొని పిల్లలను చక్కగా చదివించుకుంటున్నాడు. శాంతికి నెలకు రూ.9వేల వేతనం అందుతున్నది. ముగ్గురు పిల్లలతో సంతోషంగా జీవిస్తున్నారు.

శ్రీకాళహస్తికి దగ్గర్లోని ఓ పల్లెటూరికి చెందిన అమ్మణ్ణి అనే ఓ వృద్ధురాలికి కూతురిపై ఆధారపడడం ఇష్టం లేదు. అలాగని వృద్ధాశ్రమంలోనూ ఉండాలనుకోలేదు. తన మనవరాలిని చూసుకుంటూ ఆర్థికంగా నిలబడేందుకు ఆనంద్‌భవన్‌లో చేరింది. పాప స్కూల్‌కు వెళ్లగానే ఆనంద్‌భవన్‌కు వచ్చేస్తుంది. ఇక్కడ తనకు చేతనైన పనిచేసి మళ్లీ సాయంత్రం ఇంటికి వెళ్లి మనవరాలితో ఆడుకుంటుంది. అలా.. తనకు ఓపిక ఉన్నంత వరకూ పని చేస్తానని ఎంతో ఆత్మవిశ్వాసంతో చెబుతున్నది అమ్మణ్ణి.

సైనిక్‌పురికి చెందిన సింధూజ పేదరికం కారణంగా చదువు మానేసింది. పెండ్లీడుకొచ్చిన సింధూజ అమ్మానాన్నలకు ఆర్థికంగా తోడుగా ఉండేందుకు ఆనంద్‌భవన్‌లో చేరింది. ఇక్కడికొచ్చే వారితో ఎలా ఉండాలో హిమబిందు ద్వారా నేర్చుకున్నది. వంటలు రుచికరంగా ఎలా చెయ్యాలో తెలుసుకున్నది. కొద్దికాలనికే చీఫ్ చెఫ్‌గా మారి అద్భుతమైన రుచితో వంటలు చేస్తున్నది. తన శాలరీతో చిట్టీలు వేస్తున్నది. ఇక్కడంతా చక్కగా కలిసిపోయి, ఒకే కుటుంబంలా జీవిస్తున్నారు.

ఈ ఆనంద్ భవన్‌లో పనిచేసే ప్రతి మహిళది సాధికారత దిశగా అడుగులు వేసిన విజయగాథే. 'మహిళలు ఆర్థికంగా ఎదుగాలి.. సమాజాన్ని ఉద్ధరించాలి.. స్త్రీ సాధికారతా జిందాబాద్' అంటూ హిమబిందు ఎప్పుడూ ఉపన్యాసాలు ఇవ్వలేదు. తన చుట్టుపక్కల ఆర్థికంగా చితికిపోయిన మహిళలకు ఆదరువు చూపించి, వారి కాళ్లమీద వాళ్లు నిబడేలా చేసింది. ఎవరీ హిమబిందు..? ఏమిటీ 'ఆనంద్‌భవన్' కథ?

'ఆనంద్‌భవన్'.. ఇదొక రెస్టారెంట్. ఇది సికింద్రాబాద్ నేరేడ్‌మెట్‌లోని సైనిక్‌పురిలో ఉన్నది. ఇక్కడ వంట చేయడం నుంచి.. వడ్డించడం వరకూ అంతా మహిళలే. అందరూ సామాన్యులే. రకరకాల సమస్యలు ఎదుర్కొన్నవారే. అలాంటి వారందరినీ ఒక్కచోటకు చేర్చింది హిమబిందు. తనలాంటి మహిళలకు ఆధారం కల్పించాలనే ఉద్దేశంతోనే ఏడాదిన్నర క్రితం ఈ 'ఆనంద్ భవన్'ను ప్రారంభించింది. దీనితోపాటు 'ఇంక్లూడ్' అనే సంస్థను ఏర్పాటుచేసి... మానసిక వైకల్యం ఉన్నవారికి అండగా నిలుస్తున్నది. గృహహింస బాధితులు, ఎలాంటి ఆధారం లేని మహిళలు, విద్యార్థినులను ఎంచుకొని, వాళ్లకు వంటచేయడం నుంచి, వినియోగదారులతో ఎలా ప్రవర్తించాలో వివరిస్తూ... రకరకాల అంశాల్లో శిక్షణ ఇచ్చింది. అందరినీ ఉన్నతంగా తీర్చిదిద్ది.. ఆర్థికంగా నిలబెట్టింది.




### ఆరోగ్యకరమైన ఆహారం

ఈ ఆనంద్ భవన్‌లో చాలా ప్రత్యేకతలున్నాయి. ఇక్కడ ఆరోగ్యకరమైన ఆహారం అందిస్తారు. ఆరోగ్యాన్నికి హాని చేసే ఎలాంటి పదార్థమైనా ఇక్కడ నిషేధం. ఇక్కడ దొరికే పదార్థాలన్నీ పూర్తిగా 'వెజిటేరియన్'. ఉదయం టిఫిన్స్ నుంచి.. రాత్రి భోజనాల వరకూ ప్రతీది నాణ్యతతోనే ఉంటుంది. ఇక్కడ పూర్తిగా ప్లాస్టిక్ నిషేధం. పార్శిళ్లకు అరటి ఆకులనే ఉపయోగిస్తారు. ప్లాస్టిక్ కవర్స్ బదులుగా పేపర్ బ్యాగ్స్ ఉపయోగిస్తారు. 'కవర్స్ ఎందుకివ్వరూ' అని విషయం తెలియని కస్టమర్లు గొడవకు దిగితే.. ప్లాస్టిక్ వాడకం వల్ల ఆరోగ్యానికి, సమాజానికి, పర్యావరణానికి కలిగే ముప్పును వివరిస్తారు.

### 30 రకాల విభిన్న రుచులు

మన దేశంలోనే ప్రత్యేకతను చాటుకున్న కొన్ని వంటకాలను ఆనంద్‌భవన్‌లో రుచి చూడొచ్చు. కడప కారం దోశ, ఉడిపి వంటకాలు, దావన్‌గిరి వెన్నదోశ, ఉప్పిట్టు వంటి విభిన్న రకాల రుచులను పరిచయం చేస్తున్నారు. వారే ఆయా ప్రాంతాలకు వెళ్లి, స్వయంగా వాటిని నేర్చుకొని ఇక్కడ తయారు చేస్తున్నారు. ఉదయం నుంచి టిఫిన్స్, మధ్యాహ్నం నుంచి భోజనాలు ఉంటాయి. ఇక్కడ పనిచేసే మహిళలకు రోజూ మూడు షిఫ్టులు ఉంటాయి. పిల్లలు ఉన్నవారికి మధ్యాహ్నం, విద్యార్థినులకు ఉదయం, సాయంత్రం షిఫ్టులు ఉంటాయి.

### 'ఇంక్లూడ్' గురించి..

'ఇంక్లూడ్' సంస్థ ద్వారా మానసిక వైకల్యం ఉన్నవారికి పాఠాలు బోధిస్తున్నారు హిమబిందు దంపతులు, వారి స్నేహితులు. 'మనతోపాటు అందరినీ బతకనివ్వాలి' అనేది వీరి ముఖ్య ఉద్దేశం. మానసిక వైకల్యం ఉన్నవారిని, ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను ఇందులో భాగస్వాములను చేశారు. తద్వారా వారు తల్లిదండ్రులు, బంధువులకు భారంగా మారకుండా స్వశక్తితో పైకొచ్చే విధంగా ప్రోత్సహిస్తున్నది హిమబిందు. ఈ ఇంక్లూడ్‌లో భాగంగా 'గ్రే అపారెల్' పేరుతో మాదాపూర్, సైనిక్‌పురిలో రెండు దుస్తుల దుకాణాలు ప్రారంభించింది హిమబిందు. దానిని నిర్వహిస్తూ వారికి ఉపాధి కల్పిస్తున్నది.

### సహకారం అందితే..



ఇంక్లూడ్, ఆనంద్‌భవన్ ద్వారా కొద్దిమందికి మాత్రమే నుంచి ఉపాధి లభిస్తున్నది. మాలాంటి వారికి ప్రభుత్వం నుంచి, స్వచ్ఛంద సంస్థల నుంచి సహాయం అందితే.. ఎక్కువమందికి ఉపాధి చూపించే అవకాశం ఉంటుంది. దీనివల్ల చాలా మందికి గుర్తింపు వస్తుంది. సహాయం చేయాలనుకునే వాళ్లు మమ్మల్ని సంప్రదించొచ్చు. మొదటి మహిళా ఓలా క్యాబ్ డ్రైవర్‌గా పనిచేసేటప్పుడు.. ఆర్థికంగా వెనుకబాటును అనుభవిస్తున్న ఎంతోమందిని చూశాను. ఓలా సంస్థ నుంచి బయటకు వచ్చాక, వారందరినీ ఎంపిక చేసుకొని ఇందులో భాగస్వామ్యం చేశా. ఎప్పటికప్పుడు పని పరంగా, కుటుంబపరంగా ఎదురయ్యే సమస్యల్ని పరిష్కరించడంలో మా టీం ముందుంటుంది. మా ఆలోచన మెచ్చి సహాయం అందిస్తున్న వారందరికీ కృతజ్ఞతలు.

**- హిమబిందు,** నిర్వాహకురాలు

### మళ్లీ చదువుకుంటున్నా..



వ్యవసాయంలో అప్పులు ఎక్కువ కావడంతో కుటుంబం మొత్తం హైదరాబాద్ వచ్చేశాం. అంతా తలొక పని చేసుకుంటున్నాం. దీంతో నా చదువు మధ్యలోనే ఆగిపోయింది. మేడం నన్ను బాగా ప్రోత్సహించారు. ఇప్పుడు మళ్లీ చదువుకుంటున్నా. మొన్ననే కాలేజ్ ఫీజు కూడా కట్టేశా. పనితోపాటు చదువుకోవడానికీ సమయం దొరికింది.

**- సరిత,** వరంగల్

### పిల్లలను చదివిస్తున్నా..



ఆనంద్ భవన్‌లో చేరిన తర్వాత మాకు ఆర్థికంగా ఇబ్బందులేమీ లేవు. నా భర్త కూడా క్యాబ్ డ్రైవర్. మా ఇద్దరి సంపాదనతో మా పిల్లలను మంచిగా చది విస్తున్నాం. వారికి కోసమే హైదరాబాద్‌కు వచ్చేశాం. పిల్లలను స్కూల్‌కు పంపి.. ఇక్కడికి వస్తా. మళ్లీ స్కూల్ మూసే సమయానికి ఇంటికి వెళ్తా.

**- రేణుక,** వరంగల్ జిల్లా

... డప్పు రవి | కోనేటి వెంకట్

## నీటిసమస్య తీర్చడానికి..

**నీటిసమస్య తీర్చడానికి రోబోటిక్స్, కంప్యూటర్ టెక్నాలజీని వాడారు ఈ దంపతులు. ముంబై మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఈ సమస్యను వారు ఇలా పరిష్కరించారు.**







ముంబైకు చెందిన నిధి, అసిమ్ అమెరికాలో స్థిరపడ్డారు. ఓ రోజు అమెరికా నుంచి ముంబై వచ్చిన అసిమ్ ఇక్కడి నీటి పరిస్థితిని చూసి ఆశ్చర్యపోయాడు. సరైన నీటి సరఫరా లేక స్థానికులంతా ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్యను స్థానిక మున్సిపల్ అధికారి దృష్టికి తీసుకెళ్లాడు. నగరంలో పైప్‌లైన్ లీకేజీలవల్ల ఈ సమస్య ఏర్పడుతుందనీ, కొన్ని ప్రాంతాలకు నీటి సరఫరా కూడా అందడం లేదని ఆ అధికారి తెలిపాడు. ఆ లీకేజీలను గుర్తించడానికి సరైన టెక్నాలజీని వాడకపోవడమే ఈ సమస్యకు కారణమని అర్థమైంది. అమెరికా వెళ్లిన అసిమ్ తన భార్య నిధికి ఈ విషయం చెప్పాడు. ఇద్దరూ ఇంజినీరింగ్ చదివారు. నిధి సాఫ్ట్‌వేర్ డిజైనింగ్‌లో 15 సంవత్సరాల అనుభవం కలిగి ఉంది. అసిమ్.. రోబోటిక్స్ డెవలప్‌మెంట్‌లో 15 యేండ్ల నుంచి పని చేస్తున్నాడు. ఈ దంపతులు కలిసి ఓ టెక్నాలజీని ఉపయోగించి ముంబైలోని నీటి సమస్యకు పరిష్కారం చూపాలని ఇండియాకు తిరిగి వచ్చారు. స్థానిక మున్సిపల్ అధికారులతో కలిసి తమ ప్లాన్‌ని వివరించారు. రోబోట్స్, ఏఐ, డ్రోన్స్, కెమెరాలు, డేటా అనాలసిస్ వాడి నగరంలో ఎక్కడెక్కడ లీకేజీలు ఉన్నాయో ఈజీగా గుర్తించేందుకు తోడ్పాటునందించారు. విస్తారంగా ఉన్న పైప్‌లైన్లను మానిటరింగ్ చేయడానికి, లీకేజీలను వెంటనే గుర్తించడానికి ఆ టెక్నాలజీని వాడారు. మున్సిపల్ అధికారులతో కలిసి ఈ ప్రాజెక్ట్ చేపట్టారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా రోజుకు 600 మిలియన్ లీటర్ల నీటి లీకేజీని ఆపలుగుతున్నారు. నీటిని శుద్ధి చేయించి సరఫరా చేయించగలుతున్నారు.

## నిద్ర రావడం లేదా?

**ఒకవైపు ఉద్యోగం, మరోవైపు ఇంటిపని.. వీటికే సమయం సరిపోతుంది. నిద్రపోదామని అలా పడుకుంటే ఏవేవో ఆలోచనలు. మరి పడుకోగానే నిద్రపట్టాలంటే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసా?**



- నిద్రపోవడానికి గంటముందు కప్పు హెర్బల్‌టీ తాగడం అలవాటు చేసుకోవాలి. కుదిరితే గోరువెచ్చని నీటితో స్నానం చేయాలి. సంగీతం వినండి. అంతేగానీ ఫోన్లు, కంప్యూటర్లకు దూరంగా ఉండండి.
- పడకగదిలో వెలుతురు తక్కువగా ఉండేలా చూసుకోవాలి. పడకగది వీలైనంత వరకు ప్రశాంతంగా ఉంటేనే హాయిగా నిద్ర పడుతుంది.
- రోజూ కనీసం అరగంట వ్యాయామం చేయడం అలవాటుగా మార్చుకోవాలి. దీంతో రాత్రి హాయిగా నిద్రపడుతుంది. ఒకే సమయంలో నిద్రపోయి లేవాలి.
- రాత్రి సరిగ్గా నిద్రపట్టలేదని కొందరు మధ్యాహ్నం కునుకు తీస్తుంటారు. కొన్ని రోజులపాటు అలా చేయడం ఆపేయండి.
- ఓ ప్రణాళిక ప్రకారం దినచర్య పెట్టుకుంటే.. సాయంత్రానికి చాలా పనులు పూర్తి చేయగలుగుతారు. దీనివల్ల ఒత్తిడి తగ్గి, హాయిగా నిద్రపడుతుంది.
- ఈ నియామాలను వారం రోజులపాటు ప్రయత్నిస్తే సరిపోతుంది. ఇదే అలవాటుగా మారిపోతుంది.

ఒకప్పుడు.. కీళ్ల నొప్పులు అరవైయేండ్లు పైబడిన వారికే వచ్చేవి. కానీ.. ఇప్పుడు ముప్పైయేండ్లకే వచ్చేస్తున్నాయి. లోపం ఎక్కడుంది? మనలోనే ఉంది. పోషకాహార లోపం.. వ్యాయామం లేకపోవడం.. క్రమం తప్పిన జీవనశైలి వల్ల ఇలాంటి సమస్యలు వస్తున్నాయి. కీళ్లు బాగుంటేనే శరీరం దృఢంగా ఉంటుంది. అలా కీళ్లను లక్ష్యంగా చేసుకొని శరీరాన్ని బలహీనంగా తయారుచేస్తున్న వ్యాధి కీళ్లవాతం.

# కీళ్లవాతం.. ఇక హతం!



**కదలికలే** తగ్గిపోయిన ఆధునిక జీవనశైలిలో కీళ్లని ఉపయోగించడం తక్కువ అవుతున్నది. మనిషికి తగినంత శారీరకశ్రమ ఉండటం లేదు. దీనికి తోడు కీళ్లకు పోషక లోపం. మరోవైపు అధిక బరువు.. స్థూల కాయం. వీటన్నింటితో ఒత్తిడి. ఇవన్నీ కలిసి కీళ్లవాతంగా మారి ఈ సమస్య తీవ్రమవుతున్నది. గతంలో ఇది వృద్ధాప్యంలో ఉన్నవారికి మాత్రమే వచ్చేది. ఇప్పుడు వయసుతో సంబంధం లేకుండా వస్తున్నది. కాబట్టి అప్రమత్తంగా ఉండి కీళ్లవాతంను హతం చేయాలి.

### కీళ్లవాతం అంటే?

శరీరంలో రెండు ఎముకలను కలిపి ఉంచే భాగం కీలు. ఎముకలు సులువుగా అటూ ఇటూ కదలడానికి కీలులో ఉండే కార్టిలేజ్ పదార్థం ఉపయోగపడుతుంది. ఇది అరిగిపోతే ఎముకలు రెండూ ఒరుసుకుపోయి, నొప్పి మొదలై, కీలు వాస్తుంది. ఇదే కీళ్లవాతం.

### లక్షణాలేంటి?

చేతులు, కాళ్ల జాయింట్లలో నొప్పితో ప్రారంభమై కాళ్లూ, చేతులూ కదల్చలేనిస్థితికి ఈ వ్యాధి దారి తీస్తుంది. ఒక్కసారి కీళ్ల నొప్పుల బారిన పడితే జీవితాంతం అవి వేధిస్తూనే ఉంటాయి. కీళ్లవాతం ముదిరితే తీవ్రమైన నొప్పి కలుగుతుంది. రాత్రిపూట నొప్పి వల్ల నిద్ర కరువవుతుంది. నడవలేని పరిస్థితీ ఎదురవుతుంది. కీళ్లవాతం ప్రభావం గుండె, ఊపిరితిత్తులు, మూత్రపిండాలపైనా పడుతుంది. చర్మ సమస్యలు, దృష్టి లోపాలు కూడా చుట్టుముడతాయి. దీని వల్ల దైనందిన జీవితంలో సమస్యలు ఎదురవుతాయి.

### కీలు మార్పిడి అవసరమా?

మోకాళ్ల నొప్పి, కీళ్ల నొప్పులు ఉన్న ప్రతివాళ్లకూ ఆపరేషన్ చేస్తారన్నది నిజం కాదు. అవసరాన్ని బట్టి మార్పిడి అనేది ఆధారపడి ఉంటుంది. నడవలేనంత నొప్పి ఉండి, సాధారణ జీవనశైలికి అంతరాయం ఏర్పడితే, తప్పనిసరి పరిస్థితుల్లో మాత్రమే కీలుమార్పిడి ఆపరేషన్ చేస్తారు. ఇప్పుడు అందుబాటులో ఉన్న కృత్రిమ కీళ్లు పాతికేళ్లు గ్యారెంటీగా ఉంటాయి. వీటిలో విటమిన్ ఇ కోటెడ్ పాలీ ఇథిలీన్ ఇంప్లాంట్ అన్నింటికన్నా ఆధునికమైంది. ఇక కీళ్లల్లో సిరామిక్ పదార్థంతో తయారుచేసినవి కూడా వచ్చాయి. లోహమంటే అలర్జీ ఉన్నవాళ్లకు ఇవి మేలైనవి. ఒక్కో పేషెంటుకు ప్రత్యేకంగా తయారుచేసి, అమర్చగల కీళ్లు కూడా ఇప్పుడు అందుబాటులోకి వచ్చాయి. వీటినే పేషెంట్ స్పెసిఫిక్ ఇన్స్టుమెంటేషన్ (పిఎస్ఐ) అంటారు. ఇందులో భాగంగా మోకాలికి సీటీ స్కాన్ తీసి, ఏ కీలు ఏ మేరకు, ఏ విధంగా అరిగిపోయిందో చూస్తారు. దానికి అనుగుణంగా కృత్రిమ కీలును రూపొందించి, అమరుస్తారు. ఇవి సురక్షితమైనవే.



### ఎలా వస్తుంది?

ఎముకల మధ్య కదలిక ఉండటం శరీర ధర్మం. కదలికలే ఆరోగ్యాన్ని నిర్ణయిస్తాయి. వీటివల్లనే కీళ్లను కప్పి ఉంచే పొరల మధ్య సైనోవియల్ ద్రవం ఏర్పడుతుంది. కీళ్లకు అవసరమైన పోషకాలను రవాణా చేయడమే దీని పని. ఎప్పుడైతే కదలికలు తగ్గిపోతాయో అప్పుడు తగినంత సైనోవియల్ ద్రవం ఉత్పత్తికాక కీళ్లు తొందరగా అరిగిపోతాయి. బలహీనం అవుతాయి. శారీరక బరువు ఎక్కువైనప్పుడు బరువును మోసే మోకాళ్లు తీవ్రమైన ఒత్తిడికి లోనై చిన్న వయసులోనే కీళ్లవాతం సమస్యకు గురవుతున్నారు.

### నొప్పులు ఎన్ని రకాలు?

కీళ్ల నొప్పుల్లో చాలా రకాలున్నాయి. వంద రకాలు వీటిలో ఉన్నాయని గుర్తించారు. ఈ సంఖ్య ఇంకా పెరిగే అవకాశమూ ఉంది. ఇందులో కొన్నిరకాల ఆర్థరైటిస్‌లు ఎక్కువగా కనిపిస్తుంటాయి.

**రుమటాయిడ్:** చేతులు, పాదాల జాయింట్లలో వచ్చే తీవ్రమైన నొప్పినే రుమటాయిడ్ అంటారు. ఎముకలు, కండరాలపై ఎక్కువగా ప్రభావం చూపిస్తుంది. నొప్పి, వాపు, నొప్పి ఉన్నచోట ఎర్రగా మారడం, కీళ్లు బిగుసుకుపోవడం తదితర లక్షణాలు కనిపిస్తాయి. ఇది ఆటోఇమ్యూన్ వ్యాధి. వంశపారపర్యంగా, ఇతర ఇన్ఫెక్షన్ల మూలంగా, వ్యాధి నిరోధకశక్తి అతిగా స్పందించడం వల్ల ఈ రకం ఆర్థరైటిస్ వస్తుంది.

**సోరియాటిక్:** సోరియాసిస్ ఉన్నవారిలో చేతి వేళ్లు, కాళ్ల వేళ్ల వాపులు వస్తాయి. మడమనొప్పులు కూడా అధికంగా ఉంటాయి.

**స్పాండైలో:** యువకుల్లో నడుము నొప్పులు, రాత్రి సమయాల్లో నడుము పట్టేసినట్టుగా అన్పించి నిద్రలేకపోవడం, ఉదయాన్నే నడుము బిగుతుగా ఉండడం, మడమల నొప్పులు వంటి లక్షణాలు కనిపిస్తాయి.

### నిర్ధారణ- చికిత్స

రక్తపరీక్షలు, ఎక్స్‌రే ద్వారా కీళ్లవాతంను గుర్తిస్తారు. ఇది ప్రారంభదశలోనే ఉంటే కీలు మరింత దెబ్బతినకుండా జాగ్రత్తపడవచ్చు. కార్టిలేజ్ మరింత అరిగిపోకుండా నివారించవచ్చు. మందులు, ఫిజియోథెరపీతో కీళ్లను బలోపేతం చేయవచ్చు. వాపును తగ్గించవచ్చు. ఈ మందుల్ని రుమటాలజిస్ట్ పర్యవేక్షణలో వాడాలి. అయితే కీళ్ల వ్యాధులు తీవ్రమైతే అరిగిపోయిన కీలు స్థానంలో కొత్త కీలు అమర్చడం తప్ప మరోమార్గం లేదు. సాధారణంగా నలభై శాతం మందికి ఆపరేషన్ అవసరం అవుతుంటుంది. ప్రారంభంలోనే చికిత్స తీసుకుంటూ, సరైన జాగ్రత్తలు పాటిస్తే కీళ్లు అరిగే ప్రక్రియను వాయిదా వేయవచ్చు. ఈ వ్యాధి నాలుగు దశల్లో ఉంటుంది. నాలుగో దశలో మాత్రమే కీలు మార్పిడి అవసరం.

డాక్టర్
కిరణ్‌కుమార్ రెడ్డి
ఆర్థోపెడిక్ సర్జన్



### తీసుకోవాల్సిన జాగ్రత్తలేంటి?

- డాక్టర్లు సూచించిన విధంగా సక్రమంగా మందులు వాడుతూ ఆరోగ్యకరమైన జీవనం సాగిస్తే కీళ్లవాతాన్ని తగ్గించుకోవచ్చు.
- సమతలంగా ఉన్న ప్రదేశంలో నడవడం వల్ల కీళ్ల ఆరోగ్యం మెరుగవుతుంది.
- క్రమం తప్పకుండా అరగంట వ్యాయామం చేయడం వల్ల కీళ్ల నొప్పులు తగ్గుతాయి.
- శరీర బరువును నియంత్రణలో ఉంచుకోవాలి.
- ఆరు నుంచి ఎనిమిది గంటలు నిద్రపోవాలి.
- మధుమేహం, రక్తపోటు, థైరాయిడ్ వంటి వాటిని అదుపులో ఉంచుకోవాలి.
- ఊపిరితిత్తులకు, కాలేయానికి ఇన్ఫెక్షన్లు రాకుండా చూసుకోవాలి.
- ఆరోగ్యకరమైన, పరిశుభ్రమైన ఆహారాన్ని తీసుకోవాలి.
- క్యాల్షియం, విటమిన్ డి వంటివి శరీరానికి తగినంత అందేలా చూసుకోవాలి.

## ప్రాణం కాపాడే ప్రథమచికిత్స



హార్ట్ ఎటాక్ ఇప్పుడు సర్వ సాధారణం అయ్యింది. వయసుతో సంబంధం లేకుండా గుండెపోటు వస్తున్నది. తెలిసినవాళ్లకుగానీ.. ప్రయాణంలో ఇంకెవరికైనా గానీ హార్ట్ ఎటాక్ వస్తే ప్రథమ చికిత్సగా సాయంచేసి ఓ నిండు ప్రాణాన్ని రక్షించొచ్చు. ఎలా?

**డా**క్టర్ మనకు అన్ని సమయాల్లో అందుబాటులో ఉండరు కాబట్టి.. వైద్య సాయం అందేవరకు రోగిని పడుకోబెట్టి దుస్తులను వదులు చేయాలి. ఆక్సిజన్ అందివ్వాలి. నైట్రోగ్లిజరిన్ లేదా సోర్బిట్రేట్ మాత్రలు అందుబాటులో ఉంటే ఒకటి లేదా రెండు నాలుక కింద ఉంచాలి. కరగేసిన ఆస్పిరిన్ మాత్ర కూడా ఇవ్వాలి. ప్రథమదశలో హృదయ ధమనులలోని అడ్డంకులు కరగడానికి ఈ మందులన్నీ ఉపయోగపడుతాయి. అంబులెన్స్‌కు వెంటనే సమాచారం అందించాలి. మందులు నొప్పి ఉపశమనం కోసమే.. కానీ బాధ నుంచి ఉపశమనం పొందాలంటే మాత్రం ప్రమాదం గురించి ఆలోచించకుండా రోగికి మనో నిబ్బరాన్ని కలిగించేలా వ్యవహరించాలి. విశ్రాంతి.. నిద్రకు ప్రోత్సహించాలి. ఇది చికిత్సలో భాగం అనేది గుర్తుంచుకోవాలి. హాస్పిటల్‌లో చేర్చి హార్ట్ ఎటాక్ తీరు డాక్టర్‌కు విశ్లేషిస్తే ప్రాణాన్ని కాపాడినవాళ్లు అవుతారు.

## సిర్రోసిస్ ఆఫ్ లివర్ అంటే?

**కాలేయానికి దీర్ఘకాలిక వ్యాధులు సోకిన తరువాత కాలేయ కణాలు పనిచేయకపోవడం వల్ల కాలేయంలో కొన్ని పరిణామాలు జరుగుతాయి. దీనివల్ల వచ్చే సమస్యను సిర్రోసిస్ ఆఫ్ లివర్ అంటారు.**

దీర్ఘకాలిక కాలేయ సమస్యలు ఉన్నవారిలో, హెపటైటిస్ ఉన్నవారిలో, పైత్యరస ప్రసరణలో అడ్డంకులు వంటి సమస్యలు ఉన్నవారిలో ఇది సోకుతుంది. ఈ సమస్య వల్ల కడుపులో నీరు చేరుతుంది. కాళ్లు చేతుల్లో వాపు వస్తుంది. వాంతిలో రక్తం పడుతుంది. పచ్చ కామెర్లు వస్తాయి. రక్త నాళాలు ఉబ్బుతాయి. ఆలోచనలలో తికమక వంటి లక్షణాలు కనిపిస్తాయి. రక్తపరీక్ష, లివర్ ఎంజైమ్‌ల తీరు కనుగొనుట, రక్తంలో బిలిరుబిన్ స్థాయి కనుగొనుట, ఎక్స్‌రే, సూది సహాయంతో లివర్ కణాలు తీసి పరీక్ష చేసి వ్యాధి నిర్ధారిస్తారు.





## రేచీకటి ఎందుకొస్తుంది?

**రాత్రిళ్లు కంటిచూపు మందగించడాన్ని రేచీకటి అంటారు. చిన్న పిల్లల్లో ఈ సమస్య ఎక్కువగా ఉంటుంది. పోషకాహారం లోపించడం వల్ల ఈ సమస్య వస్తుంది. కాబట్టి పిల్లలకు మంచి పోషక విలువలున్న ఆహారం ఇస్తేనే సంపూర్ణ కంటిచూపు అందించినవాళ్లం అవుతాం.**

ఆహారంలో విటమిన్-ఎ సరిగా లేకపోవడం వల్ల రేచీకటి వస్తుంది. రెటీనాకు వచ్చే ఆరోగ్య సమస్యల వల్ల కూడా రావచ్చు. ఈ సమస్య వచ్చినవారిలో రాత్రిపూట కళ్లు అసలు కనిపించవు. విటమిన్-ఎ లోపం తీవ్రంగా ఉంటే కార్నియా కరిగిపోయి 'కెరటోమలేసియా' సమస్య వస్తుంది. పిల్లలను రేచీకటి నుంచి తప్పించాలంటే మాత్రం కచ్చితంగా విటమిన్-ఎ ఉన్న ఆహారం పెట్టాల్సిందే. అవసరం అనుకుంటే డాక్టర్ సలహాతో విటమిన్ మాత్రలు కూడా వేయాలి. సమస్య తీవ్రం అయితే కొన్ని సందర్భాల్లో పూర్తి అంధత్వం కూడా వచ్చే ప్రమాదం ఉంది.

## గర్భిణుల్లో నిద్ర సమస్యలు

**గర్భిణులు కంటినిండా నిద్రపోవటం ఎంతో అవసరం. అయితే గర్భం ధరించినపుడు శరీరంలో జరిగే మార్పులు నిద్రలో కొన్ని సమస్యలు సృష్టిస్తుంటాయి. కొన్ని జాగ్రత్తలు పాటిస్తే రాత్రిపూట హాయిగా నిద్రపోవటానికి వీలుంటుందని నిపుణులు సూచిస్తున్నారు.**



**గ**ర్భిణులు మూడోనెల నుంచి ఎడమవైపు తిరిగి పడుకోవాలి. ఎక్కువసేపు వెల్లకిలా పడుకోకుండా చూసుకోవాలి. పగలు సాధ్యమైనంత ఎక్కువగా ద్రవపదార్థాలు తీసుకోవాలి. అయితే రాత్రిపూట వాటిని పరిమితం చేయాలి-లేకపోతే ఎక్కువసార్లు మూత్రవిసర్జన నిద్రలేమికి దారితీస్తుంది. కారం తక్కువగా ఉండే పదార్థాలు తినాలి. ఛాతీలో మంట పుట్టించే మసాలా ఆహారాన్ని మానెయ్యటమే మంచిది. పడుకునేటప్పుడు గర్భిణుల కోసం ప్రత్యేకంగా తయారుచేసిన దిండ్లు వాడుకోవాలి. అవి అందుబాటులో లేకపోతే మరో దిండును మోకాళ్ల మధ్య పెట్టుకొని పడుకోవచ్చు. పగటిపూట వీలు చేసుకొని కాసేపు కునుకు తీయాలి. నిద్ర బాగా పట్టేందుకు మనసును ప్రశాంతంగా ఉంచే పద్ధతులు పాటించాలి. నిద్రలేమితో బాధపడుతుంటే తప్పకుండా డాక్టరుకు చూపించుకోవటం మరవరాదు.

సలహా

# స్క్రీనింగ్ టెస్ట్‌లతో క్యాన్సర్‌ను పసిగట్టొచ్చు!



**పుట్టుమచ్చలు అందరికీ ఉంటాయి. కాకపోతే కొందరికి ఎక్కువగా ఉంటాయి. నోటి సమస్యలూ చాలామందికి ఉంటాయి. కొందరికి వాటంతట అవే వస్తే.. మరికొందరికి చెడు అలవాట్ల వల్ల వస్తాయి. పెద్దపేగు సమస్యలు వస్తే చాలామంది ఏదో మామూలు మార్పులే అయుండొచ్చని నిర్లక్ష్యం చేస్తుంటారు. కానీ.. ఇవన్నీ చాలా ప్రమాదకరం. పుట్టుమచ్చలు చర్మ క్యాన్సర్‌కు.. నోటి సమస్యలు నోటి క్యాన్సర్‌కు.. పేగు సమస్యలు పెద్దపేగు క్యాన్సర్‌కు దారితీయవచ్చు. కాబట్టి మార్పులను గమనించండి. స్క్రీనింగ్ టెస్ట్‌లు చేయించుకోండి, క్యాన్సర్ ప్రమాదం నుంచి బయటపడండి!**

**ప్ర**మాదకర క్యాన్సర్లలో చర్మ క్యాన్సర్.. పెద్దపేగు క్యాన్సర్.. ప్రోస్టేట్ క్యాన్సర్.. నోటి క్యాన్సర్ ఇలా చాలా ఉన్నాయి. వీటిని ముందుగానే ఎలా గుర్తించవచ్చో.. ఏయే జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకుంటే క్యాన్సర్‌ను అరికట్టవచ్చు. క్యాన్సర్ ఏదైనా గుర్తించాలంటే స్క్రీనింగ్ టెస్ట్‌లే కీలకం. ఏ క్యాన్సర్‌కు ఏ స్క్రీనింగ్ టెస్ట్ అవసరమో తెలుసుకుందాం.

### చర్మక్యాన్సర్

చర్మ క్యాన్సర్ స్త్రీ, పురుషులిద్దరిలో వస్తుంది. పుట్టుమచ్చల పరిమాణంలో.. ఆకారంలో.. రంగులో వచ్చిన మార్పులవల్ల చర్మక్యాన్సర్ వస్తుంది. ఇందులో పుట్టుమచ్చలు ఒక కారణం. కాబట్టి వాటిలో ఏమైనా మార్పులు కనిపిస్తే జాగ్రత్త పడాలి.



### ఎలా గుర్తించాలి?

ఏబీసీడీఈ పద్ధతి ద్వారా పుట్టుమచ్చల పరిమాణంలో ఏం మార్పులు వచ్చాయో? అవి ఎలాంటివో? రంగులో ఏం మార్పులు వచ్చాయో గుర్తించవచ్చు. చర్మ క్యాన్సర్ నిర్ధారణలో ఏబీసీడీఈ పద్ధతి కీలకంగా పనిచేస్తుంది.

### ఏబీసీడీఈ పద్ధతేంటి?

**ఏ:** పుట్టుమచ్చలను మధ్యగా విభజించి చూసినప్పుడు రెండు అర్ధభాగాలు ఒకేలా ఉండకూడదు.
**బీ:** పుట్టుమచ్చ అంచులు, పలుచని రంగులో లేదా రఫ్‌గా ఉండకూడదు.
**సీ:** పుట్టుమచ్చల రంగులో మార్పు రాకూడదు. అంటే అవి మొదట ఉన్న రంగు కంటే ముదురురంగులోకి మారటం లేదా పలుచబడటం జరగొద్దు.
**డీ:** పుట్టుమచ్చ వ్యాసం 1/4 అంగుళం కన్నా ఎక్కువగా ఉండడం.
**ఈ:** పుట్టుమచ్చ చర్మంపై ఉబ్బెత్తుగా, వాచినట్లుగా ఉండడం.

### పెద్దపేగు క్యాన్సర్

పెద్దపేగు క్యాన్సర్ మొదట చిన్న గుల్లలుగా మొదలై క్రమంగా క్యాన్సర్ కణతిగా మారుతుంది. కాబట్టి పేగుకు సంబంధించి ఏమైనా సమస్య వస్తే ఏమాత్రం అశ్రద్ధ చేయొద్దు. వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి. ప్రమాదకరమైన పెద్దపేగు క్యాన్సర్ నుంచి బయటపడాలి.

### లక్షణాలు



పెద్దపేగు క్యాన్సర్ లక్షణాలు సాధారణంగానే అనిపిస్తాయి. అందువల్ల దానిని నిర్లక్ష్యం చేస్తారు చాలామంది. అలా కాకుండా మామూలు సమస్యలకు.. పెద్దపేగు క్యాన్సర్‌తో వచ్చే సమస్యలకు తేడా ఏంటో వ్యక్తిగతంగా విశ్లేషించుకొని ప్రాథమికంగా మీరే ఓ అంచనాకు రావాలి. పెద్దపేగు క్యాన్సర్ పట్ల అవగాహన ఏర్పరచుకోవాలి. ఆ లక్షణాలేంటో తెలుసుకోండి.

- మలద్వారం వద్ద రక్తస్రావం. మలంలో రక్తం పడటం.
- డయేరియా, మలబద్ధకం మొదలైనవి వారాల తరబడి కొనసాగుతాయి.
- పొత్తి కడుపు భాగంలో నొప్పి లేదా పట్టేసినట్లు ఉంటుంది.
- ఆకస్మికంగా బరువు తగ్గుతారు.

### ఎవరికి వస్తుంది?

పెద్దపేగు క్యాన్సర్ వ్యాధి ఫలానా వారికే వస్తుందని చెప్పలేం. వ్యక్తి జీవన విధానాన్ని బట్టి.. ఉన్న అలవాట్లను బట్టి వస్తుంది. కొన్నిసార్లు మాత్రం కొన్ని ప్రత్యేక కారణాల వల్ల పెద్దపేగు క్యాన్సర్ వస్తుంది. పెద్దపేగు క్యాన్సర్ స్త్రీ, పురుషులిద్దరికీ వస్తుంది. ఇంకా..

- ఇంతకుముందు క్యాన్సర్ వచ్చి తగ్గిన వారిలో పెద్దపేగు క్యాన్సర్ వస్తుంది.
- అల్సరేటివ్ కొలైటిస్ ఉన్నవారిలో కూడా పెద్ద పేగు క్యాన్సర్ వస్తుంది.
- రక్త సంబంధీకుల్లో ఎవరికైనా క్యాన్సర్ ఉన్నట్లయితే కొన్నిసార్లు పెద్దపేగు క్యాన్సర్ వస్తుంది.

పైన పేర్కొన్న సందర్భాల్లో ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి FOBT, ఫ్లెక్సిబుల్ సిగ్మాయిడో స్కోపీ పరీక్షలు చేయించుకోవాలి.

### నోటి క్యాన్సర్

మనం తీసుకునే ఆహారాన్ని బట్టి.. నోటిని శుభ్రంగా ఉంచుకునేదాన్ని బట్టి నోటి క్యాన్సర్ వస్తుందా లేదా? అనేది చెప్పొచ్చు. మిగతా శరీర భాగాల్లాగా కాకుండా నోటి క్యాన్సర్‌ను గుర్తించడం చాలా సులువు. ఇది స్త్రీ, పురుషులిద్దరికీ వస్తుంది.

### ఎలా గుర్తించాలి?

నోటిలో కలిగే మార్పులను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలి. ముఖ్యంగా పొగాకు నమిలే అలవాటు ఉన్నవారు వెంటనే దానిని మానుకోవాలి. పొగాకు అలవాటు ఉండి మానేసిన వారు కూడా నోటిలో కలిగే మార్పులను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలి. నోటి క్యాన్సర్ ఇండియాలో ఎక్కువగా ఉంది. దీనిని స్క్రీనింగ్ టెస్ట్ ద్వారా గుర్తించవచ్చు.

### ప్రోస్టేట్ క్యాన్సర్

భారతదేశంలో ప్రోస్టేట్ క్యాన్సర్ సర్వసాధారణం అయిపోయింది. అయినప్పటికీ చాలామందికి ఈ వ్యాధి పట్ల అవగాహన లేదు. తెలిసినవారు కూడా అంత శ్రద్ధ తీసుకోకపోవడం వల్ల ప్రోస్టేట్ క్యాన్సర్ విజృంభిస్తున్నది.

### ఎవరికి వస్తుంది?

ప్రోస్టేట్ క్యాన్సర్ మగవారిలో మాత్రమే వస్తుంది. 50 ఏండ్ల వయసు పైబడిన వారిలో ఈ సమస్య ఎక్కువగా ఉంటుంది.

### ఏ పరీక్షలు చేయించుకోవాలి?

మగవారు తప్పనిసరిగా ప్రోస్టేట్ క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలని అనేక అంతర్జాతీయ సంస్థలు కూడా సలహా ఇస్తున్నాయి. 50 సంవత్సరాల వయసు నిండిన మగవారు ప్రతి సంవత్సరం ప్రోస్టేట్ స్పెసిఫిక్ అంటిజెన్ (పీఎస్ఏ) రక్తపరీక్ష, డిజిటల్ రెక్టల్ పరీక్ష చేయించుకోవాలి. కుటుంబంలో ఎవరికైనా ప్రోస్టేట్ క్యాన్సర్ ఉంటే మిగతా మగవారు 40 సంవత్సరాల వయసు నుంచే ప్రోస్టేట్ క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్ట్‌లు చేయించుకోవాలి.

డా. సీహెచ్ మోహన వంశీ
చీఫ్ సర్జికల్ అంకాలజిస్ట్,
ఒమేగా హాస్పిటల్స్
హైదరాబాద్: 9848011421
కర్నూల్: 08518 273001
గుంటూర్: 08632 223300



## నిపుణ — విద్య ఉద్యోగ సమాచారం

### ప్రసారభారతిలో

**ప్రసారభారతి కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది.**

- యాంకర్ (న్యూస్ బులిటిన్స్ ఫర్ హియరింగ్ ఇంపేయిర్డ్)
- **అర్హతలు:** డిగ్రీ, సైన్ లాంగ్వేజ్‌లో డిప్లొమా
- **మేకప్ ఆర్టిస్ట్:** ఇంటర్, మేకప్‌లో డిప్లొమా
- హెయిర్ డ్రెస్సర్/స్టైలిస్ట్
- **అర్హత:** ఇంటర్, హెయిర్ డ్రెస్సర్/స్టైలిస్ట్‌లో డిప్లొమా ఉత్తీర్ణత.
  **గమనిక:** అన్ని పోస్టులకు సంబంధిత రంగంలో రెండేండ్ల అనుభవం ఉండాలి.
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో, **చివరితేదీ:** ఆగస్టు 30
- **వెబ్‌సైట్:** http://prasarbharati.gov.in



### ఎయిమ్స్‌లో ప్రొఫెసర్లు

**నాగ్‌పూర్‌లోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) ఖాళీగా ఉన్న ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.**

- **మొత్తం పోస్టులు- 50** (ప్రొఫెసర్-7, అడిషనల్ ప్రొఫెసర్-6, అసోసియేట్ ప్రొఫెసర్-8, అసిస్టెంట్ ప్రొఫెసర్-29)
- **విభాగాలు:** అనస్థీషియా, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్, మైక్రోబయాలజీ, న్యూక్లియర్ మెడిసిన్, పాథాలజీ తదితరాలు
- **అర్హతలు:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీ లేదా సంబంధిత సబ్జెక్టుల్లో పీజీ (ఎండీ/ఎంఎస్)తోపాటు పీహెచ్‌డీ. సంబంధిత టీచింగ్/రిసెర్చ్ రంగంలో అనుభవం ఉండాలి.
- **పే స్కేల్:** అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు రూ. 1,01,500-1,67, 400/- మిగతా పోస్టులకు వేర్వేరుగా పేస్కేల్స్ ఉన్నాయి.
- **అప్లికేషన్ ఫీజు:** రూ. 2000/- (ఎస్సీ/ఎస్టీలకు రూ. 500/-)
- **ఎంపిక:** ఇంటర్వ్యూ
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో లేదా ఈ-మెయిల్ (recruitment@aiimsnagpur.edu.in)
- **దరఖాస్తులకు చివరితేదీ:** సెప్టెంబర్ 17
- **వెబ్‌సైట్:** www.aiimsnagpur.edu.in

### ఏఐఏఎస్ఎల్‌లో ఖాళీలు

**ఎయిర్‌లైన్స్ అల్లైడ్ సర్వీసెస్ లిమిటెడ్ (ఏఐఏఎస్ఎల్) కింది పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.**

- **పోస్టులు-ఖాళీలు:** సింథటిక్ ఫ్లైట్ ఇన్‌స్ట్రక్టర్-2, సీనియర్ మేనేజర్-5, మేనేజర్ (ఆపరేషన్స్)-2, మేనేజర్ క్రూ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్-2, మేనేజర్ ఫైనాన్స్-1, స్టేషన్ మేనేజర్-1, ఆఫీసర్-12, అసిస్టెంట్ ఆఫీసర్-2, క్రూ కంట్రోలర్-1, సూపర్‌వైజర్-1, సూపర్‌వైజర్ (సెక్యూరిటీ) (ఏఏఎస్ఎల్ స్టేషన్లు ఉన్నచోట)
- **అర్హతలు:** వేర్వేరు పోస్టులకు వేర్వేరు అర్హతలు ఉన్నాయి. వివరాలు వెబ్‌సైట్‌లో చూడవచ్చు.
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో, **చివరితేదీ:** సెప్టెంబర్ 13
- **వెబ్‌సైట్:** http://www.airindia.in

### నాన్ మెడికల్ పోస్టులు

**టాటా మెమోరియల్ సెంటర్ (టీఎంసీ) పరిధిలోని హోమీ బాబా క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రిసెర్చ్‌లో ఖాళీగా ఉన్న కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**



- **మొత్తం ఖాళీలు:** 102
- **పోస్టులు:** మెడికల్ ఫిజిసిస్ట్, సైంటిఫిక్ ఆఫీసర్, సైంటిఫిక్ అసిస్టెంట్, ఫార్మసిస్ట్, టెక్నీషియన్, నర్స్, అసిస్టెంట్ నర్సింగ్ సూపరింటెండెంట్ తదితరాలు ఖాళీలు ఉన్నాయి.
- **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో ఇంటర్, డిప్లొమా, నర్సింగ్, బీఎస్సీ, బీఫార్మసీ, బీఈ/బీటెక్, ఎమ్మెస్సీ ఉత్తీర్ణత. సంబంధిత రంగంలో అనుభవం ఉండాలి.
- **ఎంపిక:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ, స్కిల్ టెస్ట్ ద్వారా
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** సెప్టెంబర్ 4
- **వెబ్‌సైట్:** https://tmc.gov.in

# రూపాయికే శానిటరీ నాప్‌కిన్

- జన్‌ఔషధి దుకాణాల్లో అందుబాటులోకి
- నేటినుంచి అమల్లోకి 'సువిధ' కొత్త రేట్లు



**న్యూఢిల్లీ:** మహిళల ఆరోగ్యానికి సంబంధించి కేంద్రం మరో కొత్త నిర్ణయం తీసుకొన్నది. 'సువిధ' పేరుతో అందుబాటులో ఉన్న శానిటరీ నాప్‌కిన్ల ధర తగ్గించి జన్‌ఔషధి కేంద్రాల్లో వాటిని అందుబాటులోకి తేనున్నది. ఒక్కో నాప్‌కిన్ ధర ప్రస్తుతం రూ.2.50 ఉండగా మంగళవారం నుంచి రూపాయికే అందించేలా చర్యలు తీసుకొన్నట్టు కేంద్ర రసాయన, ఎరువులశాఖ సహాయమంత్రి మన్‌సుఖ్ మాండవీయ తెలిపారు. ఇప్పటివరకు నాలుగు నాప్‌కిన్లతో కూడిన ప్యాకెట్‌ను రూ.10కి విక్రయించేవారు. కాగా, మంగళవారం నుంచి ఈ ప్యాక్ రూ.4కే లభించనుంది. 'సువిధ బ్రాండ్ పేరుతో ఈ నాప్‌కిన్లను దేశవ్యాప్తంగా 5,500 జన్‌ఔషధి దుకాణాల్లో లభించనున్నాయి. ప్రస్తుతం తయారీదారులు తమ ఉత్పత్తి వ్యయం మేరకే నాప్‌కిన్లు తయారుచేసి సరఫరా చేస్తున్నారు. రిటైల్ ధరను తగ్గించేందుకు కేంద్రం వారికి సబ్సిడీ అందిస్తుంది. ఈ సబ్సిడీ శానిటరీ ప్యాడ్లను దారి మళ్లించకుండా చూసేందుకు కేంద్రం చర్యలు తీసుకొంటున్నది' అని మాండవీయ చెప్పారు. కొత్త నాప్‌కిన్లు పర్యావరణ హితమైనవని, వాడి పడేశాక భూమిలో త్వరగా కలిసిపోతాయని తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్న మహిళలకు ప్యాడ్లను తక్కువ ధరకే అందిస్తామని కేంద్రం గత ఏడాది మార్చిలో ప్రకటించగా.. రెండునెలల తర్వాత మేలో జన్‌ఔషధి కేంద్రా ల్లో అందుబాటులోకి వచ్చాయి. ఏడాదికాలంలో ఈ కేంద్రాల్లో దాదాపు 2.2 కోట్ల నాప్‌కిన్ల అమ్మకాలు జరిగాయి. ధర తగ్గించడంతో అమ్మకాలు పెరుగుతాయని ప్రభుత్వం భావిస్తున్నది.

# విమానాల్లో యాపిల్ మ్యాక్‌బుక్ ప్రో వద్దు!

### ప్రయాణికులకు డీజీసీఏ సూచన

**న్యూఢిల్లీ, ఆగస్టు 26:** పదిహేను అంగుళాల యాపిల్ మ్యాక్ బుక్ ప్రో ల్యాప్‌టాప్‌లను విమానాల్లోకి తీసుకురావొద్దని భారత వైమానిక రంగ నియంత్రణ సంస్థ "డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్" (డీజీసీఏ) సోమవారం విమాన ప్రయాణికులకు సూచించింది. సదరు ల్యాప్‌టాప్‌లలోని బ్యాటరీలు వేడెక్కుతుండటం వల్ల ప్రమాదాలు జరుగవచ్చనే సందేహాలతో ఈ నిర్ణయం తీసుకున్నది. పాత వెర్షన్ 15అంగుళాల మ్యాక్ బుక్ ప్రో ల్యాప్‌టాప్‌లలో బ్యాటరీ సమస్యలు తలెత్తడంతో జూన్ 20న యాపిల్ స్వచ్ఛందంగా వాటిని మార్కెట్ నుంచి వెనక్కి తీసుకుంది. సెప్టెంబర్ 2015-ఫిబ్రవరి 2017మధ్య ఉత్పత్తిచేసిన మ్యాక్‌బుక్ ప్రో ల్యాప్‌టాప్‌లలో అమర్చిన బ్యాటరీలు పేలే ప్రమాదం ఉన్నదని, ఉచితంగా మరమ్మతులు చేస్తామని కూడా ప్రకటించింది. ఈ క్రమం లో డీజీసీఏ అధిపతి అరుణ్‌కుమార్ విమాన ప్రయాణికులకు పలు విజ్ఞప్తులు చేశారు. 'సెప్టెంబర్ 2015-ఫిబ్రవరి 2017మధ్యలో ఉత్పత్తి చేసిన మ్యాక్ బుక్ ప్రో ల్యాప్‌టాప్‌లలో బ్యాటరీ వేడెక్కడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నట్టు యాపిల్ ప్రకటించింది. విమాన ప్రయాణికులు మ్యాక్‌బుక్ ప్రో పాతవెర్షన్లను చెక్ ఇన్ లగేజీలో, హ్యాండ్ లగేజీలో తీసుకురావొద్దని అభ్యర్థిస్తున్నాం. మ్యాక్ బుక్ ప్రోను తయారీదారులు సురక్షితంగా మార్చడం లేదా భద్రతకు సంబంధించి ఎలాంటి భయంలేదని సర్టిఫికెట్ జారీ చేసేంత వరకు ఈ నిర్ణయం కొనసాగుతుంది' ట్విట్టర్‌లో పేర్కొన్నారు.



# చిదంబరానికి చుక్కెదురు

### సీబీఐ కేసులో ముందస్తు బెయిల్ అభ్యర్థనను తిరస్కరించిన సుప్రీంకోర్టు
### ఈడీ కేసులో బెయిల్‌ను నేటి వరకు పొడిగించిన ధర్మాసనం
### కస్టడీని మరో నాలుగు రోజులు పొడిగించిన సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం



సోమవారం ఢిల్లీలోని సీబీఐ ప్రత్యేక కోర్టులో ప్రవేశపెట్టే ముందు మీడియాకు అభివాదం చేస్తున్న కేంద్రమాజీ మంత్రి చిదంబరం

**న్యూఢిల్లీ, ఆగస్టు 26:** ఐఎన్‌ఎక్స్ మీడియా కుంభకోణం కేసులో మాజీ కేంద్ర మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత చిదంబరానికి సుప్రీంకోర్టు, ఢిల్లీ హైకోరుర్టుల్లో చుక్కెదురైంది. సీబీఐ అరెస్ట్ నుంచి రక్షణ కల్పించాలంటూ ఆయన చేసిన అభ్యర్థనను సుప్రీంకోర్టు తిరస్కరించింది. ఆయన ఇప్పటికే సీబీఐ కస్టడీలో ఉన్నందున పిటిషన్ చెల్లదని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈడీ కేసులో ఇప్పటికే జారీ చేసిన ముందస్తు బెయిల్‌ను మంగళవారం వరకు పొడిగించింది. మరోవైపు ఢిల్లీలోని సీబీఐ ప్రత్యేక కోర్టు చిదంబరానికి సీబీఐ కస్టడీని మరో నాలుగు రోజులు పొడిగించింది. చిదంబరానికి సంబందించిన ఇతర పిటిషన్లపై సోమవారం జస్టిస్‌లు పీ భానుమతి, ఏఎస్ బొపన్నతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. చిదంబరం ఇప్పటికే సీబీఐ కస్టడీలో ఉన్నందున ఆయన పిటిషన్ నిష్ప్రయోజనంగా మారిందని వ్యాఖ్యానించింది. సీబీఐ కస్టడీ ముగుస్తున్నందున చట్ట ప్రకారం పరిష్కారం పొందే స్వేచ్ఛ ఉన్నదని పేర్కొన్నది. చిదంబరం తరపున సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, అభిషేక్ సింఘ్వీ వాదనలు వినిపించారు. ఢిల్లీ హైకోర్టు ఈ నెల 20వ తేదీన ఇచ్చిన తీర్పుపై తాము వెంటనే సుప్రీంకోర్టును ఆశ్రయించామని, బెయిల్ కోసం ప్రయత్నిస్తుండగానే సీబీఐ చిదంబరంను అరెస్ట్ చేసిందని చెప్పారు. ఫలితంగా తమ పిటిషన్ చెల్లకుండా పోయిందన్నారు. తాము 21వ తేదీన సుప్రీంకోర్టులో అత్యవసర పిటిషన్ దాఖలు చేస్తే ఆరోజు విచారణ జరుపలేదని, కనీసం మరుసటి రోజు జాబితాలో పొందుపరుచలేదని, 23న విచారణ జరిపారన్నారు. సీబీఐ అధికారులు ఇవేమీ పట్టించుకోకుండా 21న రాత్రి అరెస్ట్ చేశారని వెల్లడించారు. 'చిదంబరానికి రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను కాలరాయడం, స్వేచ్ఛను అణచివేయడమే సీబీఐ ఉద్దేశం' అని విమర్శించారు. వాదనలు విన్న అనంతరం ధర్మాసనం చిదంబరం పిటిషన్‌ను తిరస్కరించింది.

**ముందస్తు బెయిల్ ఒకరోజు పొడిగింపు**

ఈడీ కేసుకు సంబంధించి గతంలో ఢిల్లీ హైకోర్టు సోమవారం వరకు మంజూరుచేసిన ముందస్తు బెయిల్‌ను సుప్రీంకోర్టు మరోరోజు పొడిగించింది. ఈ సందర్భంగా కపిల్ సిబల్ వాదనలు వినిపిస్తూ ఆర్టికల్ 21 ప్రకారం విచారణ, దర్యాప్తు నిష్పక్షపాతంగా జరుగాల్సి ఉన్నదన్నారు. ఆయన ప్రాథమిక హక్కులను కాపాడాలని కోరారు. కేసుకు సంబంధించిన పలు పత్రాలను సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సీల్డ్ కవర్‌లో ధర్మాసనానికి అందించడాన్ని తప్పుబట్టారు. ఈ కేసులో చిదంబరంను ఈడీ ఇప్పటికే మూడుసార్లు ప్రశ్నించిందని, ప్రతిసారి ఆయనకు సంబంధం లేని ప్రశ్నలే అడిగారని చెప్పారు. విదేశీ పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు (ఎఫ్ఐపీబీ)లో వివిధ విభాగాలకు చెందిన ఆరుగురు కార్యదర్శులు సభ్యులుగా ఉంటారని, వారు అనుమతి మంజూరుచేసిన ప్రతిపాదనలపై ఆర్థిక మంత్రి హోదాలో చిదంబరం సంతకం మాత్రమే పెట్టారని వివరించారు. ఈడీ నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లోనూ చిదంబరం పేరులేదని గుర్తు చేశారు. కౌంటర్ అఫిడవిట్‌ను మంగళవారం దాఖలు చేస్తామని చెప్పారు. సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సైతం తమ వాదనలను మంగళవారం వినిపిస్తామని చెప్పడంతో ధర్మాసనం విచారణను ఒకరోజు వాయిదావేసింది. చిదంబరం బెయిల్‌ను పొడిగించింది.

**ఆయన హస్తం ఉన్నట్లు ఆధారాలు లభించాయి**

ఐఎన్‌ఎక్స్ మీడియా కేసులో ఢిల్లీ సీబీఐ ప్రత్యేక కోర్టు చిదంబరానికి సీబీఐ కస్టడీని పొడిగించింది. గతంలో విధించిన నాలుగురోజుల కస్టడీ ముగియడంతో అధికారులు సోమవారం ఆయనను ప్రత్యేక న్యాయమూర్తి అజయ్ కుమార్ కుహర్ ముందు హాజరుపరిచారు. సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, అదనపు సొలిసిటర్ జనరల్ కేఎన్ నటరాజన్ సీబీఐ తరపున వాదనలు వినిపించారు. నాలుగురోజుల విచారణలో ఈ కుంభకోణంలో చిదంబరం హస్తం ఉన్నట్టు నిరూపించేందుకు పలు ఆధారాలు దొరికాయని పేర్కొన్నారు. ఇంకా పూర్తిస్థాయిలో ఆధారాలను సేకరించాల్సి ఉన్నదని, ఆయన చెప్పిన వివరాలను సహ నిందితుల వాగ్మూలంతో పోల్చాల్సి ఉన్నదని చెప్పారు. చిదంబరానికి, మిగతా నిందితులకు మధ్య జరిగిన ఈ-మెయిల్ సంభాషణల గుట్టు విప్పాల్సి ఉన్నదని వెల్లడించారు. ఈ నేపథ్యంలో కస్టడీని మరో ఐదురోజులు పొడిగించాలని కోరారు. వాదనలు విన్న ధర్మాసనం చిదంబరం కస్టడీని మరో నాలుగు రోజులు పొడిగించింది.

### విపక్ష నేతల కశ్మీర్ పర్యటన యత్నం

# రాజకీయం కాదా?

### బీఎస్పీ అధినాయకురాలు మాయావతి మండిపాటు



**లక్నో, ఆగస్టు 26:** జమ్ముకశ్మీర్‌లో పర్యటనకు వెళ్లిన విపక్ష నేతల తీరుపై బీఎస్పీ అధినేత్రి మాయావతి మండిపడ్డారు. 'రాజ్యాంగంలో బీఆర్ అంబేద్కర్.. సమానత్వం, ఐక్యతతో పాటు దేశ సమగ్రతకు పెద్ద పీట వేశారు. కానీ 370 అధికరణానికి ఆయన వ్యతిరేకం. అందుకే పార్లమెంట్‌లో కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి తొలిగిస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయానికి మద్దతునిచ్చాం' అని గురువారం ట్వీట్ చేశారు. 'రాజ్యాంగం అమలులోకి వచ్చిన 69 ఏండ్ల తర్వాత 370 అధికరణాన్ని రద్దు చేసినందున కశ్మీర్ లోయలో సాధారణ పరిస్థితి నెలకొనేందుకు కొంత సమయం పడుతుందన్న సుప్రీంకోర్టు వ్యాఖ్యను గౌరవిద్దాం. ఈ నేపథ్యంలో ప్రభుత్వ అనుమతి లేకుండానే కాంగ్రెస్, ఇతర విపక్షాలకు చెందిన 12 మంది కశ్మీర్‌లో పర్యటనకు వెళ్లడం సబబేనా? ఇది అవకాశ వాద రాజకీయం కాదా? అని ప్రశ్నించారు.

**కశ్మీర్‌లో జన జీవనం అస్తవ్యస్తం**

కశ్మీర్ లోయలో వరుసగా 22వ రోజు సోమవారం జన జీవనం స్తంభించింది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పలుచగా ఉండగా, ప్రైవేట్ విద్యా సంస్థలు మూతపడ్డాయి. శ్రీనగర్‌లోని రోడ్లపైకి వ్యక్తిగత వాహనాల రాకపోకలు కొంత పెరిగాయి. పలు ప్రాంతాల్లో ఆంక్షలు ఎత్తివేశారు. కానీ రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు భారీగా పోలీసులు, భద్రతా జవాన్లను మోహరించారు. కొన్ని ప్రాంతాల్లో ల్యాండ్ లైన్ ఫోన్లను పునరుద్ధరించారు. అయితే వాణిజ్య హబ్‌గా పేరొందిన లాల్ చౌక్, ప్రెస్ ఎంక్లేవ్‌ల్లో మాత్రం దుకాణాలు మూతపడే ఉన్నాయి. జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేకప్రతిపత్తిని రద్దు చేసిన తర్వాత కశ్మీర్‌లోయలో ఈ నెల ఐదో తేదీ నుంచి బీఎస్ఎన్ఎల్ బ్రాడ్ బాండ్‌తోపాటు ఇంటర్నెట్, సేవలను నిలిపివేశారు.

## పుణెకి అసద్

### మహారాష్ట్రలో పొత్తుపై ప్రకాశ్ అంబేద్కర్‌తో చర్చలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో పొత్తు కోసం ప్రకాశ్ అంబేద్కర్ (రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మనువడు) నేతృత్వంలోని భరిపా బహుజన్ మహాసంఘ్ (బీబీఎం) పార్టీతో చర్చలు జరిపేందుకు మజ్లిస్ పార్టీ అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ సోమవారం పుణె నగరానికి చేరుకున్నారు. ఈ ఏడాది అక్టోబర్‌లో జరుగనున్న మహారాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో పోటీ చేయాలని మజ్లిస్ పార్టీ నిర్ణయించిన విషయం తెలిసిందే. ముస్లిం మైనార్టీలు అధికసంఖ్యలో ఉన్న దాదాపు 30 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోటీచేసేందుకు మజ్లిస్ పార్టీ సిద్ధమవుతున్నది. మహారాష్ట్ర శాసనసభకు జరిగిన గత ఎన్నికల్లో 24 స్థానాల నుంచి పోటీచేసి ఔరంగాబాద్, ముంబాయి బైకులా నియోజకవర్గాల్లో విజయం సాధించిన మజ్లిస్ పార్టీ.. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఔరంగాబాద్ స్థానాన్ని కైవసం చేసుకున్నది. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కూడా బీబీఎంతో పొత్తుపెట్టుకోవాలని నిశ్చయించిన అసద్ సోమవారం సాయంత్రం పుణెలో ప్రకాశ్ అంబేద్కర్‌తో చర్చలు జరిపినట్టు సమాచారం.

## ఏపీ పర్యటనకు ఉపరాష్ట్రపతి

**నెల్లూరు:** ఆంధ్రప్రదేశ్‌లో ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పర్యటన ఖరారైనట్టు తెలిసింది. ఈ నెల 31 నుంచి సెప్టెంబర్ 3వరకు ఆయన జిల్లాలో పర్యటించనున్నట్టు సమాచారం. శనివారమే చెన్నై నుంచి ప్రత్యేకహెలికాప్టర్‌లో నెల్లూరుకు బయలుదేరిన వెంకయ్యనాయుడు కేంద్రమాజీమంత్రి అరుణ్‌జైట్లీ మృతిచెందడంతో తిరిగి వెళ్లిపోయారు. ఉపరాష్ట్రపతి పర్యటన రద్దుకావడంతో గవర్నర్ సైతం విజయవాడకు వెళ్లారు. పలు ప్రారంభోత్సవ, శంకుస్థాపన కార్యక్రమాలు వాయిదాపడ్డాయి. ఈ నేపథ్యంలో వెంకయ్యనాయుడు పర్యటన తిరిగి ఖరారైంది.

## 29 నుంచి 'బ్లాక్ డైమండ్' చిత్రకళా ప్రదర్శన

### కొత్తగూడెంలో 31 వరకు నిర్వహణ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సింగరేణితో కలిసి 'బ్లాక్ డైమండ్' పేరిట చిత్రకళా ప్రదర్శనను ఏర్పాటుచేస్తున్నట్టు హైదరాబాద్‌కు చెందిన పెగాసస్ స్వచ్ఛంద చిత్రకళా సంస్థ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెంలో ఈ నెల 29 నుంచి 31 వరకు సింగరేణి సంస్కృతిని ప్రతిబింబించేలా కళాకారులు నైపుణ్యాలు ప్రదర్శిస్తారని పేర్కొన్నది. పెగాసస్ ఫౌండేషన్, ఆర్ట్ గ్యాలరీ సంస్థ నిర్వాహకురాలు, మాజీ ఐఏఎస్ అధికారిణి చందనాఖాన్ చిత్ర, శిల్పకళాకారులను ప్రోత్సహించేందుకు హైదరాబాద్‌తో పాటు, దేశ, విదేశాల్లో ఎగ్జిబిషన్లను నిర్వహిస్తున్నారని తెలిపింది. ఈ అవకాశాన్ని కళాకారులు వినియోగించుకోవాలని సింగరేణి జీఎం, చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ ఆంటోనీ రాజా, కన్వీనర్ గుండా శ్రీనివాస్ కోరారు.



ఢిల్లీలో సోమవారం కేంద్ర హోంశాఖ నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న కేంద్రమంత్రులు, ముఖ్యమంత్రులు వరుసగా మహేంద్రనాథ్ పాండే, అర్జున్ ముండా, మహమూద్‌అలీ(తెలంగాణ హోంమంత్రి), వైఎస్ జగన్, నరేంద్రసింగ్ తోమర్, కమల్ నాథ్, అమిత్‌షా, నితీశ్‌కుమార్, యోగి ఆదిత్యనాథ్, భూపేశ్ భగేల్, రఘుబర్‌దాస్, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

# నక్సల్స్‌పై అమిత్‌షా సమీక్ష

### కేంద్ర హోంశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇదే తొలిసారి
### వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, పోలీస్, సివిల్ ఉన్నతాధికారులు హాజరు

**న్యూఢిల్లీ, ఆగస్టు 26:** వామపక్ష తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, నక్సల్ వ్యతిరేక చర్యలపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా సోమవారం సమీక్ష నిర్వహించారు. ముఖ్యమంత్రులు నితీశ్‌కుమార్ (బీహార్), నవీన్ పట్నాయక్ (ఒడిశా), యోగి ఆదిత్యనాథ్ (ఉత్తర్‌ప్రదేశ్), కమల్‌నాథ్ (మధ్యప్రదేశ్), రఘువర్‌దాస్ (జార్ఖండ్), భూపేశ్‌భగేల్ (ఛత్తీస్‌గఢ్)తోపాటు 10 నక్సల్ ప్రభావిత రాష్ట్రాల పోలీస్, సివిల్ ఉన్నతాధికారులు ఈ సమావేశానికి హాజరైనట్టు కేంద్ర హోంశాఖ అధికారి ఒకరు తెలిపారు. కేంద్ర హోంశాఖ అధికారులతోపాటు పారామిలిటరీ బలగాలకు చెందిన ఉన్నతాధికారులు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. కేంద్ర హోంశాఖ మంత్రిగా మూడు నెలల క్రితం బాధ్యతలు చేపట్టిన అమిత్‌షా ఇలాంటి సమీక్ష సమావేశాన్ని నిర్వహించడం ఇదే తొలిసారి. మావోయిస్టుల ప్రాబల్యం అధికంగా ఉన్న 10 రాష్ట్రాల్లో ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్, బీహార్, మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, ఉత్తర్‌ప్రదేశ్ ఉన్నాయి. కేంద్ర హోంశాఖ గణాంకాల ప్రకారం 2009-13 మధ్యకాలంలో నక్సలైట్ల హింసకు సంబంధించి 8,782 కేసులు నమోదవగా.. 2014-18 మధ్యకాలంలో వీటి సంఖ్య 43.4 శాతం తగ్గి 4,969కి చేరింది. నక్సల్స్ హింసకు 2009-13 మధ్యకాలంలో భద్రతా బలగాల సిబ్బంది, ప్రజలు కలిపి 3,326 మంది ప్రాణాలు కోల్పోగా.. 2014-18 మధ్యకాలంలో ఈ సంఖ్య 60.4 శాతం తగ్గి 1,321కి చేరింది. 2009-18 మధ్యకాలంలో 1,400 మంది నక్సల్స్ హతమవగా.. ఈ ఏడాది తొలి ఐదు నెలల్లో నక్సలైట్లు దేశవ్యాప్తంగా 310 హింసాత్మక ఘటనలకు పాల్పడ్డారని, వీటిలో 88 మంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారని కేంద్ర హోంశాఖ వెల్లడించింది.

## మేక మొక్క తింటే.. యజమాని 20 మొక్కలు నాటాలి

### వికారాబాద్ జిల్లా బార్వాద్ సర్పంచ్ నిబంధన



బార్వాద్ మొక్కను తిన్న మేక యజమానితో మొక్కలు నాటిస్తున్న సర్పంచ్ వెంకటేశ్

**కోట్‌పల్లి:** హరితహారంలో భాగంగా నాటిన మొక్కను మేక తింటే.. ఆ యజమాని 20 మొక్కలు నాటి సంరక్షించాల్సిందే. హరితహారం మొక్కలను కాపాడేందుకు వికారాబాద్ జిల్లా బార్వాద్ సర్పంచ్ వెంకటేశ్ తన గ్రామంలో ఈ నిబంధనను విధించారు. ఆదివారం సాయంత్రం మండలంలోని బార్వాద్ గ్రామంలో వంశరాజ్ గున్నమ్మకు చెందిన మేక హరితహారంలో భాగంగా నాటిన మొక్కను తిన్నది. మేక యజమాని 20 మొక్కలు నాటి వాటి సంరక్షణబాధ్యతలు చూసుకోవాలని సూచించారు. సోమవారం గున్నమ్మ గ్రామంలో 20 మొక్కలను నాటి.. వాటి సంరక్షణకు తానే చర్యలు తీసుకుంటానని సర్పంచ్‌కు మాటిచ్చింది. మేకల నుంచి మొక్కలను సంరక్షించేందుకే ఈ చర్యలు తీసుకున్నట్టు సర్పంచ్ తెలిపారు.

## పాక్ అధ్యక్షుడికి ట్విట్టర్ నోటీసు!

### కశ్మీర్‌పై అభ్యంతరకర వీడియోను పోస్టు చేసినందుకు జారీ



**ఇస్లామాబాద్, ఆగస్టు 26:** పాకిస్థాన్ అధ్యక్షుడు ఆరిఫ్ అల్వీకి ప్రముఖ మైక్రో బ్లాగింగ్ సైట్ ట్విట్టర్ షాక్ ఇచ్చింది. కశ్మీర్‌పై అభ్యంతరకర వీడియోను పోస్టు చేసినందుకు నోటీసు జారీ చేసింది. ఈ విషయాన్ని ఆ దేశ మానవ హక్కుల శాఖ మంత్రి షిరీన్ మజారీ వెల్లడించారు. తమ అధ్యక్షుడికి నోటీసు పంపిన ట్విట్టర్ చర్యలు హాస్యాస్పదమని, తమకు వ్యతిరేకమని మండిపడ్డారు. కశ్మీర్ సమస్యపై నిరసనకారులు నిర్వహించిన ఓ ర్యాలీ వీడియోను ఆరిఫ్ అల్వీ సోమవారం ట్వీట్ చేశారు. ఈ క్రమంలో ట్విట్టర్ ఆయనకు ఈ నోటీసు జారీ చేసినట్టు మీడియా పేర్కొంది. భారత చట్టాలను ఉల్లంఘించానన్న సాకుతో ట్విట్టర్ తనకు కూడా నోటీసులు పంపిందని పాక్ సమాచార శాఖ మంత్రి మురాద్ సయీద్ ఆరోపించారు. మరోవైపు, కశ్మీర్‌లో జరుగుతున్న నిరసనలకు మద్దతు తెలుపుతున్న పాకిస్థానీల సోషల్ మీడియా ఖాతాలను ట్విట్టర్, ఫేస్‌బుక్‌లు రద్దు చేస్తున్నాయని పాక్ అంతర్గత సేవలు, ప్రజా సంబంధాల విభాగం డైరెక్టర్ జనరల్ ఆసిఫ్ గఫూర్ ఆరోపించారు. ఆయా సంస్థల స్థానిక ప్రధాన కార్యాలయాల్లో భారత సిబ్బంది ఉండటమే దీనికి కారణమని ఆయన విమర్శించారు.

# అవినీతి అధికారులపై వేటు

### 22 మంది అదాయం పన్నుశాఖ ఉద్యోగులకు తప్పనిసరి పదవీవిరమణ

**న్యూఢిల్లీ, ఆగస్టు 26:** అవినీతికి పాల్పడ్డ ఆదాయపన్నుశాఖ అధికారులపై కేంద్ర ప్రభుత్వం వేటువేసింది. ద సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇన్‌డైరెక్ట్ ట్యాక్సెస్ అండ్ కస్టమ్స్ (సీబీఐసీ) విభాగంలో పనిచేసే 22 మంది సూపరింటెండెంట్ స్థాయి అధికారులను తప్పనిసరి పదవీవిరమణ చేయించినట్టు అధికారవర్గాలు తెలిపాయి. ఈ ఏడాది జూన్‌నుంచి ఆదాయ పన్నుశాఖలో అవినీతి అధికారులను తొలిగించడం ఇది మూడోసారి. గతంలోనూ 27 మంది ఇండియన్ రెవెన్యూ సర్వీస్ (ఐఆర్ఎస్) ఉద్యోగులను, 12 మంది సీబీడీటీ (సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ ట్యాక్సెస్) ఉద్యోగులను అవినీతి ఆరోపణలపై తొలగించారు. ఆదాయ పన్నుశాఖలోని కొందరు అవినీతి అధికారులు పన్ను చెల్లింపుదారులను వేధిస్తున్నారని.. వారిపై చర్యలు తప్పవని ప్రధాని నరేంద్రమోదీ స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా ఆగస్టు 15న ఎర్రకోటలో చేసిన ప్రసంగంలో హెచ్చరించడంతో అవినీతి అధికారులపై చర్యలు తీసుకున్నట్టు అధికారవర్గాలు తెలిపాయి. ప్రభుత్వం వేటువేసిన 22 మంది అధికారుల్లో 11 మంది నాగ్‌పూర్, భోపాల్ జోన్‌కు చెందిన వారు ఉన్నారు. ఇండోర్‌కు చెందిన ఓ సిగరెట్ తయారీసంస్థకు అనుమతులు ఇచ్చేందుకు వీరు అవినీతికి పాల్పడ్డారు. చెన్నై, ఢిల్లీ, కోల్‌కతా, మీరట్, చండీగఢ్‌కు చెందిన ఒక్కొక్కరు, ముంబై, జైపూర్, బెంగళూరుకు చెందిన ఇద్దరు అవినీతి అధికారులపై చర్యలు తీసుకున్నారు. సెంట్రల్ సివిల్ సర్వీసెస్ (పెన్షన్) నిబంధనలు 56(జే) ప్రకారం వీరిపై చర్యలు తీసుకున్నారు.

## జార్ఖండ్, మహారాష్ట్రల్లో జేడీయూకు 'బాణం' లేదు

### ఈసీ ఆదేశాలు జారీ

**న్యూఢిల్లీ, ఆగస్టు 26:** త్వరలో జార్ఖండ్, మహారాష్ట్రల్లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో జనతాదళ్-యునైటెడ్ (జేడీ-యూ) తన ఎన్నికల గుర్తు 'బాణం'పై పోటీ చేయరాదని కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) తెలిపింది. జార్ఖండ్‌లో జార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం) ఎన్నికల గుర్తు 'విల్లు', మహారాష్ట్రలో శివసేన గుర్తు 'బాణం' పై పోటీ చేస్తున్నాయని ఈసీ పేర్కొంది. ఇంతకుముందు బాణం గుర్తుపై జార్ఖండ్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు జేడీయూకు ఈసీ అనుమతినిచ్చింది. దీనివల్ల ఓటర్లు గందరగోళానికి గురవుతున్నారని ఈసీకి జేఎంఎం ఫిర్యాదు చేసింది. దీంతో జార్ఖండ్, మహారాష్ట్రల్లో జేడీయూ 'బాణం' గుర్తుపై ఎన్నికల్లో పోటీ చేయవద్దని ఆదేశిస్తూ ఈసీ ఆదేశాలు జారీ చేసింది.

## 370 రద్దుపై దేశవ్యాప్తంగా సభలు

### సెప్టెంబర్‌లో నిర్వహించాలని బీజేపీ నిర్ణయం

**న్యూఢిల్లీ, ఆగస్టు 26:** జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేకప్రతిపత్తి కల్పించే 370, 35ఏ అధికరణాల రద్దు విషయమై ప్రజల మద్దతు కూడగట్టాలని బీజేపీ నిర్ణయించింది. నెల రోజుల పాటు దేశవ్యాప్తంగా ప్రజలను కలుసుకుని ప్రభుత్వ నిర్ణయంపై వారి మద్దతు పొందేందుకు ప్రణాళిక రూపొందించామని కేంద్రమంత్రులు ధర్మేంద్ర ప్రధాన్, గజేంద్రసింగ్ షెకావత్ సోమవారం మీడియాకు తెలిపారు. సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి 30 వరకు దేశవ్యాప్తంగా 35 పెద్ద నగరాలు, 370 చిన్న పట్టణాల్లో బహిరంగ సభలు నిర్వహించాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఈ సభల్లో కేంద్ర మంత్రులు, బీజేపీ ఎంపీలు, పార్టీ నేతలు పాల్గొంటారు. వివిధ రాష్ట్రాల్లోని విభిన్న వర్గాల్లో పేరొందిన వ్యక్తులను కూడా కలుసుకోవాలని తీర్మానించామన్నారు. కశ్మీర్‌లోయలో నాలుగు చోట్ల.. శ్రీనగర్, అనంత్‌నాగ్, బారాముల్లా, సొపార్‌లల్లో బహిరంగసభలు నిర్వహించ తలపెట్టినట్టు ప్రధాన్, షెకావత్ తెలిపారు. 370 అధికరణాన్ని రద్దు చేస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకం అని ప్రధాన్ వ్యాఖ్యానించారు. సిద్ధాంతాలు, రాజకీయాలకతీతంగా దేశ ప్రజలను ఏకం చేసిన ఈ ఘటన.. స్వతంత్ర భారతావనిలోని ముఖ్య ఘట్టాల్లో ఒకటి అని పేర్కొన్నారు.

## ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా పద్మ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా వైఎస్సార్సీపీ సీనియర్ నేత వాసిరెడ్డి పద్మ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఏపీ స్పీకర్ తమ్మినేని సీతారాం, ఏపీఐఐసీ చైర్‌పర్సన్ ఆర్కే రోజా తదితరులు హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తున్నదని.. 50శాతం పదవులు వారికే కేటాయిస్తున్నదని స్పీకర్ తమ్మినేని సీతారాం చెప్పారు. రాబోయే రోజుల్లో మహిళలకు మరిన్ని అవకాశాలు రానున్నట్టు తెలిపారు.

# పౌరసరఫరాలో క్వాలిటీ కంట్రోల్ వింగ్

### నాణ్యత విషయంలో రాజీలేదు
### సంస్థ చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడి



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రేషన్‌షాపుల ద్వారా పేదలకు అందించే బియ్యం, ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతిగృహాలకు సరఫరా చేసే సన్నబియ్యం నాణ్యతలో రాజీపడే ప్రసక్తే లేదని పౌరసరఫరాల సంస్థ చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టంచేశారు. సీఎం కేసీఆర్ ఆదేశాలు, సూచనల ప్రకారం బియ్యం నాణ్యత విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని, ఇందుకు పౌరసరఫరాల సంస్థలో సాంకేతిక సిబ్బందితో ప్రత్యేకంగా క్వాలిటీ కంట్రోల్ విభాగాన్ని ఏర్పాటుచేసినట్టు తెలిపారు. టెక్నికల్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి గోదాముల్లో బియ్యం నాణ్యతను నిరంతరం పరిశీలిస్తామని చెప్పారు. పౌరసరఫరాల సంస్థకు చెందిన ఆధునీకరించిన సెక్రటేరియట్ పెట్రోల్ బంకును చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పౌరసరఫరాల శాఖ కమిషనర్ అకున్ సబర్వాల్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పెట్రోల్ బంకుల్లో క్వాలిటీ, క్వాంటిటీ, మంచినీరు, వాహనాలకు గాలి వంటి కనీస వసతులు విషయంలో పకడ్బందీగా వ్యవహరిస్తామని పేర్కొన్నారు. పెట్రోల్ నాణ్యత విషయంలో ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా 2,553 పెట్రోల్ బంకులకుగాను, 638 బంకుల్లో తనిఖీలు చేసి.. నిబంధనలు ఉల్లంఘిస్తున్న 187 బంకులకు నోటీసులు జారీచేసినట్టు చెప్పారు. కమిషనర్ అకున్ సబర్వాల్ మాట్లాడుతూ.. పౌరసరఫరాల సంస్థ ఆధ్వర్యంలో సెక్రటేరియట్‌తోపాటు ఎల్బీనగర్, హఫీజ్‌పేటలో పెట్రోల్ బంకులు నడుస్తున్నాయని, భవిష్యత్‌లో మరిన్ని ఏర్పాటుకు కృషి చేస్తున్నామని తెలిపారు.

# జాగృతపరిచే పాటలకు ఆదరణ

### 'రైతు సాంగ్' సీడీ ఆవిష్కరణలో మంత్రి నిరంజన్‌రెడ్డి




టీం టీవీ ఎండీ కత్తి కార్తీక రూపొందించిన 'రైతు సాంగ్' సీడీని గోల్కొండ హోటల్‌లో ఆవిష్కరిస్తున్న వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి, శాఖ ముఖ్యకార్యదర్శి పార్థసారథి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సమాజాన్ని జాగృతపరిచే పాటలకు ఆదరణ ఉంటుందని వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. అలాంటి గీతాలతో మరింత ప్రజాదరణ పొందాలని ఆకాంక్షించారు. ఆర్కిటెక్ట్, టీం టీవీ ఎండీ కత్తి కార్తీక రూపొందించి నటించిన 'రైతు సాంగ్' సీడీని హైదరాబాద్‌లోని గోల్కొండ హోటల్‌లో నిరంజన్‌రెడ్డి సోమవారం ఆవిష్కరించారు. రైతు గొప్పతనం, కష్టాన్ని తెలియజేస్తూ తీసిన పాట బాగుందని అభినందించారు. ఈ కార్యక్రమంలో సీసీఐ ఎండీ అలీరాణి, వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి పార్థసారథి, వ్యవసాయ కమిషనర్ రాహుల్ బొజ్జ, మార్కెటింగ్‌శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి తదితరులు పాల్గొన్నారు.

IV. నమస్తే తెలంగాణ
చిత్రం
[ కరీంనగర్ ]
మంగళవారం 27 ఆగస్టు 2019


ప్రభాస్

‘తొలి సినిమా సమయంలో హీరోగా ఇండస్ట్రీలో కొనసాగుతానా?లేదా? అనే సంశయాలు ఉండేవి. ‘బాహుబలి’ తర్వాత ప్రేక్షకుల్ని ఎలాంటి కథలతో మెప్పించాలి? నా సినిమాలతో ఎన్ని భాషల ప్రేక్షకులకు చేరువ కాగలననే ఒత్తిడులు పెరిగాయి. సక్సెస్‌లకు అనుగుణంగా సినిమాల పట్ల బాధ్యత, ప్రేమ, అంకితభావం పెరుగుతూ వస్తున్నాయి’ అని అన్నారు ప్రభాస్. ‘బాహుబలి’ సినిమాతో జాతీయ స్థాయి హీరోగా పేరు తెచ్చుకున్నారు ప్రభాస్. భాషాభేదాలకు అతీతంగా భారీ అభిమానగణాన్ని సంపాదించుకున్నారు. ప్రస్తుతం ప్రభాస్ సినిమాల కోసం దేశవ్యాప్తంగా సినీ ప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఆయన కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం ‘సాహో’. సుజీత్ దర్శకుడు. ఈ నెల 30న ప్రపంచవ్యాప్తంగా విడుదలకానుంది. ఈ సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లో ప్రభాస్ పాత్రికేయులతో పంచుకున్న ముచ్చట్లివి...

# బడ్జెట్ పెరుగుతుంటే నిద్రపట్టేది కాదు!

**‘మిషన్ ఇంపాజిబుల్’ తరహాలో భవిష్యత్తును గురించి చర్చించే కథాంశమిదా? ట్రైలర్‌లో కొంచెం ఆ ఛాయలు కనిపించాయి?**

• అలాంటిదేమి లేదు. ఈ కథ వర్తమానంలోనే నడుస్తుంది. కమర్షియల్ కథాంశం కాబట్టి నిజ జీవితానికి మించిన విస్తృత పరిధి(లార్జర్ దేన్ లైఫ్) ఇతివృత్తంతో ఈ సినిమాను తెరకెక్కించాం. ప్రథమార్థమంతా ముంబయిలో కథ నడుస్తుంది. ఇందులో వాడిన గన్స్, వస్త్రాలు అన్నీ నేటి కాలాన్నే ప్రతిబింబిస్తాయి. భవిష్యత్తు గురించిన ప్రస్తావన ఉండదు. ‘బాహుబలి’ తర్వాత అంతటి విజువల్ ఇంపాక్ట్ ఉండాలనే లక్ష్యంతో ఈ సినిమాలోని యాక్షన్ ఘట్టాల్ని అత్యున్నత సాంకేతికాంశాల మేళవింపుతో రూపకల్పన చేశాం.

**దర్శకుడు సుజీత్‌కిది రెండో చిత్రమే. ఏ నమ్మకంతో అతనికి ఇంతటి భారీ బడ్జెట్ సినిమా బాధ్యతల్ని అప్పగించారు?**

• సుజీత్‌తో నాకు ఎప్పటి నుంచో సన్నిహిత సంబంధాలున్నాయి. ‘రన్‌రాజా రన్’ తర్వాత ఈ కథతో నా దగ్గరకొచ్చాడు. సబ్జెక్ట్, నా పాత్ర చిత్రణ విషయంలో సుజీత్‌కు కొన్ని రిఫరెన్స్‌లు ఇచ్చాను. షూటింగ్‌కు ముందు వర్క్‌షాప్స్ నిర్వహించాం. నా పాత్ర చిత్రణ విషయంలో సుజీత్ వినోదానికి పెద్దపీట వేశాడు. మీరు ట్రైలర్‌ను గమనిస్తే ఆ విషయం అర్థమవుతుంది.

**అసలు ఇంతకి ఈ సినిమా కథేమిటి? మీరు ద్విపాత్రాభినయంలో కనిపించబోతున్నారని అంటున్నారు?**

• ద్విపాత్రాభినయం కాకపోవచ్చు (నవ్వుతూ). కథ గురించి ఇప్పుడే చెప్పడం ఇష్టం లేదు. ఎందుకంటే ప్రేక్షకులు తెలియని ఉత్సుకతతో సినిమా చూస్తేనే బాగుంటుంది.

**• శ్రద్ధా కపూర్ బాలీవుడ్‌లో ఎక్కువగా ప్రేమకథల్లోనే కనిపించింది. వాటికి భిన్నంగా ఈ సినిమాలో యాక్షన్ ప్రధాన పాత్రను చేసింది. ఆమె పాత్ర దృక్కోణం నుంచే ఈ కథ సాగుతుంది. పాటల్లో వచ్చే పాత్ర కాకుండా కథలో ఆమె క్యారెక్టర్ కీలకంగా ఉంటుంది.**

**‘బాహుబలి’ తర్వాత తిరిగి యాక్షన్ అంశాలు పుష్కలంగా ఉన్న కాన్సెప్ట్‌నే ఎందుకు ఎంచుకోవాలనిపించింది?**

• ‘బాహుబలి’ తర్వాత యాక్షన్ సినిమా చేయాలనుకోలేదు. ప్రేమకథ కోసం ప్రయత్నించాం. కానీ వర్కవుట్ కాలేదు. సుజీత్ స్క్రీన్‌ప్లే ప్రధానంగా ఇంట్రెస్టింగ్ సబ్జెక్ట్ చెప్పాడు. ‘బాహుబలి’ విడుదలైన తర్వాత ‘సాహో’ కథకు మరింతగా మెరుగులుదిద్దాం. 150కోట్ల బడ్జెట్‌తో పూర్తిచేద్దామనుకున్నాం. కానీ అనుకున్నదానికంటే ఎక్కువైంది.

**‘శ్రద్ధగా సినిమా తీసి వుంటే వందకోట్లు మిగిలేవి’ అని ప్రీ రిలీజ్ వేడుకలో చెప్పారు. ఏ దృష్టితో ఆ కామెంట్స్ చేశారు?**

• బడ్జెట్‌కు సంబంధించిన అంశాలు నా డిపార్ట్‌మెంట్ కాదు (నవ్వుతూ). నిర్మాతలు నా మిత్రులు..వాళ్లు ‘రన్ రాజా రన్’ చిత్రానికే తొమ్మిదికోట్లు ఖర్చుపెట్టారు. దర్శకుడికి రెండో చిత్రమైనా సినిమా నాణ్యత విషయంలో రాజీపడటం వారికి ఇష్టం లేదు. అదీగాక ‘బాహుబలి’ తర్వాత నా నుంచి వస్తున్న చిత్రమిది. కాబట్టి మేకింగ్ విషయంలో ఎక్కడా కాంప్రమైజ్ కావొద్దనుకున్నాం. అయితే కొంచెం శ్రద్ధ పెడితే ఖర్చు తగ్గేదేమో.

**సినిమా సాంకేతికంగా ఉన్నతంగా అనిపిస్తున్నది. కథాంశం పరంగా ఎలా ఉండబోతున్నది?**

• ఏ సినిమాకైనా ఫస్ట్ కంటెంటే ప్రధానం. అయితే ఇతివృత్తాన్ని మరింత ఉన్నతీకరించడానికి సాంకేతికంగా హంగుల్ని ఉపయోగించాల్సి వచ్చింది. ఈ రోజు సినిమాలోని ఓ గీతాన్ని విడుదల చేశాం. దానిని మామూలుగా కూడా చిత్రీకరించవొచ్చు. అయితే కంటెంట్‌లోని ఫీల్‌ను ప్రదర్శించాలంటే విజువల్‌గా గ్రాండియర్ అవసరం. ఈ సినిమాలో సాంకేతికాంశాలతో పాటు సినిమాలో మంచి ఎమోషనల్ కంటెంట్ ఉంటుంది.

**‘బాహుబలి’ సినిమాకొచ్చిన క్రేజ్ వల్లే ‘సాహో’ బడ్జెట్ పెంచారని అంటున్నారు?**

• ‘బాహబలి’ క్రేజ్ అని కాదు. ఆ సినిమా తర్వాత వస్తున్న చిత్రం కాబట్టి ప్రేక్షకుల అంచనాలకు తగినట్లుగా కన్విన్సింగ్‌గా ఉండాలని బడ్జెట్‌ను పెంచడం జరిగింది. అయితే సినిమాకు బడ్జెట్ పెరుగుతున్నప్పుడల్లా నాకు నిద్రపట్టేది కాదు (నవ్వుతూ). అయితే ఈ సినిమా విషయంలో లాభాల్ని దృష్టిలో పెట్టుకోకుండా క్వాలిటీ సినిమా అందించాలనే తపనతో పనిచేశాం.

**ఈ సినిమాకు సీక్వెల్ చేసే ఆలోచన ఉందా?**

• కథతో పాటు అన్ని పక్కాగా కుదిరితే తప్పకుండా ‘సాహో’కు సీక్వెల్ చేస్తాం. వెంటనే సీక్వెల్‌ను మొదలుపెట్టకుండా సమయం తీసుకొని రూపొందించాలని అనుకుంటున్నాం.

**నిజజీవితంలో మీరు చాలా సింపుల్‌గా, సైలెంట్‌గా కనిపిస్తారు. కానీ సినిమాలో మాత్రం వయొలెంట్‌గా నటించారు?**

• డబ్బులు తీసుకున్నాను కాబట్టే అలా నటించాను(నవ్వుతూ).



**పాన్ ఇండియన్ సినిమా చేయడాన్ని ఒత్తిడిగా భావిస్తున్నారా? అన్ని భాషల ప్రేక్షకుల్ని ఆకట్టుకోవాలనే టెన్షన్ ఉంటుందా?**

• ప్రతి వ్యాపార రంగంలో లక్ష్యం అనేది తప్పకుండా ఉంటుంది. వాటి కోసం కష్టపడాల్సిందే. ‘బాహుబలి’ తర్వాత నేను చేస్తున్న సినిమా ఇది. సక్సెస్ చేయాలనే తపనతో నిద్రలేకుండా ప్రతి ఒక్కరం సినిమా కోసం శ్రమించాం.

**ట్రైలర్ చూస్తుంటే యాక్షన్ అంశాలకే ఎక్కువగా ప్రాధాన్యతనిచ్చినట్లు కనిపిస్తుంది?**

• పూర్తి యాక్షన్ ప్రధానంగా కథ సాగదు. ఫైట్స్ నాలుగు మాత్రమే ఉంటాయి. అవన్నీ చాలా గ్రాండియర్‌గా స్టైలిష్‌గా సాగుతాయి. కార్స్ ఛేజింగ్ సన్నివేశాలు సంభ్రమాశ్చర్యాలకు లోనుచేస్తాయి. ప్రతి ఫైట్‌ను యాక్షన్ కొరియోగ్రాఫర్స్ వినూత్నంగా డిజైన్ చేశారు. కుటుంబ ప్రేక్షకులతో పాటు అన్ని వర్గాల ప్రేక్షకులు ఎంజాయ్ చేసేలా ఫైట్స్ తీర్చిదిద్దారు.

**ప్రస్తుతం తెలుగు సినిమా ధోరణుల్లో వస్తున్న మార్పుల పట్ల మీ అభిప్రాయమేమిటి?**

• గత కొంతకాలంగా చిన్న సినిమాలు మంచి విజయాల్ని అందుకుంటున్నాయి. అర్జున్ రెడ్డి, జెర్సీ లాంటి కథాబలమున్న సినిమాల్ని ప్రేక్షకులు ఆదరించారు. జాతీయ అవార్డుల్లో తెలుగు సినిమాలు ప్రతిభను చాటాయి. నాని లాంటి స్టార్ హీరోలు ‘జెర్సీ’ లాంటి కథల్ని అంగీకరించడం శుభపరిణామంగా చెప్పవచ్చు. చిన్న సినిమాలు విజయాల్ని సాధించినప్పుడే కొత్త కథలు వస్తాయి.

**• ‘బాహుబలి’లా ఇది పెద్ద కథ కాదు. ఆ సినిమా అనంతరం స్క్రీన్‌ప్లే ప్రధానంగా సాగే కథనే ఎంచుకొని నటించడం కరెక్ట్ అనిపించింది. సుజీత్ చిత్ర కథనాన్ని నడిపించిన తీరు వినూత్నంగా ఉంటుంది. కథే ఈ సినిమాకు మూలం. ఆ తర్వాతే దర్శకుడు సుజీత్‌ను నమ్మాను.**

**దర్శకుడు రాధాకృష్ణతో చేస్తున్న సినిమా ఎలా ఉండబోతుంది?**

• ప్రేమకథతో తెరకెక్కుతున్న సినిమా ఇది. ‘‘బాహుబలి-1’ తర్వాత రాధాకృష్ణ చెప్పిన కథ నచ్చడంతో అంగీకరించాను.



**అందరి ఒత్తిడులను మీరు తీసుకుంటున్నారు? మీ మానసిక ఒత్తిడిని పంచుకునే వారు మీ జీవితంలోకి ఎప్పుడూ రాబోతున్నారు?**

• ఒత్తిడిని పంచుకునేవాళ్లు వస్తారో, మరింత భారం పెంచేవాళ్లు వస్తారో తెలియదు (నవ్వుతూ). పెళ్లి వాయిదా వేయాలని అనుకోలేదు. కానీ అలా జరిగిపోతున్నది.

**ఫలితం విషయంలో టెన్షన్ పడుతున్నారా?**

• ‘బాహుబలి’ కంటే ఎక్కువ టెన్షన్ ఉంది. మరికొద్ది రోజుల్లో విడుదల కాబోతున్న ఈ సినిమాను ప్రేక్షకులు ఎలా స్వీకరిస్తారోనని నేను ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను.

**బాలీవుడ్ హీరోలు ఎవరైనా మీతో టచ్‌లో ఉన్నారా? మీ సినిమాల గురించి మాట్లాడారా?**

• రణబీర్, అజయ్‌దేవగణ్‌తో పాటు చాలా మంది ఫోన్ చేస్తుంటారు. రణబీర్ నేను నటించిన ప్రతి సినిమా చూసి తన అభిప్రాయం చెబుతుంటాడు. నాలుగైదు నెలల క్రితం అమీర్‌ఖాన్ ఓ హిందీ సినిమా చూడటానికి రమ్మని ఆహ్వానించారు. బయట వినిపిస్తున్న ప్రచారాలకు భిన్నంగా బాలీవుడ్ వారితో నా సత్సంబంధాలు కొనసాగుతున్నాయి. అందరూ నన్ను బాగా రిసీవ్ చేసుకున్నారు.

**మీ కెరీర్ ఎదుగుదల పట్ల పెదనాన్న కృష్ణంరాజు ఎలా ఫీలవుతున్నారు. ఆయనకు ‘సాహో’ సినిమా చూపించారా?**

• ట్రైలర్ చూసి పెద్దనాన్న చాలా సంతోషపడ్డారు. ఎక్కడకు వెళ్లినా అందరూ నా గురించి, నేను నటించిన సినిమాల గురించి గొప్పగా చెబుతుండటంతో ఆయన గర్వపడుతున్నారు. ఆయన ‘సాహో’ సినిమా చూడలేదు.

**రాధాకృష్ణతో చేస్తున్న మీ తదుపరి సినిమా కథలో పెద్దనాన్న ప్రమేయం ఎంత ఉంది?**

• పెద్దనాన్న జోక్యం సినిమాలో ఏమీ లేదు. దర్శకుడు చెప్పిన కథ నచ్చి సినిమాను నిర్మిస్తున్నారు. వయసుతో సంబంధం లేకుండా ఆధునికంగా ఆలోచిస్తుంటారాయన. ప్రేమకథ ఆయనకు చాలా నచ్చింది.

**‘బాహుబలి’ తర్వాత మీ జీవితంలో ఎలాంటి మార్పులు వచ్చాయని అనుకుంటున్నారు?**

• జీవితం సమూలంగా మారిపోయింది. కలలో ప్రయాణిస్తున్న అనుభూతి కలుగుతున్నది. రాజమౌళి నా జీవితంలో మాయ చేశారు. ఇంకా ఆ మాయలోనే ఉన్నాను.

**‘యువతరం, కుటుంబ ప్రేక్షకులు అనే భేదాలు లేకుండా అన్ని వర్గాల వారిని ఈ సినిమా మెప్పిస్తున్నది. మంచి సినిమాతో మళ్లీ తెలుగు ప్రేక్షకుల ముందుకు రావాలనే నా తపన ఈ సినిమాతో నెరవేరింది. నా కెరీర్‌లో ఉత్తమ చిత్రాల్లో ఒకటిగా నిలుస్తుందనే నమ్మకం ఉంది’ అని అన్నారు భీమనేని శ్రీనివాసరావు. ఆయన దర్శకత్వం వహించిన చిత్రం ‘కౌసల్య కృష్ణమూర్తి’. ఐశ్వర్యారాజేష్, రాజేంద్రప్రసాద్ కీలక పాత్రల్ని పోషించారు. క్రియేటివ్ కమర్షియల్ పతాకంపై కె.ఎస్.రామారావు సమర్పణలో కె.ఎ.వల్లభ నిర్మించిన ఈ చిత్రం ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లో భీమనేని శ్రీనివాసరావు పాత్రికేయులతో ముచ్చటించారు.**


భీమనేని శ్రీనివాసరావు

## నమ్మకాన్ని నిలబెట్టుకున్నా!

ఇదివరకు క్రికెట్ నేపథ్యంలో తెలుగు తెరపై వచ్చిన సినిమాలకు భిన్నమైన ఇతివృత్తమిది. మహిళా క్రికెట్ కథాంశానికి తండ్రీకూతుళ్ల అనుబంధాన్ని జోడించి రూపొందించాం. క్రికెట్‌తో పాటు అంతర్లీనంగా రైతు సమస్యల్ని చూపించిన తీరును ప్రశంసిస్తున్నారు. క్రికెటర్ కావాలనే ఓ యువతి కల ఎలా నెరవేరింది? రైతు సమస్యలపై ఆమె తండ్రి ఎలాంటి పోరాటం సాగించాడనే అంశాల్ని వినూత్నమైన స్క్రీన్‌ప్లేతో చెప్పిన విధానం బాగుందని అంటున్నారు. ‘సుడిగాడు’ తర్వాత మంచి సినిమాను ప్రేక్షకులకు అందివ్వలేకపోయాననే లోటును తీర్చింది. దర్శకుడిగా కమర్షియల్ సక్సెస్‌తో పాటు ప్రశంసలు లభిస్తున్నాయి. కథతో వందశాతం కనెక్ట్ అయ్యామని చూసిన వారందరూ చెబుతున్నారు. సుబ్బిరామిరెడ్డి సినిమా చూసి బాగుందని మెచ్చుకున్నారు. ప్రతి సన్నివేశం ఆసక్తిని పంచుతూ గ్రిప్పింగ్‌గా ఉందని అన్నారు.

**రెండో హీరోగా..**

రీమేక్, ఒరిజినల్ అనే తేడాలు లేకుండా కథ బాగుంటే సినిమాల్ని తెలుగు ప్రేక్షకులు ఆదరిస్తున్నారు. దర్శకుడిగా కాకుండా ప్రేక్షకుడి దృక్కోణం నుంచి ఆలోచిస్తూ నా మనసుకు నచ్చిన ఇతర భాషా చిత్రాల్ని రీమేక్ చేయడానికి ఇష్టపడతాను. రీమేక్‌లను బాగా తెరకెక్కిస్తాననే నాకున్న పేరును చూసి నిర్మాత కె.ఎస్.రామారావు ఈ సినిమా కోసం నన్ను సంప్రదించారు. ఆయన నమ్మకాన్ని నిలబెట్టుకోవడం ఆనందంగా ఉంది. ఈ సినిమాలో బ్యాంక్ మేనేజర్‌గా నెగెటివ్ షేడ్స్‌తో కూడిన చిన్న పాత్రను పోషించాను. గతంలో నటుడిగా ‘అశ్వత్థామ’ చిత్రంలో కీలక పాత్ర పోషించాను. అలాగే ఆర్.నారాయణమూర్తి రూపొందించిన ‘ఆలోచించండి’ సినిమాలో రెండో హీరోగా నటించాను. ఆ తర్వాత దర్శకత్వంపై దృష్టిసారించడంతో రెండు పడవల ప్రయాణం కష్టమనే ఆలోచనతో నటనకు దూరమయ్యాను. అల్లరి నరేష్‌తో ‘సుడిగాడు-2’ చేయాలనే ఆలోచన ఉంది. మంచి కథ కుదిరితే సీక్వెల్ తప్పకుండా చేస్తాం. తదుపరి సినిమా కోసం ఓ నిర్మాతతో సంప్రదింపులు జరుగుతున్నాయి. ఆ వివరాల్ని త్వరలో వెల్లడిస్తాను.

## ‘మిస్ ఇండియా’ సందేశం

‘మహానటి’ చిత్రంలో అద్భుతాభినయానికిగాను జాతీయ ఉత్తమ నటిగా అవార్డును సొంతం చేసుకొని దేశవ్యాప్తంగా సినీ ప్రియుల దృష్టిని ఆకట్టుకుంది మలయాళీ సోయగం కీర్తి సురేష్. ఆమె కథానాయికగా నటిస్తున్న తాజా తెలుగు చిత్రానికి ‘మిస్ ఇండియా’ అనే టైటిల్‌ను ఖరారు చేశారు. నరేంద్ర దర్శకత్వం వహిస్తున్నారు. ఈస్ట్‌కోస్ట్ ప్రొడక్షన్స్ పతాకంపై మహేష్ కోనేరు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ‘మహానటి’ తర్వాత కీర్తి సురేష్ నటిస్తున్న తెలుగు చిత్రమిదే కావడం విశేషం. ఈ సినిమా యూరప్‌లో మేజర్ షెడ్యూల్‌ను పూర్తిచేసుకుంది. ఈ చిత్ర టైటిల్‌తో పాటు ఫస్ట్ లుక్‌ను సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాత మహేష్ కోనేరు చిత్ర విశేషాలు తెలియజేస్తూ ‘ప్రతి అమ్మాయి సమాజంలో ఎదుర్కొనే సమస్యల్ని ఈ సినిమాలో చర్చించాం. మనసును స్పృశించే భావోద్వేగాలుంటాయి. మహిళలతో సహా అన్ని వర్గాల ప్రేక్షకులకు కనెక్ట్ అవుతుంది. అధికశాతం షూటింగ్ పూర్తయింది. అక్టోబర్ లేదా నవంబర్‌లో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం’ అన్నారు. ‘ఈ కథకు కీర్తిసురేష్ మాత్రమే న్యాయం చేయగలదనిపించింది. హృద్యమైన భావోద్వేగాలతో అందరిని ఆకట్టుకుంటుంది’ అని దర్శకుడు చెప్పారు.


‘మిస్ ఇండియా’ చిత్రంలో కీర్తి సురేష్

## గ్యాంగ్‌లీడర్‌తో పోలికలు లేవు!


నాని, ప్రియాంక, కార్తికేయ

‘చిరంజీవి ‘గ్యాంగ్‌లీడర్’కు మా సినిమాకు ఎలాంటి పోలికలు ఉండవు. అభిమానుల్ని అలరించడానికి ఆ సినిమాలోని ఒక్క సన్నివేశాన్ని ఇందులో ఉపయోగించాం’ అని అన్నారు నాని. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం ‘నానీస్ గ్యాంగ్‌లీడర్’. మైత్రీ మూవీస్ పతాకంపై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్, మోహన్ (సి.వి.ఎం) ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. విక్రమ్.కె.కుమార్ దర్శకుడు. సెప్టెంబర్ 13న విడుదలకానుంది. ఆదివారం హైదరాబాద్‌లో చిత్రబృందం పాత్రికేయుల సమావేశాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ ‘నా సినిమాల్లో ఎక్కువ శ్రమించకుండా ఆనందంగా పూర్తిచేసిన సినిమా ఇది. ప్రతి ఒక్కరూ ఇష్టపడి నటించారు. సినిమా విడుదల కోసం అందరితో పాటు నేనూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నా. ఈ నెల 28న థియేట్రికల్ ట్రైలర్, సెప్టెంబర్ మొదటివారంలో ప్రమోషనల్ సాంగ్‌ను విడుదల చేస్తాం. ప్రతినాయక ఛాయలున్న పాత్రలో కార్తికేయ అద్భుతంగా నటించాడు. కథానాయికగా ప్రియాంక పేరును ఛాయాగ్రాహకుడు పీసీ శ్రీరాం సూచించారు. సీనియర్ నటి లక్ష్మితో కలిసి నటించడం ఆనందంగా ఉంది. ప్రతీకార నేపథ్యంలో సాగే వినోదభరిత చిత్రమిది. విభిన్న కథాంశంతో రూపొందిన ఈ చిత్రం నవ్యమైన అనుభూతిని పంచుతుంది’ అని తెలిపారు. కార్తికేయ మాట్లాడుతూ ‘‘గుణ 369’ చిత్రీకరణలో ఉండగా విక్రమ్.కె.కుమార్ ఈ కథ చెప్పారు. వెంటనే అంగీకరించాను. హీరోగా నటిస్తూనే విలన్ పాత్రను పోషించడం రిస్క్ అని ఆలోచించలేదు. నాని ‘వి’ సినిమాలో విలన్‌గా నటిస్తున్నప్పుడు నేనెంత అనిపించింది. ఇందులో నా పాత్ర అందరిని భయపెట్టేలా ఉంటుంది’ అని అన్నారు. ప్రతి ఒక్కరూ కుటుంబ సమేతంగా చూసే సినిమా ఇదని ప్రియాంక చెప్పింది.

## తెలుగు భాష ఔన్నత్యాన్ని చాటుతూ..

మహేంద్ర, లావణ్య జంటగా నటిస్తున్న చిత్రం ‘ఒక తెలుగు ప్రేమకథ’. బి.సంతోష్‌కృష్ణ దర్శకత్వం వహిస్తున్నారు. డిజిక్విస్ట్ ఇండియా లిమిటెడ్ పతాకంపై కె.బసిరెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ట్రైలర్‌ను ఆదివారం హైదరాబాద్‌లో కె.ఎస్.రవికుమార్, సమ్మెట గాంధీ విడుదలచేశారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత మాట్లాడుతూ ‘ఆంగ్లభాషపై మోజుతో మాతృభాష తెలుగును మర్చిపోతున్నారు. తెలుగు భాష, సంస్కృతి కనుమరుగవుతున్న ప్రస్తుత తరుణంలో భాష అభ్యున్నతి కోసం ఓ జంటగా సాగించిన ప్రయత్నమే ఈ చిత్ర ఇతివృత్తం. తెలుగు భాషను వారు ఎలా కాపాడుకున్నారన్నది ఆకట్టుకుంటుంది. మన సంస్కృతి, సంప్రదాయాల విలువల్ని తెలియజెపుతుంది. నేటి తరానికి ఉపయుక్తమయ్యే సినిమా ఇది. సందేశం, మానవీయ విలువలతో ఆకట్టుకుంటుంది’ అని తెలిపారు. తెలుగు భాషా గొప్పతనాన్ని చాటిచెప్పే సినిమా ఇదని దర్శకుడు చెప్పారు. మంచి సినిమాలో తాను భాగమవ్వడం ఆనందంగా ఉందని నిర్మాణ సారథి పి.ఎల్.కె రెడ్డి పేర్కొన్నారు.


లావణ్య, మహేంద్ర